
# అనంతవాణి



పరమ పూజ్య మహాత్మ  శ్రీ రామచంద్ర జీ మహారాజ్, ఫతేఘుర్ వారి

۵۸

مه

س

..

- وم

خطا - مترادر ونیز ر گھریال می اڈی گئے تھے

سل الرابے ہیں جو بات لکھنے سن دہریے سب

قابل سفر سے ہی سہی لیت نایشے نما کی مجھے کسی

اعد انتا الہ العزیز تہمت یا کی کر درگاہ سے بنی خانگی

اللہ

ایاک

جردی در مال کی فناہوتی ہے اسی مقدار ہو

بقا بن جاتی جائیں

ع روایات کر ترین کالکی

فرض تو مقصد سے ہر نشانات کو سمر اکتفا کرنا

گیا ہے۔ لیمات میں بیز ہر وقت کو بچا لیا گیا -

باقی سب خیریت ہے - * ارنما بہ مردمی بری موجود گی

برط اسب دوانہ میں کوریا میں ہوگی - دکان سے پھر

راہ می ایشن میں مل کر نہانا ہوگا -

سم دوعا

مہران

-

رار کردہ

اری

Lalaji Sahab's letter to Babuji Maharaj

## లాలాజీ

మనము కూడా మన జీవితాలను ఉదాత్తమైనవిగా చేసుకోవచ్చునని మహాత్ములజీవితాలన్నీ మనకు గుర్తు చేస్తున్నాయి.

**అంధకార యుగము :**

మధ్యకాలీన యుగమూ, ఆధునిక యుగమూ కూడా భారతదేశపు సమకాలీన చరిత్రలో 'చీకటి' దశలుగానే పరిగణింపబడ్డాయి. ఈ కాలంలో ఎందరో మేధావులు జన్మించారు. కాని వారు ఎంత గొప్ప మేధావులైనప్పటికీ ఆధ్యాత్మికరంగంలో మాత్రం మరుగుజ్జులే! మానవుడు తనకుతానే విధించుకున్న దాస్యానికి వ్యతిరేకంగా, పైకి కన్పించకుండా అంతర్గతంగా చేసే మౌన పోరాటమూ, గమ్యాన్ని చేరాలనే ఆరాటమూ, వ్యక్తి యొక్క మనో స్వభావాన్ని బట్టి, రాను రాను అనేక రూపాల్లో, నానా విధాలుగా, పలు రకాలుగా, వివిధ పద్ధతులలో కార్యరూపంలో వ్యక్తం అవుతూనే ఉన్నది. ఈ నిశ్శబ్దమైన తిరుగుబాటు నిర్విరామంగా కొనసాగుతూనే ఉన్నప్పటికీ, ఆ విషయం తెలుసుకోగలిగింది. కొందరే. ఆ కొందరిలోనూ, దాని అసలు తత్వాన్ని, స్వభావాన్ని తెలుసుకొన్నవారు బహుకొద్దిమంది మాత్రమే. సామాజిక పరమైన, సాంస్కృతిక పరమైన సంస్కరణల వలనా, సాయుధ తిరుగుబాట్ల వలనా, సమాజంలో మతాన్ని పునరుజ్జీవింప చేయడం ద్వారానూ, కొందరికి కొంతమేరకు ఊరటా, మనశ్శాంతీ లభించాయి. మతాచార విధులూ, కర్మకాండలూ, రీతి- రివాజులూ, లాంఛనాలూ పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చి, భారతదేశపు మతాలపై ఆధిపత్యాన్ని సంపాదించాయి. స్వామి రామతీర్థ చెప్పినట్లుగా, "ఎక్కడ చూసినా అసంగతమైన, విపరీతమైన మూఢ నమ్మకాలకు అతి నికృష్టంగా బానిసలైపోవడమే కన్పిస్తోంది. మతాధికారి పట్ల నిజంగా వినయ విధేయతలు కలిగి ఉన్నారనిపించే పేరిట వారు నిజానికి ఆధ్యాత్మిక ఆత్మహత్యకు పాల్పడుతున్నారు". క్రొత్త అభిప్రాయాల, క్రొత్త సిద్ధాంతాల పునాదులపై స్థాపించబడిన క్రొత్త సంస్థలు ఎండమావులుగానే మిగిలిపోయాయే తప్ప ఆధ్యాత్మికంగా ఎటువంటి ప్రయోజనాన్ని చేకూర్చలేదు. వాటిపట్ల ఎటువంటి అనురక్తీలేని, ఆశావాదులైన పాల్ బ్రంటన్ వంటి నిష్పక్షపాత పరిశీలకులు "రాబోయే ఉదయాన్నే ఎటువంటి సరిక్రొత్త ఆశ్చర్యకర సంఘటన జరుగుతుందో ' నని ఆతృతతో ప్రతిరోజూ ఎదురుచూడసాగారు.

"ఇరవయ్యో శతాబ్దపు తొలి అర్ధభాగంలోనే, భారతదేశం తనదైన పూర్వ వైభవాన్ని తిరిగి పొందుతుంది" అని ఒకవైపు స్వామి రామతీర్థ వంటి మహాత్ములు ఎందరో గాఢంగా విశ్వసిస్తూ ఉన్నప్పటికీ సత్యతత్వానికి చేర్చే సరియైన, అసలైన మార్గాన్ని కనుగొనే ప్రయత్నంలో మేధావులు తలమునకలై ఉన్నారు. దారితప్పి, దిక్కుతోచక తిరుగాడుతున్న నేటి తరం వారికి ఒక లక్ష్యాన్ని రూపొందించేందుకు సహాయపడడానికై దైవాంశ సంభూతులైన మహాత్ములూ, వాస్తవార్థాన్ని గ్రహించిన మహామహుల అవసరం ఎంతైనా ఉంది. అంతేగానీ పూజా పునస్కారాలు చేయించే అర్చకుల వలనా, పురోహితుల వలనా, పూర్వీకుల నుండి సంక్రమించిన మూఢాచారాలనూ, అలవాట్లనూ గుడ్డిగా, యాంత్రికంగా అనుసరిస్తూ ఉండడం వలనా, ఈ తరం వారికి ఏ విధమైన ప్రయోజనమూ ఉండదు" అని డా. రామకృష్ణగారు తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసారు. ' అత్యంత సమర్థులైన మహా జ్ఞానులు ఈ భారతదేశంలో జన్మించడమే గాక; మహోన్నత ఆధ్యాత్మిక జ్ఞాన సంపన్నులు ఆధ్యాత్మికత్వాన్ని బోధించేందుకై ఈ ప్రపంచం నలుమూలలకూ వెళ్ళడానికి పూనుకునే రోజు తప్పకవస్తుంది' అని ఆధ్యాత్మిక పథంలో గణనీయమైన పురోగతిని సాధించిన స్వామి వివేకానంద వంటి సమర్థ ఋషి పుంగవులెందరో ప్రగాఢంగా విశ్వసించారు.

**<u>వెలుగురేఖలు విరజిమ్మినవేళ</u>.**

ఆశలూ, భయాందోళనలూ, సంశయాలూ, సందేహాలూ, పెడత్రోవ పట్టిన నమ్మకాలూ, సందిగ్ధాలూ, అనుమానాలూ; అస్థిరతా ఆవహించిన నేటి కాలమాన పరిస్థితులలో; ఒక శుభదినాన, వసంతపంచమి పర్వదినాన అనగా 1873 సంవత్సరం ఫిబ్రవరి 2 వ తేదీన, ఆ దివ్యజ్యోతి ఈ భూమిపై అవతరించింది. సమర్థ గురువులు మహాత్మా శ్రీ రామచంద్రజీ, భారతదేశపు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని ఫతేఘడ్లో జన్మించారు. వారి అవతారం మానవాళికి ప్రకృతి అందించిన ఒక మౌన వాగ్దానము. మానవులను ఆదుకోడానికి మానవ రూపంలో అవతరించిన అభయహస్తమే ఆయన. తనకు తెలియకుండానే, మానవాళి తనపై గల భారాన్ని వదలించుకుని తనకు తానే తగిలించుకున్న ఉక్కుసంకెళ్ళను త్రెంచుకుని బైటపడసాగింది.

**<u>పూర్వీకుల విశేషాలు</u>**

అందరూ 'లాలాజీ' అని ప్రేమగా పిలిచే శ్రీ రామచంద్రజీ ఎంతో పేరు ప్రఖ్యాతులు గల ఒక జాగీరుదార్ల కుటుంబానికి చెందినవారు. మొగల్ చక్రవర్తీ, రాజనీతిజ్ఞుడూ అయిన అక్బర్,

హిందువులతో ఎంతో స్నేహంగా ఉంటూ, వారితో సత్సంబంధాలను పెంపొందించుకుంటూ ఉండేవాడు. ధైర్యసాహసాలను ప్రదర్శించే పరాక్రమవంతులను సత్కరిస్తూ ఉండేవాడు కూడా. లాలాజీగారి ముత్తాతగారైన శ్రీ బృందావన బాబుగారు ఒక అపూర్వ ప్రతిభాశాలి. వారి చక్కటి గుణగణాలూ, ఔదార్యమూ అక్బరు చక్రవర్తి యొక్క మన్ననలనూ, మైత్రినీ పొందగలిగాయి. వారి అసమానమైన ప్రతిభకు ముగ్ధుడైన అక్బరు చక్రవర్తి 555 గ్రామాలతో కూడిన ఒక జాగీరును బహుమానంగా ఇచ్చి, 'చౌధరి' అనే బిరుదుతో వారిని సత్కరించారు. ఆయన భూమిగ్రామ్ అనే పట్టణంలో స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. ఆ పట్టణమే రానురాను "భోంగాంవ్" గా మారింది - అది ప్రస్తుతపు మైన్పురి జిల్లాలో ఉంది.

1857వ సంవత్సరంలో జరిగిన సిపాయిల తిరుగుబాటు అనంతరం, స్వాతంత్ర్యము పేరిట మారణహోమం, గృహ దహనాలూ, దోపిడీలూ జరిగినమీదట భూమిగ్రామ్ పట్టణం నివాసయోగ్యతను కోల్పోయింది. అందువలన ఆదిగురువు లాలాజీగారి పూజ్య జనకులు శ్రీ హర్బాక్సయారు అక్కడినుండి ఫరూకాబాద్ జిల్లాలోని ఫతేఘుర్కు కుటుంబసమేతంగా వలసవచ్చి, అక్కడే "పన్నుల పర్యవేక్షణాధికారి" గా ఉంటూ జీవించసాగారు.

దురదృష్టవ శాత్తూ అప్పటికింకా సంతానం కలుగక పోవడం వలన, ఆయన తన సోదరుని కుమారుని దత్తత తీసుకున్నారు. సిపాయిల తిరుగుబాటు వలన వారి ఆస్తికి అపారమైన నష్టం వాటిల్లినప్పటికీ పేరొందిన భాగ్యవంతులవలె జీవించడానికి తగినంతగా ఆస్తిపాస్తులు మిగిలాయి. కాని రానురానూ పరిస్థితులు అనుకూలించక పోవడంవలన ఆస్తులూ, హోదాలూ క్షీణించ సాగాయి. అయినప్పటికీ ఒక గౌరవనీయ సంపన్న కుటుంబానికి సాధారణంగా ఉండే నౌకర్లూ, వాహనాలూ, హంగులూ మొదలైనవన్నీ ఉండేవి.

## మాతృ ప్రభావము

లాలాజీగారి తల్లి ఒక సదాచార పరాయణురాలు. ఆమె హృదయమంతా భక్తితో నిండి ఉండేది. ఆమె భగవంతుని భగవంతుని పట్ల ఎంతో గాఢంగా ఆకర్షితురాలయింది. దైవభక్తిపరులైన మహాత్ములంటే ఆమెకు ఎనలేని గౌరవము. అవకాశం లభించినప్పుడల్లా ఆమె అటువంటి వారికి సేవలు చేస్తూ ఉండేది. ఆమె తన మధుర గాత్రంతో 'రామచరిత మానసము'ను ఎంతో శ్రావ్యంగా పాడుతూ ఉంటే, వినేవారి హృదయాలు పరవశంతో పులకరించి పోయేవి. దానధర్మాలు చేయడం

అనేది ఆమెలో గల మేటి సుగుణం. సాధ్యమైనంత వరకూ, తన సహాయాన్ని కోరి వచ్చిన వారిని ఆమె, ఎన్నడూ వట్టిచేతులతో పోనిచ్చేది కాదు. ఆమె ఒకసారి, ఫరూకాబాద్కు ఒక మహాత్ముడు విచ్చేశారని విని, వారి వద్దకు 'సత్సంగ్' కోసం, తన మరిదిని వెంట తీసుకువెళ్ళింది. వారు వెళ్ళేసరికి ఆ మహాత్ముడు సంత్ కబీరు "సాఖీ" లను అతి మనోహరంగా గానం చేస్తూ ఉన్నాడు. అది విన్న ఆమె కోమలమైన హృదయం స్పందించింది. కళ్ళ నుండి ధారల్లా నీళ్ళు కారసాగాయి. ఆ గాన మాధుర్యంలో, భక్తి భావంలో ఆమె మైమరచిపోయింది. ఆ స్థితిలో ఆమెను చూసిన ఆ మహనీయుడు చలించిపోయి,ఆమెపై ఆశీస్సులను కురిపించాడు. అంతే, ఆరోజు నుండీ ఆమెలో పరమాత్మ పట్ల భక్తి అపారమై, గట్లుతెంచుకుని ప్రవహించే వరదలాగా ఆమెను ముంచెత్తివేసింది. ఈశ్వర స్తోత్రములను గానం చేస్తూ చేస్తూ తరచుగా ఆమె సమాధి స్థితిలోనికి వెళ్ళిపోతూ ఉండేది.

ఎంతో గొప్ప భక్తురాలైనప్పటికీ, ఆమెది కూడా ఒక స్త్రీ హృదయమే గనుక మాతృత్వానికై పరితపించేది. సంతానం లేదనే వెలితి ఆమెను తీవ్రంగా బాధిస్తూ ఉండేది. మంచిరోజులు రానున్నాయి అని సూచించే సూచనలా, ఒక శుభదినాన వారింటికి ఒక అవధూత వచ్చాడు. వారికి ఆసనాది సపర్యలు చేసిన మీదట, ఆమె భోజనం వడ్డించింది. ఒక ముద్ద తిన్న మీదట ఆ అవధూత చేపల కూర కావాలని అడిగాడు. మరి చూడగా వీరేమో శ్రీ వైష్ణవులాయె! వారింట మత్స్య మాంసాదులు నిషిద్ధం. ఈ పరిస్థితిలో ఆమెకు ఏమి చేయాలో పాలుపోలేదు. ఆ స్థితిలో వున్న ఆమెను చూసి, సూక్ష్మబుద్ధి గల ఆమె పరిచారిక 'తన యజమాని స్నేహితులైన 'నవాబ్ సాహెబ్ గారు, రెండు చేపలను పంపారనీ, బహుశా వారి ఇంటిలో అవి వండి సిద్ధంగా ఉండవచ్చునని' చెప్పింది. అది విన్న ఆ యజమానురాలి మనస్సు ఉప్పొంగి పోగా, వాటిని తీసుకువచ్చి ఆయనకు వడ్డించమని ఆ పరిచారికను నిర్దేశించింది. కోరిన వంటకాన్ని తృప్తిగా ఆరగించిన ఆ అవధూత ఎంతో సంతుష్టుడయ్యాడు. వారిద్దరినీ చూసి చిరునవ్వు నవ్వి లేచి నిలుచున్నాడు. ఆయన వెళ్ళిపోతున్నాడనే అనుకున్నారు. కాని తటాలున ఆగి, వెనుదిరిగి "మిమ్మల్ని బాధిస్తున్నదేమిటి?" అని ప్రశ్నించాడు. దానికి ఆ భక్తురాలు మౌనం వహించినప్పటికీ, పరిచారిక మాత్రం "మా యజమాను రాలికి అన్నీ ఉన్నాయి - ఒక్క పుత్ర సంతానము తప్ప..." అని బదులిచ్చింది. "అలాగా!" అని ఆశ్చర్యపోతూ ఆయన వినీల ఆకాశంలో అనంత దూరానికి తన దృష్టిని సారించాడు. మరికొద్ది క్షణాల తర్వాత ఆకాశం వైపు చేతివ్రేళ్ళను చూపిస్తూ, "ఒకటి...

రెండు..., ఒకటి... రెండు..." అని తనలో తాను గొణుక్కుంటూ వెళ్ళిపోయిన ఆ అవధూత ఆపై ఇంకెన్నడూ కన్పించనేలేదు.

ఆ కరుణామయికి మొదటి సంతానంగా 2.2.1873వ తేదీన మన ఆది గురువులు శ్రీ లాలాజీగారు జన్మించారు. రెండవ సంతానంగా శ్రీ రఘువర దయాళ్ గారు 17.10.1875న జన్మించారు. వీరిని అందరూ 'చాచాజీ' అని పిలుస్తూ ఉండేవారు.

**బాల్యము, విద్యాభ్యాసము**

ఆదిగురువర్యుని జీవిత సంఘటనలు దాదాపుగా అన్నీ మరుగున పడిపోయాయి. వారు స్వీయచరిత్ర కూడా వ్రాయలేదు. కేవలం వారి ఒకే ఒక 'ఫోటో' మాత్రం లభించింది. అంతకుమించి మరేవీ లేవు. కాలక్రమేణా వారు గొప్ప ప్రజాదరణనూ, అందరి అభిమానాన్ని చూరగొన్నారు. కబీర్ సును అభిమానించినట్లే అటు హిందువులూ, ఇటు ముస్లిమ్లూ కూడా ఆయనను ఎంతగానో ప్రేమించేవారు. ఆయన బోధించిన ఉపదేశాలు తమవేనని, ప్రతివారూ వాటిపై తమతమ ముద్రలను వేసుకుని పదిలపరచుకున్నారు. అసంఖ్యాకముగా వారు వ్రాసిన ఉత్తరాలనూ, విస్తారముగా రచించిన పెక్కు గ్రంథాలనూ కూడా ఎవరికి లభించినవాటిని వారు తమ స్వప్రయోజనానికి దాచుకున్నారు. అదృష్టవశాత్తూ అప్పట్లో వారి దివ్యసన్నిధిలో ఉంటూ, వారి అనుగ్రహాన్ని పొందిన వ్యక్తులు కొందరు ఇప్పటికీ సజీవులై ఉన్నారు. పూజ్య శ్రీ లాలాజీగారి కొన్ని రచనలు మాత్రం ఫతేఘడ్లో నివసిస్తున్న వారి మనుమల వద్ద ఉన్నాయి. వీలునుబట్టి వారు వాటిని ముద్రించాలనుకొంటున్నారు.

తమ తల్లిగారినుండి పొందిన అపూర్వమైన మృదు మధుర గాత్రంతో లాలాజీగారు " రామచరిత మానసము" ను తమ తల్లిగారికి ఎంతో శ్రావ్యంగా గానంచేసి వినిపించేవారు. చిన్నతనంలోనే వారికి సంగీతం పట్ల ఎంతో మక్కువ ఏర్పడింది. ఏ పాటనైనా సరే, ఒక్కసారి వింటే చాలు. మరల దానిని స్వర, రాగ, తాళాలతో సహా తిరిగి వినిపించగలిగే సామర్థ్యం వారికి అలవడింది. అతి పిన్న వయస్సులోనే తల్లిగారి పారమార్థిక చింతనలు వారిపై గొప్ప ప్రభావాన్ని చూపడం వలన, వారికి "సత్యతత్వము" పట్ల అపరిమితమైన ఆకర్షణా, ప్రేమా ఏర్పడ్డాయి. లాలాజీగారి ఏడవయేటనే వారి మాతృమూర్తి పరమపదించినందువలన, ఆయనను మరొక స్త్రీమూర్తి చేరదీసి, అత్యంత వాత్సల్యంతో పెంచి పెద్దచేసింది. లాలాజీగారు ఆమె ఋణం ఉంచుకోలేదు. వారి జీవిత పర్యంతం ఆమె

పట్ల ఎంతో ఆదరాభిమానాలు కలిగి ఉండేవారు. ఒకానొక సందర్భంలో ఆమె తన యావదాస్తినీ లాలాజిగారికి ఇచ్చేద్దామనుకుంది. కాని దానికి ఆయన అంగీకరించలేదు. అంతేకాదు ఆయనే తిరిగి ఆమెకు ఎన్నో బహుమానాలనిస్తూ ఎంతో సహాయాన్ని అందించేవారు.

లాలాజీగారు ఒక ఉపాధ్యాయుని ద్వారా ఉర్దూ, పారశీక, అరబ్బీ భాషలలో విస్తారమైన శిక్షణను పొందారు. తమ తల్లిగారి నుండి హిందీ భాషను నేర్చుకున్నారు. ఉర్దూ పద్యరచనలో కూడా శిక్షణ పొందారు. ఆ తరువాత ఫరూకాబాద్లోని మిషన్ స్కూలులో విద్యాభ్యాసం చేసి, ఆ రోజుల్లో యూనివర్సిటీ పరీక్ష అనబడే ఇంగ్లీషు మాధ్యమిక పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు.

స్కూలులో చదువుకునే రోజుల్లో, లాలాజీగారు ఒక చిన్న గదిలో ఉండేవారు. అక్కడే ఒక మహమ్మదీయ ఉపాధ్యాయుడు విద్యార్థులందరికీ ప్రయివేటుగా శిక్షణనిస్తూ ఉండేవాడు. లాలాజీగారంటే అతనికి ఎనలేని అభిమానం. లాలాజీగారికి చదువులో ఆయన అప్పుడప్పుడూ సాయ పడుతూ ఉండేవాడు. విద్యార్థి దశలోనే లాలాజీగారికి ఈశ్వరానుభూతిని పొందాలనే బలమైన కోరిక అంకురించింది.

## వివాహము, గృహస్థ జీవనము

గౌరవనీయమైన, చక్కటి సాంప్రదాయంకల కుటుంబంలోని కన్యతో లాలాజీగారి వివాహం జరిగింది. వారు దారి తెలియని ఆర్త జనులకు వాస్తవమైన దారిని చూపే ఒక మహనీయుడు కావాలన్నదే భగవదే అయినందున తగినంత ఆస్తి ఉన్నప్పటికీ లాలాజీగారు ఒక భాగ్యవంతునివలె తన జీవితాన్ని గడపలేకపోయారు. లాలాజీగారి వివాహం జరిగిన కొద్ది కాలానికే వారి తండ్రిగారు కన్నుమూసారు. మైన్పురీ మహరాజుగారు, వారసత్వపు ఆస్తిపై దావా వేసి గెల్చుకోవడం వలన, యావదాస్తీ అన్యాక్రాంతమైపోయింది. లాలాజీగారు అంతటి ఆస్తినీ వదులుకోవాల్సి వచ్చింది. చివరికి ఉండడానికి ఇల్లు కూడా దక్కలేదు. తన భవనాన్ని విడిచి, ఒక లాలాజీగారి చిన్న ఇంటిలోనికి తరలి వెళ్ళవలసి వచ్చింది. లాలాజీగారి తండ్రి గారి దత్తత పుత్రుడైన తమ అన్నగారు కూడా అదే సమయంలో తనువు చాలించారు. ఇటువంటి విషాదభరితమైన పరిస్థితులు ఎంతటి ధైర్యశాలినైనా కృంగదీస్తాయి కదా! కాని లాలాజీగారు ఈ కష్టాలను ఏ మాత్రం లెక్క చేయలేదు. అన్నింటినీ ధైర్యంగా ఎదుర్కొన్నారు. మారిన పరిస్థితులకు అనుగుణంగా జీవనాన్ని కొనసాగించారు. ఫరూఖాబాద్ జిల్లా కలెక్టరు, లాలాజీ తండ్రిగారికి స్నేహితులు కావడం వలన, ఈయన కష్టాల గురించి విన్న ఆయన

లాలాజీగారిని ఫతేఘుడ్కు రప్పించి, నెలకు 10 రూపాయల భృతిపై తన ఆఫీసులోనే పనికి నియమించారు.

## యవ్వనం

లాలాజీగారు మరీ పొడవూ, లేదా మరీ పొట్టీ గానటువంటి సగటు ఎత్తు గలిగి, బలమైన దేహ దారుఢ్యంతో, చక్కని శరీర సౌష్ఠవం గలిగిన ఒక పరిపూర్ణ యవ్వనవంతునిగా ఎదిగారు. ఉదాత్తమైన వ్యక్తికి ప్రతీకగా వారి ఆకారం ఉండేది. బయటకు కన్పించే వారి రూపం, వారి అంతరంగంలో గల పరిశుద్ధతకు అద్దం పట్టినట్లు ఉండేది. ఆ సృష్టికర్త సృష్టించిన ప్రాణులకు మేలు చేస్తూ, ఆతనికి ఎంతో ఆమోదయోగ్యమైన పద్ధతిలో తననుతాను ఆ పరమాత్మకు ఏవిధంగా అర్పించుకోవాలి అనే దానిపైననే ఎల్లప్పుడూ ధ్యానిస్తూ, కారుణ్యం తొణికిసలాడే ఆ మానవతామూర్తిని మించిన వైభవోపేతమైన వ్యక్తీ, ధన్యజీవీ ఈ సృష్టిలో వేరొకరు కానరారు. గోధుమరంగు శరీరఛాయతో, ఆకర్షణీయమైన ముఖవర్చస్సుతో ఉండేవారు. వారి విశాల ఫాలభాగం వారి అనంత మేధాసంపత్తిని సూచించేదిగా ఉండేది. కేవలం తన స్వీయ మార్గదర్శకత్వానికై ఉన్న చేతికాగడాలా కాక, సముద్రంలో పయనించే నావికులకు దిక్కుతెలిపే ప్రకాశవంతమైన దీపస్తంభంలా ఇతరులకొరకు తన అపార మేధాసంపత్తిని వినియోగించేవారు. వారిలో విశేషంగా చెప్పుకోదగినవి వారి కన్నులు. అవి తళతళా మెరిసే రెండు నక్షత్రాలను పోలి ఉండి ఒక్క చూపులో ప్రతివారినీ, ప్రతిదానినీ ఆమూలాగ్రంగా చదవగలిగేటట్లుండేవి. అవి లోతు కానరాని నిశ్చలమైన సరస్సులవలె ఉండేవి. ఒకే ఒక రెప్పపాటుతో; నిద్రిస్తూ ఉన్న మానవుని జాగృతం చేయగల సుషుప్తి, జాగృదావస్థలు రెండూ ఒకదానితో నొకటి కలగలిసి, ప్రశాంతత ఉట్టిపడేలా ఉండే అర్ధనిమీలిత నేత్రాలు వారివి. అవి నిశ్శబ్దంగా కొనసాగే ధ్యానానికి ఆలయాలు. నిశ్శబ్దంగా, అతి రమ్యంగా, శాస్త్ర సమ్మతంగా చేసే బోధనలకు నిలయాలు. కరుణా, వాత్సల్యం మొదలైన సాత్విక స్వభావాలు మూర్తీభవించిన వారి ముఖారవిందం అసమానమైన సౌందర్యంతో ప్రకాశించేది. పట్టుకుచ్చులా ఉండే వారి కేశాలు ముట్టుకుంటే ఎంతో మృదువుగా ఉండేవి. వారి ముందుపన్ను ఒకటి మిగిలిన వాటికంటే కొంచెం పొడవుగా ఉండేది. అందమైన చిరుగెడ్డము, మీసకట్టు వారి ముఖాన్ని అలంకరించాయి. వారి చెవులు మరీ పెద్దవీ - మరీ చిన్నవీ గాకుండా తగిన పరిమాణంలో ఉండేవి. వారి చేతులూ, పాదాలూ ఎంతో సుకుమారంగానూ, మెత్తగానూ ఉండేవి.

ఖరీదైన ఆడంబరపు వస్త్రాలు వారికి నచ్చేవికావు. ఇక పట్టు వస్త్రాల సంగతి చెప్పనేల? ఆయన వాటిని ధరించడమే చాలా అరుదు. కానీ, వారు ఎల్లప్పుడూ శుభ్రమైన వస్త్రాలే ధరించేవారు. చొక్కాలు, లాల్చీలు, పైజమాలు, పంచలు - ఇవే వారు నిత్యం ధరించే దుస్తులు. ఒక్కొక్కసారి చేతులు లేని చిన్న కోటు, మోకాళ్ళవరకూ బొత్తాలు ఉండే పొడవాటి కోటూ వేసుకునేవారు. రంగుటోపీ పెట్టుకునేవారు. చలికాలంలో భుజముల మీదుగా శాలువా ఒకటి కప్పుకొనేవారు. ఆభరణాలను వారెన్నడూ ధరించేవారు కారు.

మితాహారం అంటే వారికిష్టం. ఉదయం రొట్టెలు, పప్పు, చట్నీ, తీసుకొనేవారు. సాయంత్రంవేళ సాధారణంగా రొట్టెలు, కూర, ఊరగాయలతో భోజనం చేసేవారు. మాంసము, ఐస్, టీ లు తీసుకునేవారుకారు. పిండివంటలలో కచోరీ, కాయగూరలలో చామదుంపలు వారికి మహా ఇష్టం.

వారికి ఏరోజూ క్షణం తీరిక లేకుండా పని ఉండేది. సూర్యోదయం తర్వాత ఎన్నడూ నిద్రపోయేవారుకారు. కాలకృత్యాలు తీర్చుకొని, పరిశుభ్ర వస్త్రాలు ఇతరులకు ఆధ్యాత్మిక సాధనలోనో, శిక్షణ నివ్వడంలోనో ధరించి, నిమగ్నులయ్యేవారు. ఆ తరువాత ఆఫీసుకు వెళ్ళేవారు. ఆఫీసు నుండి తిరిగి వచ్చేక మళ్ళీ ఆధ్యాత్మిక శిక్షణ నిచ్చేందుకు కూర్చునేవారు. రోజూ సాయంత్రం 7-8 గంటల మధ్యలో భోజనంచేసి, వ్యాహ్యాళికి వెళ్ళి వచ్చేవారు. ఆ తర్వాత కావలసిన వారికి ఆధ్యాత్మిక శిక్షణనిచ్చి, రాత్రి 10 గం.లకు విశ్రమించేవారు. అప్పుడు కూడా నిద్రపోయేవారుకారు. రాత్రి రెండు గంటలవరకూ తన అనుయాయులకు ప్రాణాహుతి ప్రసారం చేస్తూ ఉండేవారు. ఒక్కరే ఒంటరిగా ఒక గదిలో నిద్రించేవారు. కానీ సత్సంగీయులు ఎవరైనా ఉంటే, వారిని తన గదిలోనే నిద్రపోనిచ్చేవారు. అప్పుడప్పుడూ గంగానది తీరం వెంబడి షికారుగా నడిచి వెళ్ళేవారు. తరచు వారివెంట అతిథులను కూడా తీసుకువెళ్తూ ఉండేవారు. ఒక్కొక్కప్పుడు మార్పుకోసం వారిని ప్రదర్శనలకో, తీర్థాలకో, జాతరలకో తీసుకువెళ్ళేవారు.

## మానసిక ప్రవృత్తి – స్వభావము

“పని అనే విత్తనాన్ని నాటితే వచ్చే పంట ' అలవాటు'. అలవాటును నాటితే వచ్చే పంట 'స్వభావము'. ఆ స్వభావాన్ని నాటితే ఉత్పన్నమయ్యేది భవితవ్యం'. సత్శీలం అనేది ఎప్పుడూ స్వయంకృషి యొక్క తపోఫలమే. ఇది తల్లిదండ్రుల నుండి వారసత్వంగా సంక్రమించేదీ కాదు, బాహ్య అనుకూల పరిస్థితుల ప్రభావం వల్లనూ రాదు. అది ఆ వ్యక్తి కష్టార్జితమే. నీతి నియమాల

సత్ఫలితాలు, సౌశీల్యం, సత్కర్మలలోనే స్పష్టంగా వెల్లడౌతాయి" అని జె. హ్యూస్ అనే మహాశయుడు వివరించాడు.

మృదు స్వభావమూ, ఉదార భావమూ, సమతుల్యమైన మనస్సూ, శీలసంపదకు పునాదులు. దైనందిన కార్యకలాపాలలో, మరులు గొలిపి ఆకర్షించే మనోవికారాలు, కఠిన పరీక్షల వంటి గడ్డు సమస్యలతో కూడిన ఈ ప్రపంచంలో శీలమునకు స్థిరంగా ఉండగల సమర్థతతోబాటు, యదార్థ జీవితంలోని దూషణ, భూషణ, తిరస్కారాలనూ సహించే శక్తి ఉండాలి. అటువంటి మహోన్నత శీలమునకు లాలాజీగారే చక్కటి నిదర్శనం.

సహజంగా శాంత స్వభావులైన లాలాజీగారి మనస్సు ఎదుటివారి కష్టసుఖాలకు ఇట్టే స్పందించేది. తమ శ్రావ్యమైన కంఠస్వరంతో, మృదు మధుర సంభాషణలతో, ఎదుటివారికి తమ మనోభావాలను రమ్యంగా చెప్పగలిగే చాతుర్యం వారికి ఉండేది. వారికి కోపం రావడం చాలా అరుదు. అనవసర ప్రసంగం అంటే వారికి అసలే గిట్టదు. మితభాషి అయినప్పటికీ, అడిగిన ప్రశ్నలకు సమాధానాలను విడమరచి చెప్పేవారు. దానితో ప్రశ్నలు అడిగే వారి సందేహాలు పూర్తిగా తొలగిపోయేవి. ఎప్పుడైనా, ఏ వ్యక్తి అయినా వారు యిచ్చిన వివరణ అర్థం చేసుకోలేక పోయినట్లయితే, అలాంటివారికి 'తగిన స్థితి'ని కలుగజేసి, వారి ప్రశ్నలకు సరైన సమాధానం స్ఫురించేటట్లు చేసేవారు. ఛెస్టర్ ఫీల్డ్ మహాశయుడు చెప్పినట్లుగా మౌనమూ, మితభాషణా, అంతర్గత శక్తికి నిదర్శనాలు.

"వాక్చాతుర్యం గొప్పదే - కాని మౌనం ఇంకా గొప్పది" అని కార్లైల్ మహాశయుడు అన్నాడు. లాలాజీగారి చూపులు ఎదుటివారి కళ్ళలోనికి సూటిగా చూసినట్లు ఉండేవికావు. ఎక్కువగా వారి చూపులు క్రిందకే ఉండేవి. కేవలం చిరునవ్వు చిందించడం తప్ప వారు ఎన్నడూ బిగ్గరగా నవ్వేవారు కారు. వారి చిరునవ్వు మాధుర్యాన్నీ, మంచితనాన్నీ విరజిమ్ముతూ ఇతరులకు ఆధ్యాత్మిక ఉల్లాసాన్ని కలిగించి ఉత్సాహపరిచేది. వారికి మానవాళి పట్ల అపరిమిత ప్రేమానురాగాలు ఉండేవి. ఇతరులు తనకు ప్రేమతో సమర్పించిన కానుకలు ఇష్టం లేకపోయినా, తరచు వాడుతూ ఉండేవారు. ముఖస్తుతిని వారెంతమాత్రం సహించేవారు కారు. తన అనుచరులలో ఎన్ని లోపాలున్నప్పటికీ సహించి, వారిపై ప్రేమాభిమానాలను కురిపించేవారు. కాని క్రమశిక్షణకు మాత్రం ఎంతో ప్రాముఖ్యతనిచ్చేవారు. క్రమశిక్షణ ప్రాపంచిక అనురాగాల కుళ్లును కడిగివేస్తుంది. నీతి నియమాలతో హృదయాన్ని బలపరుస్తుంది. ఉపయోగపడే విద్య నేర్పడం వలన మనస్సుకు వివేకం'

కలిగి, అంతరంగంలోపలనుండే ఆనందం కలుగుతుంది. అందువల్లనే లాలాజీగారెప్పుడూ అనురాగంతో కూడిన కఠిన క్రమశిక్షణను అమలు పరచేవారు.

తోటి సోదర మానవులకూ, శిష్యులకు శిక్షణనిచ్చే తలంపుతో వారు తమ గృహస్థ జీవనంలో విధులను చక్కగా నిర్వర్తించేవారు. పెద్దలను గౌరవించి పూజించేవారు. సమవయస్కులను కించపరచకుండా, వారిపట్ల నమ్రతతో వ్యవహ రించేవారు. పిన్నవయస్కుల పట్ల ప్రేమానురాగాలు చూపేవారు.

ఉదయం అల్పాహారం తీసుకునే అలవాటు వారికి లేదు. వారెప్పుడూ పొగ త్రాగేవారు కారు. పేకాట కానీ, జూదం కానీ ఆడేవారు కారు. అప్పుడప్పుడూ వారు హార్మోనియం వాయిస్తూ పాడుతూ ఉండేవారు. లాలాజీగారు కర్మకాండలకు వ్యతిరేకి. స్త్రీ విద్యనూ, వితంతు వివాహాలనూ హర్షించేవారు. అభ్యాసుల పిల్లలు తమలో తాము వివాహాలు చేసుకుని సంబంధ బాంధవ్యాలు కలుపుకోవాలన్నది వారి కోరికల్లో ఒకటి. కాని బాల్య వివాహాలనూ, వయస్సు మళ్ళిన వివాహాలనూ అనుమతించేవారు కారు. వారింట్లో పనివారిని కూడా కుటుంబ సభ్యుల్లాగే చూసేవారు. వారికి జీతాలు సకాలంలో ముట్టేవి. సేవకులంటే సహాయకులనీ, కాబట్టి సాధారణంగా యజమాని స్వయంగా చేసుకోలేని పనులు చేయించుకోడానికే వారి సేవలను వినియోగించుకోవాలన్నది లాలాజీగారి అభిప్రాయం. ఆడినమాట తప్పడం అన్నా, పండగలకూ పబ్బాలకూ తలకుమించి ఖర్చు చేయడం అన్నా ఆయనకు, సుతరామూ ఇష్టం ఉండేది కాదు. చాడీలు చెప్పేవారికి లాలాజీగారి నుండి ఏమాత్రం సానుభూతి లభించేది కాదు. పైపెచ్చు వారిని అంతటితో వదలక "నిన్ను గూఢచారిగా నియమించలేదే!" అంటూ గట్టిగా చీవాట్లు పెట్టి, వెంటనే సరియైన దారిలోనికి తెచ్చేవారు.

## కాయమ్ గంజ్ నుండి ఫతేఘర్ కు

లాలాజీగారు 1908 సం. లో కాయమ్గంజ్ నుండి ఫతేఘర్కు బదిలీ అయ్యారు. ఎక్కువసేపు ఏకాంతంగా, దైవ చింతనలో గడప నారంభించారు. ఇంటిపని అంతా చేసి పెట్టడానికి ఒక ముసలి నౌకరు ఉండేవాడు. లాలాజీగారి వ్యక్తిత్వమూ, జీవనసరళీ, వారి నడవడికా ఇరుగుపొరుగు వారినెంతగానో ఆకర్షించేవి. వారు లాలాజీగారి పట్ల ప్రేమాదరణాలు చూపి, అమితంగా గౌరవించేవారు. మొట్టమొదట్లో కొందరు ఉపాధ్యాయులు వారి వద్దకు వచ్చారు. త్వరలోనే వారిలో పరివర్తన కలిగింది. తమకు తెలియకనే తమలో వచ్చిన మార్పులను వారు గ్రహించి, తమ శిష్యులకు వివరించడం వలన,

వారు కూడా లాలాజీగారి వద్దకు వెళ్ళి 'పరివర్తన చెందుతూ ఉండేవారు. అద్భుతమైన, అసాధారణమైన ఈ క్రొత్త పద్ధతిని గురించి తెలుసుకొని, మిగిలినవారు కూడా లాలాజీగారి దగ్గరకు రాసాగేవారు. కాని అటువంటివారికి వెంటనే 'సత్సంగ్ మొదలు పెట్టేవారు కాదు. వారికి ప్రాణాహుతి ప్రసారం చేసి, నిర్మలీకరణ చేసి, వారిలో మార్పును సాధ్యం చేసేవారు. తన పని బట్టల మురికిని తొలగించే చాకలిపని వంటిదనీ, మరుగుదొడ్డి శుభ్రపరచే పాకీ పని వంటిదనీ అంటూ ఉండేవారు. తమ వద్దకు వచ్చేవారు ఎటువంటి వారైనా, వారిని క్షాళన చేసి, నిర్మలంగా చేసేవారు. వారి మనస్సులు పరిశుభ్రమైన తర్వాత, తమ తమ సంస్కారాలకనుగుణంగా వారికి మార్గ దర్శకులు లభిస్తారు. అనర్హులకూ, అపాత్రులకు ప్రవేశం ఇవ్వరాదనీ, అలాగని తన వద్దకు వచ్చినవారు ఎటువంటి వారైనా సరే, వెనుదిరిగి పోరాదన్నది లాలాజీగారి అభిమతం. “గురువుగారు” అని పిలిపించుకోవడమంటే వారికి పరమ అసహ్యం. శిక్షణనిచ్చే విషయానికి వస్తే, 'అధికారికి నేనొక సేవకుడను' అని చెప్పుకునేవారు. ఆ భగవంతుని ఆదేశాలను అమలు పర్చడమే తన విధి అనీ, దాని లాభ నష్టాలతో తనకు ప్రమేయమేమీ లేదని ఆయన అనేవారు.

భోగములు గావు, మరి దుఃఖములు గావు

మనము చేరెడి చోటు, లేక నడిచెడి బాట

కాని సాధన చేయగ ప్రతి రేపటిరోజు

నేటికంటే దూరముగ కొనిపోవు.

లాలాజీగారు 1914 నుండి ఒక క్రమపద్ధతిలో సత్సంగాన్ని ఏర్పాటుచేసి, అనుచరులకు శిక్షణ నివ్వడం మొదలుపెట్టారు. తాను అస్వస్థులుగా ఉన్నప్పుడు కూడా ఈ పనిని మాత్రం ఆపేవారు కాదు. 1929 సం.లో వారి పదవీవిరమణ తర్వాత, తన సమయాన్ని పూర్తిగా ఈ మహత్తర కార్యానికే వినియోగించేవారు. ప్రతిరోజు 2-3 గంటలసేపు గ్రంథాలూ, వ్యాసాలు, సత్సంగీయులు ఉత్తరాలకు జవాబులు చెప్పి వ్రాయించుకునేవారు. ఉర్దూ, పర్షియన్, అరబిక్, భాషలలో వారు గొప్ప పండితులు. సంస్కృత, హిందీ భాషలలో వారు ప్రవీణులు. వేదాలలో ఇంతవరకూ వెలువడని నిగూఢ రహస్యాలనెన్నింటినో వారు వెల్లడించారు. వేదాలలో ప్రసిద్ధిచెందిన 'రిచస్సు' లకు తేటతెల్లంగా అర్థం చెప్పి, సత్యతత్వాన్ని వెలుగులోనికి తీసుకువచ్చారు.సర్వసాధారణంగా అపార్థాలనూ, సందేహాలనూ కలిగించే పరస్పర విరుద్ధమైన సమాసాలతో కూడుకున్న పదాలను అందరికీ సులువుగా అర్థమయ్యే

విధంగా, ఏ విధమైన అనుమానాలకు తావులేకుండా, సరళరీతిలో తేటతెల్లం చేసి, అసలైన పరిజ్ఞానం ఏ ఒక్కరికో మాత్రం పరిమితం కాదనీ, అది అందరి సొత్తూ అని అందరూ గుర్తించేటట్లు వివరించారు. కాని దురదృష్టవశాత్తూ వారి రచనలన్నీ మనకు అందుబాటులో లేవు. అయోగ్యుల చేతుల్లో పడడం వలన అవి మరుగున పడిపోయాయి. వారు వ్రాసిన వాటిలో మనకు లభించిన పది వ్యాసాలు మాత్రం షాజహాన్పూర్ నుండి వెలువడే 'సహజమార్గము' పత్రికలో ప్రచురింపబడ్డాయి.

తన కృపాకటాక్షాలను వెదజల్లే ఆ పరమసత్యము, ఆ పరంజ్యోతి ఇహలోక యాత్రను ముగించి 1931 సం. ఆగష్టు 14న తన భౌతిక శరీరాన్ని వదలి, తరలిపోయింది. తీవ్ర రుగ్మతకు లోనయినప్పుడు కూడా వారు నిత్యం భగవధ్యానంలోనే ఉంటూ, హృదయ విదారకమైన విరహవేదన ననుభవించారు.

“వాదే వసల్ చూన్ షవద్ నజీక్

ఆతషే షేక్ తేజ్- తర్ గరాద్.”

'గంపెడాశతో ఎదురుతెన్నులు చూసే ఆ ప్రియా సమాగపు వేళ సమీపిస్తున్నకొలదీ ఆ ప్రియునిపట్ల ప్రేమాగ్ని రగిలి అవధులు దాటుతుంది' అనేవారు. వారి మహా సమాధికి కొద్ది రోజుల ముందు 'విముక్తాత్మలు ఎన్నో నా మంచం చుట్టూ ఉన్నాయి. ప్రియుని చేరుకునే క్షణాలు ఆసన్నమయ్యాయనడానికి ఇదే నిదర్శనం' అని వారు చెప్పారు.

అంతిమదశలో వారికి అతిసార వ్యాధి సోకడం వలన, తనకు తానుగా నడవలేనంతగా నీరసించిపోయారు. భౌతిక కాయాన్ని విడచి వెళ్ళే చివరిరోజున, ఎవరి సహాయమూ లేకుండానే, స్వయంగా వారంతట వారే పూజగదిలోనికి నడచివచ్చి, ప్రక్కపై కన్నులు మూసి పడుకున్నారు. మూసిన ఆ కన్నులు ఇక తెరువలేదు. అర్ధరాత్రి ఒంటిగంటవేళ, ఆ నిశీధి సమయంలో ఆజ్యోతి, బాధలతో ఆక్రోశించే మానవాళి హృదయాలలో వెలుగు నింపిన ఆ జ్యోతి, అనితరమైన తన ప్రేమాంబుధిలో ముంచి, పుడమి తల్లి ముఖవర్చస్సునే మార్చగలిగిన ఆ పరంజ్యోతి, సంకల్ప పూర్వకంగా తన అవతారాన్నిముగించుకుని అంతర్థానమయింది. ప్రపంచమనే ఈ పిచ్చివాళ్ళ భవంతి వెలితిగా మిగిలిపోయింది. వారు రగిల్చి మిగిల్చి వెళ్ళిన చిన్నా పెద్దా జ్యోతులే ఈ వెర్రిబాగుల మానవాళిని ఉద్ధరించి, వారికి రవ్వంత వెలుగు నివ్వాలి.

గానము, మృదు స్వరంబులు ఉడిగినంత

మెదలుచుండును స్మృతుల బాటలందె

గంధములు, కమ్మని కృష్ణ కమలాలు క్షీణించినపుడు

సజీవములు గావె, అవి గిలిగింతలిడిన ఘ్రాణమందు

గులాబుల లేతచిగురులు, వాటి విరులు వాడిపోవ

సేకరింతురు ప్రియుని పాన్పు కొరకు

అటులె నీదు తలంపులు, చనినంత నీవు

ప్రేమ తనంతట విధిగ కునుకు దీయు

అట్లే శ్రేష్టజీవులు మీరు, అంతట మరియు

అవతరింతురు మరల ఈ పుడమి మీద

మీరు వెనుక విడచిన వ్యక్తులు, మీరు చనిన పిదప

బోధింతురు ఇచట మాకు మిమ్ముచేరు తీరు

ఎచట మీ ఇతర జీవులు, 'భోగలాలసులై

కునుకరేనాడు, మోము ఇసుమంత మొత్తకుండ

**<u>బోధనలు</u>**

“అడగనిదే సలహాల నివ్వకెప్పుడూ, లేకుంటే అవి దుష్ఫలితాల నివ్వగలవు. ఎవరిలోనైనా లోపాన్ని నీవు కనుగొన్నప్పుడు, అది దూరమవ్వాలని భగవంతుని ప్రార్థించు” అని లాలాజీ బోధించారు. చెడు అలవాట్లను మానమని వారెవరికీ సూటిగా చెప్పలేదు. వారి సన్నిధిలో అటువంటి చెడు అలవాట్లు, వ్యసనాలూ అన్నీ వాటంతట అవే ఆ వ్యక్తిని విడచి మటుమాయమయ్యేవి. ఈ పద్ధతి గురించి వివరిస్తూ, “నీవు నిప్పుకు సమీపంలో కూర్చుంటే, ఆ నిప్పు సెగ నీకు తగులుతుంది. మంచుగడ్డకు ప్రక్కన కూర్చుంటే, చల్లగా అనిపిస్తుంది. అటువంటప్పుడు, సుశిక్షితుడూ, శిష్టాచార సంపన్నుడూ అయిన వ్యక్తి సాన్నిధ్యంలో కూర్చుని ఉంటే నీవు ఎందుకు మార్పు చెందవు?” అని అనేవారు.

కోరికలను తగ్గించుకోమని వారెప్పుడూ చెపుతూ ఉండేవారు. "ఉన్న దానితో సరిపెట్టుకోగలిగితే, క్రొత్త వస్తువును కొనవద్దు" అనేవారు. న్యాయసమ్మతంగా చేసే ధన సంపాదనను వారెప్పుడూ వ్యతిరేకించలేదు.కాని ఆధ నాన్ని ఇతరులకోసమై వెచ్చించమని పట్టు బట్టేవారు. మత్తు పదార్థాలను సేవించడాన్నీ, వ్యభిచారాన్నీ వారు ఖచ్చితంగా నిషేధించేవారు. ఇటువంటి విషయాల్లో మీ మనస్సును నమ్మవద్దని తరచుగా హెచ్చరించేవారు. వారి అభిప్రాయంలో కాంతాదాసుడూ, లోభీ, పరమార్ధ సాధనకు పనికిరారు.

లాలాజీగారి దృష్టిలో ఆడంబరాలూ, లేనిపోని గొప్పలు చెప్పుకోవడం అనేవి పనికిమాలిన పనులు. నిజాన్ని ఉన్నదున్నట్లుగా చెప్పడం ఉత్తమమని వారి అభిప్రాయం. హృదయంలో గల మాటను నాలుక ఉచ్చరించుటయే అసలైన క్రమశిక్షణ, మర్యాద అని వారు దృఢంగా విశ్వసించేవారు. సాధకుని లోని అంతర్గత స్థితి, బయటకు వ్యక్తమయ్యే బాహ్య స్థితి ఒకేవిధంగా ఉండాలని వారనేవారు. ఇతరులలో గల లోపాలను గురించి ఆయన చర్చించేవారు కారు. అవసరాన్నిబట్టి ఒకవేళ అటువంటి విషయం ప్రస్తావనకు వస్తే, ఆయన మౌనంగా ఉండిపోయేవారు.

మహిమలను ప్రదర్శించడాన్ని ఆయన ఏవగించుకునేవారు. సాధన చేసేటప్పుడు ఏ సాధకునికైనా అటువంటి సిద్ధులు లభిస్తే, వారు వెంటనే వాటిని తొలగించేసేవారు. అహంభావాన్ని ఎప్పుడూ పెరగనిచ్చేవారు కారు. గమ్యాన్ని చేరి పూర్తి క్రమశిక్షణ అలవడేవరకూ, సాధకులు సిద్ధులకు కడుదూరంలో ఉండాలన్నది వారి వాదన. సాధకుడు గమ్యాన్ని చేరినట్లయితే, ఆతడు చేసే ప్రతి పనీ, దానంతట అదే ఒక అద్భుతంగా అవుతుంది. సాధువులు చేయగల గొప్ప మహిమ ఏమిటంటే, పశువు వంటి అవస్థ నుండి మానవుని ఒక పరిపూర్ణునిగా మార్చడమే. వారికి ఈ సిద్ధుల మీద పూర్తి అధికారం కలదనడంలో ఎటువంటి సందేహమూ లేదు. కాని వారీ శక్తులనెన్నడూ ఉపయోగించలేదు.

ఆధ్యాత్మిక పరిపూర్ణత మూడు విషయాలపై ఆధారపడి ఉంటుందనేది లాలాజీ అభిప్రాయం. అవి.

1. గురువర్యుని ఎడల ప్రేమ,
2. గురువర్యునితో సత్సంగం,
3. గురువర్యునిపట్ల విధేయత.

మంచివారూ, యోగ్యులూ అయిన శిష్యులకు శాస్త్రీయ శిక్షణ నిచ్చేవారు కాదు గానీ, వారిని సత్సంగంలో పాల్గొనమనేవారు. వారి వారి సామర్థ్యాల కనుగుణంగా శిష్యులకు శిక్షణనిచ్చేవారు. కొంతమందికి 'సురత్' శబ్ద యోగాన్నీ, మరికొందరికి హృదయంపై ధ్యానాన్ని నిర్దేశించేవారు. ఇంకొందరిని మంత్రజపం చేయమనీ, మిగిలినవారిని కొన్ని సాధనలు చేయమనీ ఆదేశించేవారు. సత్సంగంలో పాల్గొంటూ, హృదయంపై ధ్యానం చేస్తూ, గురువర్యుని కృపను పొందమని నొక్కి చెపుతూ ఉండేవారు. కొన్ని సందర్భాల్లో హృదయంపై 'ఓం' కార జపం కూడా చేయమనేవారు. వీటిలో ఏ ఒక్కటి చేసినా, లేదా అన్నింటినీ చేసినా, ప్రకంపనలు ప్రారంభమై, 'శబ్దారంభం' అయేది. ఈ స్థితిని వారిలో కల్పించి, నిరంతరం ఆ 'శబ్దాన్ని' అలా వింటూనే ఉండమని లాలాజీ సాధకులకు చెప్పేవారు.

సత్యతత్వ ప్రాప్తికోసం పరితపించే వారెవరైనా సరే, కుల మత భేదాలు లేకుండా, అందరికీ ఆధ్యాత్మిక శిక్షణనిచ్చేవారు. వేర్వేరు వ్యక్తుల శిక్షణకు వేర్వేరు పద్ధతులను ఉపయోగించేవారు. ఒక్కొక్కసారి, సాధకునికి ఎంతో ఇష్టమైన వ్యక్తులపై గానీ, వస్తువులపై గానీ ధ్యానం చేయమని చెప్పేవారు. అన్ని మత గ్రంథాలకూ విలువనిచ్చేవారు. సాధువులనందరినీ ఆదరించేవారు. "స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః" అని గీతలో చెప్పినట్లు, ఎవరు ఏ మతంలో జన్మించారో, వారు ఆ ధర్మాన్నే ఆచరించడమనేది వారి అభిమతం.

విగ్రహారాధనకు ఆయన వ్యతిరేకి. తన ఫోటోను ఉంచుకోడానికి ఆయన తన శిష్యులను అనుమతించినప్పటికీ, దానికి పూజలు చేయనిచ్చేవారు కారు. ఆత్మస్తుతిని వారెంతగా ఈసడించుకునేవారంటే, తమ గౌరవార్థం ఎవరైనా వారి పాదాలను తాకడానికి ఒప్పుకునేవారు కారు. కాని హిందువులలో ఈ ఆచారం, సాంప్రదాయబద్ధంగా ఉంది కాబట్టి, వారిపట్ల ఈ నియమాన్ని సడలించేవారు.

విపరీతంగా జపతపాదులను చేయడానికి వారు ఇష్టపడేవారు కారు. మధ్యేమార్గంగా, హృదయంపై ధ్యానించడమే అసలైన సాధనగా వారు భావించేవారు. ప్రార్థనకు ఆయనెంతో ప్రాముఖ్యతను ఇచ్చారు. కానీ, ఆ ప్రార్థన ప్రాపంచికమైన. కోరికల కోసం కాకూడదు. ప్రపంచంలోని సర్వమానవుల ఆత్మోన్నతికీ వారు అనునిత్యం ప్రార్థన చేసేవారు.

వారి అభిప్రాయం ప్రకారం, ప్రతీ జిజ్ఞాసువునకూ గురువొకరు అవసరం. కానీ అట్టి గురువును ఎన్నుకొనడంలో చాలా జాగ్రత్త వహించాలి. అలాగే ఒక సమర్ధవంతుడైన ఒక గురువర్యుని కనుగొన్నాక ఆ జిజ్ఞాసువు చేయవలసిందంతా ఒక్కటే ఆ గురువర్యునికి దాసోహం కావడమే. అలా శరణాగతి చొచ్చిన సాధకుడు, శవాల నలంకరించేవాని చేతిలో శవంలా, తాను గురువర్యునికి పూర్తిగా అంకితం కావాలి. తననితాను పూర్తిగా సమర్పించుకోవాలి.

హృదయంలో ఉన్న సంస్కారాలను పోగొట్టుకోడానికి తమతమ శత్రువులతో స్నేహం చెయ్యమనీ, ఎవరిని చూస్తే భయపడతారో వారితోనే మైత్రి సలుపమనీ సత్సంగీయులకు హితవు పలికేవారు. ఇతరులు ఏ పని చేస్తే తనకు నచ్చదో, అటువంటి పనిని తాను ఇతరుల పట్ల చేయరాదని అనేవారు లాలాజీ. వారి దృష్టిలో ప్రేమయే ఎంతో ఉత్తమమైన తపస్సు.

తమకు ఆ దైవం ప్రసాదించిన సమస్త  సదుపాయాలకూ ఆ భగవంతునికి కృతజ్ఞతలు తెలుపుకోవాలని ఆదేశించేవారు. దైవం ప్రసాదించిన అటువంటి వాటిని స్థిరంగా నిలుపుకోడానికై, వాటిని సద్వినియోగంచేసి సత్కార్యాలు ఆచరించాలని సలహా ఇచ్చేవారు. "దైవానికి రెండే రెండు నివాసస్థానాలు ఉన్నాయి. ఒకటి స్వర్గంలోను, మరొకటి కృతజ్ఞతనిండిన సాధు హృదయాలలోను" అన్న ఐసక్ వాల్టన్ గారి మాటలు ముమ్మాటికీ వాస్తవాలని అంగీకరించక తప్పదు.

ఋజుప్రవర్తనకు లాలాజీ ఎంతో ప్రాముఖ్యాన్ని ఇచ్చేవారు. నీతి నియమాలను అనుసరించనిదే ఆత్మ సాక్షాత్కారం అసంభవమని నిర్ద్వందంగా, చెప్పేరు. అవినీతిపరులతో సహవాసాన్ని, సత్సంగాన్నీ నిషేధించారు. భగవంతునిపట్ల దివ్యప్రేమతో తొణికిసలాడే హృదయం గలవారు తోటి సహచరులపై మంచి ప్రభావాన్ని చూపగలరనీ, అందుకని అటువంటి పవిత్ర మనస్కులతోనే సహవాసం చెయ్యాలనీ స్పష్టంగా వివరించేరు.

మహాత్ములకు ఈ క్రింది మూడు విషయాలూ ఉండాలని చెప్పారు.

1. నిత్య శారీరక రుగ్మత,
2. ఆర్ధిక ఇబ్బందులు,
3. తనలోని లోపాలను ఎత్తిచూపే వారు నిందకులు.

మనస్సును సమతుల్య స్థితికి తీసుకురావడమే నిజమైన సాధన. మితంగా భుజించు, నిజాయితీగా సంపాదించు. న్యాయంగా సంపాదించని ఆహారాన్ని భుజిస్తే, ఆధ్యాత్మిక అనుభవాలు తరుచు పెడదారిని పడతాయన్నది లాలాజీ ప్రబోధన.

"కష్టాలకూ, వ్యాకులతలకూ గురికావడం మంచిది. అణకువ, సహనశీలత అలవడాలంటే గృహమే అనువైన బోధనారంగం. గృహస్థ జీవనమే త్యాగానికీ, తపస్సుకూ ఉత్తమమైన సాధనము" అని మరొకచోట వ్రాసారు. "బాధలూ, చింతల విషయానికొస్తే, ఇతరులకు విస్మయాందోళనలు కలిగించే కష్టాలు నాకూ ఉన్నాయి. ఒక్కొక్కసారి భోజనానికి ఏమీ ఉండేదికాదు. నాపై ఆధారపడి చాలామంది పిల్లలూ, ఆశ్రితులూ ఉండేవారు. ఇంతేగాక, ఇతరులకు సహాయాన్ని అందించవలసిన తప్పనిసరి పరిస్థితులు ఎదురయ్యేవి. దీని పూర్తి భారం నా ఒక్కనిపైననే పడేది. అన్నింటినీ సమర్థించుకుంటూ, అందరి అవసరాలనూ తీర్చవలసి వచ్చేది. ఇంకా చెప్పాలంటే, ఒక్కొక్కసారి చలికి కప్పుకోడానికి ఇంటిల్లిపాదికీ కలిపి ఒకే ఒక బొంత ఉండేది. అది కూడా చినిగిపోయి, అతుకులతో నిండి ఉండేది. ఇదంతా వక్రించిన విధి విన్యాసాలుగా స్వీకరించేవాడిని. నా అస్తిత్వంలోని అత్యంత ముఖ్యమైన 'సత్యతత్వము తో పోల్చిచూస్తే, ఇవన్నీ బొత్తిగా నిస్సారములేయని భావించేవాడిని. కాబట్టి ఇవన్నీ మోక్షప్రాప్తికి సాధనాలు అనుకుని నాలో నేనే నవ్వుకుంటూ ఉండేవాడను" అని లాలాజీ వేరొకచోట తెలియజేసారు.

**<u>కొన్ని ముఖ్య సూత్రాలు</u>**

"భగవంతుని కోసం వెదికేదే ఆత్మ. వెదుకబడేదే పరమాత్మ".

"మనిషిలోని మంచిచెడ్డలను తెలుసుకునే శక్తికి తగినట్లే ఆతని ఆత్మ పరిశుద్ధత ఉంటుంది".

"ప్రేమికులమైన మనము జ్ఞానమయితే, భగవంతుడు పరిజ్ఞానం, పరిపూర్ణ జ్ఞానం. అంతేకాదు, జ్ఞాన స్వరూపము కూడా!"

"మానవుడు పరిపూర్ణమైనవాడు కానంతవరకూ భగవత్రాప్తి సిద్ధించడం అసంభవము". "అనుభూతి నొందాలి ప్రతి మానవుడూ,

తాను భగవంతుని ఒక ప్రక్రియనని.

వాని మనస్సే ఒక తలంపు అని,

వాని ప్రాణమే భగవంతుని ఊపిరియని"

అని బెయిలీ మహాశయుడు వివరించాడు.

“చెడ్డవాడు భగవంతుని చేతిలోని బంకమన్ను, సైతాను చేతిలోని మైనపుముద్ద. మంచివాడు భగవంతుని చేతిలో మైనపుముద్ద, సైతానుకు బంకమట్టి' అని హాల్ మహాశయుడు చెప్పాడు.

“సాధనను కొనసాగించి, నీ మనస్సును పరిశుభ్రం చేసుకో. అప్పుడే గ్రంథాలను అధ్యయనం చెయ్యి. అలా చేయకపోతే, ఆ పరమ సత్యం నీకు అందకుండా పోతుంది”.

“గురువును అవాలనే కోరికను వదలుకో. అచ్చమైన సేవకునిలా పనిచెయ్యి".

"ధనవంతులతో, ఆడువారితో, పసిపిల్లలతో సాంగత్యం మానుకో”.

“నిర్ణీత సమయంలోనే భగవత్ప్రాప్తి కలుగుతుందని ఎవ్వరికీ వాగ్దానం చెయ్యకు”.

“ఆత్మ - పరమాత్మల ఉనికిని గురించిన సందేహాలను తొలగించుకోడమే నీవు చేయవలసిన పని. వీటి నుండి నీవు ముక్తి పొందిన నాడు, నీకిక గురువే అవసరం లేదు”.

"పరమాత్మనూ, ఆత్మనూ వెదకడం సహజమే. కాని అది ఒట్టి బుద్ధిమాంద్యపు పని. ఈ మనోకల్పనను నివారించడం 'గురువు' అనెడి మరో మనోకల్పన వల్లనే సాధ్యం కాగలదు".

“నాస్తికుడు అంటే భగవంతునిపై నమ్మకం లేని వాడని కాదు. శారీరక, మానసిక, బుద్ధిపరమైన ఆధ్యాత్మిక ఉనికికి హాని కలిగించేవాడే నాస్తికుడు సుమా!"

'భగవంతుడు నీ హృదయంలో దాగి ఉండి, నిన్ను బట్టబయలు చేసాడు. నీవే లోపల దాగుకొని, భగవంతుని వెలికితియ్యి' ఇదే అసలుసిసలైన సాధన.

ఒక ప్రసిద్ధ తాత్వికుడు అన్నట్లుగా :

"మతము అనగా సాంప్రదాయక ఆచారాలను పాటించడము, కర్మకాండలను ఆచరించడము ఎంతమాత్రమూ కాదు. సరళ స్వభావమూ, దయా, జాలీ, కరుణా, మర్యాదా, మన్ననా, ఏకాగ్రతా, స్వీయ పరిజ్ఞానం, ప్రేమా, సర్వమానవ సహోదర భావము. ఇవన్నీ కలిసి, 'మతము' అవుతుంది. నిజానికి ఎవరైనా సరే, మతానికి అధీనుడు కాకూడదు. కాని మతమే అతడి స్వాధీనంలో ఉండాలి.

ఎందుకంటే ఎవరి మతమైననూ సరే, వారి నీతి నియమాలను అతిక్రమించి మనజాలదు. వాస్తవానికి ఈశ్వరేచ్ఛ ననుసరించి నడచుకోడమే మతము".

వేలమంది మానవులలో ఏ ఒక్కని లోనో భగవంతునిపట్ల తపన కనిపిస్తుంది. భగవంతుని పట్ల అసలైన ప్రేమ అంటే ఏమిటి? ప్రేమికుడూ, ప్రియురాలూ, ప్రేమా అనే త్రిమూర్తులూ తాదాత్మ్యం చెంది అదృశ్యమయినప్పుడు కలిగే స్థితియే నిజమైన ప్రేమ.

ఈ కష్టాలనేవి భగవంతుని వరాలు. వాటిలో అనేక రహస్యాలు దాగి ఉన్నాయి. కష్టాలననుభవించడం ద్వారా ఆంతరంగంలో అనేక అనుభూతులను పొందవచ్చు. 'జెరెమీ టేలర్' అనే మహాశయుని అభిప్రాయం ప్రకారం, మతంలో దాగి ఉన్న అనేక నిగూఢ రహస్యాలు, అనుభవ పూర్వకంగానే తప్ప, అవగాహనకు రావు. రావు. ఏదైనా గొప్ప ఆపద సంభవించినప్పుడే అవి అనుభవంలోనికి వస్తాయి. 'మేలెట్' అభిప్రాయం ప్రకారం, విపత్తు అనగా ఓరిమి, చక్కని వినమ్ర భావము, స్థిమితమైన స్థైర్యము, ప్రతిష్ఠ - ఇవన్నీ లోతుగా ప్రేళ్ళూనుకుని దృఢంగా వర్ధిల్లడానికి సహాయపడే సారవంతమైన నేలవంటిది.

<u>**విశిష్ట వ్యక్తిత్వము**</u>

మానుషమై, మరియు దివ్యమై తోచెదవు నీవు

శ్రేష్టతముడవు, పరమపావనుడవు

మానవులకు ప్రభుడవు నీవు,

మా చిత్తములు మావి, ఎరుగము మేము ఎటుల

మా చిత్తములు మావి, సేయగ వలె వాటిని నీదు పరము

ఉత్తములు పొందియున్న ఉన్నత శిఖరాలు

చేరలేదు ఠక్కున పరుగుదీసి

తోటివారు నిద్రమునిగియుండ, వారు మాత్రము

పాటు బడెడివారు నిశివేళ పైకి బోవ

- లాంగ్ ఫెలో

“ఎవడు సరియైన దానిని, తిరుగులేని నిశ్చయముతో ఎన్నుకొనునో, ఎవడు తనను ఎక్కువగా ఆకర్షించి బాధపెట్టే, ఆంతరంగక, బహిరంగక మనోవికారములను ప్రతిఘటించునో, ఎవడు ఎంతటి కష్టభారమునైననూ వహించునో, ఎవడు కలతలు, అల్లకల్లోలాలలో సైతం అతి శాంతముగా నుండునో, ఎవడు బెదిరింపులనిన, ముఖము చిట్లింపులనిన మిక్కిలి నిర్భయముగ నుండునో, సత్యము, ధర్మము, మరియు దేవుని ఎడల ఎవరి ఇసుమంత అయినా తొట్రుపాటు చెందదో, అట్టివాడే విశ్వాసము ఉత్తముడు” అని ఉత్తముల గుణగణాలను గూర్చి డబ్ల్యు. ఇ. కేనింగ్ తన అభిప్రాయాన్ని వెల్లడించారు.

“ఆలోచనలలో ఔదార్యము, కార్యాచరణలో మానవత్వమూ, విజయసాధనలో మితత్వమూ అనే మూడు విషయాలూ వాస్తవంగా ఉత్తముడైన వ్యక్తిలో ప్రస్ఫుటంగా కన్పిస్తాయి” అని ‘బిస్మార్క్’ చెప్పాడు.

లాలాజీగారు భగవంతుని తరువాత భగవంతుటంతటి వారగుటవలన, సకల సద్గుణ సంపన్నులు, పరిపూర్ణ వ్యక్తిత్వము కలిగి ఉన్నారు. స్వామి వివేకానంద చెప్పినట్లుగా "ప్రకృతిని అధిగమించి పైపైకి పోయే ప్రయత్నం చేసేంతవరకూ మానవుడు కేవలం మానవునిగానే ఉంటాడు". ప్రకృతి రెండు విధాలు.

1. అంతరంగంలో ఉండేది,

2. బాహ్యంగా ఉండేది.

బాహ్య ప్రకృతిని జయించడం మంచిదే. చాలా గొప్ప విషయమే. కానీ అంతరంగ ప్రకృతిని జయించడం అంతకంటే గొప్ప విషయం. నక్షత్రాలనూ గ్రహాల గతులనూ నియంత్రించే సూత్రాలను తెలుసుకోడం బాగుంటుంది. గొప్పగా ఉంటుంది కూడా! అయితే మానవుని మనోభావాలనూ, ఇచ్ఛాశక్తినీ, ఆవేశాలనూ నియంత్రించే విధి నియమాలను గురించిన జ్ఞానం కలగడం అంతకంటే గొప్పది. ఇది మరింత గొప్ప విషయం”.

“మానవుడు అన్ని పశువుల కంటే, దేవతల కంటే కూడా చాలా ఉన్నతమైనవాడు. అతడిని మించిన గొప్పవాడు మరొకడులేడు. దేవతలు కూడా మోక్షాన్ని పొందాలంటే, మానవ శరీరం ద్వారానే పొందాలి. కాబట్టి, మరల మరల భూమిపై అవతరించవలసిందే. మానవుడొక్కడే పరిపూర్ణత్వాన్ని సాధించగలడు. అది దేవతలకు కూడా సాధ్యంకాదు".

కేవలం ఏడునెలల వ్యవధిలోనే లాలాజీగారు పరిపూర్ణత్వాన్ని పొందడం ఆశ్చర్యకరమైన విషయం కాదా? వారు విద్యార్థిగా ఉన్నప్పుడే, వారి శరీర వ్యవస్థ యావత్తూ దివ్యమైన అంతర్జ్యోతిగా రూపుదిద్దుకుంది. వారిలోగల చైతన్యస్థితి పైకి ఎగసి, పైపైకి ఎగసి ఎగసి, తెలిసిన అన్ని స్థితులనూ, అన్ని స్థావరాలనూ దాటుకుంటూ వెళ్ళి స్థితిలేని స్థితికి చేరుకుంది. అంతిమ సత్యమూ, ప్రకృతి యొక్క అద్భుత వ్యక్తిత్వమూ అయిన ఈ విశిష్ట వ్యక్తిత్వము, ఉపనిషత్తులలో చెప్పిన 'ప్రాణము యొక్క ప్రాణము' (ప్రాణస్య ప్రాణాహ)ను, ఏనాడో మరుగునపడిన ప్రాణాహుతి ద్వారా ప్రసారం చేసే విద్యను మానవాళికి తిరిగి అందజేసారు లాలాజీ. దీనిని ఒక విశిష్టమైన సాధనా పద్ధతిగా ప్రవేశపెట్టడం వలన సాధకుడు ఇంచుమించుగా తన బాధ్యత లన్నిటినుండీ విముక్తుడైనాడు. వారు అందజేసిన సిద్ధాంతమూ, పద్ధతి కూడా వేద ప్రమాణమే అయినప్పటికీ, సరికొత్తవే. డాక్టర్ కె.సి.వరదాచారిగారు నిర్వచించినట్లుగా ఇది ఒక 'నూతన దర్శనము' లేదా 'సప్తమదర్శన' శాస్త్రము.

మనం భగవంతుడు అని వ్యవహరించే ఆ కేంద్ర స్థానాన్ని నిర్ధారణ చేయుట, పరబ్రహ్మాండ మండలానికి మిక్కిలి దూరంగా ఉన్న “కేంద్ర మండలము" అనే మండలాన్ని కనుగొనుట, 'తమ్' అని వారు పేరుపెట్టిన అంతిమ ఆధ్యాత్మిక స్థితీ - ఇవన్నీ మునుపటి జ్ఞానుల ఊహకు కూడా అందని అధ్యాయాల వంటివి. ఈవిధంగా కనుగొన్నవి అన్నీ ఒకవిధంగా మేధావుల, ఆధ్యాత్మిక తత్వవేత్తల మెదడుకు మేతవేసాయి. ఈ వినూత్న పద్ధతి యొక్క సార్థకత ఎంతవరకూ నిజమో ఋజువు చేయడానికీ, ఇటుపై జరుగవలసిన పనిని కొనసాగించడానికీ, తిరుపతిలో ఒక పరిశోధనా సంస్థ నెలకొల్పబడింది. ఆగ్రా విశ్వవిద్యాలయము వారు 'సహజమార్గము” అనే ఈ వినూత్న పద్ధతిని పరిశోధనకు తగిన విషయంగా స్వీకరించడమేగాక, ఉత్తరప్రదేశ్లోని లఖింపూర్ ఖేరీ వాస్తవ్యులైన డా. ప్రేమ్సాగర్ గారికి డాక్టరేట్ పట్టాను ప్రసాదించారు.

లాలాజీగారు ఈశ్వరేచ్ఛను శిరసావహించి ఎలా నడచుకునేవారో తెలిపే దృష్టాంతం ఒకటి ఉంది. వారు చివరిదశలో కాలేయంలో వ్రణంతో బాధపడుతూ ఉండేవారు. దానికి ప్రకృతి వైద్య చికిత్స చేయించుకునేవారు. వారి శిష్యులలో ఒకరైన రామేశ్వర్ ప్రసాద్ మిశ్రాగారు, పొట్టపైభాగంలో కాలేయం ఉన్నచోట వెచ్చటి మట్టిముద్ద పట్టీను వేస్తూ ఉండేవారు. లాలాజీగారు విపరీతమైన బాధతో మూలుగుతూ ఉంటే, వారి బాధను చూడలేక మిశ్రాగారు కళ్ళనీరు పెట్టుకునేవారు. ఒకనాడు ఆ స్థితిలోనున్న మిశ్రాగారిని చూసి “నేను తలచుకుంటే, నా శక్తిని ఉపయోగించి, ఈ బాధను

నిముషాలలో తొలగించుకోగలను. కాని ఇదంతా ఈశ్వరేచ్ఛ. మనమందరం ఎంతో ఓరిమితో దానికి ఒదిగి ఉండాలి. అందుకని నేను దాని జోలికి పోవడంలేదు" అని సమాధానం చెప్పారు.

అహంకారాన్ని పూర్తిగా విడనాడి, భక్తీ, సహనమూ, మితత్వమూ మూర్తీభవించిన మహామనీషి లాలాజీగారు. ప్రాణాహుతి ద్వారా యోగ శిక్షణకు నాంది పలికే, ఒక నూతన శకం వారితోనే ఉదయించింది. కేవలము ఒక క్రీగంటి చూపుతోనే, ఒక్క వీక్షణంతోనే ఎదుటి వ్యక్తిని పరిపూర్ణునిగా మార్చివేయగల మహోన్నత శక్తిసంపన్నులు ఆయన. సామాన్య గృహస్థ జీవితాన్ని గడుపుతూ మానవుడు ఈ జన్మలోనే... కాదు కాదు, ఈ జన్మలోని స్వల్పకాలంలోనే పరిపూర్ణుడుకాగల అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన మహనీయుడు లాలాజీగారే. ఆధ్యాత్మిక శిక్షణను అత్యంత సరళంగా మార్చి, నేటి కాలమాన పరిస్థితుల కనుగుణంగా తీర్చిదిద్దిందీ ఆ సమర్థ గురుదేవులే!

అవినాశుడవు నీవు ఓ దేవా

మానవుని ఆలోచనాజగత్తులో సింహాసనారూఢుడవు నీవు

మానవుడు తానెట్టి వాడైనా, వానిలో లోపాలెన్నయినా

సాధించిన దేమైనా, ఇంకా పొందవలసింది ఎంతో ఉన్నా

అంతటికీ నీమీద, నీ శక్తిమీద ఆన సుమీ! "షెల్లీ"

## సంపాదకుని తుది పలుకులు

ఆదిగురువులు ఈ జగత్తును విడచి మహాప్రస్థానాన్ని కావించేటప్పుడు, తమ ఆధ్యాత్మిక వారసులు నెవ్వరినీ నియమించలేదు. అసంపూర్తిగా మిగిలిన వారి మహత్కార్యాన్ని సమిష్టిగా కృషిచేసి, పరస్పర సహాయంతో ముందుకు కొనసాగించడానికి బదులు, వారి శిష్యులు తలకొక దారి పట్టి ఎవరికి వారు విడిపోయారు. దీనివలన శ్రేష్టమైన తత్వజ్ఞానానికి సంబంధించిన పరిశ్రమ మాట అటుంచి, శాస్త్రము, కళలు మేళవించిన వారి పద్ధతి ముందుకు కొనసాగకుండా, అక్కడే నిలచిపోయింది.

లాలాజీగారు తీవ్ర అస్వస్థులైనప్పుడు, వారి శిష్యులు శ్రీ జగదాంబికా ప్రసాద్గారు, మరికొందరు కలిసి, 'మీ వారసుడు ఎవరు'? ప్రశ్నించి నప్పుడు "దీపం వెలిగినప్పుడు పురుగులు వాటంతట అవే వచ్చి దాని చెంత చేరుతాయి" అని ఎంతో ప్రశాంతంగా వారు సమాధానం చెప్పారు. ఇంకొక సందర్భంలో షాజహాన్పూర్కు చెందిన శ్రీ మదన్ మోహన్లాల్గారు కూడా ఇదే ప్రశ్న అడిగినప్పుడు, లాలాజీగారు చిరునవ్వు నవ్వి, "రామచంద్ర మన వంశమును ప్రకాశింపజేస్తాడు" అని అన్నారు. మరొక సందర్భంలో పండిత గంగా సేవక్గారు కూడా ఇదే విషయాన్ని అడిగినప్పుడు, "నేను నా వారసుని వదిలే వెళుతున్నాను. సమయం వచ్చినప్పుడు అతడు తనంతట తానే వ్యక్తమౌతాడు" అని లాలాజీగారు సమాధానం చెప్పారు.

శ్రీ రామచంద్రజీ (బాబూజీ) గారు శ్రీ రామచంద్ర మిషన్ సంస్థాపకులు. వీరు ఆదిగురువు లాలాజీగారి శిష్యగణంలో సర్వశ్రేష్టులు, సమర్థులు. తమ గురుదేవులు నిర్దేశించిన క్రమశిక్షణా పద్ధతిని తూ.చా. తప్పకుండా పాటించారు. తమ ఆధ్యాత్మిక అనుభవాలు, స్థితిగతులూ ఎప్పటికప్పుడు దినచర్యగా వ్రాసి గురువర్యునికి పంపుతూ ఉండేవారు. ఒకానొక రాత్రి బాబూజీగారు తమ గురుదేవులను కలలో చూసారు. గురుదేవులు తమ విశిష్ట అనుయాయునిలో ఐక్యమవడం చూచారు. అప్పుడు

"మన్ తూ పు దమ్, తూమై పుదీ, మన్ తన్

ఆన్షు దామ్, తూ జన్ పుదీ,

తాకస్ నా గోయెద్ బాద్ అజీన్,

మన్ దీగరమ్ తూదీగరీ" –

అంటే "నేను నీవైనావు, నీవు నేనైనాను. నేను శరీరమైతే నీవు ఆత్మవు. కనుక ఇకపై నీవూ నేనూ వేర్వేరు అని ఎవ్వరూ అనలేరు" అని వారు చెప్పారని బాబూజీగారు తమ స్వీయచరిత్రలో వ్రాసి ఉన్నారు.

బాబూజీగారి వ్యక్తిత్వాన్ని మలచి, పరిపూర్ణునిగా చేయడం లాలాజీగారి మహిమాన్విత కార్యము. ఇది ఆధ్యాత్మిక వికాస చరిత్రలోనే అసమానమైనది. ఈ రంగంలో వారి పరిశోధనలూ, ఆవిష్కరణలూ, అత్యద్భుతాలుగా మహనీయమైనవిగా పరిగణింపబడతాయి. ఇవి రాబోయే

శతాబ్దాలకు పరిశోధనాంశాలుగా మిగిలి ఉండిపోతాయి. తమ ప్రియతమ గురువర్యుల పేరున స్థాపించిన శ్రీ రామచంద్ర మిషన్ సహజమార్గ యోగసాధనా పద్ధతి ద్వారా మానవాళి పొందిన విశేష లబ్ధినీ, మానవాళిపై కురిపించిన వరాలనూ విలువకట్టి నిర్ణయించవలసినది భావితరాలవారే.

## 2. వేదములు

"వేద" అనే శబ్దం సంస్కృతభాషలోని "విద్" అనే ధాతు రూపం నుండి వచ్చింది. "విద్" అంటే జ్ఞానము. అనగా తెలుసుకొనుట అని అర్థం. ఈ జ్ఞానము అనే పదానికి విస్తారమైన తాత్పర్యమూ, విస్తారమైన వాడుకా, విశాలమైన భావమూ కూడా ఉన్నాయి. దీనికి అసంఖ్యాకములైన రూపాలూ, వివిధ స్థితులూ, అనేక దశలూ ఉన్నాయి. కాని మనము దృష్టి నిలుపవలసినది కేవలం మూడు రూపాలపైన మాత్రమే. అవి తమ్ (తమస్సు), రజ్ (రజస్సు), సత్ (సత్వము) లు.

అన్నింటికీ మూలాధారము "తమస్సు". "రజస్సు" మధ్యంతర స్థితి. "సత్వ"మనేది ఉన్నత స్థితి. ఇది అన్నిటికంటే పైన ఉంటుంది. మూలమూ, పై భాగమూ ఈ రెండూ రెండు కొనలు. ఏ కొంతైనా ఆలోచింప వీలయినదీ, పరిశీలింప సాధ్యమయేదీ మధ్యస్థితి ఒక్కటే. కనుక సర్వసాధారణంగా ఈ మధ్యంతర స్థితినే "జ్ఞానము" అని వ్యవహరిస్తూ ఉంటాము. దీనిని అవగాహన చేసుకోవడం ద్వారానే, ఎవరైనా ఈ మూడు స్థితుల గురించి తెలుసుకునే ప్రయత్నం చేసి, వాటిని వివరించడానికి వీలవుతుంది.

వేదము అంటే మూడు గుణాలకు సంబంధించిన విషయం అనగా, "త్రిగుణాత్మక విషయం" అని అంటారు. తమస్సు, రజస్సు, సత్వము అనేవి మూడు గుణాలు - మూడు లక్షణాలు. అయినా "రజస్సు" కే వేదం ఎక్కువ ప్రాముఖ్యతను ఇస్తుంది. అంటే మధ్యంతర స్థితిలోనున్న విచక్షణా శక్తికే ప్రాముఖ్యత నిస్తుందన్నమాట.

**<u>తమస్సు:</u>** ఇది అన్నింటికీ మూలము, పునాది, ఆధారము. ఈ పదానికి సంస్కృత భాషలో ఎన్నో అర్థాలున్నాయి. కాని సర్వసాధారణంగా"తమస్సు" అంటే అజ్ఞానము అంటే ఎరుకలేకపోవడమూ, సోమరితనమూ, ఏ పనీ-పాటా లేకుండా ఉండడమూ, మొరటుతనమూ, అస్పష్టతా, తత్తరపాటూ మొదలైనవి అని అనుకుంటారు. ఈ భావాలన్నీ 'మూలము' లేదా ఆధారము అనే అర్థాన్ని సూచిస్తాయి.

**రజస్సు:** ఇది మధ్యంతర స్థానము. సంఘర్షణ, పోరాటం, చపలత్వము, అస్థిరబుద్ధి, ఆలోచన మొదలైనవి దీని లక్షణాలు.

**సత్వము:** 'సత్' అనేది సంతోషాన్నీ, అనుకూలతనూ, ఉన్నతినీ, సూక్ష్మతనూ, పవిత్రతనూ, శ్రేష్టతనూ తెలుపుతుంది. ఇది మిగిలిన వాటికంటే ఉన్నతమైన స్థితిలో ఉంటుంది. ఈ అర్థాలనే అందరూ అంగీకరిస్తారు.

ఈ మూడు గుణాల కలయిక వల్లనే, ఈ సృష్టి అంతా మూడు లోకాలుగా లేదా మూడు విభాగాలతో కలిసిఉన్నట్లుగా తెలియవస్తుంది. ఈ మూడు గుణముల లోపలా అంతర్లీనంగా దాగి ఉండి, వాటిని ఆవరించిఉన్న నిజమైన మూల తత్త్వంగా ఏర్పడి ఉన్నదానినే "వేదము" అని అంటారు. ఈ దృష్టితో చూసినప్పుడు వేదము మూడు భాగాలనూ, మూడు లక్షణాలను కలిగి ఉన్నట్లు కన్పిస్తుంది. కాలానికి సంబంధించినదీ, ప్రదేశానికి సంబంధించినదీ, వస్తు పదార్థానికి సంబంధించినదీ - సృష్టికి సంబంధించిన సమస్తమూ వేదములోనే ఇమిడిఉంది. ఆకాశము, కాలము, పదార్థము (అనగా విషయము) మూడూ ఈ త్రిగుణాలవల్లనే ఏర్పడ్డాయి. వీటన్నింటికీ, మొదలు, నడుమ, చివర అనే మూడు స్థితులూ ఉన్నాయి. ప్రతి వృక్షానికీ వ్రేళ్ళు, కాండము, కొమ్మలు అనే ఈ మూడూ ఉంటాయి. కాండము మధ్య భాగంలో ఉంటుంది. సాధారణంగా ఈ మధ్య భాగమే మన కంటికి ప్రస్ఫుటంగా కన్పిస్తుంది. జీవితంలో మనము చేసే కఠిన ప్రయత్నాలూ, పడే శ్రమా అంతా ఈ మధ్య స్థితిలోనే వ్యక్తమౌతాయి. ప్రతి వ్యక్తిలోనూ కూడా ఈ మూడు స్థితులూ వివిధ పాళ్ళల్లో కలిసి ఉంటాయి. కాని లోపల నిక్షిప్తమైనదంతా ఈ మధ్యభాగంలోనే ఉంటుంది. ప్రతి ఒక్క క్రియకూ ఉండే ఆది అంతాలు తరచు కనుమరుగౌతూ ఉంటాయి. ఎప్పుడూ పని జరిగే క్షేత్రమూ, పని జరిగే కాలమూ ఇవే మన దృష్టిని బాగుగా ఆకర్షిస్తాయి. ఈ విధంగా, ఈ మధ్యస్థ భాగమే మన లక్ష్యానికీ, ధ్యానానికీ కేంద్రం అవుతుంది.

ప్రతి వ్యక్తికీ శిరస్సూ, మొండెమూ, కాళ్ళూ ఉంటాయి. కాని మధ్య ఉన్న శరీర భాగమే మన దృష్టిని ఆకర్షిస్తుంది. ఇంతకీ ఈ ఉదాహరణలకూ, వేదాలకూ గల సంబంధం ఏమిటి?

ఈ పరంపర కలయిక స్థితీ, ఈ పరంపరలకు సంబంధించిన జ్ఞానమూ, వీటన్నిటి ఫలితమే వేదం. అంతటా వ్యాపించి వున్న మూల పదార్థ తత్త్వమే జ్ఞానం. దీనిని భావస్థితి అని గానీ అనుభవ

స్థితి అని గానీ భావించినట్లైతే అది పొరపాటే అవుతుంది. మూలపదార్థ తత్వజ్ఞానానికీ, అనుభవానికీ తేడా ఉంది.

జ్ఞానమనేది ఒక సిద్ధాంతమూ, మూలపదార్థమూ, పదార్థసారమూ లేదా జీవము అని కూడా అనవచ్చు. ఇంద్రియశక్తులైన కంటిచూపు, వినికిడి, ఆలోచనాశక్తి, అన్ని జీవులూ, జీవరాసులు, పరమాణువులూ ఇత్యాదివన్నీ కూడా అన్నింటికీ ఆధారభూతమయిన జ్ఞాన సముదాయమే. అయినప్పటికీ దీనిని సంకుచితార్థంలో అన్వయించుకోరాదు. అలా అన్వయించుకుంటే 'వేదము' లేదా 'జ్ఞానము' అనే పదము తన ప్రాముఖ్యాన్ని కోల్పోతుంది. "వేదము" అనేది ఏదో ఒక ప్రత్యేకమైన గ్రంథానికో, దేశానికో, జాతికో, మతానికో పరిమితమైనది కాదు. ఇది మూడు లోకాలకూ సంబంధించిన జ్ఞానము - సమస్త సృష్టికీ సంబంధించినది. అధోలోకానికీ, ఊర్ధ్వలోకానికి సంబంధించినది. ఋషులు, మహాత్ములు తెలుసుకున్నదీ, లేదా గ్రహించినదీ వేదమే అయినప్పటికీ, సమస్త జ్ఞానమూ దానిలోనుండే ఉద్భవించింది. 'వసు'వులు, ఆదిత్యులూ, రుద్రులూ, అన్ని లోకాలూ, గ్రహాలూ, బీజరూపంలో అమర్చిన పదార్థము యొక్క తత్త్వమే వేదం.

'వేదము' లేదా 'జ్ఞానము' అనే పదాల అసలైన ప్రాముఖ్యతను తెలుసుకోడానికి మనము కొద్ది క్షణాలపాటు వాటిని మరచిపోయి, వాటికి బదులుగా - సర్వత్రా వ్యాపించి ఉన్నటువంటి, అన్నింటినీ చుట్టుముట్టి ఉన్నటువంటి యదార్థమైన నిరాకార శక్తిని గురించి ఆలోచిద్దాం. ఆ శక్తి సృష్టియొక్క ఏకత్వాన్ని కాపాడుతూ ఉంటుంది. దానినే 'జ్ఞానము' అనీ, 'ఆది మనస్సు' అనీ, 'మహత్ తత్త్వము' లేదా 'అపర ప్రకృతి' అనే పేర్లతో పిలుస్తాము.

ఈ మనస్సు (శక్తి) యొక్క ఒక భాగం ఊర్ధ్వముఖంగా పైకి తిరిగి ఉంటుంది. ఇది సర్వత్రా వ్యాపించి ఉండి చుట్టూ ఆవరించి ఉన్న మూలతత్త్వము యొక్క సారము. ఇది వ్యక్తుల యొక్క, వస్తువుల యొక్క రూపురేఖలను నిర్ణయిస్తుంది. ఉదాహరణకు అతి చిన్నదైన కందిరీగ, దోమ వంటి కీటకాలను, తీసుకుంటే ఇంకా ఏ అంగమూ స్పష్టంగా ఏర్పడని వాటి తొలి దశలను నిర్ణయిస్తుందీ మూల తత్వసారం. ఆ తరువాత ఆ శక్తి ప్రతి అణువణువులోనూ ప్రవేశించి నోరు, కాళ్లు మొదలైన శరీర భాగాలను సృష్టించడం ద్వారా ఇతర ప్రాణులకూ వీటికీ రూపభేదాన్ని కల్పించగలగడాన్నే జ్ఞానము అంటారు. దీనిని 'ఆది మేధస్సు' అని కూడా వ్యవహరిస్తాము. ఇది కూడా సర్వత్రా వ్యాపించేదే! ఏ జాతి కానీ, ఏ మతం కానీ దీనికి అతీతం కాదు.

ఈ శక్తిని, భారతీయులు "వేదము" అని గానీ "జ్ఞానము" అని గానీ అంటారు. ఇతర దేశస్థులు దీనిని వేర్వేరు పేర్లతో పిలుస్తారనేది నిర్వివాదాంశము. "వేదము", "జ్ఞానము" అనే పదాలకు సాంప్రదాయబద్ధంగా వస్తున్న అర్థాన్ని ప్రక్కకుపెట్టి, హిందువులు ముందుకు సాగిపోగలిగితే, బహుశా వారు మూల పదాల అర్థాలపై సత్యతత్వమునకు దగ్గరవగలరు. అలా కాకపోతే, వాగ్వివాదాలూ, తర్జన భర్జనలూ చేసుకుంటూ జీవిత పర్యంతమూ వాదులాడుకుంటూ, కక్షలనూ, కార్పణ్యాలనూ పెంచుకుంటూ ఉంటారు. ఈ "జ్ఞానము" ఋషులద్వారా వెల్లడయింది కాబట్టి, ఋషి అనే పదానికి గల అసలు అర్థాన్ని తెలుసుకుందాం.

"ఋషి" అంటే 1.మంత్రద్రష్ట, 2. ప్రకృతిమీద పూర్తి అధికారము ఉన్నవాడు. 3. చలనస్థితిని గ్రహించిన వ్యక్తి. అనగా తన కేంద్రాన్నే కక్ష్యగా చేసుకుని, తన చుట్టూ తాను తిరుగుతూ ఉండవచ్చు. లేదా మరియొక కేంద్రాన్ని కక్ష్యగా చేసుకుని దానిచుట్టూ తిరుగుతూనే ఉండవచ్చు. ఏదీ కూడా ఈ చనలం నుండి తప్పించుకోలేదు. కొందరు "వసువులు" అయ్యారు. వీరిలోనే సృష్టి అంతా ఇమిడి ఉంది. మరికొందరు "ఆదిత్యులు" అయ్యారు. వీరు తమ శక్తి ప్రభావంతో ఇతరులకు వెలుగునిస్తారు. ఇంకొందరు "రుద్రులు" అయ్యారు. ఇతరులకు ప్రాపంచిక విషయాలలో శోకాన్ని కలుగజేసి వారిని సరియైన మార్గంలో పెడతారు.

**మంత్రద్రష్ఠ :** అనగా మంత్రాన్ని దర్శించిన వ్యక్తి. మంత్రము అంటే ప్రకృతియొక్క రహస్యము, ఒక పరిష్కారము, ఒక యోచన, ఒక ప్రణాళిక అని అర్థము. ఏమరుపాటు లేకుండా మెలకువతో మంత్రాన్ని గ్రహించగలిగినవాడు ఋషి ఇటువంటి వారు ఎందరో ఉన్నారు. కాని వారిలో ప్రసిద్ధి చెందినవారు ఏడుగురు. వారే సప్త ఋషులు. వారు భరద్వాజుడు, అగస్త్యుడు, జమదగ్ని, అత్రి, గౌతముడు, విశ్వామిత్రుడు, బృహస్పతి. వీరు 'వేదము' లేదా జ్ఞాన రూపములో ఆకాశమండలంలో ఉండే ప్రకృతియొక్క సప్త సూత్రాలు. వీరేగాక, మిగిలిన వారందరూ ఈ సప్తర్షుల విశేష లక్షణాలకు చెందినవారై, వారి అధీనంలో ఉంటారు.

**యంత్రద్రష్ఠ :** కొన్ని నిర్ధారించిన సూత్రాలనూ, కొన్ని నియమాలనూ అనుసరించి పనిచేసే యంత్రమును చూసిన, నియంత్రించగలిగిన వ్యక్తి అని అర్థం. సంస్కృత భాషలో 'నియంత్ర' అనే పదానికి కాలగమనాన్నీ, అంతరిక్షాన్నీ, స్థూల పదార్థాన్నీ నియంత్రించేవాడు, లేదా అదుపు చేసి సక్రమ మార్గంలో పెట్టే అధికారి అని అర్థం. అటువంటి ఋషిని 'ఆదిత్యుడు' అని అంటారు. అది సూర్యుని లాగా తేజోవంతంగా ప్రకాశించే ఆ దేవత పేరే 'ఆదిత్య'.

**<u>తంత్రద్రష్ట</u> :** ప్రకృతిలోని శక్తినీ, కదలికలోని ప్రవాహాన్నీ అదుపుచేసి విస్తరింప జేసేవాడు, అందరికీ అందుబాటులో ఉండేటట్లు చేసేవాడు అని అర్థం. అటువంటి ఋషిని "రుద్రుడు" అంటాము. అతడు అభ్యాసపూర్వకంగా పొందిన అనుభవంద్వారా ఇతరులకు మార్గాన్ని చూపిస్తాడు.

వీరేగాక ఇంకా "వసువులు", "ధృవులు" అనేవారు కూడా మానవుల్లో ఉన్నారు. ఎవరైతే ఈ పై విషయాల రహస్యాలను బాగుగా తెలుసుకొని, జ్ఞానము, శ్రేష్టతరమైన జ్ఞానము, చింతన, ధ్యానము మొదలైన కార్యకలాపాలలో పాల్గొంటారో వారిని కూడా "ఋషులు" అని వ్యవహరిస్తారు. వారి భాషలూ, పేర్లూ వేర్వేరుగా ఉన్నా, అటువంటివారు ప్రతి జాతిలోనూ, ప్రతిదేశంలోనూ కనిపిస్తారు. వారు అబ్దల్, కుతుబ్, అవతార్, వలి, నబి, సవాబిత్, సయ్యర్, సాధు, సంత్ మొదలైన పేర్లతో పిలువబడుతూ ఉంటారు.

భారతదేశంలోని ఋషులు వేదానికి "శృతి" అని ఒక ప్రత్యేకమయిన పేరు పెట్టారు. "శృతి"ని విని, అవగాహన చేసుకుని, అంగీకరించినప్పుడు వేదము యొక్క అసలు తత్వం మనకు సులువుగా తెలుస్తుంది. విన్నదీ, వింటున్నదీ, వినబోయే దానినీ కూడా "శృతి" అనే అంటారు. 'శృతము' అంటే 'వినిపించేది' అని అర్థం. శృతి అనే మాటకు దైవనిర్ణయం, దైవనియమం, దేవరహస్యం అనే విశేషార్థాలు కూడా ఉన్నాయి. మరల అదే 'వేదం' అయ్యింది. ఈ రోజుల్లో దీనిని 'సురత్' అని కూడా అంటూ ఉంటారు. "ఋషులు" దీనిని ఇంతకుమునుపే విన్నారు. తమ అంతరంగంలోనే విన్నారు. అంతేకాదు. "ఋషులు" నిర్ణయించిన పద్ధతుల ప్రకారం మనము కూడా దానిని వినగలము. 'శృతి' అంటే వినబడినది మాత్రమే. అది మరి దేనితోనో కలిసి కలుషితంకానిదీ, మొట్టమొదటిసారిగా దానంతట అదే వినబడినది, దేనిమీదా ఆధారపడనటువంటి శబ్దమే 'శృతి'. "స్మృతి" అంటే, గుర్తు తెచ్చుకోవడం అని అర్థం. అంటే జ్ఞాపకం చేసుకుని ఆచరించవలసిన న్యాయసూత్రాలన్నమాట. అదే "ధర్మశాస్త్రం". మిశ్రితమైన ధ్వని 'స్మృతి'. శృతి అనేది స్వతంత్రమైన ఆదిమ శబ్దం కావడంవలన, దానికి అదే ప్రామాణికము. కానీ "స్మృతి" అనేది గుర్తు తెచ్చుకొనేది కాబట్టి అది మరొక ప్రమాణంమీద ఆధారపడి ఉంటుంది.

విన్పించే శబ్దం - పదాలూ, మాటలలో బంధింపబడనిదీ, పెదవులతో ఉచ్చరింపబడనిది అయిన శబ్దం "శృతి" అనిపించుకుంటుంది. "స్మృతి" అనేది ఒక విధంగా అనుకరణ అని చెప్పుకోవచ్చు. అసలైన, అచ్చమైన, ఆదిమ శబ్దానికి స్మృతి ఒక అనుకరణ. స్మృతి నాలుక,

పెదవులు, దంతాలు, ఉచ్చారణలపై ఆధారపడి ఉంటుంది. “శృతి" స్వతంత్రమైనది. "స్మృతి” వేరొకదానిపై ఆధారపడినది.

"శృతి"ని ఎవ్వరూ వ్యతిరేకించలేరు. కాని "స్మృతి"ని వ్యతిరేకించవచ్చు. కాదని త్రోసిపుచ్చనూవచ్చు. 'శృతి' స్వయంప్రామాణికమైనది. కాబట్టి దానికి ఎవరి ధృవీకరణా అక్కరలేదు. 'స్మృతి'కి అంతటి స్వయంప్రతిపత్తిలేదు కాబట్టి, దానికి ఇంకొకరి అధికారిక ధృవీకరణం యొక్క అవసరం ఉంది. 'శృతి'కి మార్పు ఉండదు. "స్మృతి" ఎల్లప్పుడూ మారుతూనే ఉంటుంది. "శృతి" సంపూర్ణమైన ప్రకంపనలతోనే కూడుకొని ఉంటుంది. కాబట్టి, అది అసలైన ప్రకంపన. కాని "స్మృతి" అలాంటిది కాదు. అది మూల శబ్దానికి అనుకరణ కాబట్టి, అది కల్పితమైనది. అంతే కాదు. అది అక్షరాలూ, పదాలు, భాష, ఉచ్చారణలపై ఆధారపడి ఉంటుంది.అందువలన అది వర్ణము (అచ్చులు, హల్లులు)లతో కూడుకొని వర్ణాత్మకము అయి ఉంది. అది వర్ణమూ, అక్షరమూ లేదా అక్షరాల సముదాయంవల్ల ఏర్పడినది.

"శృతి" అసలైన మౌలిక ప్రభావాన్ని కలిగి ఈశ్వరాదేశాన్ని సృష్టించగలదు. ప్రళయకాల సమయంలో, 'శృతి' స్పష్టంగా వ్యక్తమై, అభావస్థితిని కలిగి ఉంటుంది. ఈ శబ్దము అందరి శరీరాలలో అంతటా వ్యాపించి, స్థిరపడి, పోషించి, కాపాడుతుంది. శృతి సూచించే అర్థం ఇదే. ఇది ఒక మర్మము. కేవలం నిష్ణాతులూ, ద్రష్టలు మాత్రమే తెలుసుకోగలిగిన రహస్యం. కంటికి కనిపించే ఈ ప్రపంచంలోని వ్యక్తులకూ, స్థూల ప్రపంచంలో ఉండే వారికి ఇది అర్థం కాని విషయం. వారి ఆలోచనలలో ప్రతిధ్వనించే ఈ శబ్దాన్ని (శృతిని) తిరిగి నోటితో ఉచ్చరించే శక్తి గలిగి ఉన్నప్పటికీ, దానిని "భగవంతుడు మహనీయుడు", “పెల్లుల్లి”, “క్యారట్ దుంప", "మూర్ఖుడా, నోర్ముయ్" వంటి మాటలతో తమ మనోభావాలను వ్యక్తం చేస్తూ ఉంటారు. కానీ ఆ ఆదిమ శబ్దం యొక్క నిజస్వరూపాన్ని గ్రహించలేక పోతున్నారు.

“శృతి” శబ్దానికి “ఉద్గీతము" అనే మరొక అర్థం కూడా ఉంది. 'ఉద్' అంటే ఉన్నతమైన (అనగా పరలోకానికి సంబంధించిన), మూల రూపమైన, లక్షణ సముదాయం అనీ, “గీతము" అనగా గానం చేయడం అని అర్థం. అంటే మూలమూ, దాని వ్యక్తీకరణము యొక్క గానం, “ఆదిలో నున్నదీ, అందరికీ స్పష్టంగా విదితమయ్యే దాని గానం", "అస్తిత్వమూ - వికాసమూ యొక్క గానం”; “దేవ-మానవ లోకాల గీతం" అన్నది ఈ పదం యొక్క అర్థం.

'ఓం' అనేది “ఉద్గీతము" యొక్క అనుకరణ. పెదవులు, నాలుక,ఉచ్చారణల సాయంతో పలికిన మూడక్షరాల కలగలుపు శబ్దం అది. దాని ప్రకృతి సహజమైన నాదం వినబడినప్పుడు, 'ఓం'కారము అసలైన “వేదము” అవుతుంది. ఈ 'ఓం'కారము నాదరూపం నుండి అక్షర రూపానికి, ఒక విశేషమైన ఆలోచనా శక్తి సహాయంతో మార్చబడింది. ఆ ప్రత్యేక సంకల్పమే సృష్టి, స్థితి, లయములు. కాని "ఓం"కారాన్ని కేవలం నాలుకతో ఉచ్చరిస్తే అది "ధ్వని అనుకరణ” లేదా “మూర్తి పూజ" మాత్రమే అవుతుంది. ఎందువలన అంటే, మన హృదయాన్ని ఒక ఆలోచనా విషయానికి పరిమితం చేస్తే, అది మూర్తి పూజయే అవుతుంది. ఆ విధంగా కాకుండా, మనల్ని మనము ఆ సత్యతత్వంతో అనుసంధానం చేసుకుంటే, అదే “జ్ఞానము” అవుతుంది. అలాగని అటువంటి మూర్తి పూజను నిరాకరించకూడదు. ఎందుకంటే, అసలు సత్యతత్వాన్ని చేరు కోవడానికి ఇదొక మెట్టు, ఒక సాధనా మార్గమూ కాబట్టి.

1.అ – సృష్టి

ఉ - రక్షణ, పోషణ, అస్తిత్వము

మ్ - లయము

2. అ -బ్రహ్మ, సృష్టికర్త

ఉ - విష్ణువు, రక్షకుడు

మ్ - శివుడు, లయకారకుడు

భగవంతుని ఈ మూడు లక్షణాలూ "ఓం"కారమునందు ఉన్నాయి.

అ – కదలిక

ఉ -కదలిక యొక్క నిశ్చల తత్వము

మ్ - కదలిక యొక్క అంత్యము

చలనం యొక్క ఈ మూడు లక్షణాలూ "ఓం"కారమునందు ఉన్నాయి.

ఓం అనేది శృతి, ఉద్గీతము. దీనిని ఒక క్రమ పద్ధతిలో వింటే, సత్య స్థితిని పొందవచ్చు. జీవిత గమ్యాన్ని చేరవచ్చు. "ఓం" అనేదానిని జ్ఞాపకం చేసుకుంటే, దానిపైననే ధ్యాస నిలిపి,

దానిలోనే లయమై, దానిమీదనే ధ్యానం చేస్తూ ఉంటే, ఈ క్రింద చెప్పిన మూడు స్థితులనూ పొందవచ్చు.

1. 'సత్' :ఉనికి, జీవనంలో ఉన్న అందచందాలు.

2. 'చిత్' :జ్ఞానము, జీవితాన్ని సక్రమంగా తెలుసుకోవడం; సరిగ్గా అవగాహన చేసుకోడం.

3. ఆనంద్ : జీవితంలోని సుఖసంతోషాలు.

'ఓం' అనేది ఒక శబ్దం, కేవలం శబ్దం మాత్రమే. అది ఒక ధ్వని ప్రకంపన, ఒక శ్రావ్యమైన సంగీతము. ఆ 'శ్రావ్యం' అనేది కేవలం గానం చేయడానికీ, విన డానికీ సంబంధించినది మాత్రమే. దానిని సక్రమమైన సరియైన పద్ధతిలో గానం చేసినప్పుడూ, విన్నప్పుడూ, ఆ గాయకునికీ, ఆ శ్రోతకూ కూడా మహదానందం కలుగుతుంది. వారు ఆనందానుభూతిని పొందుతారు. అతి త్వరలోనే వారు సతత్వాన్ని చూడగలుగుతారు. ప్రతి వ్యక్తీ "సచ్చిదానంద" స్వరూపుడే. ఎవ్వరూ కూడా సత్, చిత్, ఆనందం అనే ఉనికి, జ్ఞానము పరమానందమనే ఈ మూడు స్థితులూ లేకుండా ఉండరు. మూఢత్వం వల్లనే మనిషి తన వాస్తవ రూపానికి భిన్నంగా ఉన్నానని తలుస్తాడు. ఇక్కడ సత్సంగంలో దానితోబాటు, ఈ మూఢత్వాన్ని పోగొట్టే ప్రయత్నం జరుగుతుంది. సచ్చిదానందానుభూతిని పొందడానికై ధ్యాన సాధన చేయడం జరుగుతుంది.

ఓం' అనేది కేవలం శబ్దము, ఉద్గీతము, శృతి. కాబట్టి దానిని 'యో-యోమ్" అని గానీ, 'స్వం', 'త్వం' అనిగానీ, అటువంటివే మరికొన్ని శబ్దాలుగా గానీ ఉచ్చరించినా తప్పుకాదు. అలా చేసినప్పటికీ అవన్నీ "ఓం" శబ్దానికి అనుకరణలే. అది సక్రమమే అవుతుంది. సరియైన శబ్దానుసరణే అవుతుంది గాని అపశృతి కానేరదు. అందువల్లనే ఓంకారాన్ని "బీజమంత్రము" అని అంటారు. అనగా అది వాస్తవమైన ఉపాయము, వాస్తవమైన పద్ధతి, వాస్తవమగు కల్పన. ఇదే అన్నింటికీ మూలము. మూడు లోకాలలో గల మిగిలినవన్నీ "ఓం" కారము యొక్క అనుకరణలే. వేదాలు నాలుగు కావు. మూడే! ఎందుకంటే 'ఓం' కారములో మూడు రకాల శబ్దాలు మాత్రమే ఉన్నాయి. ఆచార వ్యవహారాలవలనా, ఇతివృత్త విభజనవలనా 'చతుర్వేదాలు' గా పరిగణింపబడుతున్నాయి. ఈ ప్రపంచంలో కేవలం మూడు విషయాలు మాత్రమే అనుసరణీయాలు, స్మరణీయాలు, అభ్యాసయోగ్యాలు.

అవి:

సత్ : ఉనికి

చిత్ : జ్ఞానము

ఆనంద్ : పరమానందము.

కేవలం మూడు రకాలైన ఉనికి, జ్ఞాన, పరమానందాలు ఉన్నాయి.

1. ఉనికి మూడు రకాలు

అ. ఉనికికి సంబంధించినది : సత్

ఆ. జ్ఞానానికి సంబంధించినది : చిత్

ఇ. పరమానందానికి సంబంధించినది : ఆనంద్.

2. జ్ఞానము మూడు రకాలు

అ. ఉనికికి సంబంధించినది : సత్

ఆ. జ్ఞానానికి సంబంధించినది : చిత్

ఇ. పరమానందానికి సంబంధించినది : ఆనంద్.

3. పరమానందం మూడు రకాలు

అ. ఉనికికి (అంటే జీవనానికి సంబంధించినది : సత్

ఆ. జ్ఞానానికి సంబంధించినది : చిత్

ఇ. పరమానందానికి సంబంధించినది : ఆనంద్.

వాస్తవానికి మంత్రము, 'శృతి' లేదా 'ఉద్గీతము' లేదా 'ఓం' కారము అగుట వలన, వేదాలు కూడా ప్రశ్నింపదగినవే అవుతాయి. వాటిలో పరివర్తనమనే గుణమూ, విశ్వసింపబడే గుణమూ, మానవ హృదయాల భ్రాంతులూ కన్పిస్తాయి. అందువల్లనే వాటిని భాష రూపంలో వ్యక్తం చేసేటప్పుడు కొంత భేద భావం స్ఫురిస్తుంది. ఉదాహరణకు ఒక పూర్ణ సంఖ్య కూడినప్పుడూ, తీసివేసినప్పుడూ,

గుణించినప్పుడూ, భాగించినప్పుడూ వివిధ రూపాలను పొందుతుంది. అలాగే సంఖ్యల మొత్తాన్ని లవమూ, హారముగా తీసుకొన్నప్పుడు వ్యత్యాసం కన్పించినా, అది సంఖ్యగానే ఉంటుంది. ఒక 'యూనిట్' గానే ఉంటుంది తప్ప రూపంలో మార్పు చెందదు. అదే విధంగా, నీరు ప్రవహించేటప్పుడు కాలువలు, వాగులు, చెరువులు, బావులు, నదులు వంటి అనేక రూపాలలో వ్యక్తమౌతుంది. అయినప్పటికీ అది నీరు మాత్రమే. ఇంకొక ఉదాహరణ తీసుకుందాం. వ్రేళ్ళు, కాండము, కొమ్మలు, రెమ్మలు, ఆకులు, పువ్వులు, కాయలు, పండ్లు మొదలైన వాటినన్నింటినీ విత్తనం తనలోనే ఇముడ్చుకొని ఉండీ, వీటన్నింటిగానూ రూపాంతరం చెంది, తిరిగి చివరికి తన మూల రూపమైన విత్తనంగా రూపుదాల్చుతుంది.

అదే విధంగా "ఓం" కారము కూడా! అది శబ్దము, మాటల రూపంలో బంధింపబడినప్పటికీ, "ఓం" కారముగానే ఉంటుంది. మేళవింపులవడం వలన "వేదాలు" కూడా వేర్వేరు ఛందస్సు, మాత్రలు, మంత్రములతో కూడుకొని ఉంటాయి. వాటిలో మానవులకు ఉండే చిత్తవృత్తులు ఇమిడి ఉండడం వలన, ప్రేమ, కఠినత్వము, పరాక్రమము, సాధుత్వము, శత్రుత్వము మొదలైనవన్నీ కనబడతాయి. ఇవే మానవుని ఇచ్ఛాశక్తికి బలాన్ని చేకూరుస్తాయి. అంతేగాక, ఇవి వివిధ రకాలయిన శక్తులు, సిద్ధులు, మహిమలు, అలవాట్లుగా రూపాంతరం చెందుతాయి. ఇదే మంత్రోచ్చారణలోని విధానం. ఒక ప్రత్యేకమైన ఉద్దేశ్యం నెరవేరాలంటే, ఒక ప్రత్యేకమైన పద్ధతిలోనే మంత్రాలను ఉచ్చరించాలి. అప్పుడే ఆశించిన ఫలితం కలుగుతుంది. ఇదే సంగీతంలో ఉన్న మూల సిద్ధాంతం. మన హృదయంలో ఒక ప్రత్యేకమైన ఆలోచనతో ఒక శబ్దాన్ని మనం పలికినప్పుడుగానీ, పాడినప్పుడుగానీ ప్రత్యేకమైన ఫలితం కలుగుతుంది.

మబ్బులలో ఉన్న నీరుకూడా నీరే. చుక్కలు చుక్కలుగా నీరు బండరాతిపై పడడం వలన, బండరాళ్ళుకూడా ఒక ప్రత్యేకమైన ఆకారాన్ని పొందుతాయి. ఆ నీరుపడిన నేల సారవంతమౌతుంది. దానిలో విత్తనం పరిపూర్ణంగా మొలకెత్తే వీలు కలుగుతుంది.

అన్నిచోట్లా ఉన్న గాలి ఒక్కటే. అది రోగికి రోగాన్ని ఎక్కువ చేస్తుంది. బలవంతునికి పుష్టినిస్తుంది. ఉత్సాహవంతునికి సంతోషాన్ని కలుగజేస్తుంది. చపల మనస్కుడికి గల చపలత్వాన్ని పెంచుతుంది. దానికి సంబంధించిన అన్ని ఇతర విషయాలలోనూ, పనులలోనూ కూడా ఇదే సిద్ధాంతం వర్తిస్తుంది. మరి 'ఓం'కార విషయంలో కూడా, అది కలుగజేసే ఫలితాల విషయాలలోనూ ఇదే సూత్రం వర్తిస్తుంది. ఉదాహరణకు, గానం (సంగీతము) సంగతే తీసుకుందాం. మానవుడి

అంతరంగంలో ఉన్న ఆలోచనల రహస్యం 'ఓం' లోనే దాగి ఉంది. ఒక పదాన్ని వివిధ రకాలుగా మార్చి, మార్చి, కూర్చి, రాగాన్ని పొడిగించి, కుదించినందువలన, పద్యాల రూపాన్నీ, పాటల రూపాన్నీ పొందుతుంది. ఒక గంటను మ్రోగిస్తే, 'ఠంగ్ మనే శబ్దం వస్తుంది. ఒకసారి మ్రోగిస్తే "ఠంగ్' మళ్లీ ఒకసారి శబ్దం వినిపిస్తుంది. రెండుసార్లు మ్రోగిస్తే, "ఠంగ్... ఠంగో'మః రెండుసార్లు వినిపిస్తుంది. అలాగే మూడుసార్లు మ్రోగిస్తే, "ఠంగ్... ఠంగ్.. ఠంగో' మని మూడుసార్లు వినిపిస్తుంది. "ఓం" అనేది అన్ని శబ్దాలకూ మాతృక అనగా తల్లివంటిది. అది మీ ఆవులింతలోనూ, తుమ్ములలోనూ, త్రేన్పులలోను ఉంది. గంటకొట్టినప్పుడుగానీ, శంఖాన్ని పూరించినప్పుడుగానీ, పిల్లనగ్రోవి ఊదినప్పుడుగానీ, మృదంగం తబలావంటి వాయిద్యాలను మ్రోగించినప్పుడు నీ వెలువడిన ఏ శబ్దాన్ని అయినా సునిశితంగా పరిశీలిస్తే, వాటన్నింటిలోను ఓం వినిపిస్తుంది. ఋషులు దీనిని గురించి ఎంతో సునిశితంగా పరిశీలించిన మీదట ఇది వెల్లడించారు.

మంత్రయుగంలో జనులు సత్యానికి దూరమయ్యారు. ఋషులు, మునులు చెప్పినదానిలో వారికి భక్తి విశ్వాసాలు ఉండబట్టి, మంత్రాలనే 'శృతి' అని నమ్మి, ఆ నమ్మకంతోనే ఈ ఆలోచనను ఏర్పరచుకున్నారు.

**ఉనికి - ప్రత్యక్ష ప్రపంచము**

"శృతి" అనేది ఒక పరిపూర్ణమైన శబ్దం. సృష్టి ప్రవాహమంతా దానినుండే పుట్టుకొచ్చింది. ఈ ప్రవాహం మూడు రూపాలను పొందింది.

1. సృష్టి - లేదా కంటికి కనిపించేది

2. మధ్యంతర స్థితి - లేదా అస్తిత్వము

3. అంత్యదశ - లేదా లయము.

సృష్టి, స్థితి, లయాలనే ఈ మూడు స్థితులూ 'ఓం'కారములో బీజరూపంలో ఉన్నాయి. ఇవి ఎల్లవేళలా సృష్టి, స్థితి, లయము అనే వరుస క్రమంలోనే ఉంటాయి. అదే వరుసక్రమంలో పనిచేస్తున్నాయి కూడా. అది అన్నింటినీ తనలో ఇముడ్చుకుంది కాబట్టి, 'జ్ఞానం' కూడా దానిలోనే ఉంది. ఆమాటకొస్తే అది కేవలం "జ్ఞానమే'! శబ్దంతోకలిసి జ్ఞానం ఉండడం అవసరం. "వాక్కు", "అర్థం"

అనేవి కలిసే ఉంటాయి. ఆ రెండూ ఒక్కటే. ఈ దృష్టితో చూస్తే, “శృతి”ని “ముల్లోకాల జ్ఞానము” అని అనవచ్చు.

"ఓం"కారము ఈ మూడు లక్షణాలకూ, మూడు “మంత్రా” లకూ, సిద్ధాంతాలకూ, ప్రకృతికీ ఎలా జన్మనిచ్చిందనే విషయం "సాంఖ్య యోగ శాస్త్రం" లో తెలుపబడింది. మానవజాతి తన ప్రత్యేకతలతో, విశేషాలతో ఎలా ఉద్భవించిందీ అనేది “వ్యవహారము” అనే మానవ జీవనము, లేదా కర్మ సిద్ధాంతానికి సంబంధించినది. 'ఓం'కారములో మూడు ప్రత్యేక లక్షణాలున్నాయి.

1.'అ', 'ఉ''మ్'

‘అ’అనేది ఆరంభం

'ఉ' అనేది మధ్యమం

'మ్' అనేది అంత్యము

'ఓం' లో ఈ మూడూ - అంటే ఆది మధ్యాంతాలు ఉన్నాయి.

2. “ఓం” లోని “అ” అనేది “సత్’ - అంటే ఉనికి.

“ఉ” అనేది “చిత్” - అంటే జ్ఞానము.

“మ్” అనేది “ఆనందము" - అంటే పరమానందం. వెరసి “ఓం” అంటే - సచ్చిదానందము.

3. 'అ' అనేది పునాది, మూలము.

'ఉ' అనేది గోడ

'మ్' అనేది పై కప్పు

'ఓం' లో ఈ మూడూ ఉన్నాయి.

4. 'అ' అనేది కర్మ

'ఉ' అనేది జ్ఞానము

'మ్' అనేది ఉపాసన

'ఓం' లో ఈ మూడూ ఉన్నాయి.

5. 'అ' అనేది శరీరం

'ఉ' అనేది హృదయం

'మ్' అనేది ఆత్మ

"ఓం" లో ఈ మూడూ ఇమిడి ఉన్నాయి.

6. “అ” అంటే సత్వము

"ఉ" అంటే రజస్సు

“మ్” అంటే తమస్సు

ఈవిధంగా 'ఓం'కారము త్రిగుణాత్మకమైనది.

ఇవే కాకుండా మరికొన్ని పదాలు కూడా ఉన్నాయి. “వ్యవహారం' అంటే లోకంలో జరిగే వ్యవహారం. “ప్రతిభాసం” అంటే కన్పించే రూపానికి సంబంధించినది. 'పరమార్థం” అంటే దైవసంబంధమైనది.

ఈ మాటలకు బదులుగా, హృదయంలో ఉన్న ఉద్దేశ్యాలను బయటకు వ్యక్తం చేసుకోడానికి, ఇతరులకు సులువుగా అర్థం అయ్యేందుకు -

1. లోక వ్యవహారాన్ని “సత్' అనీ

2. కంటికి కన్పించే రూపం - (“ ప్రతిభాస్”) ను “చిత్' అనీ

3. సత్యము (“పరమార్థం”) ను “ ఆనంద్' అనీ వ్యవహరిస్తారు.

"సత్" అనేది ఉనికి. అది ప్రపంచంలో జరిగే కార్యక్రమాల ద్వారా అంటే, పనిపాటలు, పెనుగులాటలూ, వ్యాపారాలు, పరిశ్రమలు, హస్తకళలు, విధినిర్వహణ మొదలైన పనులద్వారా వ్యక్తమౌతూ ఉంటుంది. ఇవన్నీ 'ఉనికి' ద్వారానే తెలుసుకుంటాం. ఎందువలన అంటే ఈ 'ఉనికి' అంటే సృష్టి, ప్రపంచము గనుక లేనట్లయితే, ఈ పనిపాటలూ, వ్యాపారాలూ మొదలైన పనులన్నీ ఎలా సంభవించగలవు?

చేసే పనులు, విధి నిర్వహణ మొదలైనవన్నీ దాదాపుగా శరీరానికి సంబంధించినవే. కాబట్టి స్పష్టంగా అవగతమయ్యేదీ, ప్రత్యక్షంగా కన్పించేదీ ఈ శరీరమే. ఈ దృష్టితో చూస్తే, 'సత్' అంటే శరీరము కాబట్టి ఈ శరీరమూ, ఈ శరీరం నిర్వర్తించే కార్యక్రమాలూ అంటే 'కర్మ' ఈ రెండే వేదానికి మూలమూ, ప్రారంభమూ అని అనుకోవచ్చు. కర్మకాండ (కర్మ) జీవనానికి అత్యంత ఆవశ్యకమైనది. మరి శరీరమే లేకుంటే “ఉనికి” అనేది ఎలా తెలుస్తుంది?

**శరీరాలు మూడు రకాలుగా ఉన్నాయి.**

1. బయటకు కన్పించే శరీర ఆకృతిని స్థూల శరీరం" అని అంటారు. ఇది జ్ఞానేంద్రియాలను, మాంసం, ఎముకలు, రక్తం, క్రొవ్వు మొదలైన వాటిని కలిగి ఉంది. ఇది అన్నము" అంటే ఆహారానికి తొడుగు. “అన్నమయకోశం" అని అంటారు.

2. **రెండవది:** "సూక్ష్మ శరీరం". అది 'మనస్సు', 'బుద్ధి', 'చిత్తము', 'అహంకారము' లతో కూడుకొని ఉంది. “మనోమయకోశం” అంటే కూడా ఇదే - మనస్సు యొక్క తొడుగు. జ్ఞానము, ఆలోచనలూ, మేధస్సులతో కూడుకొని ఉన్నదే జ్ఞానానికి తొడుగు. దీనినే "విజ్ఞానమయ కోశము" అని అంటారు.

3. **మూడవది :** "ఆత్మ" లేదా "కారణ శరీరము”. ఇది సుఖము సంతోషము, పరమానందాలకు తొడుగు. ఇదే “ఆనందమయ కోశము”. ఆనందమే దీని ఆహారము. ఈ పేర్లను గురించి కొంచెం నిశితంగా ఆలోచిస్తే, ఈ శరీరాలన్నీ వాస్తవంగా ఉన్నాయని మీకు అనిపించి తీరుతుంది.

బాహ్యంగా ఉండే శరీరం - అంటే 'స్థూల శరీరాన్ని' గురించిన జ్ఞానము కే మెలకువ స్థితిలో - అనగా 'జాగృదావస్థ'లో కలుగుతుంది. "సూక్ష్మ శరీరం" యొక్క జ్ఞానం నిద్రపోయేటప్పుడు అంటే “స్వప్నావస్థ' లో కలుగుతుంది. ఇ మనస్సుతో ముడిపడి ఉంది. అలాగే “కారణశరీరం యొక్క జ్ఞానం కా గాఢనిద్రలో అనగా 'సుషుప్తావస్థ' లో కలుగుతుంది. ఇది ఆత్మయే.

వీటికి సంబంధించిన జ్ఞానం మూడు విధాలుగా కలుగుతుంది.

1. **"స్థూల శరీరం”** యొక్క జ్ఞానాన్ని మన పంచేంద్రియాలూ అయిన రూప శబ్ద, గంధ, రస, స్పర్శల ద్వారా - అంటే ఆకారము, ధ్వని, వాసన, రుచి తాకుటల ద్వారా తెలుసుకోగలము. భా

2. **“సూక్ష్మ శరీరం”** యొక్క జ్ఞానాన్ని అవగాహన (అంటే ఆలోచన), విశ్లేషక చేసి ఒక నిర్ణయానికి రావడం ద్వారా పొందవచ్చు. మేధస్సు (చిత్తము మనస్సు, వివేచన (బుద్ధి), అహంకారాలు దీనికి సంబంధించి ఉన్నాయి.

3. **కారణ శరీరము”** లేదా “ఆత్మ శరీరము” గురించి తెలుసు కోవాలంటే

"శబ్ద ప్రామాణ్యం" ద్వారానే తెలుసుకోగలము.

ఈ కనబడే సృష్టి అంతా "ఒక్కటే” అనే విషయానికి అర్ధం, బాహ్యంగా కనిపించే ప్రపంచాన్ని బాహ్యేంద్రియముల ద్వారా తెలుసుకోవచ్చును అని మేధావులూ, విద్వాంసులూ అభిప్రాయపడి, బహుశః వాదోపవాదాలకు దిగి కీచులాడు కుంటారేమో! కాని పైన చెప్పినదే సరియైన అర్ధం. దాని అసలు అర్ధాన్ని మన అంతరంగంలో మన లోలోపలే అనుభూతి నొంది తెలుసుకోవాలి గాని మన బాహ్యేంద్రియాలూ, మన ప్రాపంచిక జ్ఞానమూ ఇక్కడ పనిచేయవు. కనుక ఇవి అన్నీ శరీరాలే. శరీరము ఒక్కటే “ఉనికి" (ఉన్నది). ఈ శరీరాలన్నింటిలోనూ పనిచేయడానికి గానీ, ఈ ప్రపంచంలో వ్యవహరించడానికి గానీ, సాధన చేయడానికి గానీ, లేదా మరి వేరే పనులు చేయడానికి గానీ ఉపయోగపడే పరికరం స్థూల శరీరం ఒక్కటే.

"స్థూల శరీరం" పని చేయడానికి ఒక సాధనము”. కాదు, కాదు. ఇది కేవలం “కర్మ” యే. కర్మ (పని) చేయనిదే స్థూల శరీరం తన మనుగడను సాగించలేదు.

**“సూక్ష్మ శరీరము”,** జ్ఞానము, లేదా ఆలోచనలకు ఒక సాధనము. కాదు, కాదు. అది పూర్తిగా జ్ఞానమే (ఎరుకయే). సూక్ష్మ శరీరం ఆలోచించకుండా, అర్ధం చేసుకోకుండా ఉండలేదు.

**“కారణ శరీరం”** - ఆనందానికి (సుఖ సంతోషాలకు) సాధనం. కాదు! కాదు! అది స్వయంగా పరమానందమే. ఆ పరమానందానుభూతి, సంతోషప్రాప్తి లేకుండా కారణ శరీరం ఉండలేదు.

ఈ దృష్టితో చూస్తే, కర్మ అనేది మొదలు, జ్ఞానమనేది మధ్యది, పరమానంద మనేది చివరది. అందువల్లనే కర్మలు వేదాలు ప్రారంభదశగా భావింపబడు తున్నాయి.

## కర్మ

'కర్మ' అంటే పని, లేదా చర్య అని అర్ధం. అసలు పని చేయవలసిన అవసరం ఏమిటి? ఎందుకంటే, క్రియాశీలత్వము ద్వారానే జీవము వ్యక్తమౌతుంది. ఇది ప్రకృతి నియమం. చర్య గనుక

లేకపోతే, మానవ జీవితం యొక్క మనుగడను అవగాహన చేసుకోలేము. చర్య వల్లనే జీవి ఉన్నట్లు తెలుస్తుంది. అందువల్లనే శరీరధారణ చేసిన ప్రతి జీవీ పనిచేయవలసిన అగత్యం ఉంది. గతంలో దీని ఆవశ్యకత ఉండేది. భవిష్యత్తులోనూ ఉంటుంది. తనను తాను వ్యక్తపరచుకోకుండా ఏ జీవం ఉండలేదు. ప్రకృతిలో ఉన్న సమస్త జీవరాసులకూ గల సహజ లక్షణం ఇదే. ఏ ప్రాణీ కూడా తనను తాను వ్యక్తపరచుకోనిదే ఉండలేదు. జీవియొక్క సహజ స్వభావానికి అనుగుణంగా తాను చేసే పనీ, ప్రవర్తనా, తీరుతెన్నులూ ఉంటాయి.

కానీ, చర్య అనేది ఎల్లప్పుడూ ఉండదు. పని ముగిసిన తర్వాత విశ్రాంతి స్థితి వస్తుంది. అందుచేత పనిగానీ, చలనము గానీ శాశ్వతము కాదు. అంటే అదీ ఎల్లవేళలా ఉండేదికాదు. అయితే ఈ చర్య వలన కలిగిన ప్రశాంతత, ఆనందం అనేవి కూడా పనులే కదా? మూడు శరీరాలు (స్థూల, సూక్ష్మ, కారణ) కలిసి పనిని నెరవేరుస్తున్నాయి. స్థూల శరీరంలో కంటికి కనిపించే కదలిక, చేతనత్వః శ ఉంటాయి. సూక్ష్మ శరీరంలో ఆలోచనల పరంపరగా భావాలరూపంలో మానసిక చేతనత్వము ఉంది. మరి పని చేయనప్పుడూ, చలనము లేనప్పుడూ కలిగిన విరామంలో ఉండే ప్రశాంతత, ఆనందం కారణశరీరం (ఆత్మ) లో ఉంటాయి.

శరీరము, (హృదయము) మనస్సు, ఆత్మ - ఈ మూడూ శరీరాలే. స్థూ శరీరంలో దాని శరీర అవయవాలు పనిచేయడమూ, వాటి ద్వారా జ్ఞానాన్ని గ్రహించడం అనేవి జరుగుతాయి. ఇది స్థూల శరీరము యొక్క లక్షణం. అలా సూక్ష్మ శరీరమైన మనస్సులో సూక్ష్మ అవయవాల ద్వారా మానసికమైన చలనము భావాలరూపంలో పనులూ జరుగుతూ ఉంటాయి. చలనమూ, విశ్రాంతి అనేక రెండూ కూడా ఈ సూక్ష్మ శరీరంలో ఉంటాయి. ప్రశాంతత, విశ్రాంతి అనేవి ఆత్మయొక్క పనులు. దానిలో భౌతిక శరీరంలోని స్థూల చలనమూ, మనస్సునందలి సూక్ష్మ చలనమూ, కారణశరీరంలోని(ఈ రెండు శరీరాలలో లేనట్టి) ప్రశాంతత, వెరసి ఈ మూడు రకాల చలనాలూ బీజరూపంలో ఇమిడి ఉన్నాయి.

శరీరము, మనస్సుల వలెనే ఆత్మ కూడా చర్యకు అతీతం కాదు. అయితే ఈ వ్యాసంలో స్థూల శరీరం, చర్మ మాంసాదులతో కూడుకొని ఉన్న భౌతిక శరీరం వ్యక్తం చేసేదానినే 'పని' అని వ్యవహరిస్తున్నాము. ఈ పని (కర్మ)నే వేదం యొక్క ప్రారంభదశ అంటారు. సంస్కృతంలో 'దేహము' అనే పదము "దిహ్" అనే ధాతువు నుండి పుట్టింది. 'దిహ్' అంటే ''సేకరించడం", "ప్రోగు చేయడం", "వెనుకకు ఉపసంహరించుకోడం" అనే అర్థాలు ఉన్నాయి. ఒక క్రమ పద్ధతిలో ఏకీకరణము

చేయబడిన పంచభూతాల కలయిక అవడం వలన, ఋషులూ, మునులూ శరీరాన్ని 'దేహము' అని పిలిచేవారు.

ఈ ప్రపంచం ద్వంద్వములకు నిలయమైన కారణంగా ప్రకృతి నియమంలో ఉన్నట్లుగా, వ్యాప్తి, సంకోచమూ, వ్యవకలనమూ, సంకలనమూ అనే సిద్ధాంతాలూ, తీసివేతలూ - కూడికలూ, భాగహారము - గుణకారము అనే పరస్పర విరుద్ధాలైన సూత్రాలు కలిసి పనిచేస్తాయి. శరీరం కూడా ఈ ప్రకృతి నియమంతోనే తయారు చేయబడింది. కాబట్టి లోనికి గ్రహించడం, వెలుపలికి విసర్జించడం అనే పరస్పర విరుద్ధాలైన రెండు పనులనూ ప్రకృతి ధర్మం ప్రకారం శరీరం నిర్వర్తిస్తూనే ఉంటుంది.

**“స్థూల దేహం”** అంటే భౌతిక శరీరం. స్థూల పదార్థాల కలయికతో ఏర్పడినది.

**“సూక్ష్మ దేహం”** అంటే సూక్ష్మ శరీరము. సూక్ష్మ పదార్థాల మేళవింపుతో ఏర్పడినది.

**“కారణ దేహం”** అంటే “ఆత్మ” కూడా ఆవిధంగానే, మూల కారణముల యొక్క సమ్మేళనం వలన ఏర్పడినది.

ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథ్వి అనేవి స్థూలతత్వాలు, లేదా మూలభూతాలు. ఈ దేహము స్థూలతత్వము యొక్క పరమాణువులతో, క్రమపద్ధతిలో నిర్మింపబడి ఉంది.

శబ్దము, స్పర్శ, రూపము, రసము, గంధము అనేవి సూక్ష్మ తత్వములు. ఈ సూక్ష్మ తత్వాల అణువుల కలయిక వలన సూక్ష్మ శరీరం ఏర్పడింది. మూలకారణములు,

అనగా పైన చెప్పిన తత్వముల యొక్క కారణ పరమాణువులు. బీజరూపంలో నున్న అట్టి కారణ పరమాణువులే కారణ శరీరము (ఆత్మ) ఏర్పడుటకు కారణభూతాలయ్యాయి. ఈ మూడు శరీరాలూ కేవలం పరమాణువుల కలయిక వలన క్రమబద్ధంగా ఏర్పడినవి. కాబట్టి ఆయా పరమాణువుల సహజ లక్షణాలూ, చేష్టలూ, అలవాట్లూ (“'స్వభావం' ) – ఈ శరీరాలకు అలవడ్డాయి.

'ఆత్మ' మిశ్రమమైనదీ, విభజింప వీలయినదీ అని ఎవ్వరూ ఒప్పుకోనప్పటికీ, ఇదే సత్యము. ఎవరో ఒప్పుకోనంతమాత్రాన, 'సత్యం' సత్యం కాకపోదు కదా? దీనిని ఎవరికి వారు వారి వారి ఊహలకు అందినంతవరకూ ఆయా స్థాయిలలో అర్థం చేసుకున్నారు. “వేదాంతులు”, “సాంఖ్యులు”, యోగులు" వీరేకాదు, ఋషులూ, మునులూ కూడా దీనిని తెలుసుకోడంలో పొరపాటు

పడ్డారు. ఈ మూడు శరీరాలూ ఉన్నాయని “శాస్త్రాలు” కూడా అంగీకరించినప్పటికీ "ఆత్మ"అనేది కారణ శరీరమేనని తెలుసుకోలేకపోయారు. ఇప్పుడు మనం “ఆత్మ” అనే పదానికి గల వ్యుత్పత్తి అర్థాన్ని తెలుసుకుందాం.

“ఆత్మ” అనే సంస్కృతపదం 'అథ్' “మ(న)న్" అనే శబ్దాలతో ఏర్పడింది. “ అథ్” అంటే కదలిక. “మ (న)న్”” అంటే ఆలోచించడం. దేనిల్ అయితే, ఉంటాయో, దానిని 'ఆత్మ' అని అంటారు. బీజరూపంలో ఉన్న కారణశరీరమే ‘ఆత్మ'. అది భిన్న పదార్థాల మేళవింపు.

అది భౌతికంగా ఉండే "స్థూలశరీరం" గానూ, మనస్సుకు సంబంధించిన "సూక్ష్మ శరీరం' గానూ వ్యక్తమౌతుంది. అది మేల్కొని, జాగృదావస్థలోనికి ప్రవేశించినప్పుడు, దాని ప్రవాహ ప్రభావం వలన, కర్మేంద్రియాలలో చలనం కలుగుతుంది. అది మానసిక స్థితికి, అంటే స్వప్నావస్థకు వచ్చేసరికి, ఆలోచనలలో నిమగ్నమౌతుంది. అది తిరిగి తన ప్రవాహాన్ని తానే ఉపసంహరించుకుని, సుషుప్తావస్థలోనికి వెళ్ళినప్పుడు, అది యథారూపంలోని సమాధి స్థితికి వెళ్ళి బ్రహ్మానందానుభూతిని పొందుతుంది. కాబట్టి, కదలిక, ఆలోచన, తన్మయత్వం దానిలో ఉన్నప్పుడు, అది అవిభాజ్యంగా గానీ, సరళంగా గానీ ఎలా ఉండగలదు? కాబట్టి అది తప్పనిసరిగా భిన్న పదార్థాల మిశ్రమమే అయి ఉండాలి.

“కర్మ" స్థూల శరీరముయొక్క స్వభావము, లేదా ధర్మము. శరీరం రూపం ధరించడం ఎంత స్వాభావికమో, దాని కదలికలు కూడా అంతే స్వాభావికము. అలాగే తప్పు- ఒప్పు అనే న్యాయం కూడా స్వాభావికమే. శరీరాన్ని ధరించిన ప్రతి ప్రాణినీ "జీవి' అని అంటారు. చలనము ఆలోచించడము, వృద్ధి చెందడము, వికసించడం అనే నియమాలు ఈ చలనంలో పనిచేస్తూ ఉంటాయి. సహజగుణం.

జీవుడు అంటే “ఆత్మ”. ఎందువలన అంటే దానిలో “అత్” (చలనము), “మ(న)న్' (ఆలోచించడం) అనే రెండూ ఇమిడి ఉన్నాయి. ఆత్మయే “ బ్రహ్మము”. “బ్రహ్మము” వికసిస్తూ, ఆలోచించే సృష్టి. సంస్కృత శబ్దమైన “ బ్రహ్మము” అనే పదం “బృహ" అంటే వికసించడం లేదా వృద్ధిచెందడం, “మన్' అంటే ఆలోచించడం అనే శబ్దాల నుండి పుట్టింది. చలిస్తూ ఆలోచించేది “ఆత్మ”. వికసిస్తూ ఆలోచించేది “బ్రహ్మము”. ఈ దృష్టితో చూస్తే, “జీవుడు" ఎక్కడ ఉంటాడో, అదంతా "బ్రహ్మమే". చలనము, వృద్ధి అనేవి రెండూ ఇంచుమించుగా ఒకే అర్థాన్నిచ్చే పర్యాయ పదాలు,

అంటే ఒకే అర్థాన్నిచ్చే వేర్వేరు మాటలు అన్నమాట. కదలికలో వృద్ధి చెందడం, చిన్నదవడం ఉంటాయి. ఈ రెండూ కూడా వికాసానికి, అంటే ప్రగతి నియమానికి సూచకాలే. పెరుగుట పురోగమనానికి అంటే అభివృద్ధికీ; తరుగుట తిరోగమనానికి అంటే వెనుకకు రావడానికి నిదర్శనాలు. ఈ రెండూ కూడా ప్రగతినే సూచిస్తాయి. ఒకటి ఊర్ధ్వగమనంలో పైపైకి, ముందుకు చొచ్చుకుపోతూ ఉంటుంది. మరొకటి తిరోగమనంలో క్రిందికి పయనిస్తూ ఉంటుంది. ఈ రెండింటిలోనూ 'తరుగుట' అనే భావం ఏమాత్రం లేకుండా, కేవలం 'వికాసం' అనే అర్థాన్ని మాత్రమే సూచిస్తుంది. బండిచక్రాలు ముందుకూ, వెనుకకూ తిరుగుతున్నట్లు కనిపించినా, అవి మాత్రం ముందుకే తిరుగుతూ ఉంటాయి. అలాగే జీవుడు, ఆత్మ, బ్రహ్మము కూడా.

చలనము, వృద్ధి చెందడమనేవి "స్థూల శరీరానికి ఉండే లక్షణాలు. ఆలోచించడం, జ్ఞానాన్ని కలిగి ఉండడం (అవగాహన) అనేవి "సూక్ష్మ దేహం" యొక్క లక్షణాలు. ఈ రెండూ ఒక్కటిగా ఏకమై పనిచేస్తూ ఉంటాయి. కాబట్టి అలా ఒక్కటిగా అయిన వాటి సహజ గుణాలకు అనుగుణంగా ఉండే దిశగా వాటి చలనం ఉంటే, అవ సరియైన రీతిలో పనిచేస్తాయి. కానీ మనస్సు, లేదా స్థూల శరీరంలో వ్యక్తిగతమైన అహం (నేను) అనే ఆలోచనలు వస్తే మాత్రం, ఇది తప్పు, అది ఒప్పు అనే అభిప్రాయాలు ఆలోచన రూపంలో మనస్సులో నాటుకుంటాయి.

మంచి-చెడ్డ అనే తలపులు మంచి - చెడు అనే ఉద్దేశ్యాలలోనే ఇమిడి ఉంటాయి. ఆలోచించే మానవునికి, సద్భావాలు మంచివనీ, దురాలోచనలు చెడ్డవనీ తెలుసు. మంచి-చెడ్డల, ప్రతిఫలాలను గురించిన ఆలోచనలు ఎక్కడ ఉంటాయో అక్కడ తప్పు-ఒప్పుల సిద్ధాంతం పనిచేస్తుంది. దానికి అనుగుణంగా “జీవునికి” మంచీ-చెడుల కర్మ ఫలితం దానంతటదే కలుగుతుంది. ఇదే మంచి చెడ్డల ప్రతిఫలం. ప్రగతి, ఆలోచనలూ అనేవి ఎంత సహజమో, కర్మఫలము కూడా అంతే సహజం. మంచీ-చెడూ అనే భావనలే లేనప్పుడు, అటువంటి జీవికి వాటి మంచి, చెడ్డల ప్రతిఫలం కూడా ఉండదు. అది ఒక పసిపాపలాగానే పెరుగుతూ, ఆలోచిస్తూ, కదలుతూ ఉంటుంది.

సృష్టిలో కనిపించే ప్రతి రూపంలోనూ ఈ మూడు శరీరాలూ కనిపిస్తాయి. వేరు వేరు జీవాలలో, నీటి ప్రభావంలో తరతమ భేదాలు ఉండడం వలన, అటువంటి భేదాలకు అనుగుణంగా కొన్ని కొన్ని దశలు స్పష్టంగా గుర్తింపబడ్డాయి.

1. ఖనిజాలలో సూక్ష్మ శరీరం స్థూలరూపంగానే ఉంటుంది. మిగిలిన శరీరాలన్నీ దానిలోనే నిక్షిప్తమై ఉంటాయి. పైకి అచేతనంగా కనిపించినప్పటికీ, నిద్రావస్థలోనున్న మనిషికి పాలు త్రాగించినట్లే, అది కూడా పరమాణువులను గ్రహించి, కలగలిపి, తనలో ఇముడ్చుకుంటుంది. ఖనిజాలలో కారణ శరీరమూ, గాఢ నిద్రావస్థ అయిన 'సుషుప్తి' కూడా స్థూల రూపంలోనే ఉంటాయి.

2. మొక్కలు కూడా స్థూల శరీరాన్ని కలిగి ఉంటాయి. దీనితో బాటు సూక్ష్మరూపం కలిగి ఉన్న కారణ శరీరం కూడా ఉంటుంది. అవి చేతనమైన పరమాణువులను, నిశ్చలమైన పరమాణువులను - రెండింటినీ గ్రహించి అప్పుడే పుట్టిన పసిపాపలా వాటిని కలగలిపి, తమలో ఇముడ్చుకుంటాయి. స్వప్నావస్థ, సుషుప్తి అవస్థలనే గాఢ నిద్రావస్థలు కూడా వీటిలోనే కనిపిస్తాయి.

3. జంతువులలో, స్థూల, సూక్ష్మ, కారణశరీరాలనే ఈ మూడు శరీరాలు ఉంటాయి. జంతువులు తింటాయి, త్రాగుతాయి, నిద్రపోతాయి, మేల్కొంటాయి. అంతేగాక, ఈ మూడు శరీరాలలోనూ, సుఖదుఃఖాల అనుభూతిని పొందుతుంటాయి. జాగ్రదావస్థ, స్వప్నావస్థ, సుషుప్తి అవస్థ అనేవి మూడూ కూడా  వాటిల్లో కన్పిస్తాయి.

4. మానవులలో కూడా స్థూల, సూక్ష్మ, కారణశరీరాలనే ఈ మూడు శరీరాలూ ఉన్నాయి. వ్యక్తి పోషణ, పెరుగుదల, అభివృద్ధి, ఆలోచన, సుఖమూ అనేవి అతడికి ఈ శరీరాలతో గల సంబంధం వలన బలపడుతూ ఉంటాయి. వారిలో కొందరికి ఈ మూడే గాక, నాలుగవ స్థితి కూడా ఉంటుంది. దానిని గురించి ఈ వ్యాసం చివరలో వివరిస్తాను. ఈ స్థితి ఎవరిలో మొదలౌతుందో, అటువంటి మానవులు చాలా అరుదు. అలా కాని మనుషులు జంతువులతో సమానమే. అటువంటివారు మృగాల కోవకు చెందుతారు. అటువంటివారు చేసే పనులనూ, నడవడికనూ గమనిస్తే, వారు జంతువులలా ప్రవర్తిస్తున్నారని తెలుసుకోవచ్చు.

"నరపశు, గురుపశు, స్త్రియాపశు, వేదపశు, సంసార!

మనుష నోయి జానియే జాహీ వివేక విచార!!

అనగా

"ఎవరు మానవుని, గురువుని, స్త్రీని, వేదాలనూ అనుసరించి పూజిస్తారో, అట్టి వారందరూ మృగాలు. యుక్తాయుక్త విచక్షణా, ఆలోచనశక్తీ గలవాడే మనిషి!!

ఎవరైతే భగవంతుని స్థితినీ, తమ స్థితిని తెలుసుకోకుండా, భగవంతుని తమ దృష్టితో గాక భగవంతుని దృష్టితో ఆరాధిస్తారో, అటువంటి వారిని విష్ణువు రుద్రుడై ఏడిపిస్తాడు. ఎవరైతే దేవతల స్థితినీ, తమ స్థితిని తెలుసుకోకుండా, దేవతలను తమ దృష్టితో గాక, దేవతల దృష్టితో ఆరాధిస్తారో, అట్టి వారిని దేవతలు బరువులు మోసే జంతువులుగా చేసేస్తారు. అదేవిధంగా ఎవరైతే గురువు యొక్క స్థితినీ, తమ స్థితిని తెలుసుకోకుండా, గురువును తమ దృష్టితో కాక గురువుయొక్క దృష్టితో పూజిస్తారో అట్టి వారికి గురువే కాలపిశాచిగా మారతాడు. ఆ గురువు తన దయాళు రూపాన్ని వదలి, ఆ భక్తుడు సంపాదించుకున్నదంతా కబళించి, అతనిని ఒక జంతువుగా మార్చేస్తాడు. అటువంటివారికి మోక్షం అనేది ఉండదు. వారు ఎల్లప్పుడూ జంతువులలో ఒక జంతువులాగే ఉంటారు. వారు బాధల ననుభవిస్తూ, తమ మానవత్వపు హక్కులను గుర్తించి, చిత్తశుద్ధితో, మనఃపూర్వకంగా ప్రగాఢమైన వాంఛతో ఆ హక్కుల కొరకు పోరాడేవరకూ, వారు ఆ మృగ స్థితిలోనే కొనసాగుతూ ఉంటారు. చాలాకాలం తర్వాతనే వారు మానవ స్థితిని పొందగలరు. దీనినే బృహదారణ్యకోపనిషత్తులో, యాజ్ఞవల్క్యమహాముని అయిన మైత్రేయికి తన సహధర్మచారిణి ఇలా వివరించాడు:

" ఓ మైత్రేయీ! ఎవరైతే బ్రహ్మమునూ, ఈశ్వరునీ, వేదములనూ, పుత్రులనూ, ఆత్మనూ తమ దృష్టితో గాక, (తమ నుండి వేరుపడినవారనే భావంతో) బ్రహ్మము, ఈశ్వరుల దృష్టితో చూస్తారో, అట్టివారు వాటి వలననే వినాశనం పొందుతారు”.

మనస్సును ఏకాగ్రముచేసి దాని వివిధ దశలను, ఒక స్థితి నుండి వేరొక స్థితికి మార్చుటే యోగము యొక్క ఉద్దేశ్యము. మెదడులో గల ఆధ్యాత్మిక కేంద్రాలపై మనస్సును లగ్నం చేయడం ద్వారా ఆతడు స్వయంగా అనుభవాన్ని పొంది, యదార్థాన్ని తెలుసుకుంటాడు. ఈ జీవులన్నీ మతపరమైన, నైతికపరమైన కర్మకాండలకే కట్టుబడి ఉన్నాయి కనుక వాటి ప్రవేశం అంతవరకే ఉంది.

ఇప్పుడు మనం వివిధ రకాలైన కర్మలు, వాటివలన కలిగే కర్మఫలాలు, శిక్షల గురించి తెలుసుకుందాం.

ప్రకృతి నియమానుసారం, జీవునకు సత్ఫలితముగానీ, దుష్ఫలితము గానీ లేనటువంటి కర్మలు రెండు విధాలు. ఆ కర్మల యొక్క ముఖ్యోద్దేశం మూడు శరీరాలతో సంబంధం ఉన్న చలనాన్నీ, ఆలోచననూ, ఆనందాన్ని కలిగించడమే.

వాస్తవానికి జీవుడే “ఆత్మ", "బ్రహ్మము”. వాని లక్షణాలు ఏవంటే –

1. చలనంతోబాటు ఆలోచిస్తూ ఉండడం, ఆలోచిస్తూ కదలిపోతూ ఉండడం.

2. వృద్ధి చెందుతూ ఆలోచించడం, ఆలోచిస్తూ వృద్ధి చెందడం.

**మొదటిది :** “ఆత్మ” యొక్క ప్రత్యేక లక్షణము, నిర్వచనము.

**రెండవది :**"బ్రహ్మము" నకు సంబంధించినది. వీటికి గల తేడా ఏమిటంటే, "ఆత్మ"మితమైనది, 'బ్రహ్మము” విస్తృతమైనది. అందుకనే “బ్రహ్మము” ను “పరమాత్మ” అని పిలుస్తారు. బ్రహ్మము పరిపూర్ణమైనట్టిది. కనుక దానికి, శిక్షలుగానీ, బహుమతులు గానీ ఉండవు. శిక్ష, బహుమతులనేవి పూర్ణత్వానికి గాక, దాని ' అంశ' (భాగము) కే వర్తిస్తాయి. పరిమిత జ్ఞానం గల దాన్ని ' అంశ' లేదా భాగం అనీ, సర్వజ్ఞత గల దానిని "బ్రహ్మము" అనీ వ్యవహరిస్తాము. సర్వజ్ఞుడు లేదా సర్వజ్ఞత అయినదే బ్రహ్మము. సర్వజ్ఞత్వము అంటే పరిపూర్ణ జ్ఞానము. అది ఒక సంపూర్ణ ధర్మము. ఈ లక్షణమే దానికి గుర్తు. పరిమిత జ్ఞానంలో, జ్ఞానము మితమైనది. అంటే అసంపూర్ణంగా ఉంటుంది కాబట్టి అది లోపభూయిష్టమై, కొన్ని లోపాలు కలిగి ఉంటుంది. ఇటువంటి అసంపూర్ణ స్థితిలోనే ప్రశ్నలూ, సమాధానాలూ ఉత్పన్నమౌతాయి. అసంపూర్ణమైనది అంటే దానిలో కొంత వెలితి ఉందనీ, దానికి మరికొంత జేర్చి సరిదిద్దవచ్చునని అర్థం. పరిపూర్ణమైనది ఎల్లప్పుడూ సంపూర్ణంగానే ఉంటుంది. దానిలో లోపాలు ఉండవు. దానిని సరిదిద్దడానికి గానీ, దానికి మరికొంత చేర్చడానికి గానీ, చేర్చవలసిన అవసరం గానీ ఉండదు. అందువలన ఈ పరిపూర్ణ స్థితిలో బహుమతులు గానీ, దండనలు గానీ ఉండవు.

జీవించాలనే కోరిక ఉన్న "ఆత్మ"నే “జీవి" అని అంటారు. జీవితేచ్ఛ గలదే “జీవుడు" అవుతాడు. జ్ఞానంలో గల లోపాలు, లోటుపాట్ల మీదే ఎల్లప్పుడూ ఈ జీవుని దృష్టి ఉంటుంది. అది ఎప్పుడూ ఏదో ఒక లోటును అనుభవిస్తూ, ఇంకొకరి మీద ఆధారపడి ఉంటుంది. ఇదే దాని దుఃఖానికీ, కష్టాలకూ కారణం. అందువల్లనే జీవుడు ఎల్లప్పుడూ దుఃఖపూరితమైన జీవనాన్ని గడుపుతూ ఉంటాడు. ఈ దుఃఖానుభూతికి పర్యవసానంగా, తన స్వలాభాన్నే కోరడం, ఇతరులకు హాని తలపెట్టడం వంటి పెక్కు లోటుపాట్లను తనలో ఏర్పరచుకుంటాడు. ఈ ద్వంద్వవైఖరి వలన జీవి యొక్క ఆలోచనలూ, చేతలూ వేర్వేరుగా ఉంటాయి. "జీవుడు" తనను తాను కించబరచుకుంటూ, చిన్నబుచ్చుకుంటూ, తాను పేదవాడిననీ, పనికిరాని వాడిననీ, ఇతరులకంటే

తక్కువ వాడిననీ, అధముడననీ; ఇతరులు తనకంటే ఎంతో గొప్పవారనీ, ఉన్నతమైన వారనీ తలపోయ నారంభిస్తాడు. ఆత్మ నిందకూ, పరస్తుతికీ పూనుకుంటాడు. అంటే తాను ఇతరుల వంటివాడిని కాదని తలబోసి, న్యూనతాభావాన్ని సృష్టించుకొని, అంటే తాను ఇతరుల నుండి వేరు పడినట్లుగా భావిస్తాడు.

ఈ అన్య భావం జీవాత్మను “అనేకత్వ" స్థితిలోనికి తోసివేస్తుంది. ఇతరులు అందరూ తనకంటే భిన్నమైనవారనీ, వాళ్ళు వేరూ, తాను వేరూ అనే దృష్టితో చూస్తూ, అనేకత్వమనే భావానికి జీవాత్మ గురి అవుతుంది. ఈ అనేకత్వంపై మక్కువ చూపనారంభిస్తుంది, జీవి.

జీవాత్మ తనను తాను తెలుసుకోలేదు. ఇతరులనే చూస్తూ ఉంటుంది. ఈ లోపమే దానిని మాయకు గురి చేస్తుంది. అంతర్ముఖంగా గాక, బహిర్ముఖంగానే ఈ బాహ్య దృష్టి ఉండడం వలన, దాని పరిస్థితి వర్షాకాలంలో ఇంటి నుండి బయటకు వచ్చినవానిలా ఉంటుంది. అప్పుడది స్వలాభాపేక్షతో కూడుకున్న పనులు చేయనారంభిస్తుంది. దురాశ, ఈర్ష్య, ద్వేషము, శతృత్వము, ఇతరులతో పోటీ, స్వార్థము, కోరికలతో కూడిన పనులు చేస్తూ ఉంటుంది. ఇది చేసే అతి హీనమైన పని ఇతరుల మనస్సును గాయపర్చడమే. క్లుప్తంగా చెప్పాలంటే, ఇటువంటి పనులన్నింటికీ దండనా, శిక్షా ఉంటాయి. శిక్షనూ, బాధనూ, కష్టాన్నీ అనుభవించిన తర్వాత జీవాత్మ సన్మార్గం వైపునకు మరలి, మంచిపనులు చేయడం గురించి ఆలోచిస్తుంది. అప్పుడు ఆ జీవాత్మ అందరి మేలునూ, అందరి శ్రేయస్సునూ కోరుకుంటుంది. వేరు మాటల్లో చెప్పాలంటే, చెడులో నుండే మంచి పుట్టుకొస్తుంది. అప్పుడు జీవాత్మలో పరోపకారబుద్ధి, క్షమాగుణం, వినయం, ఇతరుల సంక్షేమం మొదలైన స్వభావాలు పెంపొంది, స్వానుభవం వలన సన్మార్గానికి వస్తుంది. ఇటువంటి వాటికి, ఆ జీవాత్మకు పురస్కారమూ, బహుమతి లభిస్తాయి. అప్పుడే, సద్గుణాలు మంచివనీ, దుర్గుణాలు చెడ్డవనీ జీవాత్మ గ్రహిస్తుంది. ఈ రెండింటినీ బేరీజు వేసుకుని, చెడు కన్నా మంచే మిన్న అని తేల్చుకుంటుంది. ఇక్కడి నుండే పరస్పర విరుద్ధములైన మంచి - చెడు అనే ద్వంద్వాలు పుట్టుకొస్తాయి. కొంతకాలంపాటు ఈ ఘర్షణకు గురి అయినా, చెడును పూర్తిగా వదలివేసి మంచివైపే పూర్తిగా మొగ్గు చూపినప్పుడు ప్రకృతి నియమాన్ని అనుసరిస్తూ పనిచేయనారంభిస్తుంది. అదే సృజనాత్మక కర్మ. అప్పుడు కూడా దానికి లోపరహితం కానట్టి మంచి చెడ్డల జ్ఞానము, అనుభవమూ ఉంటాయి. ఎప్పటికీ అహింస పరమ ధర్మమనీ, హింస ఘోరమైన పాపం అనే నిశ్చయానికి వస్తుంది.

## రెండు విధములైన కర్మలు

"కర్మ" రెండు విధాలుగా ఉంటుంది. అవి ధర్మకార్యమూ, అధర్మ కార్యమూ అనేవి. సుఖసంతోషాలు కలుగజేసే కర్మ సక్రమమైనది, ధర్మబద్ధమైనది. సంతోషాన్ని కలుగజేయని కర్మ అధర్మకార్యం.

దొంగతనం, దోపిడీలు చేయడం వంటివి ఆనందాన్ని కలుగజేస్తాయా లేదా? అన్నది ఇప్పటి ప్రశ్న. మనిషి తనకు ఏ కొంచెం కూడా దుఃఖం కలుగకుండా, కేవలం సంతోషాన్ని మాత్రమే కలిగించే కార్యాన్నీ, ఇష్టం వచ్చిన ఏ పనినైనా చేయవచ్చు. ఎవ్వరూ వానిని ఆ పని చెయ్యవద్దని చెప్పి వారించలేరు. కాని వాస్తవానికి, మనిషి తన మూర్ఖత్వంకొద్దీ, 'ఆనందం' అని భ్రమపడి చేసే పనులన్నీ దుఃఖాన్ని కలుగజేస్తాయి. మనము జీవించే వాతావరణమంతా పాపపుణ్యాలూ, మంచిచెడ్డలనే భావాలతోనే నిండి ఉంది. ప్రప్రథమంగా, దాని ప్రభావమే సర్వత్రా వ్యాపించి ఉంది. ఇక రెండవ విషయం: దొంగతనం చేసేవాడూ, ఖూనీలు చేసేవాడూ కూడా ఈ పాపపుణ్యాల భావాలకే పరిమితులౌతాడు. దొంగ ఇతరులకు కనబడని విధంగా, రహస్యంగా దాక్కొని దొంగతనం చేస్తాడు. ఇటువంటి పరిస్థితులలో, తప్పుడు పని చేసేవాడు, ఆ దుష్ప్రభావాన్ని ముందుగా తన హృదయంలో పొంది, ఆ తరువాత ఇతరులకు హాని కలుగజేస్తాడు.

దుర్మార్గమనేది మనస్సునూ, హృదయాన్నీ కలుషితం చేస్తుంది. హృదయాన్ని అపవిత్రంగానూ, భారంగానూ చేసి, దుఃఖభాజనము చేస్తుంది. అంతేగాక, ఎవరి మీదైతే ఈ క్రూరత్వాన్ని చూపుతామో, ఆతడు దుఃఖానికి లోనవుతాడు. కాని అతడు అనుభవించే దుఃఖపూరిత భావాల ప్రభావం, ఆ దుఃఖకారకుడైన వానికి కూడా కలుగుతుంది. దుఃఖాన్ని కలుగజేసిన వ్యక్తి కూడా దుఃఖానికి లోనవుతాడు. ఒక ఉదాహరణను తీసుకుందాం. మీ ఇరుగు పొరుగున ఉన్న ఒక వ్యక్తి కష్టాలకు లోనై విచారిస్తూ ఉంటే, నువ్వు ఏవిధంగానూ ఆ దుఃఖ ప్రభావం నుండి తప్పించుకోలేవు. ఒకవిధంగా చెప్పాలంటే, ఈ దుఃఖం విషపూరితమైన వంటచెరకు మండేటప్పుడు వచ్చే విషవాయువు లాంటిది. దానిని ఏ ఇంటిలోపలైనా ఉంచి మంట పెట్టినా, దాని ఘాటు చుట్టుప్రక్కల ఉండే ఇళ్ళకు వ్యాపించడం ఖాయం. సన్మార్గము, పుణ్యకార్యాల విషయంలో కూడా జరిగేది ఇదే.

నీవు సన్మార్గుడవు అయినట్లయితే, నీ చుట్టుప్రక్కల ఉన్నవాళ్ళు ఆ సుఖసంతోషాల లబ్ధిని పొందుతారు. ఈ ప్రపంచాన్ని మన దేహంతో పోల్చవచ్చు. శరీరంలో ఏ భాగమైనా రుగ్మతకు లోనయితే, శరీరం అంతా బాధకు లోనౌతుంది. అందువల్లనే సత్పురుషులెప్పుడూ పాపకార్యాలకు ఎంతో దూరంగా ఉంటారు. సన్మార్గులై మంచి పనులనే చేస్తూ ఉంటారు. ఇది అందరికీ తెలిసిన నిజం.

## పాపపుణ్యాల లక్షణాలు

ఏ పనిని చేస్తే, భయం, బిడియం, అవమానం కలుగుతాయో, ఆ పని పాపకార్యం అవుతుంది. నిర్భయంగా, ధైర్యంగా, శౌర్యంగా చేయగలిగిన పని పుణ్యకార్యం అవుతుంది. అయినా చదువూ సంస్కారమూ, నీతి-నిజాయితీ, నియమాలూ, సాంఘిక మర్యాద, స్వీయానుభవం - ఇవన్నీ కూడా వాటి ప్రభావాన్ని చూపిస్తాయి. విద్య, నిజాయితి, సత్ప్రవర్తన - వీటి ప్రభావం ఎల్లప్పుడూ ధర్మం వైపే దారి చూపిస్తాయి. అందువలన ఎవ్వరూ కూడా వీటికి విరుద్ధంగా పనిచేయకూడదు. మతము, గురువులు, శాస్త్రాలు, అంతరాత్మ - ఇవన్నీ అంగీకరించినదే ధర్మబద్ధమైనవి. వాటికి వ్యతిరేకంగా ఉండే విషయాలన్నీ ధర్మబద్ధం కావు.

మతం, శాస్త్రాలు, గురువు, అంతరాత్మ - ఇవన్నీ కలసి, ఏకగ్రీవంగా అధర్మాన్నీ, చెడ్డ విషయాలనీ ఎన్నటికీ ఒప్పుకోవు. ఏదైనా ఒక పనిని, అది మంచిపనా లేదా చెడ్డపనా అని నిర్ధారించడానికి, పైవన్నీ కలిసి ఏకగ్రీవంగా అంగీకరించడమే ప్రామాణికము లేదా గీటురాయి. వాటిలో ఏ ఒక్కటి ఒప్పుకోనకపోయినా, ఏ వ్యక్తి తన కిష్టమనిగానీ, ఇతరులకిష్టమని గానీ ఏ కార్యాన్నీ చేపట్టకూడదు.

ఏ పాపపుణ్య ఫలాలనూ ఇవ్వని కార్యాలు కొన్ని ఉన్నాయి. ఉదాహరణకు ప్రతిరోజూ స్నానం చెయ్యడం, ముఖం, కాళ్ళూ చేతులూ కడుక్కోవడం లాంటివి. అయితే ఈ పనులు చేయకపోవడం వలన ఆరోగ్యం చెడిపోయే ప్రమాదం మాత్రం ఉంది.

మనం పెద్దలను గౌరవించకపోతే మనకు యోగ్యత సిద్ధించదు. ఎటువంటి పుణ్యం రాకపోగా, పైపెచ్చు సాంఘిక మర్యాదలను అతిక్రమించిన వారమౌతాము. ఇదే విషయం వేద సంబంధమైన వాటికీ, లౌకిక సంబంధమైన వాటికి కూడా వర్తిస్తుంది. ఇవన్నీ సక్రమమైన, ధర్మసమ్మతమైన కార్యాలు నిజం చెప్పాలంటే, యజ్ఞం చేయడం బంధనాలకు దారితీయదు. ఈ బంధనమనేది

మనస్సులోనూ, భావాలలోనూ, నమ్మకంలోనూ ఉంది. వాస్తవానికి యజ్ఞం కూడా ఒక విధంగా పూజయే.

వ్యక్తి తన చేష్టలవలన, ప్రవర్తన వలన పెద్దలనూ, పిన్నలనూ, తన అధీనంలో ఉన్న వారినందరినీ సంతోషపెట్టాలి. ప్రతి వ్యక్తీ తన పరిసరాలనూ, వాతావరణాన్నీ ఎంతో రమణీయంగా ఉంచాలి. వీలైనంతవరకూ అగ్ని, వాయువు, నీరు, భూమి, ఆకాశాలను కలుషితం చేయరాదు. ఇదీ ఒక యజ్ఞమే మరి. జీవిత ప్రాథమిక దశలో ఈ నియమాలను పాటించడం ఎంతైనా అవసరం. ఇవి పాపానికి దారితీయవు. ఇతర విధానాలైన క్రతువులు, అంటే ఒక వ్యక్తికి గానీ, ఒక వర్గానికి గానీ హాని కలగాలనే ఉద్దేశ్యంతో చేసే పనులన్నింటికీ అభ్యంతరం చెప్పాలి.

పని చేయడంలోని ముఖ్యోద్దేశ్యం జీవాన్ని వ్యక్తం చేయడమే. అదే జీవం తనంత తానుగా, ప్రకృతిసిద్ధంగా, ఇతరులకు కీడు చేయకుండా వ్యక్తమయితే, దానికి అభ్యంతరం ఏమీ ఉండదు. దానిలో పాప పుణ్యాలనేవి ఉండవు. తప్పొప్పులనే పరస్పర విభిన్న భావాలు ఎక్కడ ఉంటాయో, అక్కడ పాప పుణ్యాలనేవి కూడా ఉంటాయి. ఆవిధంగా తప్పొప్పులనేవి బంధనాలనే సంకెళ్ళను సృష్టిస్తాయి. వీటి బారినుండి బయట పడడం ఎంతైనా అవసరం. లేకుంటే, బంధనాలు, 'విముక్తి అనేవి మనస్సుకు తట్టనే తట్టవు. ఏ వ్యక్తి అయినా వీటినుండి తననుతాను కాపాడుకోవాలంటే, చెడు భావాలను మంచి భావాలుగా మార్చి, తీర్చిదిద్ది, అటుపైన వాటిని కార్యరూపంలో పెట్టాలి. ఈ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని, స్వార్థం అనేది లేకుండా, తోటి మానవులకు సేవ చేయడమే, అత్యుత్తమమైన ఆరాధన, యజ్ఞం అవుతాయి. ఆవిధంగా చేయగలిగినవాడు పని అనే బంధనం నుండి విముక్తి పొందగలడు. అటువంటి కార్యమే ఈ భౌతిక శరీరం యొక్క ప్రకృతి, ధర్మము, నియమము.

తాము చేసిన పనికి ప్రతిఫలాన్ని ఆశించేవారు మూర్ఖులు. కొంచెమే తెలుసుకుని, అర్థం చేసుకున్న వారిని అజ్ఞానులు అని అంటారు. ఏమీ తెలియని వారిని "మూఢులు" అని అంటారు. పశు దశ నుండి వారేమాత్రం ఇంకా ఉన్నతులు కాజాలరు. మిగిలినవారందరూ - అంటే విద్యావంతులు, రాజులు, సామాన్యులు, ధనవంతులు, మంత్రులు, మేధావులు, తార్కికులు వీరందరూ అజ్ఞానులే. అజ్ఞానులని పిలువ తగినవారే. వారి దృష్టి అంతా ఈ భౌతిక శరీరం మీదే ఉంటుంది. జీవితంలో సర్వసాధారణమైన పనులను మాత్రమే వారు చేస్తూ ఉంటారు. వారు శారీరకమైన, మానసికమైన పనులకు మాత్రమే పరిమితమై ఉంటారు. వారు భౌతిక శరీరానికీ,

మనస్సుకూ, ఆలోచనలకూ, భావాలకూ, నియమాలకూ, నిబంధనలకూ సంబంధించిన సంస్కారాలను దృఢం చేసుకుంటూ ఉంటారు. "అజ్ఞాని" అనే పదం వారికి సరిగ్గా సరిపోతుంది.

అటువంటివారిని భక్తులు, సాధువులు, సజ్జనులు మొదలైన పేర్లతో పిలిచినప్పటికీ వారు అజ్ఞానులే. వారిని శరీరంపై దృష్టిగలవారనీ, మనస్కులనీ, కోరికలపై దృష్టి గలవారనీ, భిన్న మనస్కులనీ అంటారు. వారి దృష్టి ఎల్లప్పుడూ ఈ విషయాలపైనే కేంద్రీకరించి ఉంటుంది. ధార్మికచింతన కలవారు కూడా ప్రాపంచికములైన శరీరాలు, వాంఛలు వంటివాటి గురించే తప్ప ఇతర విషయాల గురించి ఆలోచించరు. విషయలోలత్వమూ, అప్సరసలతో సంభోగము, దానీజనాలతో క్రీడించడమూ - వీరి భావనలలో ఇదే "స్వర్గం". స్వర్గానికి వెళ్ళాలని కోరుకునేవారు, అది యీ భౌతిక ప్రపంచం యొక్క సూక్ష్మ రూపమని భావించి, ఆ కోరికను ఇంకా ఎక్కువ. బలపరచు కుంటారు. అదేవిధంగా వైకుంఠం" వెళ్ళాలనుకునేవారు, అది ఆనందదాయకమైన ప్రదేశమని భావిస్తారు. అటువంటివారు కూడా శరీరాన్నీ, ఇంద్రియాలనూ దాటిపోలేరు. అంతకుమించి మరిదేనినీ గ్రహించలేరు. అందువల్లనే కొద్దిపాటి జ్ఞానమూ, అవగాహనా పొందినవారిని అజ్ఞానులంటారు. ఎవరిలోనైతే ఇహలోకం, పరలోకం అనే భావాలూ, నమ్మకాలూ దృఢంగా నాటుకొని ఉంటాయో అటువంటివారినే మూర్ఖులు అని అంటారు. ఇహలోకం, పరలోకం అనేవి రెండూ ఒక్కటే. ఈ రెండూ "అనేకత్వ" భావంతో ఉన్న లోకాలే.

<u>**మొట్టమొదటిది:**</u> ధార్మికచింతన గల మానవులు, సాధువులు, భగవద్భక్తులు - వీరెవ్వరికీ కూడా "భగవంతుడు" అంటే ఏమీ తెలియదు. రెండవది: వారి దృష్టిలో, భగవంతుని స్థితి ఒక మహాపురుషుడు అనుభవించే హోదాకు మించి ఉండదు. వీరు చేసే ప్రార్థనలలోని మాటలనొకసారి గమనించండి. ఆతడినే, ఆ భగవంతుడినే కొందరు సర్వశక్తి సంపన్నుడు, యజమాని, నిరంకుశ ప్రభువు, న్యాయ నిర్ణేత అని అంటే, మరికొందరు దయామయుడు, కరుణామయుడు, కృపాసింధువు అని పిలుస్తారు. ఇవన్నీ మానవునికి ఉండే లక్షణాలే కదా. ఇక మూడవది: వీరందరూ భగవంతుని; ఆయన కళ్ళతో చూడలేదు. కాని ఆతడు స్తోత్రాలకు కరిగిపోయేవాడనీ, ఇంద్రియ సంబంధమైన కోరిక లన్నింటినీ తీర్చేవాడనీ వారి భావన. కొందరు ఈ స్తోత్రాలనే "ప్రార్థన" అనీ, "భక్తి" అనీ అంటారు. ఇది బాగుగా ఆలోచించవలసిన విషయం. భక్తుల ప్రార్థన ఈ క్రింది విధంగా ఉంటుంది.

"ఓ సృష్టికర్తా! నీవు సమస్తలోకాలకూ కరుణను ప్రసాదించేవాడివి. నాకు పనిపాట్లను ఇవ్వు. నాకు ధనాగారాన్ని కరుణించు. నాకు సుఖసంతోషాలను ప్రసాదించు. నాకు కీర్తినీ, పరువు-ప్రతిష్ఠలను ప్రసాదించు" ." ఓ వైకుంఠవాసా నేను నీ నామమునే స్మరిస్తాను. నాకు ధర్మార్థముల నిమ్ము. నాకు జీవితంలో అభివృద్ధిని ప్రసాదించు".

మౌల్వీ రూమీగారి ప్రార్థన ఇలా ఉంటుంది.

"ఐహిక లాభ పరాయణులందరూ శుద్ధ నాస్తికులు. పాషండులు, మోసగాండ్రు. వారు వచ్చీరాని మాటలతో రాత్రింబవళ్ళు వాగుతూ ఉంటారు. ఒకడు స్వార్థభావాలలో చిక్కుకుంటే, వేరొకడు "అబూ బకర్ ఆలీ" అనే ఉచ్చులో చిక్కుకుంటాడు".

ఇటువంటి వారు, అజ్ఞానులు, మూర్ఖులు. వీరు అనేకత్వంలో మునిగిపోయారు. అటువంటివారు మాత్రమే పారితోషికాలనూ, దండనలనూ పొందుతారు. ఇటువంటి వారికోసమే ధర్మమూ, కర్మ అనేవి ఉంటాయి.

## ఆధ్యాత్మికత

మానవుడు మూడు శరీరాలతో నిర్మింపబడినవాడు. ఈ మూడు శరీరాల ప్రభావమూ వానిలో కనబడుతుంది. ఇంతకుముందే చెప్పినట్లుగా, అవి స్థూల, సూక్ష్మ, కారణశరీరాలు.

సత్వ, రజ, తమో గుణాల లక్షణాల కలయిక వలన ఏర్పడిన కారణంగా ఈ మూడు శరీరాలనూ "త్రిగుణాత్మకము" అని అంటారు. సాధారణముగా, ఈ మూడు విధాలైన లక్షణాలూ, గుణాలూ మూడు శరీరాలలోనూ ఎల్లప్పుడూ కనిపిస్తాయి. ఈ మూడు గుణాలలో ప్రధానంగా ఉండే ఏదో ఒక లక్షణాన్ని బట్టి, వాటియొక్క ప్రత్యేకతా, నైజమూ, ప్రభావాలూ నిర్ణయింపబడతాయి. అందువలన వాటి పేర్లు కూడా వేర్వేరుగా ఉంటాయి.

'తమస్సు' అంటే స్థూలత్వము, 'రజస్సు' అంటే సూక్ష్మము, 'సత్వము' అంటే కారణాత్మకము. సత్వగుణ స్వభావము అన్నింటికంటే ఉంటుంది. 'రజస్సు' స్వభావము మధ్యభాగంలో ఉంటుంది. 'తమస్సు' యొక్క స్వభావము అన్నింటికంటే అట్టడుగున ఉంటుంది. మొరటుగానూ, చిక్కగానూ ఉండడం వలన స్థూల శరీరానికి తమోగుణము ప్రధానంగా ఉంటుంది.

కారణశరీర పదార్థము అతి సూక్ష్మంగా ఉంటుంది కాబట్టి, కారణశరీరానికి "సత్వ' గుణము ప్రధానంగా ఉంటుంది. చిక్కదనము, సూక్ష్మత్వము రెండూ కలిసిపోయి సూక్ష్మ శరీరంలో ఉంటాయి కాబట్టి, అది 'ర' గుణ ప్రధానమైనదై ఉంటుంది. ఈ కారణం చేతనే వ్యక్తులు కూడా 1. మూఢులు 2. చంచల మనస్తత్వము గలవారు 3. అజ్ఞానులు అనే మూడు రకాలుగా ఉంటారు.

1. శరీరం పైననే ఎక్కువగా దృష్టిని నిలిపి, దానినే ఆరాధిస్తూ ఉండేవారినీ, బాధ్యత లేనివారినీ, సోమరిపోతులూ మొదలైన వారినీ 'మూఢులు" అని అంటారు. శరీరాన్నే ఆరాధించేవారు, వారికంటూ ఒక శరీరం ఉన్నప్పటికీ, వారికి దానిని గురించి బొత్తిగా ఏమీ తెలియదు. అటువంటి వాని దృష్టి ఎల్లప్పుడూ శరీరంపైననే ఉంటుంది. అతడు జాగృదావస్థకు మెలకువ స్థితికి చెందిన పనులను మాత్రమే చేస్తూ ఉంటాడు. జాగృదావస్థలో ఎల్లప్పుడూ దృష్టి శరీరంపైననే ఉంటుంది. ఈ శరీరం యొక్క ప్రయోజనం అతనికి ఏమీ తెలియదు. ఇదే వ్యక్తిత్వము - అంటే తాను ఇతరులకంటే వేరుగా ఉన్నాననే భావం కలిగిన వ్యక్తిత్వం వలన ఆతడు "మూఢుడు" అయ్యాడు.

2. శరీరంతోబాటు మనస్సును కూడా ఆరాధించేవారు - అంటే కష్టించి పనిచేసే శ్రమజీవులూ, శాంతస్వభావము లోపించిన ముక్కోపులూ, ప్రతీకారవాంఛ గలవారూ, ఆలోచనాపరులూ, స్థిరబుద్ధులూ, స్వార్థపరులూ అయిన వారిని "చపల స్వభావులు" లేదా "చంచల బుద్ధి గలవారు" అని అంటారు. మనస్సును ఆరాధించే వారికి, మనస్సు ఉన్నప్పటికీ, ఆ మనస్సును గురించిన జ్ఞానం ఉండదు. శరీరంతోబాటు మనస్సునూ ఆరాధించేవాడు, ఆ రెండింటి మీదా దృష్టిని కేంద్రీకరిస్తాడు. జాగృత, నిద్రావస్థలలో చేసే పనులన్నీ చేస్తాడు. మెలకువ స్థితిలో శరీరంమీదా, స్వప్నావస్థలో మనస్సుమీదా దృష్టిని కలిగి ఉంటాడు. కానీ, మనస్సుయొక్క అసలు ప్రయోజనం మాత్రం అతడికి తెలియదు. ఇదీ అతడి పరిస్థితి. అతడు మనో భావాలను తెలుసుకొననూలేడు, వాటిని అదుపులో పెట్టనూలేడు అందుచేత అతడు చపలచిత్తుడూ, అశాంతుడూ, వికల మనస్కుడూ అవుతాడు.

3. శరీరము, మనస్సులతోబాటు ఆత్మనుకూడా ఆరాధించేవారు. న్యాయబుద్ధి గలవారూ, స్వార్థం లేనివారూ, సాధుస్వభావం గలవారూ అయిన వీరిని "అజ్ఞానులు" అని అంటారు. "ఆత్మ"ను ఆరాధించేవారు శరీరము, మనస్సుల అవసరాన్ని గురించి కొద్దిపాటి జ్ఞానాన్ని కలిగి ఉంటారు. సుఖశాంతులకోసం ఆరాటపడుతున్నప్పటికీ, ఆత్మయొక్క అసలు తత్త్వము వారికి తెలియదు. ఆధ్యాత్మికతను గురించి ఎవరైనా చెపుతున్నప్పుడూ, దానిని గురించి ఆలోచించినప్పుడూ,

చదువుతున్నప్పుడూ, వీరు ఆధ్యాత్మికత్వంపైపు మొగ్గు చూపుతారు. అయినా వారిలో బలీయంగా ఇతర కోరికలు ఉండడంవలన వారు ఆధ్యాత్మికత పట్ల అశ్రద్ధ వహిస్తారు. అటువంటి వ్యక్తిని " అజ్ఞాని" అని అంటారు.

శరీరము, మనస్సుతోబాటు ఆత్మను కూడా ఆరాధించే వ్యక్తి యొక్క దృష్టి శరీరమూ, మనస్సూ పైననే గాక, ఆత్మపై కూడా ఉంటుంది. కాని ఆత్మ యొక్క ప్రయోజనం అతడికి తెలియదు. అతడు జాగృదావస్థ, స్వప్న, సుషుప్తి అనే ఈ మూడు అవస్థలలో చేసే పనులన్నీ చేస్తూ ఉంటాడు. అలా చేస్తున్నప్పటికీ, ఆత్మతత్వమూ ఆత్మను గురించిన పరమసత్యమూ అతడికి తెలియదు. అందువల్లనే అతడు ' అజ్ఞాని'. అతడి స్థితి అటువంటిది.

శరీర మనస్కులు, మనోమనస్కులు, ఆత్మ మనస్కులు అనేవి వాడుకలో లేని భావాతీతమైన పదాలు. అందువలన వీటికి బదులుగా "శరీరధారులు", "మనోధారులు", "ఆత్మధారులు" - అంటే శరీరం, మనస్సు, ఆత్మలను కలిగి ఉన్నవారు అని వ్యవహరించవచ్చు. స్థూల, సూక్ష్మ, కారణ రూపాల దృష్ట్యా చూస్తే, ఈ మూడు రూపాలూ అందరిలోనూ, అన్ని జీవుల" లోనూ కనిపిస్తాయి. సూక్ష్మ శరీరమైన మనస్సు మధ్యస్థానములో ఉండి, ఎగువ, దిగువ భాగాల యొక్క సందేశాలను తేగలదు... తెస్తుంది కూడా! కాని సాధారణ మానవుని మనస్సుకూ, బుద్ధికి సంబంధించిన (అతని) ధ్యానసాధన కేవలమూ అతని శరీరము, మనస్సులపై మాత్రమే లగ్నమై ఉంటుంది కనుక, అతడు శారీరక, మానసిక క్షేత్రములు సరిహద్దులలోనే ఆగిపోతాడు. ఈ రెండుదశలకే పరిమితమైపోతాడు.

కాబట్టి అతడి మనస్సు ఉన్నత స్థితులకు వెళ్ళినప్పటికీ, అక్కడ ఎలా నిలద్రొక్కుకుని ఉండాలో, ఆ స్థితిని ఎలా అదుపులో ఉంచుకోవాలో తెలియక, ఆ మనస్సు ఉన్నత స్థితికి చేరగానే, త్రోవతప్పినట్లు తెలుసుకొని, తననుతాను తెలియని స్థితిలో, మైమరచిన స్థితిలో క్రిందకు తిరిగి వచ్చేస్తుంది. అందువలన అటువంటి వ్యక్తి సుషుప్తి అనే "గాఢనిద్రావస్థ" గురించిగానీ, "ఆత్మ" ను గురించిన వివరం గానీ ఏ మాత్రమూ తెలుసుకోలేడు. కోరికలలో మునిగి తేలియాడే ప్రతి మనిషీ ఇరవైనాలుగ్గంటలూ, రేయింబవళ్ళూ, ఈ మూడు స్థితులనూ (స్వప్న, జాగృద, సుషుప్తి) అనుభవిస్తూనే ఉంటాడు కాని, మూడవ ఆవరణ అయిన "ఆత్మ" ను తెలుసుకోలేడు.

మొదట విత్తనమూ, ఆ తర్వాత వృక్షమూ ఉంటాయి. కారణ శరీరము విత్తనం కనుక అదే ప్రప్రథమంగా వస్తుంది. ఆత్మకు “జ్ఞానంతో పనిలేదు. ఆత్మయందు స్థిరత్వము, నిలకడ, పొందిక, సుఖము, శాంతీ ఉంటాయి. చాలామంది ఆత్మ స్థిరమైనదని నమ్మినప్పటికీ, దానినే జ్ఞానమని పిలుస్తారు. ఆత్మను జ్ఞానమని అనడం భావాన్ని వ్యక్తం చేయడంలో గల పొరపాటే తప్ప, మరేమీ కాదు.

'తమో' గుణంలోనూ, 'సత్వ' గుణంలోనూ చలనమనేది ఉండదు. మధ్యంతర స్థితి అయిన 'రజస్సు' లోనే కదలిక ఉంటుంది. మరి అటువంటప్పుడు కర్మ చేయుట అనేది తమోగుణము వలన ఏర్పడిన ఈ స్థూల శరీరం యొక్క ధర్మము అని ఎందుకు అంటారు? కర్మ అనేది చలనంలోనే ఉంటుంది. మరి స్మృతి లేనట్టి జడత్వస్థితిలో చలనముండుటకు వీలులేదు.

“కర్మ, “జ్ఞానము” అనేవి రెండూ మనస్సులోనే ఉంటాయి. అవి సూక్ష్మ శరీరం యొక్క లక్షణాలు. నిజం చెప్పాలంటే కర్మా, జ్ఞానమూ మరియూ ఈ రెండింటి యొక్క ఉద్దేశ్యము అయిన ఆనందమూ  ఈ మూడునూ రజోగుణం వలన ఏర్పడిన మనస్సుయొక్క లక్షణాలు.

కర్మ, జ్ఞానము, ఆనందము ఈ మూడూ మధ్యస్థముగా ఉండే దశలు; అవి మనస్సు యొక్క లక్షణాలు. అట్టడుగున ఉండేది కర్మ పైన చిట్టచివరిన ఉండేది ఆనందము; ఈ రెండింటి మధ్యగా ఉండేది జ్ఞానము. - వీటి మధ్య గల తేడా కేవలం ఇదే. అదేవిధంగా స్థూల శరీరము అట్టడుగున ఉంటుంది. కారణ శరీరము అన్నింటికంటే పైన ఉంటుంది. సూక్ష్మ శరీరము ఈ రెండింటి మధ్యలో ఉంటుంది. “కర్మ”, భావమును తెలియపరుస్తుంది. ఇది బయటకు వ్యక్తమయ్యే చలనము. ఆనందమూ, సౌఖ్యమూ, సమాధానమూ అనేవి నిశ్చలమైనవి. జ్ఞానదశకు చెందిన ఆలోచనా, అవగాహనలు మధ్యంతర స్థితికి చెందినవి.

రెండింటి కలయిక వలన, ఆ రెండింటి లక్షణాలు కలిసి ఉన్న మూడవది ఏర్పడుతుంది. అలా కలసిన ఈ మిశ్రమమూ, కలయికా, మనస్సులో ఉండే ఒక మానసిక స్థితిని తెలుపుతుంది. జ్ఞానమూ, విచక్షణా, పర్యవసాన నిర్ణయమూ - ఇవి పై చెప్పిన స్థితికి లోబడి ఉంటాయి.

ఒకే వస్తువు ఉన్నప్పుడు, దానిని కదలించాలనే ఉద్దేశ్యం ఏర్పడదు. అది వేరు అనే భావన కూడా కలుగదు. అక్కడ సంకలన, వ్యవకలన, అభివృద్ధి, విభజన ఏవీ కూడా ఉండవు. ఎప్పుడైతే వస్తువు ఒకటిగా ఉంటుందో అప్పుడు జ్ఞానము, చర్య, ఆనందమనేవి ఎక్కడ ఉంటాయి? ఎక్కడైతే

ఒక్కటి కాకుండా రెండు విషయములు ఉంటాయో, అప్పుడు ఏకత్వం నుండి భిన్నత్వము బయలుదేరుతుంది. అంటే, ఆ రెండింటి కలయిక వలనా, మూడవ స్థితి ఏర్పడి; మరి దానితోబాటు - ఇదీ-అదీ; నీవూ - నేనూ; మొదలైన పరస్పర భేదములు కూడా ఉత్పన్నమౌతాయి. రెండు విషయాలు కలసినప్పుడు, వాటి కలయికకు సూత్రమైన ఆ 'ముడి' మధ్యలో ఉంటుంది. దానికి పై చివరలో ఒక విషయమూ, క్రింది కొసలో రెండవ విషయమూ ఉంటాయి. ముడి వేసుకొని, మధ్యస్థముగా ఉండేది మనస్సే. దానికి ఒక చివర ఉచ్చతరమైన "చైతన్యస్థితీ", మరి రెండవ చివర "జడత్వమూ" లేదా అచేతన స్థితి అని పిలువబడే స్థితీ ఉంటాయి. మనస్సు ఈ రెండింటి ఛాయలనూ, వాటి ప్రభావాలనూ తనలోనికి గ్రహిస్తుంది. అందువలన అది చైతన్యమూ - జడత్వమూ కలిసిన గ్రంథిగా తయారగుటతోబాటు, ఏ విషయాన్నయినా ఆలోచించి అర్థం చేసుకోడం మనస్సుకు తప్పనిసరి అవుతుంది. ఇది దాని విశేషధర్మం. కొన్నిసార్లు పైకివెళ్ళి, కొన్నిసార్లు క్రిందకు వచ్చి, మరికొన్నిసార్లు మధ్యన అచేతన స్థితిలో అది ఉండిపోతుంది. ఈ మూడూ కూడా దాని సహజ స్వభావాలే!

తల పైభాగంలోనూ, కాళ్ళు క్రింది భాగంలోనూ ఉంటాయి. మనస్సు మధ్యభాగంలోనే ఉండి ఆ రెండింటికీ కదలికలను కలుగజేస్తుంది. 'సత్వము" పై స్థానంలోనూ, "తమస్సు" క్రింది భాగంలోనూ ఉంటాయి. మనస్సు (రజోగుణము) మధ్యలో ఉండి, ఆ రెండింటిలో చలనాన్ని కలుగజేస్తూ, వాటికి పనిని కల్పిస్తూ, తన పనిని తాను చేసుకుంటూ పోతుంది.

మొదటి స్థితి కర్మ (చర్య), రెండవస్థితి జ్ఞానము (అర్థం చేసుకొనుట) మూడవస్థితి ఆనందము. ఈ మూడు స్థితులలోనూ, మనస్సు తిరుగాడుతూ వాటి ఫలితాలైన కదలిక, అర్థం చేసుకొనుట, స్థిరత్వము అనే పరిణామాలకు దారితీస్తుంది. కదలిక అనేది కర్మ. అర్థం చేసుకోవడమే జ్ఞానము. స్థిరత్వమే ఆనందము. ఈ మూడింటిలో జ్ఞానము అనేది మిశ్రితమైన మధ్యంతర స్థితి. మనస్సూ, స్థూల శరీరమూ, భిన్నత్వము యొక్క క్షేత్రములలో అనేకత్వమనే స్థితితో మెలగుతూ, లోక వ్యవహారాలన్నింటినీ తెలివితేటలతోనూ, వివక్షతతోనూ నడుపుకునేవాడు కేవలం 'అజ్ఞాని' మాత్రమే. భిన్నత్వములో (అనేకత్వము) మునిగి ఉన్నవాడు 'అజ్ఞాని'. ఏకత్వమునందు మునిగి ఉన్నవాడు 'జ్ఞాని' - ఆధ్యాత్మిక జ్ఞానం కలవాడు.

ఎవడైతే స్థూల శరీరము, మరియూ మనస్సు యొక్క మంచీ-చెడ్డా, పుణ్యమూ-పాపమూ మొదలైన పరస్పర వ్యతిరేక ద్వంద్వ భావముల యొక్క కార్య క్షేత్రములందుండి, దానిలో లీనమై

లేదా దానివైపు మొగ్గుచూపి, తన కార్యకలాపాలను నెరవేర్చుకుంటూ ఉంటాడో, అటువంటివాడు "అజ్ఞాని". ఎవరైతే స్థూల శరీరమూ, మనస్సుల యొక్క క్షేత్రాన్ని విడిచిపెట్టి, కారణ శరీరమనే ఆత్మతో తన హృదయాన్ని అనుసంధానం చేసుకుని, ఆ ఆత్మలోని సుఖసంతోషాలూ, ఆనందానుభూతీ, స్థిత ప్రజ్ఞస్థితిలో తేలియాడుచున్నవాడూ లేదా ఆ స్థితివైపు మొగ్గు చూపుతున్నవాడూ - అసలైన "జ్ఞాని" అవుతాడు. ఆతడు ఆధ్యాత్మిక పరిజ్ఞానాన్ని కలిగి ఉంటాడు.

అజ్ఞాని అయినా, జ్ఞాని అయినా శరీర క్షేత్రాన్ని లేదా భౌతిక స్థాయినీ దాటి పైకి ఎదగలేడు. ఆ ఇద్దరూ కూడా భౌతికస్థాయిలోనే ఉన్నారు. కాకపోతే వారి మధ్య గల వ్యత్యాసం ఏమిటంటే, ఒకడు భిన్నత్వ భావానికి లోనైతే, ఇంకొకడు ఏకత్వ భావానికి అధీనుడు. ఒకడు తన ఆత్మలో (అంతరంగం) ప్రశాంతతనూ, స్థిరత్వాన్ని కనుగొంటే, మరొకడు తన శరీరంలోనూ, భౌతికమైన శారీరక అవయవాలలోనూ, అవి చేసే పనులలోనూ ఆనందాన్ని అనుభవిస్తున్నాడు.

స్వచ్ఛమైన ప్రశాంతత, స్థిరత్వము అంటే ఏమిటో ఆ ఇద్దరిలో ఏ ఒక్కనికి తెలియదు. ఎందువల్లనంటే, అజ్ఞాని కర్మ ద్వారానూ, జ్ఞానం ద్వారానూ అనేకత్వాన్ని ప్రేమిస్తూ, ప్రతిదినమూ ఏకత్వమనే పరిధిలోనికి వస్తూ ఉంటాడు. జ్ఞాని ఏకత్వభావాన్ని ప్రేమించినా, అనేకత్వ భావ స్థాయికి దిగజారక తప్పదు.

జ్ఞాని తన శరీరాన్ని విడనాడనూలేడు. అజ్ఞానికి ఆత్మానంద అనుభవం లభించకాపోదు. ఆ ఇద్దరూ ఒకలాంటి వారే. కాకపోతే 'అజ్ఞాని' స్థితితో 'జ్ఞాని' యొక్క స్థితిని పోల్చి చూస్తే జ్ఞాని యొక్క స్థితి కొంచెం మెరుగనిపిస్తుంది. ఎందుకంటే 'స్థూల శరీరము' అనేకత్వ భావానికి క్షేత్రము. 'ఆత్మ' ఏకత్వ భావానికి ఆలవాలము. అనేకత్వమంటే, తెలివి- మెలకువలు ఉన్నట్టి స్థితి. ఏకత్వము అనేది గాఢ నిద్ర (సుషుప్తి) స్థితి. ఈ రెండు కూడా శరీరములే (ఆవరణములే). మెలకువ స్థితిలో తన కార్యాలను తాను చేసుకుపోతూ కూడా, గాఢనిద్ర లోనికి వెళ్ళని అజ్ఞాని ఎవ్వడూ ఉండడు. అలాగే, ఎల్లప్పుడూ సుషుప్తి అవస్థలో ఉంటూకూడా మెలకువ స్థితిలోనికి దిగి రానటువంటి జ్ఞాని కూడా ఎవ్వడూ ఉండడు. మరోవిధంగా చెప్పాలంటే, సంకోచమూ – వ్యాకోచమూ అంటే ముడుచుకోవడం, విస్తరించడం అనేవి హరిద్దరిలోనూ కన్పిస్తాయి. ఉన్న వ్యత్యాసం ఒక్కటే. అనేకత్వ భావం ఉన్నప్పుడు, ఏకత్వ భావం కలుగదు.

అదేవిధంగా ఏకత్వము ఉన్నప్పుడు అనేకత్వమూ ఉండదు. అయినా ఆ ఇద్దరూ కూడా అత్యున్నతమైన స్థితులకు ఎదగవలసినవారే. నీటిలో మునిగినవాడు ఊపిరి బిగబట్టి కొంతసేపు నీటిలో ఉండగలుగుతాడు. కాని కొంతసేపు గడిచాక, నీరు వానిని పైకి నెట్టి, వెలుపలకు పంపిస్తుంది. జ్ఞానీ, అజ్ఞానీ - ఈ ఇరువురూ తమ తమ స్థితిలో మునిగి ఉన్నవారే. ఒకడు జాగ్రత్తగా మునుగుతాడు, రెండవవాడు దానికి భిన్నంగా ఉంటాడు. ఉన్న భేదమంతా, ఏకత్వము - అనేకత్వము మాత్రమే. అనేకత్వము కేవలం ప్రపంచంలోనే కన్పిస్తుంది. ఉదాహరణకు, ఒక వ్యక్తికి ఉన్న రూపురేఖలు మరొకనికి ఉండవు. అదేవిధంగా జాగృదావస్థలో నున్న ఒకని భౌతిక స్థితికీ, మరొకని భౌతిక స్థితికీ భేదముంటుంది. అందరూ వేర్వేరుగా కనబడి, ఒకనికీ, ఇంకొకనికీ పోలిక లేనట్లు కనబడుతుంది. అయినప్పటికీ, గాఢ నిద్రావస్థలో, అనగా ఆత్మ యొక్క స్థితిలో ఏకత్వగుణము ఉంది. అక్కడ అన్నీ ఒకే మోస్తరుగా ఉంటాయి. ఆ స్థితిలో గొప్పా - బీదా; రాజా- పేదా, చక్రవర్తీ-సామాన్యుడూ అనే వివక్షత లేకుండా, అందరూ ఒక్కటే అవుతారు.

శరీరంలో స్థూల శరీర ధోరణి గల వ్యక్తుల దృష్టి వారి శరీరం మీదా, వాటి అంగాల మీదా ఉంటుంది. అలాగే, ఆత్మలో ఆధ్యాత్మికత పట్ల ఆకాంక్ష గల వానికి, ఆతడి లక్ష్యం ఆత్మ మీదనే ఉంటుంది. కానీ అందులో చూచేవాడు, చూడబడేది, దృష్టి అనే ఈ మూడూ విడివిడిగా ఉన్న స్థితి ఉండదు. ఏది ఏమైనా, ఆత్మలో ఉండే స్థితి ఎటువంటిదైనా, అది ఒక్కగానొక్కటై ఉంటుంది. అక్కడ ఆ స్థితికి సంబంధించిన జ్ఞానం కూడా ఉండదు. అలాగున లేకుంటే, ద్వంద్వత్వ దోషం మెల్లమెల్లగా ఆత్మలోనికి చొరబడుతుంది. శరీరంలో అన్నీ వున్నాయి. వ్రేళ్ళు, మ్రాను, శాఖలు, ఆకులు, పువ్వులు, పళ్ళు మొదలైనవి. పండులో అనేక పొరలకు అట్టడుగున, విత్తనం దాగి ఉంటుంది. అలాగే ఆత్మలో విత్తనం మాత్రమే ఉంది. దాని బయట వ్రేళ్ళూ, మ్రాను, కొమ్మలు, ఆకులు, పువ్వులు, ఇవన్నీ కప్పబడి, ముడుచుకొని ఉన్న స్థితిలో పైన ఉంటాయి. తన ఆత్మ వల్లనే శరీరము తననుతాను ఎల్లప్పుడూ వ్యక్తీకరించుకోగలదు. వృద్ధి చెందగలదు. అదేవిధంగా శరీరం వలన ఆత్మ, చెట్టునుండి విత్తు, విత్తు నుండి చెట్టూ ఎడతెగక ఒకదాని నుండి మరొకటి ఎలా పుడుతూ ఉంటాయో, ఇవి (ఆత్మ, శరీరం) కూడా సరస్పరం వ్యక్తమవుతూ వృద్ధి చెందుతాయి.

జ్ఞానం లేనివాడు ఆకులనూ, పువ్వులనూ లెక్కబెడతాడు. ఆ తర్వాత పండును తింటే తింటాడు లేకుంటే లేదు. జ్ఞానం ఉన్నవాడు ఈ అనవసర వివరాలన్నింటి జోలికీ పోక, నేరుగా పండును ఆరగించడమే ధ్యేయంగా పెట్టుకుంటాడు. అజ్ఞాని అయినవాడు బాగుగా

చదువుకున్నవాడూ, పండితుడు కాబట్టి, కాకతాళీయంగా భగవద్గీత ఆతని చేతికి చిక్కినప్పుడు, ఆతడు దానిని పరీక్షించి, పరిశీలించి, దాని రచయిత యొక్క వివరాలు తెలుసుకోవడం లాంటి పనికిమాలిన పనులకు పూనుకుంటాడు.

నిజం చెప్పాలంటే, మనస్సుకు అచేతనత్వమూ, చంచలతా, అజ్ఞానమూ అనే మూడు స్థితులు ఉన్నాయి. మూడు శరీరాలూ మూడు ఆవరణలు అయినందువలన ఈ స్థితులు ఏర్పడ్డాయి.

**మొదటిది:** ఇంద్రియాలూ ఇతర వివిధ అంగాలతో కూడి ఉన్న స్థూల శరీరము - ఇది చేతనా రహితంగానూ, దట్టంగానూ, చీకటిగానూ బయటకు వ్యక్తమౌతుంది.

**రెండవది:** 'ఆత్మ' అనబడే కారణ శరీరము, దీనిలో ప్రకాశం (వెలుతురు) బాగుగా ఉన్నప్పటికీ, ఇది కూడా చలనములేనిదే. ఏమీ తెలియని స్థితికి మూలకారణం ఇదే.

**ఇక మూడవది:** సూక్ష్మ శరీరమనే మనస్సు. ఇది స్థూల, కారణశరీరాల మధ్యన ఉంటుంది. దీనిలో చలనం ఉంది. ఇది తన చలనము ద్వారా జడత్వస్థితికీ, అజ్ఞాన స్థితికీ చలనాన్ని కలుగజేస్తుంది.

వ్యక్తికి మూడు గోళాకార మండలాలు ఉన్నాయి. మొదటిది కాంతితో నిండి ఉన్న 'అజ్ఞాన మండలము' లేదా 'ఆత్మ మండలము. స్థూలస్థితి కూడా దీనిలో ఉంటుంది. రెండవ మండలము చీకటితో నిండి ఉంటుంది. దీనిని 'జడత్వము' అని అంటారు. ఇక మూడవ ఆవరణలో చీకటీ, కాంతీ - ఈ రెండూ ఉంటాయి. వెలుతురు పై భాగంలోనూ, చీకటి క్రింది భాగంలోనూ ఉంటుంది. ఇది ఆ చీకటి వెలుగుల రెండింటి ప్రభావాన్నీ, నీడలనూ, ఆకర్షణలనూ కలిగి ఉంటుంది. ఎందువల్లనంటే ఈ మధ్యంతర స్థితిలో, రెండింటి ప్రభావాలూ ప్రతిబింబిస్తాయి.

మొదటి భాగంలో వెలుతురూ, రెండవదానిలో చీకటీ మధ్యనున్న 'మూడవదానిలో చీకటి-వెలుగులు కలగలిసి ఉంటాయి. ఈ సృష్టి సమస్తమూ, బ్రహ్మాండమూ, చరాచర జగత్తు యావత్తూ అదే రూపాన్ని, అంటే త్రిగుణాత్మక రూపాన్ని కలిగి ఉంది. ఇక్కడ ఉన్న మనుష్యులు, జంతుజాలము, దేవతలు, భూమ్యాకాశాలు, సమస్తమూ అసమాన నిష్పత్తిలో సృష్టించబడ్డాయి. ఈ విషయం ఒక చిన్న చీమను చూసినా తెలుస్తుంది. ఎర్రచీమ అయినా, తెల్లచీమ (చెదపురుగు) అయినా వాటిల్లో ఈ మూడు ఆవరణలూ ప్రస్ఫుటంగా కనిపిస్తాయి.

'సృష్టి' అనే మాట సరియైనది కానప్పటికీ, అది మన భావాలను చక్కగా వ్యక్తం చేయగలదు. "బ్రహ్మాండము" అంటే సమస్త చరాచర విశ్వం అనే పదాన్ని 'సృష్టి' కి ఉపయోగిస్తారు. ఈ మూడు స్థితులూ (జడత్వ, చంచల, అజ్ఞాన) దానిలో కనిపిస్తాయి. దానిలో ఉండే సమస్త జీవరాసులూ వీటి (స్థూల, సూక్ష్మ, కారణ శరీరాల) సూక్ష్మ ప్రతులే. వాటి శరీరాలను గానీ, వాటి శరీర పరిమాణాల మొత్తాన్ని గానీ 'పిండము' లేదా ' జీవరాశి' అని గానీ పిలుస్తారు. ఈ "పిండము" సమస్త చరాచర విశ్వము అయిన 'బ్రహ్మాండా"నికి ప్రతి. "బ్రహ్మాండము" నందున్న అన్ని ధర్మాలూ, లక్షణాలూ 'పిండము'లో కూడా ఉంటాయి. చీమ, చెదపురుగుల ఉదాహరణలో చెప్పుకున్నట్లుగా అవి చిన్నవై ఉంటాయి. ఈ భూమికి సంబంధించిన మొట్టమొదటి "వెలుగు వలయము' ఉత్తర ధృవం అయిన ఆర్కిటిక్ ప్రాంతము. రెండవది అయన "చీకటి వలయం దక్షిణ ధృవమైన అంటార్కిటిక్ ప్రాంతము. హిందువులు ఒక్క మరణ సమయంలో తప్ప దక్షిణంవైపుకు కాళ్ళు చాచి ఎప్పుడూ నిద్రపోరు.

ఆ'కాంతి వలయం' అజ్ఞానులకు, ఆధ్యాత్మికులకు చెందినది. 'చీకటి వలయం' మూర్ఖులకు, భౌతికవాదులకు చెందినది. మధ్యలోనున్న చీకటి వెలుగులు కలిసి ఉన్న వలయం మధ్యస్థాయి వారికీ, చంచలమైన మనస్సు గల వారికీ చెందినది. పైన "జీవుడూ", క్రింద పదార్థమూ, మధ్యలో ఈ రెండింటి కలయిక అయిన మనస్సూ ఉంటాయి.

మనస్సు అనేది, ఇవన్నీ కలగలిసిన స్థితిలో ఉన్న శరీరాన్ని ధరించి, పై నుండీ - క్రిందినుండీ, వాటి వాటి ముద్రలనూ, ఆకర్షణలనూ గ్రహిస్తుంది. ఈ కారణంగా దానికి చలనము ఏర్పడుతుంది. ఈ చలనం కారణంగా దానికి అస్థిర మనస్తత్వము కలిగి, 'చంచలమైనది' అని అనిపించుకుంటుంది.

అది మధ్యనున్న ప్రదేశంలో ఉండి, మిశ్రమ స్థితిని పొంది ఉండడం వలన, ఆయా స్థితుల యొక్క సహజ ప్రవృత్తులను పొందుతుంది. ఇవి సామీప్యత, సారూప్యత, సఖ్యతలను ప్రభావితం చేస్తాయి. కనుక ఇది (మనస్సు) అధోముఖంగా అంటే ముఖాన్ని క్రిందికి దించి చూస్తూ ఉన్నట్లయితే, ఆయా ప్రభావాలను సంతరించుకుని, చంచల స్వభావాన్ని పొంది, మూర్ఖత్వంతో మతిమాలిన పనులు చేస్తూ ఉంటుంది. అప్పుడది " క్రియాశీలుడు" అంటే పనిలో నిమగ్నమైన కార్యకర్త అనిపించుకుని శరీరాన్ని ధరిస్తుంది.

అదేవిధంగా అది ఊర్ధ్వముఖమై, పైకి కారణ శరీరమని పిలువబడే ఆత్మ వైపునకు మళ్ళినపుడు, దాని లక్షణమైన 'ఆధ్యాత్మికత్వాన్ని' పుణికి పుచ్చుకొని నిరాకారతను పొంది ఆధ్యాత్మికమౌతుంది. 'జీవుడు' లేదా 'ఆత్మ'లో అజ్ఞానము, మూఢత్వమూ ఉన్నాయి. అందువలన దానితో సారూప్యత చెంది 'అజ్ఞాని" అనిపించుకుంటుంది.

ఇక మిగిలినది మూడవది అయిన 'మనస్సు యొక్క నిజస్థితి'. ఈ సందర్భంలో మనము జ్ఞాపకం ఉంచుకోవలసిన విషయం: చీకటి వెలుగుల మిశ్రమ స్థితి చెందినందువలన, అది నిజస్థితిలో ఉన్నప్పుడు, ఈ రెండు వలయాల ప్రభావం యొక్క కారణంగా, చలనమూ - కదలికా పొందుతుంది అనేది మనం గుర్తుంచుకోవాలి. ఈ విశేష పరిస్థితులలో అది చంచలమై, నిలకడ లేనిదైపోతుంది. దానిని ఆ విధంగానే, అంటే చంచల మనస్సు అని పిలుస్తారు.

“ఆత్మ” ను, “అజ్ఞాని" అనడానికి ప్రపంచంలోని వారందరూ జంకుతారెందుకు? ఎందరో విజ్ఞానవంతులు, ఋషులు, మునులు, ప్రవక్తలు, భక్తులు ఎందరెందరో ఈ ప్రపంచంలోనికి ఇంతవరకూ వచ్చారు. కాని వారిలో ఏ ఒక్కరూ కూడా “ఆత్మ”ను, “అజ్ఞాని" అని అనలేదు. ఎందువలనంటే:-

1. ఎన్నాళ్ళనుండో పారంపర్యంగా వచ్చే ఆలోచనను వదలి, ఎందరో అనుసరించిన మార్గాన్ని వదలి, వేరొక మార్గాన్ని అనుసరించాలంటే, వీరంతా ప్రాణం పోయినట్లే భావిస్తారు!

2. ఏదైనా ఒక క్రొత్త విషయాన్ని ఎవరైనా చెప్పాలనుకున్నప్పటికీ, అపకీర్తి కలుగుతుందేమోనని వెనక్కి జంకేవారు. సాంఘిక, మత వర్గాలను విడచి బయటకు వచ్చే సాహసం చేసేవారు కాదు. వారు స్వజాతి, మతము, సమాజమునందు చెడ్డపేరు వచ్చుటే, అన్నింటినీ మించిన విపత్తుగా భావించేవారు.

3. అందరూ అదేమాట చెప్పారనడానికి ఏమాత్రం సందేహం లేదు. అయితే ఆ మాటను బాహాటంగా ఎవ్వరూ అనలేదు. ఎవ్వరూ కూడా ఆత్మ నిజస్థితి మీదున్న ముసుగును తొలగించలేదు. అది ఏదో ఒక అతీంద్రియ శక్తి అనీ, పరమ రహస్యము అనీ ముసుగువేసి "సత్యాన్ని” మరుగు పరచారు. ఒకవేళ సూచనప్రాయంగా, చూచాయగా దీనిని గురించి చెప్పినా, అది వారి వారి ఆంతరంగికులైన ఏ కొద్దిమందికో, పరిమితమైన సమాజానికో చెప్పేవారు. ఆత్మను గురించిన అసలు విషయాన్ని అర్థం చేసుకున్నవారూ దానిని పొగిడారు; అర్థం కానివారూ దానిని పొగిడారు.

4. మానవుని మనస్సు ఎంతో ఎత్తుకు ఎదగాలనీ, తద్వారా వాని హృదయమెంతో ఉదారమైనదీ, విశాలమైనదీ కావాలనీ భావించి, దానికి అనుగుణమైన ఆచరణలనూ, ధ్యాన పద్ధతులనూ వాడుకలోనికి తెచ్చారు. పుణ్య పురుషులు, పావన చరితులు అయినవారితో సాంగత్యము చాలా అవసరమని అనుకునేవారు. అట్టి పరిస్థితుల ప్రకారం నడచుకొనినవాడు తనకు తానే సత్యమును తెలుసుకొనుట సంభవము కావచ్చుననేది వారి ఊహ. కాని అయితే సత్యము అంటే ఏమిటో, అది ఎటువంటిదో స్పష్టంగా తెలియపరచే వ్యాఖ్యానాన్ని చేయలేదు. ఏవేవో నీతి కథలూ, సామెతలకే వారి మనస్సును పరిమితం చేసారు. కానీ, అనుమానం, భయం ఉన్నచోట సత్యతత్వం గురించిన అవగాహన కలగడం అసంభవము.

ఏ విషయాన్ని గురించైనా ఏమీ తెలియకపోవడం అజ్ఞాన మనిపించుకుంటుంది. తెలుసుకోడం జ్ఞాన సముపార్జన. ఇది "మనస్సు" యొక్క విధి. అది మధ్యంతర స్థితిలో ఉంటుంది. అది ఒక మిశ్రమమైన స్థితి. ఎక్కడైతే ఈ కలగలుపు, మిశ్రమం ఉంటుందో, అక్కడ వేరు వేరు తరహాలకు చెందిన తేడాలు ఏర్పడతాయి. ఒక్కగానొక్క విషయమే ఉన్నప్పుడు, అక్కడ ఆలోచనలకూ, మననం చెయ్యడానికి ఆస్కారము, అవసరము ఎలా ఉంటాయి? ఆత్మ, పదార్థము అనే ఈ రెండింటికీ తెలుసుకొనే గుణం లేదు. ఒకవేళ ఈ లక్షణాన్ని కలిగి ఉన్నా, అది బీజరూపంలోనే ఉంటుంది. పైన ఉన్న మనస్సు దానిని ఛేదించుకుని, లోపలికి ప్రవేశించి తెలుసుకోగలదు. ఆత్మలో నిశ్చలతా, ఏకత్వమూ ఉన్నాయి. దీనినే ఇక్కడ "కారణ శరీరం" అని అంటాము. మనస్సు ఆత్మవైపు మ్రొగ్గితే, దాని లక్షణాలను (ముద్రలు) పుణికిపుచ్చుకుని, దానిలాగే తయారౌతుంది.

ప్రతిరోజు గాఢనిద్ర, తురీయావస్థలోనికి నువ్వు వెళుతూ ఉంటావు. అక్కడ నీకు తెలిసిందేమిటి? ఏమీలేదు. ఇది ప్రతిరోజు నీకు కలిగే అనుభవమే, కానీ, గాఢనిద్ర నుండి మేల్కొన్న తరువాత మనస్సుకు 'తాను ఉన్నాను' అన్న సంగతి జ్ఞాపకం వస్తుంది. దానికి కారణమేమిటంటే - మనస్సు ఈ కలగలిసిన, మిశ్రిత ప్రభావాలనన్నింటినీ ముద్రల రూపంలో, తనతోబాటు తీసుకువస్తుంది. అది గాఢనిద్రలో ఉన్నప్పుడు నిస్సందేహంగా 'ఆత్మ' లో లీనం అయిపోతుంది.

కానీ, అది ఆ గాఢనిద్ర నుండి తిరిగి మేల్కొనినప్పుడు ఆ స్థితి యొక్క ముద్రలను భావరూపంలో వ్యక్తపరుస్తుంది. మరి అయితే ఆ భావము ఏమిటి? మైమరచి ఉన్నట్లు ఎరుక;

జ్ఞానశూన్యముగా ఉన్నట్లు అభిప్రాయపడుట మరియు 'అజ్ఞానములో ఉం' అనే జ్ఞానము! ఇది తప్పు, అది (మనస్సు) ఇంకేమి చెప్పగలదు? మనస్సును ప్రశ్నించు. దానంతట అదే, నీకు తెలియజేస్తుంది. పుస్తకాలు చదివి తెలుసుకున్న జ్ఞానమూ, ఇతరులు బోధించగా విని తెలుసుకున్న జ్ఞానముకంటే, స్వానుభవంద్వారా పొందిన జ్ఞానము, అది ఎంత కొద్దిపాటిది అయినప్పటికీ, ఎంతో మేలైనది.

ఏపైనా రెండు వస్తువులు కలసినప్పుడు, మూడవ స్థితి ఏర్పడుతుంది. అది ఈ రెండు వస్తువులద్వారా, తన వివేచనాశక్తి ద్వారా, తన పనిని నెరవేర్చుకుంటుంది. ఏదైనా ఒక పని జరుగుతున్నప్పుడు మనస్సులో ఈ మూడు వస్తువులూ ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. కాని, ఆత్మలో ఈ మూడు వస్తువులూ అజ్ఞానావస్థలో, బీజరూపంలో అడిగి ఉంటాయి. ఇవి అన్నీ ఒక్కటిగా ఉన్నట్లే కనిపిస్తాయి. గేదె పేడనూ, గాడిద మూత్రాన్నీ కలగలిపి, ఎండలో పెట్టు. దానిలోనుండి తేళ్ళు పుట్టుకొస్తాయి. అవి ఆ పేడలోనే పుట్టి ఆ పేడనే తింటూ, ఆ మూత్రాన్నే త్రాగుతూ ఉంటాయి. మనస్సు (బుద్ధి) కూడా అలాగే చేస్తుంది. నిజానికి మనస్సుతో సంబంధించి ఉండడమే వాస్తవంగా జీవునియొక్క విశేషం. మనస్సే లేనప్పుడు 'జీవుడు' మాత్రం ఎలా ఉంటాడు. మూడు రకాలైన శరీరాలతో కలగలిసి ఉన్న స్థితి మనస్సు. ఈ మనస్సు ఉన్నంతసేపూ జీవుడు కూడా ఉంటాడు. కాని మనస్సును మాత్రం 'జీవుడు' అని పిలవరు. శరీరము, మనస్సు, ఆత్మ - వీటి కలయికే “జీవుడు”. అంటే, శరీరమూ, ఆత్మా లేకపోతే, మనస్సు అనేదే ఉండదు. దానికి ప్రత్యేక అస్తిత్వము అంటూ ఒకటి లేదు. అవి రెండూ (ఆత్మ, శరీరము) కలిసినప్పుడే, దాని (మనస్సు) యొక్క అస్తిత్వము వ్యక్తమౌతుంది.

## జీవుడు – బ్రహ్మము

గుడ్డివాడు అంతులేని అద్భుతాన్ని చూస్తున్నాడు. మూగవాడు బ్రహ్మాండమైన భాష మాట్లాడగలుగుతున్నాడు. మాటకారి మూగబోతాడు.

నేనేమీ చూడలేదు, అయినా నేనన్నీ చూశాను! నేనేమీ వినలేదు, అయినా నేనన్నీ విన్నాను!

ప్రకృతి యొక్క అద్భుత విధానమిదే. ఈ సృష్టి యావత్తూ త్రిగుణాత్మకము అంటే మూడు సహజ లక్షణాలైన 'సత్వ', 'రజ', 'స్తమో' గుణాలతో ఏర్పడినది.

'తమస్సు' లో' ఉనికి (నేను ఉన్నాను) వ్యక్తమవడం, అస్తిత్వము ఉన్నాయి.

'సత్వము'లో తిరోగమనము, అంతర్లీనము, క్షీణించుట, విలయము (నాశనము) ఉన్నాయి. అయితే అంతర్లీనంగా ఉండడం, క్షీణించడం అనే మాటలకు అస్తిత్వ శూన్యత (ఉనికి లేదనుట) అని ఎంతమాత్రమూ, ఎన్నటికీ పొరపడరాదు. అవి కేవలము అస్తిత్వమును తిరిగి లోనికి తీసుకొనెడి ఒక స్థితి మాత్రమే. తిరుగుదల లేదా క్షీణత అనేది అస్తిత్వ శూన్యత కాదు. అది ఒక స్థితి; వెనుకంజ వేసిన ఒకానొక పరిస్థితి. వెనుకకు వెళ్ళడం, క్షీణించడం అంటే, 'లేకపోవడము' అని దాని అర్థం కాదు.

వ్యక్తీకరణము (ప్రకటించబడుట), ఉపసంహారణ, అస్తిత్వము (ఉండుట) - అస్తిత్వము లేకపోవుట - ఈ స్థితులన్నింటికీ మిశ్రమ స్థితి అయిన 'రజో' గుణము సాక్షిగా ఉంటుంది. ఈ 'రజస్సు' అనేది సత్వ, తమస్సులతో కూడిన గ్రంథి. జడచైతన్యముల సంయుక్త స్థితి, జడచైతన్య గ్రంథి.

'తమస్సు' పదార్థము, 'సత్వము' ఆత్మ, 'రజస్సు' మనస్సు. ఈ స్థితి 'పిండాండము', 'బ్రహ్మాండము' అనే రెండింటిలోనూ ఉంటుంది.

ఆ రెండు ప్రదేశాల్లోనూ ఇదే దృశ్యము కనిపిస్తుంది. ఎలాగైతే మనము జాగృదవస్థలో మెలకువతో ఉండి, స్వప్నావస్థలో కలలుకంటూ, తురీయావస్థలో తిరోగమిస్తూ ఉంటామో, సరిగ్గా అదేవిధంగా ఇటువంటి ప్రక్రియలే చేస్తూ, ఇలాగే నిమగ్నమై ఉండే వేరొక ప్రపంచం ఉనికి ఉంది. అది చాలా పెద్దది. అదే 'విరాట్ అస్తిత్వము', ఋషులు, మునులు దీనిని 'విరాట్ అస్తిత్వము అనీ, 'బ్రహ్మము' అనీ, బృహత్తరమైన ఉనికి అనీ అంటారు. 'సూఫీ'లు దీనిని "ఖుదా-ఇ-అజీమ్" అనేవారు. పైన చెప్పిన ఈ రెండింటికీ గల తేడా, వాటి శరీరంలోనూ, పరిమాణంలోనూ, వైశాల్యంలోనూ ఉంటుంది. ఇక్కడ 'జీవుడు' అనేమాట బ్రహ్మమునకు వాడరాదు. 'జీవుడు' బ్రహ్మమునకు సూక్ష్మ ప్రతిరూపము మాత్రమే. 'విరాట్ అస్తిత్వము' కూడా మనస్సే, అంటే జడ చైతన్యములు కలిసిన గ్రంథే. ఈ విషయాన్ని స్పష్టంగా విప్పి చెప్పడానికి ప్రజలు ఎందుకో జంకుతారు.

విశాలసృష్టి అయిన బ్రహ్మము:

1. జడ, చేతన గ్రంథి,

2. సత్వ, రజ, స్తమో గుణాలు కలిగిన స్థితి,

3. దానికి కూడా మనలాగే, జాగృదావస్థ స్వప్నావస్థ, తురీయావస్థలు ఉంటాయి.

4. అది కూడా మనలాగే ప్రవర్తిస్తుంది.

5. అది చాలా విశాలమైనది, పెద్దది. మనం దానిముందు అల్పులం. చాలా చిన్నవాళ్ళం.

6. అది అంతులేనిది, అన్నీ తెలిసినది, అన్నిచోట్లా ఉండే సర్వాంతర్యామి. అన్నిచోట్లా వ్యాపించి ఉండే సర్వ వ్యాపకము.

మనలో కూడా ఈ లక్షణాలన్నీ, అతి చిన్న ప్రమాణంలో, అతి స్వల్పంగా ఉన్నాయి. బ్రహ్మమునకూ మనకూ గల తేడా ఇదే. మనము వ్యక్తిగతమైన ఆత్మ, 'జీవుడు' అయితే ఆతడేమో సర్వాంతర్యామి అయిన 'బ్రహ్మము'. పూర్వకాలంలో ఋషులు దాని అర్థాన్ని పూర్తిగా, వివరంగా అవగాహన చేసుకుని, ఆ పరమ పురుషునికి ఆ పేరు పెట్టారు. " బ్రహ్మన్' అనే మాట యొక్క అర్థాన్ని ఒక క్షణంసేపు ఆలోచించండి. 'మన్' - అంటే మహామనస్సు. మహామనస్సు ఉన్నవాడు 'బృహత్' + 'మన్' 'బ్రహ్మము'. సూఫీలు సృష్టికర్తను బ్రహ్మమనే పేరుతో పిలువలేదు. ఇంకొక మంచిపేరు కనిపించక, ఆ పరమ పురుషుణ్ణి 'ఖుదా-ఇ-అజమ్' అని సంబోధించేవారు. అయినా వీరు కూడా సూక్ష్మబుద్ధి గలవారగుటవలన, దీని అర్థాన్ని సవ్యంగానే గ్రహించారు. 'మనస్సు' మాత్రమే ఆలోచించగలదు. కాని 'బ్రహ్మము' అంటే పెద్దది, విశాలమైనది, విరాట్ స్వరూపంగా వృద్ధి చెందగలిగినదీ అని అర్థం. కాలక్రమేణా దాని అర్థంలో ఈ మార్పు వచ్చింది.

కనుక 'బ్రహ్మము' విశ్వాత్మ. "జీవుడు" వ్యక్తిగత 'ఆత్మ'. అది దైవ సంబంధమైనదీ, పరలోక సంబంధమైనదీ అయిన మనస్సు. ఇది ఇహలోకానికి సంబంధించిన లౌకిక మనస్సు. అది అన్నీ కలసిన మొత్తము అయితే, ఇవి వేర్వేరు ముక్కలుగా ఉన్నాయి. జీవుడు మూర్ఖుడు, అజ్ఞాని. జీవుడు జ్ఞానాన్ని పొందగలిగినప్పటికీ, చంచల స్వభావము కలవాడు. 'బ్రహ్మము" కూడా అజ్ఞాని, మూఢమతియే. అతడు జ్ఞాని అయి ఉండి, చంచల స్వభావము కలవాడు. ఈ లక్షణాలు ఆ విశ్వాత్మలో లేకపోయినట్లయితే, జీవాత్మలో కూడా ఉండవు.

'బ్రహ్మము' నకు కూడా మనవలెనే శరీరం ఉంటుంది. అతడిని పరమాత్మ అనీ, 'విశ్వ మనస్సు' అనీ అన్నప్పుడు అతడికి మనస్సే శరీరం అవుతుంది. మరి శరీర లక్షణాలు లేకుండా

ఎలా ఉండగలదు? నీ భౌతిక శరీరమే నీ స్థూల శరీరము, పదార్థమనే దృష్టితో చూస్తే, ఈ సృష్టి, ఈ విశ్వమూ అంతా, ఆ విశ్వాత్మ అయిన ' బ్రహ్మము' యొక్క శరీరమే. నీ మనస్సే నీ సూక్ష్మ శరీరము. ఈ విశాల విశ్వసృష్టికి సంబంధించిన సమస్త భావాల కలయికతో వచ్చిన గ్రంథి బ్రహ్మము యొక్క సూక్ష్మశరీరము. వాస్తవమైన విశ్రాంతికి స్థానము, బీజరూపంలోనున్న "ఆత్మ", నీ కారణ శరీరము. ఈ సువిశాల విశ్వానికంతటికీ మూలాధారమైనదీ, లేదా ' బ్రహ్మము' నందు లయావస్థ యొక్క బీజమూ అయిన అది, 'బ్రహ్మము' యొక్క కారణ శరీరం అయింది. ఇవే (జీవుడు - బ్రహ్మము) ఈ రెండింటి రూపాలు. వీటికి కూడా పేర్లు తప్పకుండా ఉండాలి.

స్థూల శరీరానికి సంబంధించిన “జీవుని” కి శాస్త్రాలలో "విశ్వ" అనే పేరు ఉంది. ఈ మాటకు 'సాంసారికము' లేదా 'నశ్వరము' - అంటే నాశనము అగునది అనే అర్థం స్ఫురిస్తుంది. సూక్ష్మశరీరానికి, లేదా మనస్సుకు సంబంధించిన జీవునికి శాస్త్రాల్లో “తైజస” అనే పేరు ఉంది. ఈ పేరు చంచలత్వాన్ని సూచిస్తుంది. కారణ శరీరానికి సంబంధించిన జీవుడికి, అంటే ఆత్మకు "ప్రజ్ఞ" అనేది శాస్త్రాల్లో ఉన్న పేరు. దానికి ఇంచుమించుగా సరిపోయిన అర్థం "ప్రశాంతి". ఈ సందర్భంలో "ప్రజ్ఞ" అనే మాటకు “జ్ఞానం” అనే అర్థం తీసుకోరాదు. ఎందుకంటే, ఆత్మ, లేదా కారణ శరీరానికి జ్ఞానం ఉండదు. మూడు విధాలయిన శరీరాలకు సంబంధించిన "జీవుడి” కి ఉన్న పేర్లు ఇవి. ఇప్పుడు బ్రహ్మము" నకు గల పేర్లను పరిశీలిద్దాం.

1. స్థూల శరీరానికి సంబంధించిన బ్రహ్మమును “విరాట్” అని శాస్త్రాలలో పిలుస్తారు. దీనికి "ఉచ్చైస్స్వరము” (ఉచ్చస్థాయిలో గల శబ్దము) అనే అర్థం స్ఫురిస్తుంది.

2. సూక్ష్మ శరీరానికి బ్రహ్మమునకు బ్రహ్మమునకు శాస్త్రాలలో "అవ్యకృతుడు" లేదా "అంతర్యామి" అనే పేరు ఉంది. 'అంతర్యామి' అనే మాటకు "అంతరంగ ప్రయాణం" అనే అర్థం వస్తుంది. "అవ్యాకృతము" అనే పదానికి అదృశ్యకర్త, కంటికి కన్పించకుండా తన పని చేసుకునేవాడు అనే భావం స్ఫురిస్తుంది. సంబంధించిన సంబంధించిన

3. కారణ శరీరానికి సంబంధించిన బ్రహ్మమును శాస్త్రాలలో "హిరణ్యగర్భ" అని అంటారు. దీనికి బంగారు గుడ్డు రూపంలో ప్రశాంతంగా, నిశ్చలంగా ఉన్నవాడు అనే అర్థం స్ఫురిస్తుంది. ఇక్కడ కూడా జ్ఞానాన్ని గురించిన ప్రస్తావన లేదు. ఇవి 'జీవుని' దృష్టిలో మూడు శరీరాలకు సంబంధించిన

'బ్రహ్మము' యొక్క పేర్లు. "విశ్వ హృదయము" అనగా సకల సృష్టికీ హృదయంగా పేర్కొనబడినదే “బ్రహ్మము". అదే విధంగా, జీవునికి హృదయంగా వర్తించేది ఆత్మయేనని గ్రహించాలి.

## అజ్ఞానము – జ్ఞానము

(వేదముల చివరలో వచ్చే వేదాంతంపై కొన్ని ఆలోచనలు)

ఎవడైతే, “జ్ఞానము” యొక్క అర్థాన్ని గానీ, ప్రయోజనాన్ని గానీ తెలుసుకోవాలనుకుంటాడో వాడు 'అజ్ఞాని'. వాడికి ఆ మాత్రమైన అవగాహన కూడా లేక పోయినట్లయితే, అతడిని 'అజ్ఞాని అనడానికి బదులు 'శుంఠ', 'మూఢుడు' అని పిలిచే వాళ్ళమే.

'అజ్ఞాని' అంటే కేవలం తెలివి లేనివాడనీ, లేదా అర్థం చేసుకోలేని వాడనీ అనుకోకూడదు. జ్ఞానం యొక్క అర్థమూ, ప్రయోజనమూ తెలియనివాడని దాని అర్థం. అటువంటివాడే జ్ఞానాన్ని పొందడానికి అర్హుడు. ఆకలిగా ఉన్నవానికి ఆహారము, దాహంగా ఉన్నవానికి నీళ్ళూ, రోగికి మందూ పొందే హక్కు ఎలా ఉంటుందో, అలాగే అజ్ఞానికి జ్ఞానాన్ని పొందే హక్కు కూడా ఉంది. వాస్తవానికి జ్ఞానమనేది అటువంటి వారికోసమే. ఆకలిగా ఉన్న వానికి కావలసింది ఆహారమే. అంతేగాని ఆహారాన్ని గురించిన జ్ఞానం కాదు. అతడికి విషయ పరిజ్ఞానం ఉంది. అదేవిధంగా అజ్ఞానికి జ్ఞానం యొక్క ప్రాథమిక అవగాహన ఉంది. అంటే జ్ఞానానికి సంబంధించిన మూల వస్తువు ఉంది. అయినప్పటికీ దానిలో జ్ఞానం వ్యక్తం కాలేదు.

'జ్ఞానము' అంటే మననము, చింతన, నిర్మలమైన విచక్షణ తప్ప ఇంకేమీ కాదు. వివిధ వస్తువుల, విషయాల మధ్య గల తారతమ్యాన్ని చూపించుట, అభిప్రాయ భేదములకు హద్దులు గీయుట, వివాదాంశములనూ, లేదా విశేషాంశములను నిర్ధారించుట - ఈ జ్ఞానమే కేవలం మనస్సు యొక్క సహజ తత్వము. “వివేకము” అంటే విచక్షణ. అంటే మంచి చెడ్డలను నిర్ధారించుకునే శక్తి. రెండు వేర్వేరు స్థితుల మధ్య మనస్సు నిలిచినప్పుడు, దానిలో ఆలోచనలు స్పందిస్తాయి. ఈ రెండు విభిన్న స్థితుల కలయిక (నచ్చిన భావాలను కలుపుట), వ్యత్యాసాల (నచ్చని భావాలను వేరుపరచుట) నడుమనున్న పరిధిలోనే ఆలోచనల స్థానం ఉంటుంది. ఆ పరిధి పైననే, అందులోనే నిలచి, మనస్సు ఆలోచిస్తుంది.

"జ్ఞాని" యొక్క లక్ష్యము ఆలోచించడము, ధ్యానంలో నిమగ్నమై ఉండడం, వివేకాన్ని కలిగి, విచక్షణ పాటించడం వరకు మాత్రమే పరిమితం కాదు. అదేగాక, అంతకుమించినది మరెంతో

ఉంది. ప్రతి పనికీ ఏదో ఒక ఫలితం ఉండి తీరుతుంది. ఫలితాన్ని, లేదా పర్యవసానాన్ని కలుగజేయని కార్యమంటూ ఏదీ ఉండదు. ఎవరైతే ఆలోచనాపరుడై, కేవలం వట్టి మాటలలో చిక్కుకొని, ఫలితం యొక్క లాభాన్ని పొందలేకపోతాడో అతడే అజ్ఞాని. అటువంటి అజ్ఞానుల సమూహంలో, ఆతడు ఎంత ఉన్నత స్థానాన్ని అలంకరించినప్పటికీ, ఆతడు 'అజ్ఞాని' మాత్రమే. ఏది ఏమైనప్పటికీ, అతడు జ్ఞానానికి ఎంతో దూరంలో ఉంటాడు. దానిని పొందలేడు. ఇటువంటి వారికి గల జ్ఞానాన్ని 'పుస్తక జ్ఞానం' అని అంటాము. దీనిని గురించి గొప్పగా చెప్పినప్పటికీ, ఇది వాస్తవానికి ఎందుకూ పనికిరానిది. వీరు గ్రంథాలను చదివి, మేధావుల ఉపన్యాసాలను విని, ఇతరులనుండి అరువు తెచ్చుకున్న అభిప్రాయాలను కేవలం ప్రదర్శించడంవరకే పరిమితమౌతారు. పెంపుడు చిలకలవలె వాటిని పదే పదే వల్లెవేస్తూ ఉంటారు. మాటల అర్థాన్ని గ్రహించి, ఆ అభిప్రాయాలను తమ స్వంతం చేసుకోవడానికి ప్రయత్నించరు.

కాని ఎవడైతే జ్ఞానం యొక్క ప్రయోజనాన్ని తెలుసుకుంటాడో, స్వానుభవం ద్వారా దానిని తన స్వంతం చేసుకుంటాడో ఆ జ్ఞానం పై ధ్యాస ఉంచి మననం చేస్తూ, తన దైనందిన జీవనంలో ఆ జ్ఞానాన్ని ఆచరణలో పెట్టి, దానిని సార్థకం చేసుకుంటాడో, ఆటువంటివాడి జ్ఞానమే అసలైన జ్ఞానము. జ్ఞానము ఒక ఆదర్శమూ కాదు, పరిపూర్ణత్వమూ కాదు, చేరుకోవలసిన లక్ష్యమూ కాదు. జ్ఞాని కొంతసేపు ఇటూ, కొంతసేపు అటూ రెండు స్థితుల మధ్య ఊగిసలాడుతూ ఉంటాడు. సంశయ స్థితిలో ఉన్నవానికి మనఃస్థిమితం ఉండదు. ఒకవిధంగా పోల్చి చూస్తే, అసలు జ్ఞాన స్వభావం అంటే ఏమిటో తెలియకుండా, నిత్యం పనులలోనే మునిగితేలుతూ ఉండే మూర్ఖుడు ఇటువంటి జ్ఞానులకంటే చాలామటుకు నయం అనిపిస్తుంది.

ఇహలోకంలోనూ, పరలోకంలోనూ జరిగే సంఘటనలు ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించేవిగా ఉంటాయి. ఈ లోకము అద్భుతాలకు ఆలవాలము. నీతి పాఠాలు నేర్చుకోవడానికి నిలయం.

“సత్సంగం” లోని సౌందర్యమూ, సత్సంగం యొక్క లక్ష్యమూ, ముఖ్య ప్రయోజనమూ మనస్సును విశాలం చేయడమే. అలా చేయడం వలన ప్రతి దానికీ, ప్రతి విషయానికీ దాని స్థానంలో దానికి ఇవ్వాల్సిన ప్రాముఖ్యతా, ఇతర విషయాలతో, వస్తువులతో కలిసి ఉన్నప్పుడు సందర్భానికి తగిన ప్రాముఖ్యతా అర్థమౌతాయి. దీనివలన అభ్యాసి తన గమ్యాన్ని; ధ్యేయాన్ని సులభంగా చేరుకోగలడు. ఇదంతా వివరించడంలోని ఆంతర్యం ఏమిటంటే, "జ్ఞాని”

అయినంతమాత్రాన లక్ష్యాన్ని చేరుకున్నట్లు కాదు. ఆనందాన్ని, సుఖాన్ని పొందడానికి జ్ఞానం చివరి దశ మాత్రమే అవుతుంది.

ఇప్పుడొక ప్రశ్న తలెత్తుతుంది. జ్ఞానము లక్ష్యసాధనలోని ఆఖరిఘట్టం కాకుండా కేవలం సంతోషాన్నీ, ఆనందాన్నీ పొందడానికి కావలసిన చిట్టచివరి సాధనము కనుక అయినట్లయితే, మరి 'స్వేచ్ఛ' గానీ, 'ముక్తి' గానీ ఆదర్శంగా తీసుకోతగినదా? చేరుకోవలసిన లక్ష్యంలోని ఒక అత్యున్నత స్థాయిగా దానిని పరిగణింపతగునా అనే ప్రశ్న కలుగుతుంది. జ్ఞానమే మనకు ఆనందాన్ని అందిస్తే, అది జ్ఞానం వలన కలిగిన ఫలితంగా భావించవచ్చు. అటువంటప్పుడు జ్ఞానమూ, కర్మా - ఈ రెండూ ఒకే కోవకు చెందినవి అవుతాయి. కర్మ వలన బహుమానమూ, దండనా కలుగుతాయని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. జ్ఞానమే ఆనందాన్ని కలుగజేస్తే, అది జ్ఞానము వలన కలిగిన బహుమతి అవుతుంది. అయితే జ్ఞానాన్ని ఒక ప్రయోజనాన్ని సిద్ధించుకోవడానికి పనికివచ్చే సాధనముగా భావించినపుడు, జ్ఞానము, కర్మ కంటే శ్రేష్ఠమైనది కానేకాదు. కాని కర్మను గాఢాంధకారముగానూ, జ్ఞానాన్ని ఎంతో ప్రశంసనీయంగానూ అభివర్ణించారు. దీనికి సమాధానం ఏమిటంటే, నిజానికి 'కర్మ' 'జ్ఞానము' అనే ఈ రెండూ కూడా ఒకే విధమైన క్రియాకాండలు. కర్మ భౌతికము, జ్ఞానము మానసికము. 'కర్మ' అంటే పనిచేయడం, 'జ్ఞానం' అంటే తెలుసుకోడం.

ఇంకొక విషయం ఏమిటంటే, కర్మ, జ్ఞానముల పర్యవసానము సంతోషము అయినప్పటికీ, వీటిని గురించి కొన్ని అపార్థాలు ఉన్నాయనడానికి ఎటువంటి సందేహమూలేదు. హృదయం యొక్క రహస్యాన్ని పరిపూర్ణంగా ఎవ్వరూ అవగాహన చేసుకోలేక పోయారన్నదే దీనిలోని మర్మం, ఆనందమనేది స్వయంగా" ఒక వాస్తవమైన స్థితి. నిజం చెప్పాలంటే, ఆనందమనేది అసలైన స్థితి. మిగిలినవన్నీ - అంటే దుఃఖము వగైరాలన్నీ వట్టి భ్రమలు మాత్రమే. కొందరు ఆనందాన్ని గురించిన జ్ఞానాన్ని పొంది, ఇదే తమ ఆదర్శం అని అంగీకరించి, దానితో సరిపెట్టుకున్నారు. మరికొందరు మోక్షము, విమోచనమూ తమ ధ్యేయమని అంగీకరించారు.

ఇప్పుడు మనము ' జ్ఞానము', 'మోక్షము' వీటికి గల తేడాను పరిశీలిద్దాం.

1. 'జ్ఞానము' అనగా తెలుసుకోదలచిన దానిని తెలుసుకోవడమే కాక, తెలుసుకొన్నదాని మాదిరిగానే తయారగుట అని నిర్వచింపవలసి ఉంది. అప్పుడు అక్కడ మిగిలి ఉన్నది తెలుసుకొనుట" మాత్రమే. దానిని ఒకే పోలిక కలిగినటువంటిది (తదాకార్) అని పిలువవచ్చు.

2. 'ముక్తి' అంటే స్వేచ్ఛను పొందడమూ, లేదా స్వేచ్ఛగా తయారవడమూ అని అర్థం. బంధనాలనుండి విడుదల కావడమే ముక్తి. ఈ రెండూ మనస్సుకు సంబంధించిన స్థితులే. మనస్సే వీటిని అనుభవిస్తోంది. ఈ బంధనాన్నీ, స్వేచ్ఛనూ అంగీకరించేది, అనుభవించేదీ కేవలము ఈ మనస్సే. తెలుసుకొనడం, అనుభూతి చెందడమే జ్ఞానం అంటే. మనస్సు తాను అజ్ఞానిననీ, తనకు ఏమీ తెలియదని భావించి, దానిని తెలుసుకుందామనే ఉత్సుకతతో, దాని యందు శ్రద్ధ వహించి, తెలుసుకుంటే, దానిని "జ్ఞానము" అని అంటాము. అదేవిధంగా, మనస్సు ఏదైనా ఒక విషయాన్ని అప్రియము అని భావించి, దానిని గ్రహించి, కలవరం చెందినప్పుడు, ఆ స్థితిని 'బంధము' లేదా 'దాస్యము' అని అంటాము. అటువంటి బంధనాలనుండి విముక్తి చెందడానికి ప్రయత్నించి, సఫలమై, స్వేచ్ఛను పొందితే, దానిని 'ముక్తి" అని అంటాము. అజ్ఞానమూ, జ్ఞానమూ - అనే రెండూ మానసిక స్థితులని ఎలాగన్నామో,'బంధమూ' 'విముక్తి' అనేవి రెండూ కూడా మనస్సు అనుభవించే స్థితులే. ఈ రెండు స్థితులూ అవాస్తవములే. వీటి ఉనికి మనస్సులోనే కనబడుతుంది.

ఈవిధంగా, ఎప్పుడైతే: -

1. అది శరీరంతో బలమైన మానసిక అనుబంధం ఏర్పరచుకుంటుందో, అప్పుడది 'మూఢమతి' అవుతుంది.

2. ఒక విశేష అనుబంధంతో శరీరంలో పనిచేస్తుందో, అప్పుడది 'అజ్ఞాని', చంచలమూ అవుతుంది.

3. శారీరక, ప్రాపంచిక వ్యవహారాలలో, వివేకంతోనూ తెలివితోనూ పనిచేస్తుందో, అప్పుడు దానిని "బుద్ధిశాలి" అని అంటారు. దానికి బాహ్యమైన అన్ని విషయాలను గురించిన జ్ఞానం ఉన్నప్పటికీ, తనను గురించిన జ్ఞానం దానికి లేదు. ఈ కారణంగానే దానిని "అజ్ఞాని" అని అంటారు.

4. తనకు గల విశాలమైన అనుభవంవలన, ఈ బాహ్య ప్రపంచంతో ఉన్న బంధాలను తెంచుకుని, ఆత్మతో అనుబంధాన్ని ఏర్పరచుకుని, ఇహ - పరలోకాల గురించి ఆలోచించగలిగిన స్థితిలో ప్రవేశించి, "జ్ఞాని" అని అనిపించుకుంటుంది. అప్పుడది ఆ రెండింటి ఎడల సమభావంతో మెలగుతూ, లోతుగా నాటుకునే ఎట్టి భావాలనూ ఏర్పరచుకోకుండా, సమతుల్య స్థితిలో గల త్రాసు యొక్క పళ్ళెముల రీతిలో, సమస్థితి యందుంటుంది. మనస్సును అర్థం చేసుకున్న వ్యక్తి ఆత్మనూ, సమస్త విషయాలనూ తెలుసుకుంటాడు.

ఆదర్శంగా తీసుకున్న ప్రతి విషయమూ కేవలము మానసికమైనదే. అంటే మనస్సుకు సంబంధించినదే. ఆలోచించగలగడం, అవగాహన చేసుకోగలగడం, అంగీకరించడం, నమ్మకం కలిగి ఉండడం వంటి సామర్థ్యాలన్నీ మనస్సుకు సంబంధించినవే.

మనస్సు అంతటా సంచరిస్తూనే ఉంటుంది. అది సంచరించని ప్రదేశమే లేదు. మనస్సు విహరించే సువిశాల ప్రదేశంలో లెక్కలేనన్ని విశ్రాంతి స్థావరాలూ, చర్యలు ఉత్పన్నమయ్యే స్థానాలూ ఉన్నాయి. వాటిలో ముఖ్యమైన మూడింటిని మాత్రం ఇక్కడ ప్రస్తావిస్తాను. ఈ మూడు ప్రదేశాలనూ, 'మనస్సు' అనే పుస్తకంలోగల మూడు అధ్యాయాలుగా పరిగణించవచ్చు.

వీటిని "ద్వారాలు" అని కూడా పిలువవచ్చు. మనస్సుకు ముఖ్యమైన మూడు ద్వారాలు వేర్వేరుగా ఉన్నాయి. ఇవి క్రిందన, మధ్యన, పైన ఉన్నాయి. లేదా వీటిని 'శారీరకము, మానసికము, అధ్యాత్మికము' అని కూడా అనవచ్చు.

మొదటి ద్వారము - 'స్థూల శరీరము'. అది 'మనస్సు' అనే పుస్తకంలోని మొదటి అధ్యాయము. రెండవ ద్వారము - 'మనస్సు', అది మధ్యస్థానంలో ఉంటుంది. మూడవ ద్వారము 'ఆత్మ'. అది అన్నిటికంటే ఉన్నతమైన స్థాయిలో ఉంటుంది.

స్థూల శరీరం అనేది అతి త్వరగా రూపంలో మార్పులు చెందే పదార్థ స్థితి. సూక్ష్మ శరీరమైన మనస్సు మార్పులతోబాటు నిశ్చలత కూడా కలిగి ఉన్న పదార్థస్థితి. కారణశరీరమైన ఆత్మ సుఖశాంతులూ, మరింత నిశ్చలత కలిగిన పదార్థ స్థితి. ఇవి మనస్సులోని మూడు అధ్యాయాలు.

మనస్సు స్థూల శరీరం మీద దృష్టిని నిలిపినప్పుడు, తారతమ్యాలకు గురి కావడం వలన ఎంతో అనుభవాన్ని సంపాదించుకుంటున్నది. కాని అది అంతా దుఃఖాన్నే అనుభవించింది. అనేకత్వంతో కూడిన ఈ ప్రపంచంలో ఒకదానిని మించి మరొకటి సుందరంగా, శ్రేష్ఠమైనదిగా కన్పించుట వలన, స్థూల శరీర దృష్టి గల మనస్సుకు కలిగేదంతా దుఃఖమే. ఇక్కడ మనస్సుకు అసూయ, ద్వేషము, శతృత్వములతోబాటు, పరిస్థితిని మెరుగుపరచుకోడానికీ, అభివృద్ధి చెందడానికీ కావలసిన సామాగ్రి యావత్తూ లభిస్తుంది. మనస్సు తన స్వస్థానమైన సూక్ష్మ శరీరంలో స్థిరపడినప్పుడు, ఆలోచించడానికీ, ధ్యానించడానికీ, నిర్ణయాలు తీసుకోడానికీ, తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉండడానికీ – మొదలైన వాటికన్నింటికీ వీలవుతుంది.

ఋషులు మనస్సుకు నాలుగు రూపాలను ఇచ్చారు. అవి :

చిత్తము : ఆలోచనాశక్తి

మనస్సు : ధ్యానించే సాధనము

బుద్ధి :విచక్షణ చేయగల, లేదా తీర్మానించగల సాధనము (మేధస్సు).

అహంకారము : తీసుకున్న నిర్ణయంపై ధ్యాస; అహం ('నేను', 'నాది' అనే భావన).

సుఖ దుఃఖాలనే రెండింటి మిశ్రమ స్థితి అయిన మధ్యస్థానంలో మనస్సు విశ్రమిస్తూ ఉంటుంది. ఈ రెండు స్థాయిల నుండి పైకి వచ్చి, కారణ శరీరమైన ఆత్మను చేరుకున్నప్పుడు, మనస్సుకు ప్రశాంతత, నిశ్చలతా, ఎటువంటి చీకూ చింతాలేని ఆనందమూ కలుగుతాయి. ఇవే (స్థూల, సూక్ష్మ, కారణశరీరములే) మనస్సు యొక్క మూడు ద్వారములు.

ఈ మనస్సుకు ఐదు విధాలైన అవస్థలూ, లేదా దశలూ ఉన్నాయి.

అవి :

1.మూఢత్వము

2. చంచలత్వము

3. అజ్ఞానము

4. జ్ఞానము

5. ఆనందము.

నీ ఈ శరీరంలో క్రింది భాగము మూఢత్వానికి స్థానమై ఉంది. అది కంఠం వద్ద మొదలై, దానికి క్రిందా మీదా ఉన్న రెండు ప్రదేశాలనూ చుట్టుకొని ఉంటుంది. చంచల మనస్సు యొక్క స్థానము, ప్రముఖంగా హృదయంలో కన్పిస్తుంది. అజ్ఞానము యొక్క స్థానము హృదయము, కంఠంతోబాటు జ్ఞానేంద్రియాలైన కనుల వరకూ వ్యాపించి ఉంటుంది. జ్ఞానము యొక్క స్థానము, హృదయం, మెడ, కళ్ళు, నుదురుతోబాటు, మొత్తం శరీరం అంతా వ్యాపించి ఉంటుంది. ఆనంద స్థితి యొక్క స్థానం కళ్ళకు పై భాగం నుండి మిగిలిన ఉన్నత ప్రదేశమంతా వ్యాపించి ఉంటుంది. ఆ దశలో నెలకొని ఉన్న మనస్సు ఎన్నటికీ అధోముఖంగా తన దృష్టిని నిలుపక, ఎల్లవేళలా ఉన్నతమైన స్థితులయందే స్థిరంగా ఉంటుంది. ఇక్కడ గమనించవలసిన ముఖ్య విశేషం ఒక్కటి ఉంది.

అదేమిటంటే, అధిష్ఠానమని చెప్పే ఉన్నత స్థానాన్ని ఆక్రమించిన మనస్సు, దానిమీద ఆధారపడి ఉన్న తక్కువ స్థాయిలకూ, స్థానాలకు అవసరమైన శక్తిని అందిస్తున్నప్పటికీ, వాటి ప్రభావాలకు లోనవకుండా, సురక్షితంగా, స్వతంత్రంగా వ్యవహరించ గలుగుతుంది.

క్రింది స్థానాలలో మనస్సు అతి మూఢత్వ స్థితిలోనే ఉంటుంది. మధ్యనున్న స్థానంలో అతి చంచలంగా ఉంటుంది. చంచలస్థితి పెరిగిన కొద్దీ, అజ్ఞానము, జ్ఞానములకు చెందిన స్వభావాలు లేదా లక్షణాలు ఉత్పన్నమౌతాయి. అవి పెరిగిన పిమ్మట, మనస్సు వాటిని అధిగమించి, ఉన్నత స్థితులకూ, లేదా ఉన్నత రంగాలకూ చేరినప్పుడు అది స్థిరత్వాన్ని ప్రశాంతతను చేకూర్చుకుంటుంది. అప్పటికీ, మనస్సు దాని తొలి నాలుగు అవస్థలనూ - అనగా మూఢ, చంచల, అజ్ఞాన, జ్ఞానములను - దాటుట వలన, ఆ పేర్లతో దానిని వ్యవహరించడం అసందర్భమే అవుతుంది. కాబట్టి మనస్సు ఏ ప్రదేశంలో సంచరిస్తే ఆ ప్రదేశపు స్థితిలో లయమై, దాని ప్రభావానికి లోనై, దానిని గ్రహించి, దానిలా మారుతుందన్న సంగతి అర్థమౌతుంది.

మూఢత్వ స్థితిలో చలనము, లేదా కదలిక లేదని అర్థం చేసుకోరాదు. కాని ఈ స్థితిలో సోమరితనం నెలకొని ఉంటుంది. తెలివితేటలూ, విచక్షణా లేశ మాత్రమైనా ఉండవు. ఈ స్థితిలోనున్న వ్యక్తి, తానేమి చేస్తున్నాడో, దాని పర్యవసానమేమిటో తెలియకుండానే పని చేస్తూ ఉంటాడు. అంతేగాక, దానిని గురించి ఏమాత్రమూ వివరించలేడు. వివరించలేడు. ప్రపంచంలోని చాలామంది మూఢత్వపు స్థితిలోనే, దాని ప్రభావానికి లోనై, కార్యాలను నిర్వర్తిస్తూ ఉంటారనేది వాస్తవము.

చంచలత్వము అంటే కదులుతూ ఉండేది అని అర్థం. ఈ అవస్థ యందున్న వ్యక్తి స్థిమితం లేకుండా, ఎల్లప్పుడూ అటూ ఇటూ తిరుగుతూ, ముందూ వెనుకా చూసుకుంటూ, ఈ ప్రక్కకీ - ఆ ప్రక్కకీ దృష్టిని సారిస్తూ; "అయితే", "కానీ" వంటి పద ప్రయోగాలు తరచు చేస్తూ, సందేహమనస్కుడై సంచరిస్తూ ఉంటాడు. ఇతనిలోని మూఢత్వానికి తోడుగా, సందేహించే తత్వము కూడా తోడయేటప్పటికి, ఒక విలక్షణమైన, విచిత్రమైన పరిస్థితి ఎదురౌతుంది. స్థిరత్వం లోపించడం వలన దేనిలోనూ శీఘ్రంగా నిర్ణయాలు తీసుకోలేక, అవస్థపడుతూ ఉంటాడు.

మూఢుడు ఎప్పుడూ, ఎటువంటి సందేహమూ లేకుండా పని చేసుకుంటూ పోతాడు. కాని చంచలతత్వము కలవాడు అలవాటుగా అబ్బిన సందేహ, సంశయాల కారణంగా పని చెయ్యనూలేక, అలాగని మాననూ లేక అజ్ఞానంతో ఆవరింపబడి ఉంటాడు. క్రమేణా, అతడు క్రింది ప్రదేశంలోని

మనస్సు పోకడలను గురించిన అనుభవాన్ని సరిపడినంత గ్రహించి, కొంతమేరకు విచక్షణా జ్ఞానాన్ని అలవరచుకుంటాడు. ఎటువంటి పనులు చేపడితే ఎలాంటి ఫలితాలు కలుగుతాయి అన్న తెలివి ఏర్పడడంతో అతడు బహుమానానికీ, దండనకు గురి అవుతాడు. ఈవిధంగా బహుమానాలనూ, దండనలనూ స్వీకరిస్తూ, అతడు అపారమైన అనుభవాన్ని గడించడంతో అతనిలో జ్ఞానం ఉదయిస్తుంది. ఈ జ్ఞానం యొక్క సహాయంతో అతడి మనస్సు దిగువ, మధ్య, ఎగువ ప్రదేశాలలో సంచరిస్తూ, ఆయా రంగాలలో కార్యకారణ సంబంధాన్ని గురించిన జ్ఞానాన్ని పెంపొందించుకుంటుంది. ఏది ఏమైనప్పటికీ, మూఢత్వపు పరిధితో పోల్చి చూస్తే చంచలత్వము యొక్క పరిధి కొంత పరిమితమైనదనే చెప్పవచ్చు.

నిశ్చలంగా ఉన్నదానిని ' ప్రశాంతత', 'నిలకడ'తో ఉందని అంటారు. ప్రశాంతి అనేది అతి సూక్ష్మమైన మూల స్థితికి 'గల పేరు. సంస్కృత భాషలో దీని ధాతువు ""శమ్". - అంటే స్థిరత్వము, లేదా స్థిర నిశ్చలత అని అర్థం. ఇది మనస్సు యొక్క ఉన్నత స్థాయికి చెందిన స్థితి.

ఇప్పుడు ఆహారాన్ని భుజించే విషయాన్ని ఉదాహరణగా తీసుకుందాం. ఎదురుగా ఆహారం ఉన్నప్పుడు కుక్క, పిల్లి వంటి జంతువులు దానిమీద పడి, లాక్కొని మింగివేసేటట్లు సాధారణ మానవుడు చేయడు, అతడు ఏమాత్రమూ ఆలోచనలేని మూఢుడు అయితే తప్ప! మానవునికి తను తినే ఆహారంలోని రుచుల గురించి కొంత జ్ఞానం ఉంది. కానీ ఆ జ్ఞానం కూడా ప్రత్యేకించి నాలుక, పళ్ళు, గొంతు వరకే పరిమితమయింది. భుజించిన ఆహారం గొంతులోనికి దిగిన పిమ్మట, దానిని గురించిన జ్ఞానం ఉండదు. జ్ఞానము మనస్సు యొక్క మధ్యస్థ స్థితికి సంబంధించినది. జ్ఞానము అజ్ఞానము కలగలిసిన స్థితియే ఆ మధ్యస్థ స్థితి. పదార్థము, పదార్థ రహితమైన ఆత్మ యొక్క కలయికచే ఏర్పడిన మిశ్రమ స్థితి. ఇప్పుడు మరల మూఢత్వ ప్రభావం కనబడే మొదటి స్థితిని పరిశీలిద్దాము. మనము తీసుకున్న ఆహారం కడుపులోనికి వెళ్ళిన తర్వాత, మనకు ఏమాత్రం తెలియని విధంగా పూర్తి అజ్ఞాన స్థితిలో అది జీర్ణమై, దానిలో కొంత రక్తంగానూ, కొంత క్రొవ్వుగానూ, కొంత వీర్యముగానూ, కొంత బీజంగానూ, కొంత వ్యక్తిత్వపు ఓజస్సుగానూ మారి, శరీరాన్నంతా వికసింపజేస్తుంది.

ఈవిధంగా లోనికి తీసుకున్న ఆహారం ఎలా పరిణామం చెందుతుందో ఎవ్వరైనా చూడగలరా? ఎవ్వరైనా చూపించగలరా? ఇదంతా క్రింది స్థానంలో స్థిరపడిన మీ మనస్సు చేసిన పనే. ఇది మీలో మీరే, మీ మనస్సుచేత చేయించారు. కాని దానిని గురించిన స్పృహ మీకు లేదు. ఇదంతా

మీ అజ్ఞాన స్థితిలో జరుగుతూనే ఉంటుంది. ఈ స్థితిలో జరిగే క్రియ మూఢత్వంతో కూడిన క్రియ. ఇక్కడ చలనం అంతా మూఢత్వంతో కూడుకున్నదే. ఈ స్థితి ప్రపంచమునందు ఎక్కువ భాగం ఆవరించుకొని ఉంది.

మధ్య స్థితి యందు నెలకొని ఉన్న మనోమండలము గురించి కొన్ని విషయాలు ఇంతకుముందే వివరించడం జరిగింది. భుజించడంలో రుచి, ఆ వాసన గురించిన స్పృహ, ఆనందం, సుఖము- అసౌకర్యము, ఎక్కువ తక్కువ మొదలైన వాటిని గురించిన జ్ఞానం ఉంది. అయినా అది పరిమితమైనది. ఇది దాని తొలి దశ. తర్వాత అది అజ్ఞానంలో పడిపోతుంది. ఆ స్థితిలో, దానికి తన స్థూల శరీరానికి సంబంధించిన స్థితిగతులను గురించిన అవగాహన ఉన్నప్పటికీ, తనను గురించి దానికి ఏమీ తెలియదు. తననుతాను తెలుసుకోలేదు. తనకున్న విశేషానుభవం వలన, అది ముందుకు వెళుతూ, జ్ఞానిగానూ, వివేకిగానూ మారి, ఇంకా జ్ఞానాన్ని సంపాదిస్తుంది. అయినప్పటికీ ఆ జ్ఞానం కూడా విశేషమేమీ కాదు. మనస్సు జ్ఞానిగా మారి ప్రశాంతతను పొందినప్పుడు, అది పరమానందానుభూతిని పొందుతుంది. ఇటువంటి శాంత, నిశ్చల స్థితిలో దానిని రగిలిస్తే, ఒక విధమైన అత్యున్నత చైతన్యస్థితి వస్తుంది. ఆ స్థితిలో అప్పటివరకూ తెలియని విషయాలను కూడా తెలియజేయగల సామర్థ్యాన్ని అది కలిగి ఉంటుంది. మనస్సు తన వేర్వేరు స్థితులపై తన దృష్టిని నిలిపినప్పుడు, ఆయా దశల ప్రభావం వలన మనస్సుకు పైన వివరించిన మూడు ముఖ్య స్థితులూ ఏర్పడ్డాయి.

ఉన్నత స్థాయికి చెందిన చైతన్యము, లేదా గ్రాహ్యాశక్తి అనేది జ్ఞానియొక్క లక్షణము. జ్ఞాని తప్ప ఇతరులెవ్వరూ ఈ అత్యున్నత చైతన్యస్థితిని పొందలేరు. కారణ శరీరమైన ఆత్మ యందు మనస్సును స్థిరముగా నిలిపి, దానియందలి సూక్ష్మాతి సూక్ష్మమైన ఆనందాన్ని పొందేవాడే అసలైన జ్ఞాని అని పిలువ తగినవాడు. ఈ స్థాయిని శాస్త్రములు "తురీయ" స్థితి అని వివరించాయి. సంస్కృతములో 'చతుర్' అనే మాటనుండి, అంటే 'నాలుగవది' అనే అర్థం నుండి, ఇది వచ్చింది. ఈ మాట అందరికీ సుపరిచితమైనదే కాని, దాని అర్థం ఎవ్వరికీ తెలియదు. ఈ నాలుగవ స్థితియైన “తురీయస్థితి” సత్, చిత్, ఆనందములకంటే ఉన్నతమైన స్థితి. ఇంతవరకూ మనస్సునకు గల మూడు స్థితుల గురించి మాత్రమే చర్చించుకున్నాము. నాలుగవ స్థితిని గురించి మరొకచోట చర్చించుకుందాము.

సత్, చిత్, ఆనందములనబడే ఉనికి, జ్ఞానము, ఆనందములు కూడా భౌతిక స్థితులే. మనకు కంటికి కన్పించేది, తన ఉనికిని వ్యక్తపరచేదీ అయిన స్థూల శరీరాన్ని “సత్’ అని అంటాము. జ్ఞానేంద్రియాలైన రూప, శబ్ద, స్పర్శ, రస, గంధములద్వారా శరీరము యొక్క ఉనికి తెలుస్తుంది. దీనిని నిరూపించడానికి వేరే నిదర్శనాలు అవసరంలేదు. ఇదంతా మీ స్థూల శరీరం గురించేనా కాదా అనేది మీరే ఆలోచించుకోండి. మీరు 'అవును' అన్నట్లయితే, దాని ఉనికిని ఒప్పుకున్నట్లే అవుతుంది. 'కాదు' అని మొండిగా వాదించినా, నీ పంచేంద్రియాలు తమ గ్రాహ్యశక్తి ద్వారా నీ స్థూల శరీరము యొక్క ఉనికిని సులువుగా నిరూపిస్తాయి.

'చిత్' అనే చైతన్యము, లేదా జ్ఞానము సూక్ష్మ శరీరమై ఉంది. 'ఆనందము' అనేది కారణ శరీరమై ఉంది. దీనితో మనము ఆలోచిస్తామో, ఏది ఆలోచనకు ఉపకరిస్తుందో, ఆలోచన ద్వారా దేనినయితే తెలుసుకొని, అర్థం చేసుకోగలమో, ఏది తన అవగాహన ద్వారా తనలోని జ్ఞాన స్థితిని వెల్లడి చేస్తుందో, అది సూక్ష శరీరమైన మనస్సు. దేని ఆలోచనాశక్తి, నిర్ణయించే సామర్థ్యము, విచక్షణాశక్తి, సృజనాత్మకత, అవగాహనశక్తి, కావలసిన వాటిని ఏరుకొని, అనవసరమైన వాటిని విడిచిపెట్టే సామర్థ్యము, సూక్ష్మగ్రాహుల మనస్సులపై చక్కని అభిప్రాయాన్ని కలుగజేస్తుంది, తెలివైనవారి విచక్షణా జ్ఞానంలో చురుకుగా అవగాహన చేసుకొని, నిర్ణయాలు తీసుకోడంలో స్పష్టంగా కనబడేదే, సూక్ష్మ శరీరమైన మనస్సు. అటువంటిది శరీరానికి గల సామర్థ్యముగాక మరి ఇంకేమి కాగలదు? మనస్సు లేదు అనడం కేవలం ఉనికిని సులువుగా మొండివాదనే అవుతుంది. మనస్సు యొక్క ఊహించవచ్చుననడానికి పైన చెప్పిన లక్షణాలే ప్రమాణము.

'ఆనందం' అనేది సూక్ష్మాతి సూక్ష్మమైన శరీరము. అదే కారణశరీరము, లేదా ఆత్మ. సంస్కృతములోని 'నంద్' అనే ధాతువునుండి 'ఆనందించు', ‘ఆనందాన్ని కలిగించు' అనే అర్థం పుట్టింది. దీని సాంగత్యము వలన ఆనందం కలుగుతుందో, లేశమాత్రమైనా దుఃఖములేనట్టి సుఖాన్ని పొందగలమో, దేనిలో పేదరికము, పరాధీనత, కొరత, దోషము వంటివి కనబడవో, దానినే 'ఆనందము' అని అంటారు. ఇది 'కారణశరీరం' కాక మరేమవుతుంది? ఎవరైనా అనుభవపూర్వకంగా తెలుసుకొనగలిగే సంతోషమే దాని సహజగుణము అనే సంగతి (ఆనందము అన్న) ఆ శబ్దమే నిరూపించగలదు. మరి దీనికి “ఎవరి సాక్ష్యాన్ని తీసుకోవాలి”? అనే ప్రశ్నకు సమాధానంగా, "దాని సాక్ష్యం దాని పేరులోనే ఉంది' అని అనవచ్చు. స్వయంగా తానే ఇచ్చే సాక్ష్యాన్ని మించిన మరొక సాక్ష్యం ఎక్కడుంటుంది? నీవు దాని ఉనికిని అంగీకరించావు అనే దానికి నిదర్శనం నీ స్థూల శరీరమే.

అది నీకూ తెలుసు. ఈ శరీరమే గనుక లేనట్లయితే, ఇతరులు నీ ఉనికిని గుర్తించడం మాట అటుంచి, నీ ఉనికిని నీవే గుర్తించలేకపోయేవాడివి!

## సత్ - చిత్ – ఆనందము

సచ్చిదానందము అంటే ఉనికి, జ్ఞానము, ఆనందము.

స్పృహగల స్థితిలో ఉనికి, జ్ఞానము, బ్రహ్మానందము ఈ మూడూ కలిసి ఉండడము వాస్తవము. ఈ మూడు స్థితులూ ఒకదానితో మరొకటి ముడిపడి ఉంటాయన్నది కూడా తెలిసే ఉంటుంది. దీనికి కారణాలు:

1. ఏ వ్యక్తి కూడా ఈ మూడింటి కలయికకూ అతీతుడు కాడు. 'మధ్యస్థానంలో హృదయం ఉన్నందువలన, అది తన క్రింద, పైనా ఉన్న గతుల యొక్క ప్రభావాలను ఆకళింపు చేసుకుంటూ పనిచేస్తుంది. అది దాని లక్షణము.

2. ఇక్కడ గమనించేదేమిటంటే, ఊపిరి బయటకు వచ్చి మరల లోనికి వెళ్ళి అక్కడ ఆగుతుంది. దీనిసే రేచకము (నిశ్వాసము, లేదా ఊపిరి వదలుట), పూరకము (ఉచ్ఛ్వాసము లేదా ఊపిరి పీల్చుట, కుంభకము (ఊపిరి బిగబట్టి ఉంచుట) అని అంటారు. ఇది రాత్రనక, పగలనక ఎల్లవేళలా, ప్రతిక్షణం జరుగుతూ ఉండే ప్రక్రియ. ఈ ప్రక్రియ మూడు (స్థూల, సూక్ష్మ, కారణ) శరీరాలూ కలిసి ముడి వేయబడి ఉండుట వలన కలుగుతున్నది. స్వప్నావస్థ యందు జాగృతి అవస్థ లేదనిగానీ, అలాగే జాగృదావస్థయందు సుషుప్తి అవస్థ లేదని గానీ, సుషుప్తి అవస్థ యందు జాగృదావస్థ, స్వప్నావస్థ లేవనిగానీ అనుకోరాదు. కాని ఇవి అందరికీ తెలిసేవి కాదు. ఆధ్యాత్మికంగా ఉన్నతిని పొందినవారే దీనిని తెలుసుకోగలరు.

మనస్సును, దాని ఆలోచనా ప్రవృత్తిని బట్టి తెలుసుకోవచ్చు. అలాగే ఆత్మను, దాని శాంతి ఆనందముల ద్వారా తెలుసుకోవచ్చు. కాకపోతే ఈ సత్, చిత్, ఆనందాల ప్రభావం స్థూల, సూక్ష్మ కారణ శరీరాల్లో కన్పిస్తుంది. అందువల్లనే కర్మ, జ్ఞానం, పరమానందం అనే ఈ మూడూ అన్ని విషయాల్లోనూ పెనవేసుకొనే ఉంటాయి. వాటి వాటి సహజ లక్షణాలను బట్టి, వాటి తీవ్రతను బట్టి, అవి వేర్వేరు అనే భావం కలుగుతుంది.

స్థూల శరీరము యొక్క సహజగుణము మూర్ఖత్వంతో కూడిన కర్మ. సూక్ష్మ శరీరము యొక్క గుణములు: కర్మ, అజ్ఞానము, జ్ఞానము. సూక్ష్మ శరీరం యొక్క ఉన్నత దశలో కేవలం జ్ఞానం మాత్రమే కనిపిస్తుంది. కారణ శరీరము యొక్క స్వభావము: ప్రశాంతత, స్థిరత్వము, శాంతి, స్తిమితము, శాంతి అనగా సౌఖ్యము తప్ప మరేదీ కాదు. మనస్సు అటువంటి స్థితికి వచ్చి చేరినప్పుడు, మనస్సు కూడా అదే ప్రశాంత స్థితినీ, ఆహ్లాదాన్ని పొందుతుంది. మనస్సు ఈ స్థితిలో స్థిర పడడాన్నే 'ఉపాసన' అని అంటారు. హృదయం కూడా ఆత్మలో సంయమనం పొంది పనిచేస్తుంది. ఇదివరకే పొందివున్న ఏ వస్తువునైనా పొందనట్లుగా భావించి ఎవరైతే వ్యాకులపడుతూ ఉంటాడో, అతడు తప్పకుండా అనుష్ఠానము (అభ్యాసము), కర్మయొక్క దశల గుండా పోవాల్సి ఉంటుంది. ఏదైనా ఒక వస్తువును, తానిదివరకే పొంది ఉన్నట్లుగా భావించేవానికి దానిని మరల పొందే అవసరము కన్పించదు. ఉదాహరణకు తన ముంజేతికి అలంకరించుకున్న బంగారు మురుగులు ముంజేతి క్రిందికి జారిపోయినప్పుడు, ముంజేతిపై ఆ మురుగులు కనిపించక పోవడం వలన ఆ వ్యక్తి వాటినెవరో దొంగిలించారన్న భ్రమకు లోనౌతాడు. వాటికై వెదకడం అనేదే సాధన, కర్మ అనిపించుకుంటుంది. ఇవి భ్రమలోనున్న మనస్సుకు ఆవశ్యకములు. మనవెంట ఉండేదీ, ఒకే భంగిమలో కూర్చోగలిగేదీ కూడా 'మనస్సే'. మనస్సు ఏ వస్తువుపై స్థిరపడి ఉంటుందో, ఆ  వస్తువు యొక్క రూపాన్ని అది ఎంతో త్వరగా ధరిస్తుంది.

మనస్సు, చేతులు, కాళ్ళు, కళ్ళు, ముక్కు, చెవులు - ఇవన్నీ మనస్సు నివసించి ఉండే చోట్లు. మరి స్థూల సూక్ష్మ శరీరాల మాట ఇక వేరే చెప్పేదేముంది? వాటి మీద కూడా మనస్సు నిలుస్తుంది. వాటి అన్నింటి యందూ స్థిరపడి, "ఉపాసన" చేస్తూ ఉంటుంది. వీటియందు కలుగుతున్న మార్పుల్ని గమనిస్తూ, బయట కన్పించే వస్తువుల్నీ, దృశ్యాల్నీ చూస్తూ అది ఆనందిస్తుంది.

ఈ ఆనందం మూడు రకాలు. ఉదాహరణకు మన ఎదురుగా ఒక మేజాబల్ల కన్పిస్తోంది. మన మనస్సులో నుండి ఆలోచనా ప్రవాహము కళ్ళనుండి బయటకు వెలువడి, ఆ బల్లను చుట్టుముడుతుంది. కాలువలోని నీరు ప్రవహించుకుంటూ పోయి, మైదానాన్ని ఎలా చుట్టుముడుతుందో, అదే విధంగా మనస్సులో నుండి వెలువడ్డ ప్రవాహము ఆ బల్ల ఆకారాన్నే పొందుతుంది. కర్మ, జ్ఞానము, ఆనందము అనే ఈ మూడూ కూడా సంతోషం యొక్క మూడు రూపాలు మాత్రమే. కళ్ళలోనుండి వెలువడ్డ వెల్లువ ఏదైనా ఒక వస్తువును చూసి, ఎడతెగకుండా

దానిని తడుతూనే ఉంటుంది. ఇదియే కర్మ. కళ్ళు తాను చేసిన చర్య (వృత్తి) వలన, ఆ బాహ్యా వస్తువును చుట్టుముట్టి ఆ రూపాన్ని ధరించి, దాన్ని గురించిన జ్ఞానాన్ని పొందుతుంది. ఇదే "జ్ఞానము”. మరల అవే కళ్ళు,బయట కన్పించే ఒక దృశ్యంపై నిలిచి దానిని ఆనందిస్తాయి. ఇదే ఆనందం. ఈ విధంగా కర్మ, జ్ఞానము, ఆనందం అనేవి మూడూ ఏదో ఒక విధంగా కలిసే ఉంటాయి. దీనిసే సచ్చిదానందము (సత్+చిత్+ఆనందం) అని అంటారు. అవన్నీ ఏదోవిధంగా ఒకదానితో ఒకటి కలిసి ఉంటాయి. వ్యవహారికంలోనూ (కర్మ), ఆలోచనా రూపంలోనూ, ఆధ్యాత్మిక రూపంలోనూ అవి ఒకే పోలికలో ఉంటాయి. దీనిసే " త్రిగుణాత్మక సిద్ధాంతము అని చెప్పవచ్చు. ఈ సిద్ధాంతమే స్త్రీ పురుష సంయోగంలో కూడా కనబడుతుంది.

ఏదైనా ఒక కర్మ చేసినప్పుడు, ప్రాథమికంగా ఒక మూఢత్వపు కదలిక ఉంటుంది. దానిమీద మనస్సు ఎక్కువసేపు నిలచి ఉండలేదు. 'జ్ఞానోపాసన' అంటే ఆలోచనలు పైకీ, క్రిందికి కదులుటయే. ఇక్కడ కూడా మనస్సు చాలాసేపు నిలచి ఉండలేదు. ఇది పూర్తిగా అటూ ఇటూ కాని మధ్యేమార్గము కాబట్టి, ఇంకా చివరి స్థితికి పోయి అక్కడ నిలుస్తుంది. అక్కడే దానికి ఆనందం లభిస్తుంది. అందుకే ఈ స్థితిలో కలిగే ఆనందానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది.

ఎదుటివారు చెప్పేమాటల్ని వినడం ఒక "కర్మ". ఆ మాటలనే శ్రద్ధగా మళ్ళీ ఆలోచించి, అభ్యంతరాల్నీ, అనుమానాల్నీ వ్యక్తం చేయడం “జ్ఞానము". మనస్సు ఈ మాటల్లోని సత్యాన్ని గ్రహించి, దానిలోని సారాన్ని తీసుకొని, అక్కడే ఉండడం “ఉపాసన”. ఇది ఆనందాన్ని కల్గిస్తుంది. వీటిసే శ్రవణ, మనన, నిధి ధ్యాసన (తదేక ధ్యానము) అని శాస్త్రాల్లో అంటారు. 'నిధి ధ్యాసన' అంటే, ధ్యానమున కూర్చొనుట' (ని-ఎదురుగా, ధి-ధ్యానము, ఆసనము- కూర్చొనుట) అని నిఘంటువులోని అర్థం.

జ్ఞానమే ప్రకాశము అనడానికి ఎలాంటి సందేహమూ లేదు. కాని అదే గమ్యం కాదు. లక్ష్యాన్ని చేరడానికి అది ఒక సాధనామార్గము మాత్రమే. మనం రాత్రులయందు అకారణంగా దీపాన్ని వెలిగించం. ఆ కాంతిలో ఏదో ఒక పని చేయడానికే దీపాన్ని వెలిగిస్తాము. ఆ పని చేయడమే మన లక్ష్యం. అదేవిధంగా మనం పొందే జ్ఞానం మన లక్ష్యసిద్ధికి ఉపయోగించేది మాత్రమే గాని, అదే లక్ష్యం కాదు.

“సచ్చిదానందము” అనే సమాసంలో 'సత్', 'చిత్', 'ఆనందం' అనే మూడు పదాలు ఉన్నాయి 'సత్' అనేది కర్మ, 'చిత్' అనేది జ్ఞానం, 'ఆనందం' అనేది ఆఖరిస్థితి. “ఉపాసన" అనేది ఆనందం కాదని అనుకుంటే, ఈ “సచ్చిదానందం” అనే సమాసానికి వేరే ఇంకొక పదాన్ని వాడుకోవలసి ఉంటుంది. ఎందుకంటే, మన 'గమ్యం' ఏమిటో మనం వివరంగా తెలుసుకోవాలి. ఒకవేళ ఇదే సాధ్యపడినట్లయితే, అనాదినుండీ మనం వాడుతూ ఉన్న పదాలు అర్థం లేకుండా నిష్ప్రయోజనం అయిపోతాయి. కాబట్టి ఈ నాల్గవ పదం సార్థకం కావడానికి ఆలోచించాలి. కానీ, ఇలా ఆలోచిస్తూ పోతే, “ అనావస్థ” అనే అనంతం వరకూ సాగే మిధ్యాక్రమమునకు దారితీస్తుంది. అప్పుడు ఈ సత్య పదార్థాన్ని కనుక్కోవడం అసంభవం అవుతుంది. కాబట్టి, ‘ఉపాసన’ అనిగానీ, 'సత్సంగం' అనిగానీ అంటే, దాని అర్థం కలయికే. అదే మన గమ్యం. ఈ ' బ్రహ్మానంద' మనే స్థితి ఒక మైమరపించే మత్తైన స్థితి. ఒక తన్మయత్వ స్థితి. అంతేకాదు అది స్వయంగా పరమానందం, మనోహరం, నిషా. ఇప్పుడు “వేదాంతం” అనే దాని అర్థం తెలుసుకోవలసి ఉంది. వేదము (జ్ఞానము) యొక్క చివరిమెట్టు 'వేదాంతము'. అదే బ్రహ్మానందము, పరమానందము. దుఃఖాలన్నింటినీ నిర్మూలించి, అత్యున్నతమైన అనుభూతిని పొందడమే మానవ జీవితపరమావధి అని మన శాస్త్రాలు చాటుతున్నాయి. వేదములు గానీ, జ్ఞానముగానీ మన గమ్యం కాదనీ, అంతిమ లక్ష్యం "పరమానంద స్థితి" యే నని దీనిని బట్టి బుజువౌతోంది.

కర్మను ఆచరించడం ద్వారా కూడా ఆనందానుభూతి కలుగుతుంది. కాని ఆనందంలో కూడా తేడాలున్నాయి. ఇందులో అనేక రకాలున్నాయి. 'పరమానందము', 'బ్రహ్మానందము' అనే పదాలు మనస్సు యొక్క సూక్ష్మ స్థితుల దృష్ట్యా, ఈ తేడాలను సూచించడానికి వాడబడుతున్నాయి. ఆ పరమానంద స్థితి అంటే లయమే, ఆలింగనమే, సత్సంగమమే. దీనినే నేను ఉపాసన అని ఇంతవరకూ చెపుతూ వచ్చాను. ఈ పదాన్ని 'కలయిక' ను సూచించడానికి నిస్సంకోచముగా వాడవచ్చు. కాని సాంకేతికపరంగా చూస్తే, ఉపాసన అనే పదానికి అర్థము ధ్యానమని గానీ, మననం అనిగానీ, చెప్పవచ్చు. కాబట్టి 'కలయిక' అనే పదానికి ఈ 'ఉపాసన' అనేది పర్యాయపదంగా వాడుకోవచ్చు.

ఇది ఆ సత్య పదార్థాన్నీ, అసలైన ప్రయోజనాన్నీ కలుగజేసినప్పుడు ఈ ఆనందం, బ్రహ్మానందమే ఉపాసన అనిపించుకుంటుంది. కేవలం ఈ కారణం వల్లనే ‘ఉపాసన’ జ్ఞానం కంటే శ్రేష్టమైనదిగా పరిగణింపబడుతుంది.

ఆత్మ అనేది మూలాధారం కాదు. అది వ్యక్తిగతమైన మనస్సు అనీ, శరీరానికి గుండె వంటిదనీ ఋజువయ్యింది. "ఆత్మ" అనే పదానికి రెండు విశేషణాలు ఉన్నాయి. "ఆత్" అనగా కదలిక గలది. "మన్" అనగా ధ్యానము - ఈ రెండింటి విశేషముల వల్లనే మనస్సు తన ఉనికి కలిగి ఉన్నది. ఆకర్షణ, నిరాకరణ, కోరిక, ఆనందము, జ్ఞానము, ప్రయత్నము - ఇవన్నీ ఆ మనస్సు యొక్క లక్షణాలే. " బ్రహ్మము' అనగా 'బృహ' (పెరుగుట, వ్యాపించుట), 'మన్' (ఆలోచించుట, మననము చేయుట). కనుక అది విశ్వమంతటినీ చుట్టిన మనస్సు. ఇది కూడా గుర్తింపుపొందే శరీరమే, కానీ, అది ఒక ముసుగు మాత్రమే. శరీరాన్ని సంస్కృతంలో "దేహము" అని అంటారు. ఇది "దిహ్' అనే ధాతు రూపం నుండి వచ్చింది. "దిహ్" అంటే కలయిక. సూక్ష్మ, స్థూల, కారణ శరీరాలు మూడు ఇలాంటివే. గోచరించే స్థూల శరీరం అనేక అణు సముదాయాల సమూహం. సూక్ష్మ శరీరం అంతర్గత, బహిర్గత స్థితుల మధ్యన ఉండే అణు సముదాయాల సమూహం. దీనినే హృదయము, చిత్తము అని అంటారు. అదేవిధంగా అంతర్గతంగా ఉండేది కారణ శరీరం. లోలోపల ఉండే అణు సముదాయాల సంపుటి. దీనిని "ఆత్మ", 'జ్ఞానము' లేదా 'ప్రాణము' అని అంటారు. 'సత్యరూపం' లేదా 'సారం' యొక్క పేరే 'ఆత్మ' లేదా 'ప్రాణం'. మానవుని అవగాహనకు ఈ మూడు మాత్రమే సంభవము కనుక, వీటికి గల అసలైన వివరణను గ్రహింపలేక, వారి భ్రమను తొలగించుకొనక పోవడం వలన, ఈ మూడు పదాలూ తిరిగి విశదీకరింపబడుతున్నాయి. ఋషులూ, మునులూ "ఇది కాదు, ఇదీ కాదు" అనే అర్థంతో "నేతి, నేతి" అని విశ్లేషించారు. 'శూన్యము' నాస్తి అనేదాని అనువాదము. ఇంతకుమించి ఏమి చెప్పినా అది కేవలం ఒక సూచన అనియే గ్రహించగలరు. మానవుడు దేనిని పొందుటకు ఆశిస్తున్నాడో, దేనిని మనస్సు అన్వేషిస్తోందో. అది భగవంతుడు గానీ, బ్రహ్మము గానీ, ఈశ్వరుడు గానీ, పరబ్రహ్మము గానీ కాదు. నేతి, నేతి, నేతి - అంటే ఇది కాదు! ఇదీ కాదు! ఇది కూడా కాదు! బుద్ధిగానీ, చిత్తము గానీ గ్రహింపలేని దానిని వాక్కు ద్వారా ఎలా చెప్పగలరు? ఇది ఋషుల నాల్గవ స్థితి. "తురీయ' స్థితి. సర్వసాధారణంగా మానవులు కారణ శరీరాన్ని గురించి గానీ, "ఉపాసన" యొక్క సూక్ష్మతత్వం గురించి గానీ, ఆనందానుభూతిలోని మర్మాన్ని గానీ తెలుసుకోలేరు. కనుక దీన్ని గురించి అనేక ప్రశ్నలు తలెత్తుతాయి.

మన కన్నులు అన్నింటినీ చూడగలవు గానీ వాటిని మాత్రం అవి చూసుకోలేవు. ముక్కు అన్నింటినీ ఆఘ్రాణించగలదు, తనను తాను తప్ప. చెవులు అన్నీ వింటాయి కాని తమను తాము

వినిపించుకోవు. నీవు అన్నింటినీ చూడగలవు, నిన్ను నీవు తప్ప. ఇదే అజ్ఞానము. ఈ అజ్ఞానాన్ని తొలగించడానికి నీవు ఇప్పటికే ఉపయోగిస్తున్న కృత్రిమ అద్దం యొక్క సహాయాన్ని పొందాలి. ఈ సహాయం అందుతున్నప్పుడు, క్రమక్రమంగా రానురానూ నీ ఆకారాన్ని నీవు అద్దంలో చూసుకొని, తృప్తిచెంది ఊరుకుంటావు. అప్పుడు ఈ ప్రశ్నల పరంపర ఆగిపోతుంది.

వ్యతిరేకంగా ఉండే మార్గాన్ని అనుసరించనిదే దీని అనుభవం మనకు కలుగదు. అది కేవలం ఆధారం మాత్రమే. అందుకనే, 'నీవు', 'నేను' వేరు వేరు రూపాల్లో ఉండడం వలన, 'శరీరం' అనే భావన కలుగుతోంది. అంతేకాదు. ఆత్మ, బ్రహ్మము మొదలైనవన్నీ శరీరాన్ని కలిగి ఉన్నవాటిలాగ విశదీకరింప బడ్డాయి. వాస్తవానికి ఇవన్నీ శరీరాలే. స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలు అనేవి శరీరానికి గల వేర్వేరు నిర్వచనాలు మాత్రమే. రూపము, నామము ఇవే శరీరంగా భాసిస్తాయి. నిరాకారము, నిర్గుణము, సాకారాలు కూడా శరీరాలే. నేతి, నేతి, నేతి!

## జ్ఞానము - ఉపాసన – ఆనందము

ఏదైనా ఒక వస్తువు యొక్క అసలు స్వభావమూ, ప్రభావమూ, ప్రయోజనమూ తెలియనంతకాలం, మానవుడు దానిని నమ్మలేడు. మరియు దానిని గురించి ఒక స్థిరమైన నిర్ణయానికి రాలేడు. దానియందు నిమగ్నమైనప్పుడే తప్ప ప్రశాంతతనూ, ప్రసన్నతనూ పొందలేడు. ఆనందాన్ని పొందడంలోని రహస్యమేమిటంటే, మన చిత్తవృత్తిని - అనగా మనస్సు యొక్క చంచల స్వభావాన్ని. అరికట్టి, దానిని నిశ్చలము చేసినప్పుడుగాని, నిజమైన ఆనందానుభూతి కలుగదు.

ప్రశాంతత, విశ్రాంతిల వారసత్వమే 'ఆనందము'. ప్రకృతి నియమంలో ఉన్న ఏర్పాటు ఇదే. జీవితంలోని సయ్యాటలన్నీ ఈ ఏర్పాటు ప్రకారమే జరుగుతూ ఉంటాయి. ఎంతో ప్రాముఖ్యమైనది అని భావించే జ్ఞానముగానీ, ఆవరణముల సమస్యలకే ఆధ్యాత్మికత గానీ బంధనములు మరియు సంబంధించి ఉన్నవి. ఆవిధంగా కాని యెడల, జరిగినది, జరుగుతున్నది, జరుగబోయేది, ఎడతెగక నిరంతరం జరుగుతూ ఉండే సంఘటనలూ, వాటి వరుసక్రమంలో, ప్రకృతి లీలకు అనుగుణంగా కొనసాగుతూనే ఉంటాయి.

<u>ప్రశ్న:</u> అయితే ఇప్పుడొక ప్రశ్న ఎదురౌతుంది. ఒకరి ప్రమేయం లేకుండా, అదే సంభవించేటట్లయితే, జ్ఞానము యొక్క సర్వమూ దానంతట గొప్పదనమేమిటి? తెలిసికోవలసిన

అవసరమేముంది? తెలుసుకోవాలన్న కోరికా, తెలుసుకొనేందుకు ప్రయత్నమూ ఎందుకు? దానికి 'తెలుసుకొనుట'

జవాబు: దేనిని అంటామో, మరి దేనిని తెలుసుకోవడానికి ప్రయాసపడుతూ ఉంటామో, 'అది' కూడా ప్రకృతి క్రమంలో ఉన్నటువంటిదే. దాని బారినుండి మనమెట్లు తప్పించుకోగలము? కానున్నది కాకమానదు. అది నిశ్చయముగా జరుగుతూనే ఉంటుంది.

అయితే ఇంకొక ప్రశ్న: మనకు ఎటువంటి కష్టమూ లేకుండానే దానంతట అదే జరిగే దానిని గురించి మనము తొందర పడడం, బాధపడడం ఎందుకు? అలాగ అయినప్పుడు మన ప్రయత్నం వృధా అయి, అది పొందరానిదై ఉంటుంది.

దీనికి జవాబు: 'తొందరపడక పోవడం చాలా ఉత్తమం" తొందరపాటు లేకపోవుట ఎంతో యుక్తమైనది, ఎంతో మేలైనది. అయితే మనము దేనిని "తొందరపాటు" అని అంటామో, అది మనస్సు యొక్క ఆతురత. అది మనస్సులో అణిగి ఉన్న కోరికల ప్రతిఫలం. వాంఛ తీరనంతవరకూ, అది తీరేవరకూ పాటుపడుతూనే ఉంటుంది. సంస్కృతమునందు వాంఛకు "వాసన" అని చెప్పబడింది. ఈ కారణంవల్లనే మానవ ప్రపంచానికి ఒక ఉనికి ఏర్పడింది. కోరికలున్న స్థితినుండి కోరికలు లేని స్థితికి మారినప్పుడే వ్యక్తికి ప్రశాంతత లభించగలదు.

కోరికలు గలిగిన స్థితి నుండి నిష్కామస్థితికి మార్పు చెందడం అంటే మనస్సు స్థిమిత పడడం, ఉపాసన స్థితికి చేరుకోవడం అన్నమాట. ఇది జ్ఞానము ద్వారా గానీ, కోరికలు ఫలించడం వల్ల కలిగే సంతృప్తి ద్వారా గానీ సంభవిస్తుంది. ఏదైనా కోరిక నెరవేరినప్పుడు ఒక విధమైన నెమ్మదితనము, కుదురుపాటు, స్థిరత్వములు ఏర్పడతాయి. కనుకనే విజ్ఞులు ఈ జ్ఞానం యొక్క విశిష్టతను గూర్చి పొగడుతూ ఉండేవారు. వారు చేసిన గుణగానమంతా 'అక్షరసత్యమే'. ఈ జ్ఞానం కలుగనన్నాళ్ళూ, విచక్షణాలోపం, నిర్ణయాల లోపం, మనోస్థిరత్వ లోపం కలుగుతూ ఉంటాయి.

స్థిరత్వమూ, దృఢత్వమూ లేని వ్యక్తీ, నిర్ణయాలు తీసుకోవడానికి జాప్యం చేసే వ్యక్తీ, కలవరానికి, మనోవ్యాకులతకూ గురి అవుతాడన్నది అందరికీ తెలిసిన విషయమే. మరొక నియమం ఏమిటంటే, ప్రకృతిలో ఏ స్థితిగానీ, ఏ అవస్థా గానీ శాశ్వతంగా ఒకే విధంగా ఉండదు. వాటిలో పెరుగుదలా, తరుగుదలా ఉంటాయి. ఉదాహరణకు జాగృతి (మెలకువ) స్థితి స్వప్నావస్థకూ, స్వప్నావస్థ సుషుప్తికీ మారిపోతాయి. మళ్ళీ సుషుప్తి స్వప్నావస్థకుగానీ,

జాగృదావస్థకు దారితీస్తుంది. ఇది ప్రతీరోజు, ప్రతిక్షణమూ జరిగే మార్పు. “కాల చక్రము " " గానీ అంటే ఇదే.

సంతృప్తి, నిష్కామము ఈ రెండూ ఇంచుమించు ఒకేలాంటి స్థితులే. కోరిక నెరవేరినప్పుడు దానిని “ భోగము” అనీ, నిష్కామ స్థితి అంటే కోరికలే లేని స్థితి కలిగినప్పుడు దానిని "యోగము” అనీ అంటారు. ఒకవిధంగా యోగమే భోగము. ఏదైనా ఒక స్థితిని చవిచూడడం 'భోగం' సారాంశము వచ్చి చేరినప్పుడు 'యోగం'. చివరకు జ్ఞానము, కర్మ రెండూ కలసి ఒక్కటిగా అయిపోతాయి. ఒక కర్మ నుండి వేలకొలది కర్మలు ఉద్భవిస్తాయి. మొట్టమొదట్లో నున్న ఒకే కోరిక నుండి వేలకొలది కోరికలు పుట్టుకొస్తాయి. వీటిని గురించి తెలియకపోతే, అంధకారంలో ఉన్నట్లే. కర్మ చేసి చేసీ, అనుభవాన్ని గడించి, కోరికలను విసర్జించి, మనస్సు నిర్మలమైనప్పుడు, జ్ఞాన కవాటాలు తెరచుకుంటాయి. యుక్తాయుక్త విచక్షణా జ్ఞానం మేల్కొంటుంది. అప్పుడతడు 'కాంతి మండలం' అంటే వెలుగులోనికి ప్రవేశిస్తాడు. అతడి మనస్సు నిష్కామ స్థితిలో నిశ్చలమై ఉంటుంది. 'పని' మొదటి మెట్టు అయితే, జ్ఞానము ఆఖరుది. ఆలోచించకుండా, అవగాహన లేకుండా వాదవివాదాలకు దిగడం మొదటిమెట్టు. దీనిని “మీమాంస” అని అంటారు. మీమాంసకు రెండు శాఖలు ఉన్నాయి. 1. పూర్వ మీమాంస: అది జ్ఞానాన్ని గురించిన అన్వేషణ. 2. ఉత్తర మీమాంస: తదుపరి జ్ఞానాన్ని గురించిన అన్వేషణ. మొదటిదైన పూర్వ మీమాంస కర్మ. ఇది వేదాలలోని విషయాల ఉపయోగాన్ని గురించిన ఒక భావము, అభిప్రాయము మాత్రమే. అయితే అది మొదటి దశ.

ఉత్తర మీమాంస జ్ఞానస్థితి. వేదాలలోని ప్రధానమైన అంశాలకు సంబంధించినది. ఇది తదుపరి కలిగే ఉన్నతమైన స్థితి. వీటిని గురించి యథాతథంగా తెలుసుకున్నవారు భ్రాంతి చెందరు. కాని చాలామంది వారి వారి కోరికలకు ఫలితాలను ఆశించి, సర్వసాధారణ ప్రక్రియ అయిన కర్మను ఆచరిస్తూ ఉంటారు. అలాంటివారు ఒక క్రియ తర్వాత మరొక క్రియ, ఒక కోరిక తర్వాత మరొక కోరికను పెంచుకుంటూ ఈ కర్మల సుడిగుండంలో చిక్కుకుని, అసలు గమ్యానికి బహుదూరంగా నెట్టివేయబడతారు. అదేవిధంగా మరికొందరు జ్ఞానం యొక్క ప్రయోజనాన్ని తెలిసికూడా, వాగ్వివాదాలు, ప్రమాణాలు, నిదర్శనాలు, తర్కవితర్కాలతోనే సరిపెట్టుకునేవారు, మధ్య దారిలోనే త్రోవ తప్పుతున్నా. అటువంటివారు తమ పాండిత్యాన్ని చాటుకుంటూ, విద్యాగర్విష్టులై, రెంటికీ చెడిన రేవడై ఎందుకూ పనికిరాకుండా పోతారు.

అస్తిత్వము గురించి మనము వివరంగా తెలుసుకోవడానికి ఉపయోగపడేదీ, లేదా వ్యావహారిక సంబంధమైనట్టి దశ - 'కర్మ'. జ్ఞానము కర్మ యొక్క సారభూతమైనటువంటి ప్రధాన రూపము. ఈ రెండు దశలూ మన అస్తిత్వము యొక్క, మధ్యనుండే కొక్కెము - అనగా మానవ హృదయముతో జోడింపబడి ఉన్నవి. ఈ హృదయమే స్థూలత్వ మండల ప్రదేశాలలోనికి తన శక్తి ప్రవాహాన్ని పంపించి, కర్మను ఆచరించేటట్లు ప్రేరేపిస్తుంది. తద్వారా తన ఉనికిని చాటుకుంటుంది. అదే హృదయము, విద్య, జ్ఞానములకు వారసత్వాన్ని తనకుతానే ఆపాదించుకుంటూ తన శక్తి తరంగాలను సూక్ష్మ మండలాలలోనికి ప్రసరింపచేసి, మధ్య ప్రదేశంలో స్థిరపడుతుంది. అది జ్ఞానము, కర్మలనే మండలాలలో విహరిస్తూ ఉన్నంతసేపూ, ఈ రెండింటి ఆనందానుభూతినీ పొందుతుంది. అలాగున కాకుండా, అది స్థూల, సూక్ష్మ క్షేత్రములు రెండింటి ప్రతిబింబాలనూ, ప్రభావాలనూ కలిగియున్న కారణం వలన, అది (మనస్సు, హృదయం) ఈ రెండింటిలో దేనివైపునకైనా పూర్తిగా మొగ్గినపుడు తాను కూడా, స్థూలముగా గానీ, సూక్ష్మంగా గానీ అవుతుంది.

కాని కర్మ- జ్ఞానం అనే ఈ రెండింటినుండీ ఈ హృదయాన్ని మళ్ళించి, సూక్ష్మమండలంలోని పరిసరాలలో స్థిరపడేటట్లు చేస్తే, దానిని 'ఉపాసన' అని అంటారు. ఆనందానుభూతి, ప్రశాంతతలు ఈ ఉపాసన ఫలితంగా కలిగినవే. ఇదే అంతిమ లక్ష్యం. కాని ఈ 'ఉపాసన' లో ద్వంద్వం యొక్క ఆనందస్థితి కూడా ఉంటుంది. దానిపై ఆధారపడకూడదు. దీనిలో ఉన్న బలహీనత, లోపం ఇదే. శరీరంలోని స్థూల మండలం అనేక పదార్థ పరిణామాలకు క్షేత్రమైనది. చిత్తము యొక్క 'వృత్తి', లేదా ప్రవాహ ప్రకంపనలు మరల మరల కలతలకు గురి వుతూ ఉంటాయి. ఏకాగ్రత స్థితిలో ఆనందానుభూతి కలుగుతుంది. చిత్త చాంచల్యము అరికట్టబడి, స్థిరత్వం వస్తుంది. ఈ స్థితికి అంతరాయం ఏర్పడి, కలత చెందినప్పుడు, దుఃఖము, దైన్యము ఆవహిస్తాయి. కనుక ఈ ఆనందానుభూతి స్థితి కేవలం తాత్కాలికము, అస్థిరము, అనిత్యము, క్షణభంగురము, పరాధీనము. ఇది ఎరుకను పెంచుతుంది. అనిశ్చల స్థితిని కలిగిస్తుంది. దాని ఫలితంగా, వ్యక్తి భోగాన్ని గానీ, యోగాన్ని గానీ పొందలేడు. సుఖాన్ని అనుభవించనూ లేడు. దివ్యత్వంతో అనుసంధానాన్ని పొందనూలేడు.

ఆధ్యాత్మికతలో కూడా ఇదేవిధంగా సంభవిస్తుంది. తనతోబాటు, భౌతిక ప్రవాహాన్నీ, దాని ఛాయను తీసుకువెళ్ళడం వలన అక్కడ తన పాదాన్ని సుస్థిరంగా మోపలేడు. స్పృహ లేని

స్థితిలోనే అక్కడకు వెడతాడు. అదే స్థితిలో తిరిగి వచ్చేస్తాడు. నిర్మోహత్వాన్ని గానీ, సంతృప్తిని గానీ పొందలేడు. అది లోపాలతోనూ, దోషాలతోనూ నిండి, అసంపూర్ణంగా ఉంటుంది. దానికి పరిపూర్ణ స్థితికి ఉండే లక్షణాలు ఉండవు. ఆ స్థితికి బహుదూరంలో ఉంటుంది.

ఆనందము, క్లేశము అనే వాటిని శాస్త్రాలు మూడు రకాలుగా వివరిస్తున్నాయి.

1. <u>అధి భౌతికము</u> : ఇది ప్రకృతి యొక్క పంచభూతముల సృష్టి
2. <u>అధి దైవికము:</u> ఇది 'విధి' లేక దేవతల ద్వారా సంభవించేది.
3. <u>ఆధ్యాత్మికము:</u> వ్యక్తి యొక్క హృదయ ప్రదేశంలో హృదయం చేతనే కల్పించబడినది.

వీటి కలయిక, ప్రభావాల వలన సుఖదుఃఖాలు కలుగుతాయి. మనస్సు యొక్క ఒకానొక ప్రసన్న స్థితికి ఆనందమని పేరు. ఉపాసనలో మనస్సు నిశ్చలముగా నుండి, ఒక పరిస్థితిపై స్థిరపడిన తర్వాత, దానిని వెనుకకు మళ్ళించుకొనడానినే 'ఆనందం' అని అంటారు. అదేవిధంగా, నిశ్చలము, అనిశ్చలము, ప్రభావానికి లోనుగావడమూ, దురాలోచనతో నిండి ఉండడం, వీటి పేరే క్లేశము. ఇది తప్ప కామలోలత్వంతో కొట్టుమిట్టాడడం సుఖదుఃఖాలంటూ మరి ఏమీ లేవు. మనస్సు యొక్క ఆలోచనా ప్రవాహం శరీరమంతటా ఉంటుంది. ఆపాదమస్తకమూ, రక్తనాళాల ద్వారాను, నరనరాల ద్వారానూ ఆ ప్రవాహం కొనసాగుతుంది. ఆ ప్రవాహము స్థిరపడినప్పుడు ఆనందానుభూతీ, బలవంతంగా దానిని అస్థిరము చేసినప్పుడు క్లేశమూ కలుగుతాయి. శారీరక, మానసిక, ఆధ్యాత్మిక సమతలాలలో అది ఎల్లప్పుడూ పయనిస్తూ, ఆనందాన్నీ, దుఃఖాన్నీ అనుభూతి చెందుతూ ఉంటుంది. కాని అది తనకై తాను, అప్రయత్నంగా సహజసిద్ధంగా పయనించినప్పుడు, సుఖదుఃఖాల అనుభూతి చెందదు. అది స్థిరపడినప్పుడు ఆనందమూ, బలవంతంగా అట్టి స్థితికి భంగం కలిగించినప్పుడు దుఃఖమూ కలుగుతాయి. ఈవిధంగా చిత్ర ప్రభావ ప్రవాహము స్థిరపడినప్పుడూ, స్థిరత్వాన్ని కోల్పోయినప్పుడూ వరుసగా ఈ సుఖదుఃఖాలు కలుగుతాయి.

ఉదాహరణకు ఇద్దరు వ్యక్తులు చదరంగం ఆట ఆడుతున్నారనుకుందాం. ఆ ఆటగాళ్ళ మనస్సులు ఆ ఆటపైనే కేంద్రీకరింపబడి ఉంటాయి. ఆటలో వారు నిమగ్నమై ఉంటారు. దానిలోని తాజాదనానికీ, ఆనందానికీ తన్మయులౌతారు. మరి, మరొక వ్యక్తి వచ్చి, చదరంగం బల్లను త్రోసివేసి, వారి ఆటకు భంగం కలిగించి, వారికి చికాకు కల్గించినప్పుడు, అప్పటివరకూ ఆటపై

స్థిరంగా నున్న వారి మనస్సు చెదిరిపోతుంది. మరోమాటలో చెప్పాలంటే, వారి ఏకాగ్రత చెడిపోతుంది. దాని ఫలితంగా ఆ చదరంగపు ఆటకు, వారికీ గల అనుబంధం చెల్లా చెదరైపోతుంది. వారి మనస్సు వికలమై దుఃఖానికి లోనవుతుంది. ఇది మొదటి దృష్టాంతం.

ఇంకొక ఉదాహరణకు వద్దాం. ఒక వ్యక్తి తోటలో షికారు చేస్తున్నాడనుకుందాం. అక్కడి పువ్వులనూ, లతలనూ, వృక్షాలనూ, సుందర దృశ్యాలనూ చూస్తూ పరవశిస్తూ ఉంటాడు. ఆతడి చిత్తవృత్తి సుస్థిరపడి, తన్మయత్వంలో ఉంటుంది. అంతలో ఆతడి దృష్టిని బలవంతంగా మళ్ళించే సంఘటన జరుగుతుంది. ఇష్టంలేని వ్యక్తివస్తే, ఆతడి దృష్టి మళ్ళిపోతుంది. ఆతడనుభవిస్తున్న ఆనందమంతా, దుఃఖంగా మారిపోతుంది.

మరో ఉదాహరణను తీసుకుందాం. ఒకచోట సితార్, వాయిద్యాలను వాయిస్తూ ఉంటే, పాటగాడు శ్రావ్యంగా పాడుతూ ఉంటాడు. అది విన్న శ్రోతకు తన్మయత్వం కలుగుతుంది. ఆతడి చిత్తప్రవృత్తి ఆ పాట మాధుర్యంలో, ఆ సంగీతంలో మునిగి ఉంటుంది. ఆతడు ఆనందాన్ని అనుభవిస్తూ ఉంటాడు. అప్పుడెవరైనా వచ్చి, ఆతడి ఆ స్థితిని భగ్నం చేస్తే, లేదా ఆతడిని అక్కడి నుండి మరెక్కడికో తీసుకుపోతే అతడి ఆనందం అంతా దుఃఖంగా మారిపోతుంది.

రుచికరమైన తినుబండారాలను చూచినప్పుడు నోరూరుతుంది. అలాగ ఆనందాన్ని అనుభవిస్తూ ఉన్నప్పుడు, వాటిని అక్కడి నుండి తీసివేసినప్పుడు గానీ, లేదా తొందరలో నాలిక కరచు కున్నప్పుడు గానీ ఆ స్థిరత్వము అస్థిరత్వముగా మారి, ఆనందము దుఃఖంగా మారిపోతుంది. ఒక ఎముకను నోట కరచుకుని కొరుకుతూ ఆనందంగా ఉన్న కుక్క నోటి నుండి ఆ ఎముకను లాగివేసి చూడండి, దాని ఫలితం ఎలా ఉంటుందో! ఒక వ్యక్తి ఆరోగ్యవంతుడై ఉన్నప్పుడు ఆతడి చిత్త- ప్రవృత్తి కంపనాలు నరనరాలలోనూ ఎగబ్రాకి ఆతని శరీర సౌష్ఠవంపై స్థిరపడి, ఆనందాన్ని కలుగజేస్తాయి. ఆతడి శరీరానికి దెబ్బతగిలి, రక్తనాళం చిట్లి రక్తం కారుతూ ఉన్నప్పుడు, అతడి చిత్త ప్రవృత్తి అస్థిరమైపోయి, దుఃఖానికి దారితీస్తుంది. ఆతడు తన మనస్సును దేనిమీదా నిలుపలేడు. పదే పదే స్థిరత్వాన్ని కోల్పోతూ ఉంటుంది. దాని ఫలితంగా దుఃఖం తప్ప మరేదీ ఉండదు.

సంపూర్ణ ఆరోగ్యాన్ని కలిగి ఉన్నప్పుడు నిశ్చలత్వం ఏర్పడి, ఆనందానుభూతి కలుగుతుంది. అనారోగ్యం కలిగినప్పుడు చెల్లాచెదరైపోతుంది. ఫలితంగా దుఃఖం కలుగుతుంది.

జీర్ణకోశం బాగా పనిచేస్తుంటే, మనోనిశ్చలత కారణంగా ఆనందమూ, తృప్తి కలుగుతాయి. అజీర్తి చేసి కడుపు బరువుగా అనిపించినప్పుడు, బాధ కలిగి, దుఃఖం కలుగుతుంది. ఇదే అన్ని రకాల అనారోగ్యాలకూ, పరిస్థితులకు అన్వయిస్తుంది. శరీరానికి కలిగిన గాయం మీద మలాము రుద్దినపుడు రెండు రకాల పరిస్థితులు ఏర్పడతాయి. తెగిన రక్తనాళాలు తిరిగి అతుక్కుని, రక్త ప్రసరణ యథావిధిగా కొనసాగుతుంది. లేని పక్షంలో గాయపడిన భాగం తిమ్మిరెక్కుతుంది. అనిశ్చలతా భావం తొలగి, బాధకు ఉపశమనం కలుగుతుంది.

ఆ అనారోగ్యంతో బాధపడుతున్న రోగి చెంతకు వచ్చి కూర్చున్నవారు దగ్గర స్నేహితుడో, వైద్యుడో, గురువుగారో లేక ఆత్మబంధువో అయినప్పుడు, ఆ రోగి ధ్యాస తాను సేవించిన మందు ప్రభావం వలన, ఆతని శరీరంలోని నిమ్న భాగాన్ని వదలి, పై భాగంలోని మెదడుకు చేరుకుని, కుదుటపడుతుంది. ఇది ప్రకృతి నియమం. ఇక బాధ కలిగించే భావం ఉండదు. ఒక వ్యక్తి ఎత్తైన భవనం పై అంతస్థు నుండి క్రింద పడి, ఆతని తల పగిలినప్పుడు, తగిలిన ఆ దెబ్బవలన ఆతడి మనస్సులో ఉండే భావ తరంగాలు, శరీరంలోని క్రింది భాగాన్ని వదలి, మెదడులో స్థిరపడతాయి. అక్కడ కూడా ఈ నిగూఢమైన సిద్ధాంతమే  వర్తిస్తుంది. ఆనందమనేది బయట ఎక్కడో లేదు. మన భావనలు ఒక చోట కేంద్రీకరించి, అక్కడే నిశ్చల స్థితిలో ఉండి, మనస్సును అంతర్ముఖం చేసి లోనికి మళ్ళించినపుడు ఈ ఆనందస్థితి కలుగుతుంది. ఈ మర్మాన్ని తెలిసినవారు ఆనందంకోసం బయట ఎక్కడో అన్వేషించవలసిన పనిలేదు.

ఒక వ్యక్తి తన హృదయాన్ని కేంద్రంగా చేసుకుని ఏదైనా ఒక ఆలోచన చేస్తూ ఉన్నప్పుడు దాని ఫలితాన్ని తెలుసుకొని ఆతడు ఆనందంలో తేలియాడుతూ ఉంటాడు. ఆతడు చేసే ఆలోచన ఏదైనా కావచ్చు. గణితశాస్త్ర సమస్య కావచ్చు, జ్యోతిష శాస్త్ర నిగూఢ రహస్యం కావచ్చు, వేదాంతపరమైన ప్రశ్న కావచ్చు. లేదా మరింకేదైనా కావచ్చు. అక్కడ ఆతడు తాదాత్మ్య స్థితిని పొంది ఆనందాన్ని అనుభవిస్తూ ఉంటాడు. ఆతడి ఆ స్థితిని ఎవరైనా భగ్నం చేసినట్లయితే, అతడి ఏకాగ్రత చెదిరిపోయి, దుఃఖం కలుగుతుంది.

ఏ విషయంపైననో ఆలోచనా ప్రకంపనాలు ప్రసరించడం, మనస్సు ఏకాగ్రత చెందడం, తత్ఫలితంగా ఆనందానుభూతి కలగడం, తదేక ఆలోచనా ప్రసారం అక్కడ స్థిరపడడం, ప్రశాంత స్థితిని అనుభవించడం – ఆధ్యాత్మికత్వపు ఆనందం అంటే ఇదే. మరింకే వివరణా దీనికి సరిపోదు.

## మూడు విధాలైన సుఖదుఃఖాలు

“భూతము” అనగా మూలపదార్ధము. ప్రకృతిలోని మూలతత్వములతో చేయబడిన ఈ సృష్టిని "అధి భౌతికము” అంటారు. ఆ సృష్టి భౌతికమైనది కావచ్చు. అలౌకికమైనది కావచ్చు. జడమైనవీ లేదా సూక్ష్మమైనవీ అయిన ఈ తత్వాల సమ్మేళనము వలన గానీ లేక మనో స్వభావము వాటిమీద నిలిచి స్థిరపడటం వలన గానీ కలిగే సుఖాన్ని " అధి భౌతిక సుఖం” అంటారు. ఇది భౌతికమైన, స్థూలమైన సుఖము మాత్రమే. ఆ చిత్తవృత్తిని బలవంతంగా మరలించినపుడు గానీ, లేదా కలత చెంది అస్థిరమైనపుడు కలిగే దుఃఖాన్ని గానీ "అధి భౌతిక దుఃఖం" అంటారు. దీనిని భౌతికమైన లేదా స్థూలమైన దుఃఖం అనవచ్చు. శబ్దము, స్పర్శ, రూపము, రుచి, వాసనలు సూక్ష్మ తత్వములు. ఆకాశము, గాలి, అగ్ని, నీరు, భూమి - వీటిని స్థూలతత్వములుగా వ్యవహరిస్తారు. ఈ తత్వాలతో చేయబడిన సృష్టి అంతా “ అధి భౌతికము", లేదా లౌకికమైనదే.

"దేవ"" అనే పదం కారణతత్వాన్ని సూచిస్తుంది. ఇది సూక్ష్మ స్థూల స్థితులకు మధ్య ఉంటుంది. 'దేవ' అనే పదానికి సంస్కృత భాషలో అనేక అర్ధాలున్నాయి. ఉదాహరణకు, దేవత, రాజు, బావమరిది, అవివేకి, పిల్లవాడు, వృత్తి వ్యాపారం చేసేవాడు, బల్లెము, ఈటె, పోటీ, బ్రాహ్మణ కాయస్తకుల సంజాతులకు గల బిరుదు, అంగము, దుర్గ, మహారాణి, గొప్ప వంశానికి చెందిన స్త్రీ, ఆరాధన, భక్తి ప్రపత్తులు మొదలైన అర్ధాలున్నాయి. ఇవన్నీ పైకి కనబడే అర్ధాలు. సంస్కృత ధాతువు 'దివ్' అంటే కేళి, చలనము అని అసలైన అర్ధము. దీని ఉత్పత్తి అర్ధము 'ప్రకాశము' అని కూడా ఉంది. అన్నింటిలోనూ ఉండి చలిస్తూ ప్రకాశించేది అని అర్ధము. ఇది ఆత్మ యొక్క లక్షణమును తెలియపరచే శాంతి, స్థిరత్వముల యొక్క స్థితి. ఆత్మ నిశ్చల స్థితిలో కూడుకున్నప్పుడు కలిగే సుఖమూ, అది కుదురుతప్పి అస్థిరమైనపుడు కలిగే దుఖమూ - వీటిని “ అధి దైవికము” అంటారు. సూర్య చంద్రాదుల వల్లనూ, ప్రకృతి సంభవాలైన ఉరుములు, పిడుగులు, మొదలైన వాటివలన కలిగే దుఃఖాన్ని "అధి దైవిక" మని సాధారణంగా అనుకుంటారు. కానీ అది సరియైనది కాదు. అది పంచభూతాల వలన కలిగినది కాబట్టి, అది భౌతికమైనదే కాని ' అధి దైవికం' కాదు.

"ఆత్మ" అంటే (ఆత్- కదలిక; మన్-ఆలోచన) చలనమూ, ఆలోచనా కలిగినదని అర్ధము. ఈ రెండు స్థితులూ చిత్తము అంటే మనస్సులో కలుగుతాయి కాబట్టి అదే "ఆత్మ" అవుతుంది.

ఆనందము, విచారము, జ్ఞానము, అజ్ఞానము, అనురాగము, ద్వేషము, కోరిక, ప్రయాసా – ఇవన్నీ మనస్సు లక్షణాలు. అది కదలిక, ఆలోచనలకు చెందిన మూడు స్థితులకూ సంబంధించి ఉంటుంది. దాని నిశ్చలత, కదలికలు ఈ మూడు స్థితులలోనూ పనిచేస్తుంటాయి. మొదటిది స్థూల శరీరము, రెండవది కారణ శరీరమైన ఆత్మ. ఇక మూడవది అంతరంగమైన దాని యొక్క స్వంత స్థితి. ఇదే మనస్సు యొక్క విపర్యయ ప్రతిబింబము, అంటే హృదయ మండలము. ఈ మూడింటిలో మనసు యొక్క ఆలోచనా ప్రవాహము స్థిరపడుట వలన సుఖమూ, కలత చెందుట వలన దుఃఖమూ కలుగుతాయి. ఇటువంటి 'సుఖదుఃఖా' ల స్థితులను 'ఆధ్యాత్మికం' అని వ్యవహరిస్తుంటారు. ఆధ్యాత్మికం అంటే చలనానికీ, కదలికకూ, ఆలోచనకూ సంబంధించినది అని చెప్పవచ్చు. 'ఆధ్యాత్మికం' అనేది కేవలము మనస్సు యొక్క స్థితిని సూచించడానికి పెట్టిన పేరు మాత్రమే.

చిత్తవృత్తి శరీరం మీద లగ్నమవడమూ, దానినుండి చెదిరిపోవడమూ జరిగితే దానిని 'మెలకువ స్థితి' అని వర్ణిస్తారు. అదేవిధంగా మనస్సు మీద లగ్నమయినపుడూ, దాని నుండి చెదిరిపోయినపుడూ 'స్వప్నావస్థ' అంటారు. అలాగే వ్యక్తి యొక్క చిత్తవృత్తి ఆత్మపై లగ్నమయినపుడూ, దాని నుండి చెదిరిపోయినపుడూ, 'గాఢనిద్ర' (సుషుప్తి) అంటారు. ఏ వ్యక్తి దీర్ఘకాలం గాఢనిద్రలో ఉండలేడనే విషయము, అందరికీ తెలిసిందే. అతడు ఆ అవస్థ నుంచి స్వప్నావస్థకూ, మెలకువ స్థితిలోనికి తిరిగి రావలసిందే. అటువంటపుడు శాశ్వత సుఖాన్ని పొందడం ఎలా వీలవుతుంది? ఈ మూడు స్థితులూ కాల చక్రానికి లోబడే ఉంటాయి.

ఎక్కడైతే సుఖము అనే భావం కలుగుతుందో అక్కడ దుఃఖము కూడా ఉండి తీరుతుంది. ఆ రెండు పరస్పరంగా అవినాభావ సంబంధం కలిగి ఉన్నవే. అయినప్పటికీ సుఖదుఃఖాలు రెండింటికన్నా మిక్కిలి భిన్నమయిన ఒక అద్భుత స్థితిని కల్పించుకొనుటకు కొంతవరకు సాధ్యపడుతుంది. అదెలాగ అంటే, ఒక వ్యక్తి గాఢనిద్రావస్థలో కూడా మెలకువతో నుండుటకు అభ్యాసము చేసి అక్కడ తన చిత్తవృత్తిని సమబుద్ధితో నిలిపి ఉంచడానికి ప్రయత్నించి లయావస్థనూ, అభావస్థితినీ తనలో కలిగించుకున్నపుడే అటువంటి అద్భుత స్థితి సంభవమవుతుంది. అటువంటి వ్యక్తి సుషుప్తి అవస్థ నుండి స్వప్న, జాగ్రదవస్థలకు తిరిగి వచ్చినపుడు కూడా అద్భుత స్థితిని నిలుపుకోగలుగుతాడు. దీనినే " బ్రహ్మానంద" స్థితి అని వ్యవహరిస్తారు. దీనిని పొందుట యెంత దుర్లభమో అర్థం చేసుకోవడం కూడా అంత కష్టమే.

అప్పుడు కూడా కొంత కొరత ఉండనే ఉంటుంది. ఆనందానుభూతి యొక్క గుర్తు ఆ వ్యక్తిలో రవ్వంతైనా మిగిలి ఉంటే, లేశమాత్రమైనా దుఃఖం కలగడం ఖాయం. వైరాగ్యం ద్వారానూ, అభ్యాసం ద్వారానూ, మనసు పరిశుభ్రమయి, ఆ అద్భుత స్థితిలో దానికదే లయమయినపుడే అసలైన జీవన ప్రయాణం ఆరంభమయి దానికదే వ్యక్తమౌతుంది.

ఈ లోకంలో సమస్తమూ సాధ్యమయ్యే వీలుంది. సాధ్యం కాగల ప్రతి ఒకటీ సంభవమవుతుందనేది వాస్తవమే. కాని ఎంతో ఆశ్చర్యకరమైన విశేషమేమిటంటే, అసంభవాలని అనుకున్నవి కూడా సాధ్యమవుతాయి.

సుషుప్తి అవస్థ నుండి తిరిగి వచ్చిన తర్వాత, శరీరంలో ఒక తాజాతనం, నూతనోత్తేజం కలుగుతాయన్నది తెలిసినదే. జాగ్రదావస్థలో రోజువారీ కార్యక్రమాల్లోనూ, ఆలోచనా, అభ్యాసంలోనూ ఉపయోగించినపుడు అది ఖర్చయిపోతుంది. కాని, ఏ వ్యక్తి అయినా వైరాగ్యం ద్వారానూ, అభ్యాసం ద్వారానూ, తనపై తానే అదుపు కలిగి ఉన్నట్లయితే, ఆ అపరిమితానంద స్థితిని చివరివరకూ నిలుపుకోగలడు. అటువంటపుడు వ్యాకులత, అసంతృప్తి మాయమౌతాయి. మెలకువలోనే నిద్రించగలిగే శక్తి ఉన్న ప్రాణులు ఈ ప్రపంచంలో ఎన్నో ఉన్నాయి. ఉన్నాయి. ఉదాహరణకు గుర్రం యుద్ధభూమిలో పరిగెడుతూనే నిద్రపోగలదు. అలాగే భగవద్భక్తి పారవశ్యంలో మునిగి తేలేవాడు కూడా అంతే. అలాంటి వారికి స్వప్న జాగ్రదావస్థలు రెండూ ఒక్కటే.

క్వాబో బేదరియమ్ ఘుదా యక్సాన్

అజ్ ఇనాయత్ సొహబతే పీరాన్

పావన పురుషుల సాంగత్యంలో, వారి కృపాకటాక్ష వీక్షణాల్లో,

స్వప్న జాగ్రదవస్థల తేడాయే తొలగిపో యింది నాకు.

కానీ, ఈ ఆనందం కూడా శాశ్వతం కాదు. ఈ లోపాన్ని తొలగించుకోవాలంటే, వ్యక్తి తన చిత్త ప్రవృత్తిని "బ్రహ్మం" లోనే రమింపజేయాలి. అప్పుడు సృష్టి యొక్క ఆదిమస్థితి గోచరమవుతుంది. అప్పుడే చిత్తవృత్తికి బ్రహ్మరూపం అవగతమవుతుంది. ఆ రూపంలోనే అది విలీనమయిపోతుంది. తాదాత్మ్యత చెందుతుంది. ఆ తాదాత్మ్య స్థితిలో మరోవిధమైన ఆనందానుభూతి ప్రకటితమౌతుంది. జీవాత్మ, పరమాత్మలకున్న భేదాలు మాయమయినపుడు దుఃఖం అంతమవుతుంది. అప్పుడిక,

ఆ పరమానందస్థితిలో రమించి ఉన్న చిత్త వృత్తి చెదిరిపోతుందేమోనన్న భయం ఉండదు. నీటిబిందువు, మహాసాగరం ఒకటే అయిపోతాయి! తాదాత్మ్యం చెందుతాయి.

## బ్రహ్మానందము

బ్రహ్మానందాన్ని పొందడమే జీవిత పరమావధి. బ్రహ్మానందాన్ని పొందుటయే మానవ జీవితానికి ఆకాంక్షణీయము, అదే ఆదర్శము. బ్రహ్మానందమొక్కటే సర్వోత్కృష్టమైనది.

కర్మ ద్వారానే ఉనికి వ్యక్తమౌతుంది. ఫలితాన్ని ఆశించని క్రియ జరిగినప్పుడే, వాస్తవమైన ఉనికి వ్యక్తమౌతుంది. ఉనికి యొక్క వాస్తవికతను తెలుసుకొనే సాధనమే జ్ఞానము. ఉనికికి సంబంధించిన నిజమైన జ్ఞానము యదార్థమైనదీ, వాస్తవమైనదే కానీ, మాటల రూపంలో వ్యక్తం చేసేది కాదు. జీవితంలో సంతోషాన్ని సాధించడానికి ఉపకరించే సాధనమే ఉపాసన. అది ఎటువంటిదై ఉండాలి అంటే, దుఃఖం ఏమాత్రం కలుగకుండా, సంతోషంలోనే లీనమయ్యే విధంగా ఉండాలి.

సిద్ధాంతరీత్యా, ఆత్మ-పరమాత్మలు ఒక్కటే అనడానికి ఎలాంటి సందేహమూ లేదు. “బ్రహ్మము” అనబడునది కూడా "ఆత్మ" యే. ‘బ్రహ్మము”, “జీవము” కూడా ఒక్కటే. పరమాత్మలోని ఆ గొప్పదనాన్నీ, జీవాత్మలోని పరిమిత భావాన్నీ తొలగించినప్పుడు వాటి నిజ స్వభావమైన కదలిక, ఆలోచనలు రెండూ ఒకటిగానే ఉంటాయి. కదలిక, ఆలోచనలను కలిగి ఉన్నదే ఆత్మ. విస్తరణ, ఆలోచనలను కలిగి ఉండేదే బ్రహ్మము. ఇదే వాటి స్వభావము. కదలిక, విస్తరణలు రెండూ ఒక్కటే. కాకపోతే వాటి వాటి పరిమాణాల స్థాయిలలో తేడా ఉంటుంది. బ్రహ్మమునకు తనదైన విశ్వము ఉన్నట్లే, జీవాత్మకు కూడా తనదైన విశ్వం ఉంటుంది. గొప్పదనము-తక్కువతనము; సర్వజ్ఞత-పరిమిత జ్ఞానాల విషయాలలోనే తేడా ఉంటుంది. అవి రెండూ కూడా తమ తమ లోకాలను సృష్టించుకుని, వాటిని తమలోనే విలీనము చేసుకుంటాయి.

విశ్వ, తైజస, ప్రజ్ఞ అనేవి జీవాత్మ లక్షణాలను తెలిపే పేర్లు. విరాట్, అంతర్యామి (అవ్యకృత), హిరణ్యగర్భ అనేవి బ్రహ్మము యొక్క లక్షణాలను తెలిపే పేర్లు. వీటినిబట్టి, జీవాత్మకు గల మెలకువ, నిద్ర, గాఢనిద్ర అనే మూడు విధాలైన స్థితులూ బ్రహ్మమునకు కూడా ఉన్నాయని మనకు తెలుస్తోంది. 'జీవాత్మ తన మనస్సును బ్రహ్మముతో అనుసంధానము చేసి, దానిపైననే కలుగుతుంది. ఎందుకంటే, ఏకత్వం (ఒకటి కావడం వలన, సర్వ స్థిరంగా నిలిపినప్పుడు, ఆ

జీవాత్మకు కూడా పరమాత్మను గురించిన జ్ఞానము సమానత్వము (అన్ని విధాలా అదే ఇది, ఇదే అన్నట్లు కావడం వలన), చిత్తవృత్తి ఏకీకరణం వలననూ, సంబంధమూ సమానత్వమూ స్వభావరీత్యా ఒక్కటే అవడం వలన, ఈ జ్ఞానం సంప్రాప్తిస్తుంది. ఈ జ్ఞానమే బ్రహ్మానందంగా మారుతుంది. అటువంటి జ్ఞానం ఉదయించినప్పుడు, మనస్సు యొక్క స్థిర, అస్థిర స్థితుల గురించిన భావాలు సమసిపోతాయి. జీవాత్మ కేవలం ఆనందాన్ని మాత్రమే అనుభవిస్తుంది. బ్రహ్మముతో కలిసి ఉండి, అది సముద్రంపై ఒక నీటిబిందువులా తేలియాడుతూ ఉంటుంది. అప్పుడు నామమాత్రంగానైనా దుఃఖము అనేది ఉండదు. ఎందుకంటే బ్రహ్మమునకు దుఃఖము అనేది ఉండదు. దుఃఖము అనేది ఒక అంశలోనే ఉంటుంది గానీ పూర్ణత్వంలో ఉండదు. దుఃఖం అనేది ఒక భాగానికే వర్తిస్తుంది గానీ పూర్ణత్వానికి ఉండదు.

## సర్వోత్కృష్ట సత్యాన్వేషణము

### నాల్గవ స్థితికి సంకేతము

ఓ సాధువా! ఆ ఒకే రూపం సర్వ వ్యాపకం,

బిందువుకూ బిందువుకూ లేదు భేదం.

రెండూ ఒక్కటే, కడలీ - నీటిబొట్టూ,

కడలిలోనున్న నీటిబొట్టు, కడలియే నీటిబొట్టు,

కనుగొంటే, ఇదే సత్యం, పరమసత్యం.

నీటిచుక్క వెనుక మహోదధి వ్యాపించింది,

నీటిబొట్టుకు ఆధారం, మహోదధి అందించింది.

నీటిబొట్టు మహాసాగరాన్ని సాధించాలి, పొందాలి,

ఇంతే వాస్తవం, నిగూఢ వాస్తవం.

సముద్రంలో పొడ చూపిందో భావం,

ఇది కేవలం ఒక నీటిబొట్టనే భావం.

ఈ దురభిప్రాయాన్ని పారద్రోలింది జ్ఞానం.

మరలా ఉత్పన్నం కాదెన్నటికీ ఈ భేదం.

అంతా భ్రాంతే. అవాస్తవం. భావనలంతా బూటకమే,

ప్రపంచంలోని వ్యవహారాలన్నీ వట్టి కపటం,

కనుగొంటే ఇదంతా అసత్యం అని,

మటుమాయమౌతాయి ద్వంద్వాలు.

బ్రహ్మము ద్వంద్వాలకు అతీతం. జీవాత్మ పరస్పర విరుద్ధమైన స్థితులలో జీవిస్తూ ఉంటుంది. దీనికి ప్రయాసపడే స్వభావముంటుంది. బ్రహ్మములో శ్రీ సుఖమును గురించిన భావన లేదు గనుక కలతల నుండి అది విముక్తము. జీవాత్మ తన మనుగడ సాగించాలనే మమకారంతో దుఃఖాన్ని త్రోసిపుచ్చి ఆనంద ప్రాప్తికోసమే ఆరాటపడుతుంది.

జీవాత్మ ఆనందానికి అర్రులు చాస్తుంది, కష్టాలను రుచి చూస్తుంది. జీవాత్మ ఒక చిన్న భాగమైనందున కష్టాలూ, కడగండ్లే దానికి ప్రాప్తం. బ్రహ్మము అలా కాదు. అది అఖండమూ, పూర్ణమూ, సమగ్రమూ. బ్రహ్మము జీవనమును గానీ, సుఖమును గానీ కోరదు. కనుక దానికి దుఃఖముండదు.

జ్ఞానమనేది ఒక అసంపూర్ణమయిన స్థితి. జ్ఞానమున్న చోట ఎరుక, ఎరుగెడివాడు, ఎరుగబడినది - వీటి యొక్క ముప్పేట కూడా ఉండి, దీని పర్యవసానంగా హద్దులు ఏర్పడ్డాయి. బ్రహ్మము విషయంలో హద్దులే లేనపుడు, దానిలో ఈ ముప్పేట వున్నదని ఎలా నిర్ణయిస్తావు? బ్రహ్మము సంపూర్ణముగా, లోపరహితమూ అయి ఉండడం వల్ల అందులో ఆపాదించేదేదీ ఉండదు. ఆ అనంతునిలో భ్రాంతి, భ్రమలకు అవకాశమే ఉండదు. అటువంటి స్థితులూ, ఆపాదనలూ, భ్రమలూ అసంపూర్ణమైన జీవునిలోనే కనబడతాయి. బ్రహ్మమునకు తాను పరిపూర్ణుడననీ, లోపరహితుడననీ ఎరుకయే ఉండదు. ఆ తత్వములో ఏ గుణాలు కన్పడినప్పటికీ అవన్నీ జీవుని అభిప్రాయంలో కల్పించినవే. బ్రహ్మము తనను తాను సచ్చిదానందమని వ్యవహరించుకోదు. తనకు కర్మయందు నమ్మకములేదు, తాను సంపూర్ణుడనని వ్యవహరించుకోదు.

జీవుడు మాత్రమే ఆ అభిప్రాయమును కలిగి ఉండి, ఆ బ్రహ్మమునే జీవిత పరమార్థంగా తలుస్తాడు. బ్రహ్మము బ్రహ్మము తననుతాను తననుతాను సంపూర్ణుడనిగానీ, లోపరహితుడననిగానీ ఘోషించు కున్నట్లయితే, సంపూర్ణమూ, అసంపూర్ణమూ ' అనే భావనలను కలిగి ఉన్నట్లే. ఇటువంటి భావనలు దొర్లితే బ్రహ్మము సంపూర్ణస్థితి నుండి దిగజారిపోయినట్లే. ఎట్టి పరిస్థితులలోనూ, పరిపూర్ణమయినదీ, అసంపూర్ణమయినదీ ఒకటి కాలేవు. మహాసాగరంలోని ఒక నీటి బిందువు ఆ సాగరానికి పైకి వచ్చినపుడు, ఆ సాగరానికీ, తనకూ ఏ సంబంధమూ లేదని భావిస్తుంది. తనతో వేరుపడిన విశాల మహాసాగరం ఒక పెద్ద నీటి బిందువని భావిస్తుంది. అలాగే తాను కాక విడిగా నున్న బయటి వస్తువులన్నింటిలోనూ ఏకత్వము చూసినపుడు కూడా ఇటువంటి భావమే జీవునికి కలుగుతుంది. అందువల్లనే ఆ వ్యక్తిగత జీవునికి కోరికలు కలుగుతాయి. ఇది ఒక దృష్టికోణము.

ఇంకొక విషయమేమిటంటే, ఏదో కారణం వల్ల, ఆ నీటిబిందువుకు తాను మహాసాగరం నుండి విడివడిన భాగాన్ని అనే ఎరుక కలిగినట్లయితే, తమలాటి నీటిబిందువుల వెనుక ఒక మహాసాగరమున్నదనీ, తాను ఆ సాగరంలో సంగమించాననీ, దానిలో ఒక భాగమును మాత్రమేననీ కూడా ఆలోచించాలి. ఎప్పుడైతే, ఈ “ఒక్కటే'' అనే ఐక్యతాభావం కలిగిందో, ఇంక బిందువూ, సాగరమూ వేరు వేరనే అభిప్రాయం ఎందుకుంటుంది?

కాని మరి జీవాత్మ ఇలా ఆలోచించదు. ఇలాగ అంటే, ఒక్కటే నన్న భావం కలిగి ఉంటే, ఇక జీవాత్మ పరమాత్మ వేరు వేరనే భావం గానీ, తనలో లోపాలున్నాయని గానీ, తాను అనంతత్వంలో ఒక భాగమని గానీ, ఆందోళన చెందదు. గమ్యాన్ని చేరుకోడానికి ఈ భావం, ఈ విశ్వాసము కలిగి ఉండడమనేది మొదటి సోపానము. దీనినే "వాచిక జ్ఞానము” అనగా మాటలను గూర్చిన జ్ఞానము అంటారు. దానితోబాటే శరీరం కూడా ఉంటుంది. మధ్యస్థితిలో వచ్చిన జ్ఞానాన్ని “యదార్థ జ్ఞానము” అని అంటారు. దీని ప్రతిఫలమే ఆలోచన, మననము. దీనినే జ్ఞానము అని కూడా చెపుతారు. చిట్టచివరి దశలో కలిగిన జ్ఞానాన్ని అసలైన 'సత్య జ్ఞానము' అంటారు. అనగా 'తద్రూప' జ్ఞానము అని వ్యవహరిస్తారు. అంటే అన్నిటిలో ఉండేది ఒకటే రూపము అనే జ్ఞానము. దుఃఖము అనేది బొత్తిగా లేకుండా, మైకం కలిగించే అత్యంతానందము ఇదే, అదే బ్రహ్మానంద స్థితి. దీనిలో ఆనందాన్ని గురించిన భావం కూడా ఉండదు. ఇది సంపూర్ణము, సమగ్రము అయినట్టి ఆనందము. అదియే బ్రహ్మము.

## బ్రహ్మము

సతతము మననం చేస్తూ, ధ్యానంలో ఉంటూ, వ్యాపించేది, విశాలమవుతుండేదీ అని 'బ్రహ్మము' నకు నిర్వచనం చెబుతారు. 'బృహ్' అంటే వ్యాపించేదీ, విశాలమౌతుండేది అనీ, 'మన్' అంటే మననం చేయడం, ధ్యానం చేయడం అనీ అర్థము. 'జీవాత్మ' ఈ స్థితిని దానికి ఆపాదించింది కనుక ఆ పేరు 'బ్రహ్మము' నకు వచ్చింది. అంతేకాదు 'జీవాత్మ' తన దృష్టికోణంలో ఆ పేరు పెట్టింది. అంతేకాని బ్రహ్మము ఎవ్వరికీ, ఈనాటివరకూ తన పేరును చెప్పలేదు. ఇకముందు కూడా చెప్పబోదు.

జీవాత్మకు, చలనము, వృద్ధి, ఆలోచనా ఉన్నాయి కాబట్టి బ్రహ్మము. తనకంటే ఎన్నో రెట్లు గొప్పదిగా భావించి తనకాపేరు పెట్టింది. వాస్తవానికి బ్రహ్మము పెద్ద దీకాదు, చిన్నదీకాదు, సువిశాలమూ కాదు, సంకుచితమూ కాదు. అది ఏదో అదే.

ఏదో ఒక పేరు పెట్టుకోవాలనుకుంటే ఈ పేరు బాగానే ఉంది. బ్రహ్మమునకున్న గుణగణాలన్నీ, వ్యక్తిగతమైన జీవుడు అంటే జీవాత్మ మనో ప్రవృత్తిపై ఆధారపడి ఉన్నాయి. జీవాత్మ ఎలా రూపకల్పన చేస్తే, ఎలా ఆలోచిస్తే అలాగే ఉంటుంది బ్రహ్మము. అది 'సగుణము' కానీయండి లేదా 'నిర్గుణము' కానీయండి. తన అవగాహన మేరకు జీవాత్మ బ్రహ్మమును ఉన్నతోన్నతస్థితిలో ఉంచి అదే తను చేరవలసిన గమ్యమని నిర్ణయించుకొంది. అట్టి స్థితి కల్పించిన తర్వాత, ఆ బ్రహ్మమును చేరే ప్రయత్నంలో తాను కూడా ఆ బ్రహ్మమువలె ఉండాలని వాంఛించింది జీవాత్మ. ఇది జీవాత్మ యొక్క తెలివితేటల ఫలితము. ఎప్పుడైతే తాను జ్ఞానాభివృద్ధిని పొంది వికసిస్తుందో, అప్పుడు బ్రహ్మమునకు ఆపాదించిన ఈ స్థితిగతులు తన తెలివితేటలతోనే, తన ఆలోచనాసరళితోనే నిర్ణయింపబడినవని తెలుసుకుంటుంది. అప్పుడే బ్రహ్మమును, సగుణ బ్రహ్మముగా గాక, నిర్గుణ బ్రహ్మముగానే స్వీకరిస్తుంది.

తాను లోపభూయిష్టము, అసంపూర్ణమని భావించి, దోషరహితమూ, సంపూర్ణమూ అయిన స్థితిని ప్రేమిస్తూండడం వల్ల, బ్రహ్మమునకు గల పరిపూర్ణస్థితిలో ఎంతో హాయినీ, సుఖాన్నీ జీవాత్మ ఆశిస్తుంది. ఇది మొదటి విషయము. ఇక రెండవదేమంటే, జీవాత్మ అనుసారము, ఈ బ్రహ్మాండము యావత్తూ, అనగా ఈ విశాల ప్రపంచము సృష్టి అంతా చక్రమువలె తిరుగుతూ భ్రమణగతి కలిగి ఉంటుంది. సూర్యచంద్రులు, నక్షత్రము, భూమి అన్నీ భ్రమణగతిలో ఉన్నందువల్ల తాను కూడా

భ్రమణగతిలో ఉన్నట్లు జీవాత్మ కనుగొంటుంది. ఈ చక్ర భ్రమణగతికి ఒక ప్రత్యేకమైన ఉద్దేశ్యమున్నది గనుక, ఇదే స్థితిని జీవాత్మ అన్ని జీవరాసులకూ ఆపాదించి, అన్నిటికినీ మేధస్సు, విచక్షణాశక్తి ఉన్నవని ఊహించుకొంటుంది. తెలివితక్కువ వానిని కూడా అతి తెలివైనవానిగా తలుస్తుంది. అందువల్ల బ్రహ్మమును కూడా అతి తెలివైన దానిగా జీవాత్మ ఊహించుకుంటే ఆశ్చర్యము లేదు. కాని జ్ఞానము, అవగాహనశక్తి, పొందిన తరువాత జీవునకు శాంతి, నిలకడ వస్తాయి.అందువల్ల బ్రహ్మము కూడా ఆపాదమస్తకమూ ప్రశాంతత కలదని భావించి మిన్నకుంటుంది.

బ్రహ్మము యొక్క ఉనికి జీవాత్మ ఉనికిపైన ఆధారపడి ఉంది. నీటిబిందువు విశాలసాగరాన్ని చూస్తూ ఉన్నందువల్ల ఆ సాగరం ఉన్నదని ఎలా నమ్ముతుందో అలాగే నీవు ఉన్నావు కాబట్టి, అతడూ (దైవము) ఉన్నాడని భావిస్తున్నావు. నీవంట లేకపోతే బ్రహ్మము యొక్క ఉనికిని ప్రశ్నించేవారెవరు? అతన్ని అవగాహన చేసుకునేది ఎవరు? నమ్మేదెవరు?

అంతేకాదు, సకల జీవాత్మల మొత్తమే బ్రహ్మము. ఈ జగత్తు, ' బ్రహ్మాండము' కూడా బ్రహ్మము యొక్క స్థూలరూపమే. స్థూలరూప సందర్శనం దృష్ట్యా దీన్ని 'విరాట్' అని భావిస్తారు. అదే సకల జీవరాసుల సమైక్య రూపము. మానవుడు మేధాసంపత్తీ, విచక్షణాశక్తీ కలవాడు కాబట్టి, బ్రహ్మము కూడా సకల జీవరాసుల సమైక్య మేధస్సని భావించి, అతడిని సర్వజ్ఞుడనీ, పరిపూర్ణ విజ్ఞత కలవాడనీ స్తుతిస్తుంటారు. అందువల్లనే బ్రహ్మము యొక్క మేధాసంపత్తి మానవునిపై ఆధారపడి ఉంది. జ్ఞానము, మేధస్సు, మానవునికి కావల్సిన ప్రాధమిక వస్తువులని మనం నమ్ముతాము కనుక బ్రహ్మము కూడా సకల జీవరాసుల సమైక్య మేధాశక్తి సంపన్నుడని భావించి, ఆ దైవాన్ని ' అంతర్యామి' (అంతటా కలడు) అనీ, అన్నిటినీ నడిపించేవాడనీ, సూత్రాత్ముడనీ, (మణిహారంలోని దారంలాటివాడని) ఆత్మలోని ఆత్మ అనీ, ఇత్యాది పదాలతో వర్ణిస్తాము. సుఖ సంతోషాలంటే ఏమిటో తెలుసుకొని ఆనందిస్తాము. ఇతరులలో కూడా ఆనందాన్ని చూస్తాము.

ఏ విధంగానైతే ఈ విశాల జగత్తు సమస్త జీవరాసుల సమైక్య రూపమని భావిస్తున్నామో, అదేవిధంగా సమస్త జీవరాసులు సమిష్టి ఆనందం, బ్రహ్మానందమయిందని మనకి మనమే స్థిరీకరించుకుని ఆ స్థితిని చిదానందమని, ఆపర సుఖసంతోషాలనీ, 'హిరణ్యగర్భ' అనీ తదితర పదాలతో వ్యక్తీకరిస్తాము. తనలోనే బ్రహ్మాండాన్ని చూసుకోవాలనీ, ఈ బ్రహ్మాండం అంతా తానేనని

భావించాలనీ పెద్దలు చెబుతారు. ఇది కేవలము మాటలతో చెప్పేదీ, సిద్ధాంతాన్ని ఉటంకించేదీ మాత్రమే. ఇప్పుడు ఈ వాస్తవిక విషయం గురించి తీవ్రంగా ఆలోచించండి మరి.

మనచుట్టూ అ కోట్ల జీవరాసులను చూస్తుంటాము. సూర్యచంద్రాదులూ, నక్షత్రాలూ, రాజులు, ప్రజలూ ఇత్యాది అసంఖ్యాకాలైన వాటిని చూస్తుంటాము. ఇటువంటి చిన్న, పెద్ద, దృశ్యాలన్నింటినీ క్షణకాలంలో మన కనుపాప గ్రహిస్తుంది. కనులు తెరచి చూస్తే వేలాది నక్షత్రాల వెలుగు మన కంటిలోకి ప్రవేశిస్తుంది. ఇది బహిర్గతంగా ఉండే స్థితి. కన్నులు మూసుకున్న తర్వాత కూడా అదే దృశ్యం అగుపిస్తుంది. బహిర్గతంగా నున్నవీ, అంతర్గతంగా ఉన్నవీ సరిసమానంగా అవగతమవడం ప్రారంభమౌతుంది.

మనం ఏదో రాజుగారి ప్రజలమని భావిస్తాము. ఒక ఉన్నతాధికారి వద్ద పనిచేసేవారమని తలుస్తాము. ఈ సువిశాల సృష్టిలో పరిస్థితుల వలయంలో చిక్కుకున్న చిన్న జీవరాసులమని నమ్ముతాము. అంటే, మనం ఎవరికంటెనో తక్కువ వారిమనే నీచభావాన్ని కలిగి ఉంటాము. వీటిలోని నిజానిజాలు మనపైననే, మన భావాలపైనే ఆధారపడి ఉన్నాయనే విషయాన్ని ఒక్క క్షణకాలమైనా స్ఫురణకు తెచ్చుకోలేము. అసలు 'మనమే' లేకపోతే ఆ రాజుని 'రాజు' అని ఎవరు పిలుస్తారు? ఆ ప్రజలను 'ప్రజ' అని ఎవరు సంబోధిస్తారు? మనందరమూ కలసి ఆయనను 'రాజు' అని ఒప్పుకొంటే ఆతడు రాజౌతాడు. మనం తండ్రిని తండ్రిగా అంగీకరిస్తేనే అతడు 'తండ్రి' ఔతాడు! మనం 'భార్య' అని అంగీకరిస్తే అపుడే ఆమె భార్య అవుతుంది! ఇవన్నీ కూడా అందరు ఒప్పుకునే విషయాలు. "నీవు భగవంతుడని విశ్వసిస్తే అందులో భగవంతుడుంటాడు. లేకుంటే అది ఒక రాయి మాత్రమే" అనే సామెత ఉన్నది. దీనికంతటికీ మూలకారణం మనమే.

మనచుట్టూనే ఈ అనేకత్వంలోని దృశ్యాలు పరిభ్రమిస్తూ మనలను మభ్యపెడుతుంటాయి. ఏదో కారణం ' వల్ల మనం దీని గురించి తెలుసుకోలేకుండా వున్నాము. ఇవీ, అంటే ఈ అనేకత్వంలోని దృశ్యాలు, మన చుట్టూ పరిభ్రమిస్తూ ఉండడాన్ని మన మేధస్సు కూడా గుండ్రంగా తిరగడం మొదలెడుతుంది. తత్ఫలితంగా (ధృవము) లేదా కేంద్ర స్థితి చూసి లోని ఆనందానుభూతిని జారవిడుచుకున్నాము. పరభ్రమించేదీ, గుండ్రంగా తిరుగుతూండేదీ, చుట్టూ ఉన్న చక్రము (పరిధి) మాత్రమే కాని, కేంద్రము కాదు. కాని తనచుట్టూ ఉన్న పరిధి తిరుగుతూ కనిపించేసరికి, తాను కూడా పరిభ్రమిస్తున్నానని, కేంద్రం అనుకుంటుంది. రైలుబండిలో ప్రయాణించే వారికి బయట ఉన్న చెట్లు, తటాకాలు కదిలి వెనుకకు పరిగెడుతున్నట్లనిపిస్తుంది. రంగులరాట్నం

ఆటల్లో, గిరగిరాతిరిగే పిల్లవాళ్లకు తమ చుట్టూ ఉన్న ఇళ్ళూ, వాకిళ్లూ, తోటలూ కూడా గిరగిరా తిరుగుతున్నట్లపిస్తుంది. అదేవిధంగా, కేంద్రం చుట్టూ ఉన్న పరిధి వర్తులాకారంలో తిరుగుతూంటే, కేంద్రబిందువు తాను కూడా పరిభ్రమిస్తున్నాననే తలపోస్తుంది. దీనినే 'భ్రమ' అంటారు. ఒకసారి మనమీ భ్రమకు లోనయ్యామంటే, మనం గుండ్రంగా తిరుగుతున్న అనుభూతి తప్పక పొందవలసిందే.

అన్నింటా మనలనూ, మనలోనే అన్నింటినీ చూడగలగడంలోని రహస్యాన్ని ఇప్పుడు మనము అర్థం చేసుకుందాము.

కేంద్ర బిందువూ, తొలి భూతాత్మకము, ఉనికిలోని సారమూ అయిన బ్రహ్మమూ, మనమే అనుకుందాము. ఈ అభిప్రాయం తొలి దశలో అంతర్గతంగానే కలిగి ఉందాము. అప్పుడు బయట ప్రత్యక్షంగా కనిపిస్తున్నవాటిని చూస్తూ, ఇవన్నీ మన మానసిక భావాలకు ప్రతీకలని భావిద్దాము. ఇవి మనలోనుండి ఉద్భవించినవే, మన రూపాలే. అక్కడ 'మనము' గాక వేరే ఏముంటుంది?

అంతర్గతంగా లోపలనున్నవీ, బహిర్గతంగా బయట ఉన్నవీ ఒకటే అయినపుడు అనేకత్వమనే తెర మొదట తొలగిపోతుంది. ఏకత్వము వస్తుంది. క్రమేణా అది కూడా అంతరించిపోతుంది. మరి అపుడు మిగిలేదేమిటి? నీకు నీవే మిగిలి ఉంటావు. తెలుసుకునేవాడు, తెలుసుకోవలసిందీ, తెలుసుకున్నదీ ఈ మూడింటి ముప్పేట కూడ మటుమాయమౌతాయి. ఊహించని, విననట్టి, ప్రకటించలేని ఒక అపూర్వమైన స్థితి ఏర్పడుతుంది. ఏకత్వంతో సమాగమం, అనేకత్వంలో కలయిక, సత్యమునందు లయావస్థ. ఈ మూడూ మధ్యలో వచ్చే స్థితులూ, దశలూ.

1.జ్ఞానం లేని పసివాడు అద్దంలో తన ప్రతిబింబాన్ని చూసుకొని, అద్దంలో మరో పిల్లవాడున్నాడంటాడు. అతడిని బయటకు లాగి, అతడితో ఆడుకోవాలంటాడు. అద్దాల మేడలోని కుక్క అన్నిచోట్లా తన ప్రతిబింబాన్ని చూచి మొరుగుతూ తిరుగుతుంటుంది. అనేకత్వంలో మునిగి ఉన్న జ్ఞానుల అవస్థ ఇది.

2. తెలివైన వ్యక్తి తన ప్రతిబింబాన్ని అద్దంలో చూసి, అద్దంలో ఉన్న తన ప్రతిరూపము, బయటనున్న తానూ ఒకటేనని అంటాడు. ఏకత్వంలో సమాగమమైన స్థితి ఇది.

3. సత్యతత్వంలో మునిగిన ప్రేమికుడు, లోపల, బయటా కూడా ఉన్నదొకటేనని తెలుసుకుని, సన్నని ముసుగులో నున్న సత్య తత్వానికి వెనుకనున్న నిజాన్ని గ్రహించి, ఎప్పుడూ ఆనందస్థితిలోనే ఉంటాడు. సత్య తత్వంలో సమాగమమైన స్థితి ఇది.

ఈ మూడూ కూడా మార్పు చెందకుండా ఉండేవి కావు. కనుక నాల్గవ స్థితి ఆరంభానికి ఇవి సూచకాలు.

యదార్థ పదార్థము అన్నింటికీ మూలకారణమయిన ఆత్మ ఎప్పుడూ కనిపించదు. ఒకవిధంగా చూస్తే దానికి నామరూపాలు లేవు. ఇంకొక విధంగా ఆలోచిస్తే ఉన్న నామాలన్నీ, ఉన్న రూపాలన్నీ దానివే. అన్నింటికీ ఆధారమూ, ఆశ్రయమూ కల్పించేది ఆత్మ. అది ఎవరి ఆధీనంలోనూ లేదు. అన్నీ దాని ఆధీనంలో ఉన్నాయి. కాని దానికి ఏ ఆధారముగానీ, ఆశ్రయం గాని లేవు. అన్నీ దానిపై ఆధారపడి ఉంటాయి. కాని తాను మాత్రము ఎవరి మీద ఆధారపడి ఉండదు. అది ఆత్మ. అంతేకాదు (మన దృష్టిలో) అలా ఉండడము దాని ప్రతిభ. అది పరమ శుద్ధమైనది. అలా ఉండడము (మన దృష్టిలో) దాని సహజగుణము. మనమే దానిని ఆత్మ అనీ, పరిశుద్ధమైనదనీ పిలుస్తాము. ఈ పేర్లను మనం అర్థం చేసుకోడానికి మనమే కనిపెట్టాము. అది కొంతవరకు ఆత్మను గురించిన అవగాహన మనకు కలుగజేస్తుంది. యదార్థమైన 'శాంతి' అదే కనుక, మనకు ప్రశాంతి లభిస్తుంది. ఉదాహరణకు ఒక పదార్థము ఉందనుకోండి. దాని వెనుక దాని ఉనికికి సంబంధించిన ఆలోచనలూ, సూక్ష్మ బుద్ధి ఉండి దానిని చుట్టుముట్టి, తన లీలలను ప్రదర్శిస్తున్నదనుకోండి.

(పటము. ఒకటి)


యదార్థ
పదార్థము

ఉనికి లేక మాయ

అట్టి ఉనికి లేక మాయ అనీ ' భ్రమ' అని పిలుస్తారు. యదార్థ పదార్థము చమత్కారాన్ని చూపిస్తూ, సూక్ష్మాతి సూక్ష్మమైన అణువుల రూపంలో గిరగిరా తిరుగుతూ తన ప్రతిబింబం ద్వారా అనేక ***<u>(అట్టి ఉనికిని 'మాయ' ఆధారంతో)</u>*** రూపాలలో కన్పిస్తుంది. ఈ మాయ తన ఈ ఉనికికి (మాయకు) తనదంటూ ఒక స్వంత వ్యక్తిత్వము అన్నదేదీ లేదు. 'బలము' అనేది బలవంతునిపై

ఎట్లా ఆధారపడి అ ఆ యదార్ధ పదార్థముపై ఆధారపడిన ఉనికి ఉన్నట్లుగా, లేనట్లుగా అగుపడుతుంది. బలము అనేది కంటికి కనిపించేది కాదు. దాని ప్రభావమూ, ఉనికీ, దాని కార్యకలాపాలలో మనకు అవగతమౌతాయి.

**ప్రకాశం**




చీకటిమయం

యదార్థమైన ఆత్మ యొక్క ప్రతిబింబము, ఈ ఉనికిలో (మాయ) పడి, చిక్కుకొని, గోళాకారముగానీ, వృత్తముగానీ మరే ఇతర ఆకారమును గానీ నిర్మించుకొని చలన ప్రవృత్తిని కోల్పోయి, ప్రతిబింబం రూపంలో శక్తిని యావత్తూ సంగ్రహించుకొని నిశ్చలమౌతుంది. దీని ప్రతిబింబంగా మరొక వృత్తాకారము గానీ, ప్రదేశంగానీ ఏర్పడుతుంది. (పటము. రెండు). మూల పదార్థము క్రిందుగా ఉండడం వల్ల చీకటితో అది నిండి ఉంటుంది.

దీపం వెలుగుతున్నపుడు పొగబారి మసి వస్తుంది. ఆ మసి బయట నున్న వస్తువుల మీద పడి తనకో స్థానాన్ని ఏర్పరచుకొంటుంది. ఆ ప్రదేశం కూడా మసిబారి నల్లగా ఔతుంది. ఆవిధంగా రెండు మండలాలు ఏర్పడతాయి. ఒకటి వెలుతురు, రెండవది చీకటి వెలుతురున్న ప్రదేశం నుండి తరంగాలు చీకటి మండలానికి పయనించి తిరిగి స్వస్థానాన్ని చేరుకుంటాయి.

(సత్)

ఈ మూడూ మాయ యొక్క క్రింది మండలాలు. ఇవి త్రిగుణాత్మకాలు.

కాంతిమయము

(1) దివ్యమండలము (లోకము)

(రజ్)

కాంతిమయం
చీకటిమయం

మధ్యలో నున్న మండలం ' అంతరిక్షము'. ఇది నక్షత్రం వలె ప్రకాశిస్తుంది. (అంతర్-మధ్యనున్న; ఇక్ష - నక్షత్).

(2) మధ్యమండలము (లోకము)

(తమ్)

ఈ నిర్మాణానికిదివ్యమండలం తలవంటిదైతే, పాతాళం పాదం వంటిది. మధ్యనున్నది హృదయమని అర్థం చేసుకోవచ్చు.

చీకటి మయం

3 పాతాళ లోకము

తరంగాలు ముందుకూ వెనుకకూ ప్రయాణించేటపుడు మార్గమధ్యంలో ఇంకో మండలం ఏర్పడుతుంది. ఈ మధ్య మండలం ఒక చిన్న డమరుకాన్ని పోలి ఉంటుంది. అది కాలాన్ని సూచించే ఇసుక గడియారం వలె ఉండే చిన్న డమరుకము యొక్క మధ్య భాగాన్ని పోలి ఉంటుంది. దీన్ని మధ్య మండలం అని పిలుస్తారు (పటము. మూడు).

| శిరస్సు చైతన్య ప్రపంచము ఊర్ధ్వలోకము | హృదయం మధ్యలోకం | పాదములు జడ ప్రపంచం అధోలోకం |
|---|---|---|

మూడు ప్రపంచాలు

సత్య పదార్థము నుండి బయలుదేరిన తరంగాలు ప్రతిబింబించి తిరిగి వచ్చేటపుడు ఈ మూడు మండలాలను తాకుతాయి. అవి ఆయా చోట్ల తమ లీలలను ప్రకటిస్తూ మూడు లోకాలను సృష్టిస్తాయి (పటం. నాలుగు).

చైతన్యస్థితి, జడస్థితి, కలయిక వలననే సృష్టి ఆరంభమయింది. ఈ రూపకల్పనకు అర్థము చెప్పే పుస్తకం వంటిది హృదయము. అది చైతన్యం, జడం అనే రెండు స్థితులూ కలసినటువంటిది. కనుక ఆ రెండింటి స్థితులనూ అర్థం చేసుకోగలదు.

"సత్వగుణం" లో చైతన్యం ఉంది. 'తమస్సు' లో జడత్వం ఉంది. 'రజస్సు' లో ఆలోచన, మననము, ప్రయత్నమూ, చురుకుతనమూ ఉన్నాయి. 'సత్వగుణం' లో ఆధ్యాత్మికం ఉన్నది. 'తమోగుణం'లో శారీరకత ఉన్నది. 'రజోగుణం'లో పై రెండింటి మిశ్రమము ఉన్నది. శిరస్సు స్థానంలో ఆత్మ ఉంది. ఆత్మ యొక్క ప్రతిబింబం పాదాలుండే చోట ఉంది. హృదయమూ లేక చిత్తము ఉండే ప్రదేశంలో ఆత్మా, దాని ప్రతిబింబముల మిశ్రమమూ ఉన్నది.

'సత్వగుణం' లో 'అంటే శిరస్సు స్థానంలో 'కారణ శరీరం' ఉంది. స్థూల శరీరము 'తమస్సు' లో అంటే పాదాలున్నచోట ఉంది. సూక్ష్మ శరీరము 'రజస్సు' లో అంటే మధ్యలో హృదయమున్న చోట ఉంది. ఈ మూడు గుణాలు ఒకదానితో మరొకటి కలిసిపోయి ఒక విచిత్రమైన విధంగా పనిచేస్తుంటాయి. సత్వగుణంలో పరమానందం ఉంది. తమస్సులో ఉనికి ఉంది. రజస్సులో జ్ఞానము ఉంది. జ్ఞానము అనేది కేవలము ఈ మధ్య స్థితి యొక్క పేరు.

యాంత్రికంగా పనిచేయడము తమస్సు యొక్క స్వభావము. ఇది అస్థిత్వము ప్రకటితమవ్వడంలోని ప్రారంభదశ. మనం మేలుకొనుటకు కూడా ప్రారంభదశ. ఆనందం, సుఖం, శాంతి, నిశ్చలతలుసత్వ గుణం యొక్క లక్షణములు. ఇది శారీరక కర్మల యొక్క కడపటి దశ ఔతుంది. ఈ దశనే 'సుషుప్తి' అని కూడా అంటారు. మధ్య దశ అయినటువంటి 'స్పృహ' (ఎరుక) రజస్సు యొక్క ప్రకృతి ఔతుంది. దీన్నే 'స్వప్నావస్థ' అని కూడా అంటారు.


కాంతిమయమైన 'దివ్యలోకం' లో చైతన్యముంది. అయితే ఈ చైతన్యము ప్రకాశము యొక్క స్థూలరూపంలో ఉంటుంది. అంటే అది కరుడుగట్టిన స్థితిలో వ్యక్తమైన రూపమన్నమాట. కనుక సుషుప్తి దశలో జ్ఞానము, స్పృహ ఉండవు. స్పృహ అనేది హృదయము యొక్క లక్షణము. చేతన, జడ స్థితులను ఎప్పుడూ అదుపు చేయాలని ప్రయత్నిస్తుంది. ఈ 'స్పృహ' అనేది సుషుప్తి దశకు

చేరుకున్నపుడు, తన స్థానం మరిచిపోయి, సుషుప్తి ప్రభావానికి లోనైపోయి ఆ స్థితిలోనే మునిగి ఉంటుంది. కాని తన సాధన ద్వారా ఆ స్థితికి తన 'స్పృహ' 'ఎరుక' జ్ఞానాన్ని దశను పదిలపరచుకుంటూ ఎగబ్రాగ గలిగితేనే పొందగలదు. అలా కాకపోతే జ్ఞానము కలగడం అసంభవము. సాధారణంగా, హృదయం, స్థూలశరీర కార్యకలాపాలలో మునిగిపోయి, తనను గురించిన సత్య జ్ఞానాన్ని కోల్పోతుంది.

కాని సుషుప్తిలో స్పృహ కలిగి ఉండేటట్లు చేయగల ఉపాయమే అభ్యాసము. ఈ స్థూల శరీరానికి సంబంధించిన కార్యకలాపాలు నెరవేరడానికీ, మనస్సు విచక్షణ చేసి పనిచేస్తూ కూడా ఎలాగ తనను గురించిన స్పృహ కలిగి ఉంటుందో అలాగే 'సుషుప్తి' దశలోనున్న ఆనందస్థితిని, ఆత్మ యొక్క స్థితిని గురించి కూడా విచక్షణ చేసి పనిచేస్తూ పోతూంటే, ఆ ఉన్నత తర స్థితులలో కూడా స్పృహను, జ్ఞానమును పొందగలుగుతుంది. ఇలా సాధన చేయడము ఉపాసన యొక్క మొదటి మెట్టు.

దేనిని మనమంతా 'మనం' అని వ్యవహరిస్తుంటాము? అది మన హృదయమే. కాని ఇదే హృదయాన్ని సూక్ష్మ శరీరమనీ, లోలోపలి ఆకృతి అనీ, అంతర్గతమైన శరీరమని అంటున్నపుడు, స్థూల శరీరము బహిర్గత పరిస్థితులను ఎలా అర్థం చేసుకోగలదు? ఆ అనుభవాన్ని ఎలా పొందగలదు అని మనకి అన్పిస్తుంది. వాస్తవానికి, సూక్ష్మదశలో నున్న మాయామేఘాల యొక్క క్షేత్రం ఆత్మకు లేదా సత్యతత్వానికీ క్రింద నుండే సుడిగుండంలాటి వలయాలలో పరిభ్రమిస్తూ సత్యతత్వం యొక్క ప్రతిబింబాన్ని తనలో ఇముడ్చుకొంటుంది. ఈ విచిత్రమయిన స్థూలస్థితీ, ఘనీభవించిన ప్రశాంతతా - ఇవే ఆధ్యాత్మికత యొక్క ఆది, మధ్య, అంత్య దశలు. అది పరిపూర్ణమయి, బీజరూపంలో ఉంటుంది.

దీని నుండి ప్రసరించిన తరంగాలు, కొంతదూరం సాగి ఒక మండలంగా ఏర్పడతాయి. ఆ స్థితినే 'బ్రహ్మాండము' 'పరబ్రహ్మాండ' దశలు అని పేరు పెట్టారు (పటము. ఐదు). వీటియందు మూలస్థితి యొక్క ప్రతిబింబంలోని రవ్వంత భాగము చూడవచ్చు. ఈ భాగము స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలనే (బ్రహ్మము యొక్క) త్రివిధాత్మక శరీరాలను ఉత్పన్నం చేస్తుంది.




ప్రతిబింబించిన సత్యస్థితి, హిరణ్యగర్భ, అంతర్యామి (అవ్యకృత). విరాట్ అని పిలువబడే మూడు శరీరాల్లోనూ ఉంటుంది.

(అ) సుడిగుండంలో ఉండే హిరణ్యగర్భ తత్వము. (ఆ) పరబ్రహ్మాండ మండలంలో ఉండే అంతర్యామి (అవ్యకృత) తత్వము.

(ఇ) బ్రహ్మాండ మండలంలో ఉండే విరాట్ పురుష తత్వము.

ఈ మూడింటిలో హిరణ్యగర్భ అనేది కారణ శరీరము. ఇది కారణ స్థితికి మూలము. అక్కడ 'శూన్య' భావము నెలకొని ఉంటుంది. ఇది ప్రశాంత పరిస్థితికీ, ఉన్నత తరమైన ఆత్మస్థితికీ

ఆలవాలము. అంతర్యామి (అవ్యకృత) అనేది సూక్ష్మ శరీరము. సూక్ష్మతత్వము, జ్ఞానము లేక స్పృహ కలిగిన స్థితి. మేధస్సు, విచక్షణాశక్తి, మానసిక శక్తి, మనస్సు యొక్క విపర్యయ చలనం, సూక్ష్మ శరీర లక్షణములు. చైతన్యస్థితి, శరీర కార్యకలాపాలు, పూర్తి శారీరక స్థితి ఇవన్నీ బ్రహ్మముయొక్క స్థూలశరీర స్థితి అయిన “విరాట్" లక్షణాలు.

బ్రహ్మము యొక్క స్థూల శరీరము “విరాట్". బ్రహ్మము యొక్క కారణశరీరము "హిరణ్యగర్భ". బ్రహ్మము యొక్క సూక్ష్మశరీరము అంతర్యామి” లేక “అవ్యకృత”.

'విరాట్ అనేది శరీరము. 'అంతర్యామి' అనేది మనస్సు, 'హిరణ్యగర్భ, అనేది బ్రహ్మము యొక్క ఆత్మ. స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలనేవి దివ్యలోకంలో ఉండే దేవుని శరీరాలు. ఈ మూడు స్థితులనూ దాటివెడితే నాల్గవస్థితి ఇంకొకటి ఉంది. భౌతికమూ, ఆధ్యాత్మికమూ, వాటిని దాటిన ప్రత్యేక దశా, వీటి స్థితుల ప్రమాణంలో దానిని చెప్పవచ్చు. ఈ నాల్గవదశ యొక్క ఒక బిందువు నుండి రూపుదిద్దుకొన్న మహాసాగరమే బ్రహ్మము. ఈ సాగరము అలలవలె కదలుచూ, మాయాస్థితికి ఆలంబనంగా ఉంటూ, “మాయావీ రచన" చేస్తూ, ఈ విశ్వజగత్తుకు లక్షణాలను ఆపాదిస్తూ ఉంటుంది. తనలోతానే ఈ సయ్యాటను ఆడుతూ ఉంటుంది. బ్రహ్మమునకు గల త్రిగుణాత్మకమైన స్థితులనే త్రిమూర్తులు అంటారు. ఋషులు, మునుల పరిభాషలో చెప్పాలంటే 'త్రికుటి' అంటారు.

స్థూల, సూక్ష్మ, కారణ శరీరాల స్థితుల మొత్తమే ఈ 'త్రికుటి' అనేది. ఇది పదార్థమూ, చైతన్యమూ, ఈ రెండింటి కలగలపు స్థితిని కలిగి ఉంటుంది. వీటిని శారీరకమూ, ఆధ్యాత్మికతా గ్రంథులు అంటే సత్వ రజస్తమో గుణముల కలగలుపు అని చెప్పవచ్చు. ఈ మూడూ కలసిపోయిన స్థితిని "బ్రహ్మము” అంటారు.

మరి ఆ నాల్గవదశను ఏమని పిలుస్తారు? దానిని భౌతిక క్షేత్రంలో శృత్ (ధ్యాస) అంటారు. దీనినే ఉన్నత క్షేత్రంలో శబ్దము (ధ్వని) అని అంటారు. దీనినే వాస్తవ స్థితిలో అశబ్ద (నిశ్శబ్దము) అని అంటారు. కాని ఇవన్నీ కేవలం పేర్లు మాత్రమే.

'శృత్' అనే స్థితిని ధ్యాస, నిబ్బరము, ఉపసంహరించుకొనుట, శాంతి, స్థిరత్వము అని తెలుసుకోవచ్చు. దీనిలో అంటే 'శృత్' స్థితిలో, నాల్గవ దశలోని ప్రతిబింబపు స్థితిని చూడవచ్చు. స్థిరంగా, కదలిక లేనట్టిదిగా ఉండడము దాని లక్షణము. దీనితో అనుబంధం కలిగి ఉండడము వల్ల

ఈ హృదయం కూడా ఉజ్జీవనం పొంది గర్వపడుతుంది. దాని నుండి తరంగాలను తీసివేస్తే లేక వాటిని ఊర్ధ్వముఖంగా మళ్లిస్తే, అది అచేతనమై, స్తబ్ధ అయి, మరణిస్తుంది.

'శృత్' అనే పదం 'శృతి' నుండి వచ్చింది. 'శృతి' అంటే విన్నది అని అర్థము. ఇంతకంటే సులభంగా అర్థమవడానికి వేరే ఇంకో పదం లేదు కాబట్టి, చాలా మాటల్లో చెప్పడానికి బదులుగా ఈ పదాన్ని వాడారు. మంత్రాలలోని 'శబ్దాన్ని' శృతి అని అనవలసింది పోగా, 'వేద మంత్రాలనే' శృతి అని సర్వసాధారణంగా అంటారు. పాడుకలో సామాన్యంగా దొర్లిన తప్పుడు అవగాహన ఇది. మంత్రములోని ''శబ్దా"న్నే "శృతి" అని పిలిచి ఉన్నట్లయితే, అది తప్పు అయ్యి ఉండేదికాదు. ఎందువల్లనంటే అది త్రోసిపుచ్చడానికి వీలులేనిది. ఈ ప్రపంచంలో ప్రతీదీ శబ్దము నుండే పుడుతుంది, శబ్దంలోనే కలిసిపోతుందనేది అనుభవం ద్వారా తెలిసే విషయము.

## శబ్ద మహత్యము

శబ్దము చైతన్యము యొక్క వ్యక్తీకరణము అయి ఉంది. అది జీవములకు జీవమూ, ఆత్మలకు ఆత్మా, అస్తిత్వములకు అస్తిత్వమూ అయి ఉంది. ప్రపంచమంతా దానిపైననే ఆధారపడి ఉంది. ఈ సమస్త సృష్టికీ సంపూర్ణమైన ఆధారమూ, లేదా శాశ్వతమైన పునాదీ ఆ శబ్దమే. కేవలం ఇది నాలుగవ స్థితి మాత్రమే. శబ్దం యొక్క కదలికయందు స్పందించునట్టి ప్రవాహ ప్రకంపనలూ, కడలికలూ 'దివ్యజ్యోతి' రూపంలో అన్నిటియందు ఉన్నట్లు కనబడుతుంది. కదలిక ఉన్న ప్రతి చోటా శబ్దం యొక్క ప్రవాహం ఉంటుంది. 'ఆదిమాయ' యొక్క మండలములో గుండ్రంగా తిరుగుతూ సుడిగుండము లోపల గిరగిరా తిరుగుతుండేది ఈ శబ్దమే. (అధ్యాయము 12, పటము: 5) నిశ్చయంగా అది 'మహాకాలమే'. అదే శబ్దం, కోడిగుడ్డు ఆకారంలోనున్న స్థానం నుండి క్రిందికి దిగివచ్చి, "పర బ్రహ్మము" అయింది. ఇంకా అది బ్రహ్మము, శుద్ధ బ్రహ్మము, సబల బ్రహ్మము, సృష్టికర్త ఈశ్వరుడూ, పరమేశ్వరుడు, శేష, మహేశ, బ్రహ్మ, విష్ణువులు మొదలైనవన్నీ అవుతుంది. ఇవే దేవీ - దేవతా గణములు. "మాయ" క్షేత్రంలో అది క్రిమి కీటకాలు, ప్రాణులు, ఈ లోకంలోని జంతువులు, పక్షులు మొదలైనవి అవుతుంది.

ప్రాథమికంగా మూడు మండలాలు అంటే, ప్రదేశాలు ఉన్నాయి. అవి:

1. **దయాళు మండలం :** కదలికలేని పీఠము, ఆధారము, సర్వోత్కృష్టమయిన ఉచ్చస్థితిలోని ఆశ్రయం.

2. **మహాకాల మండలం** : దీనిలో సూక్ష్మ స్థితి ఉంటుంది. “బ్రహ్మలోకం" అనే స్థూల, సూక్ష్మ, కారణ కోశములు ఉంటాయి. ఇంకా ఉచ్ఛస్థితిలోనున్న "పరబ్రహ్మ లోకం” ఉంటుంది. ఇంకా ఇటువంటివే మరికొన్ని స్థితులు ఉంటాయి.

3. **మాయా మండలం:** ఇది స్థూల ప్రదేశం. 'మాయ"తో బాటు శబ్దం కూడా స్థూలరూపంలోనే పనిచేస్తూ ఉంటుంది.

ఈ మూడింటితో సంబంధము కలిగి ఉన్న, యుక్తమైన అభిప్రాయం "దివి'', 'అంతరిక్ష', 'పాతాళ' - అనే శబ్దముల యొక్క పరిభాషలో కొంతవరకూ కన్పిస్తుంది. అయినప్పటికీ వీటిని ఇంకా స్పష్టంగా చెప్పే అవసరం ఉంది. దివ్యవాక్కు, సత్యము, ఉపాసనలు లేనిదే వీటిని తెలుసుకొనుట అసాధ్యము.

## శబ్దం వలన సృష్టి – లయములు

ఈ సృష్టి ఆదిలో ఏముండేది? చెప్పనలవి కానిదీ, అస్పష్టమైన చీకటిచేతా ఆవరింపబడినటువంటి అంధకారం ఉండేది. ఒక "కదలిక” కదిలింది. అంధకారమనే ముసుగు తొలగిపోయి, ఆశ్చర్యమనే ఛాయ దాని గర్భంలో చోటుచేసుకుంది. దానిలో నుండి కాలము పుట్టుకొచ్చింది. ఈ “మహాకాలము” అనేది వలయాకారంలో ఉన్న చీకటి నీడల రూపాన్ని ధరించింది. అది అటూ, ఇటూ చూసి, “నేనున్నాను” అని పలికింది. “నేను” అనే మాట అప్పటినుండీ పుట్టింది. అది (కాలపురుషుడు) భయపడింది. అప్పటినుండీ "భయం" అనేది ప్రారంభమయింది. “నేను” “నేను” (అహం) అనే భావానికి, వేరు పడిపోయినట్లుగా భ్రమ తోడయినప్పుడు భయం కలిగింది. "నేను తప్ప వేరే ఎవరూ లేరు కదా? అనవసరంగా నాకెందుకీ భయం” అని అప్పుడు అది అనుకుంది. భయం మాయమయింది. నేటికీ జరుగుతున్నట్లుగా, భయం అనేది ఆలోచన వల్లనే పోతుంది. అది మూలపదార్థాన్ని చూసి, దానిలాగా విస్తరించాలని ఆశించింది. దానితో కోరిక మొదలయింది. ఆ తర్వాత అది పెరగడం ప్రారంభించింది. అప్పటినుండి దానిని "బ్రహ్మము" అని వ్యవహరిస్తూ వచ్చారు.

“మాయ” అనే పేరు గల తన నిజస్వరూపమైన అంధకారంతో అది కలిసిపోయింది. బఠాణీ గింజంత పరిమాణంలో ఉన్న రెండు రూపాలు పుట్టుకొచ్చాయి. ఒకటి “పురుషుడు”. మొట్టమొదట మానవ శరీరరూపాన్ని దాల్చింది ఇతడే. రెండవది “ప్రకృతి”. ఇంతకు మునుపు ముసుగు

రూపంలో ఉన్న ఇది ఇప్పుడు ప్రత్యక్షంగా అవతరించింది. దీనిని ' ప్రధానము' అని కూడా అంటారు. ఇది మొట్టమొదట్లో "సత్యాన్ని ఆవరించి, దానిని కప్పివేసి ఉన్నందువలన దానికి ఆ పేరు వచ్చింది.''

ప్రకృతి, పురుషుడు - ఇద్దరే ఉన్నప్పుడు ఆ ఇద్దరూ సంగమించేరు. అప్పటినుండి శరీరరూపాన్ని ధరించిన సంతానం కలగడం ప్రారంభమయింది.

ప్రకృతితో సంగమించేటప్పుడు పురుషుడు ఆనందాన్నీ, సుఖాన్నీ అనుభవించేడు. కనుక అప్పటినుండీ, సృష్టిలోని సమస్త జీవరాసులలోనూ, స్త్రీ-పురుష సంగమం ఏర్పడింది. ఆనాటినుండి అది అలా కొనసాగుతూ వస్తోంది.

చీకటి ముసుగు క్రింద పడినప్పుడు, ఐదు రకాలైన లేత రంగుల ఛాయలు తరంగాల రూపంలో ఒకటి తర్వాత మరొకటి అవతరించాయి. ఆ రంగుల్లో వ్యత్యాసం ఉంది. మొదటిది నలుపురంగు. రెండవది పసుపు, మూడవది ఎరుపు, నాల్గవది ఎరుపు ఛాయతో కూడిన తెలుపు, ఐదవది శుద్ధమైన తెలుపురంగు.' ఈ రంగులన్నీ "మహాకాల" మండలానికి చెందినవి. "కాల పురుషుడు" బ్రహ్మము యొక్క మూడు రూపాలనూ, అంటే హిరణ్యగర్భ, అంతర్యామి (అవ్యకృత), విరాట్ అనే రూపాలను ధరించాడు. ఇవి 'కారణ', 'సూక్ష్మ', 'స్థూల' రూపాలు. మొదటిదైన 'హిరణ్యగర్భ' కారణ స్థితిలోనిది. 'శూన్యము", "మాహాశూన్యము" అనే స్థితులలో ఐదు ఉప కారణరూపాలు కనిపిస్తాయి. రెండవది "అంతర్యామి" అనేది సూక్ష్మమైన అస్తిత్వము. దీనిలో కూడా ఐదు ఉపరూపాలు ఉన్నాయి. ఇవి శబ్దము, స్పర్శ, రూపము, రుచి, వాసన అనేవి. ఇది "త్రికుటి" యొక్క ప్రదేశము. మూడవది "స్థూల" స్థితికి చెందిన 'విరాటో' రూపం. దీనిలో కారణ స్థితిలోని ఐదు ఉపరూపాలూ, మరో రూప ధారణ పొంది పంచభూతాలుగా మారాయి. అవి ఆకాశము, అగ్ని, వాయువు, నీరు, భూమి. ఇది "సహస్ర దళ కమల" ప్రదేశము. మూడు శరీరాలూ " బ్రహ్మము" లో ఎలాగైతే ఉన్నాయో, అలాగే అవి వ్యక్తిగత ఆత్మలో కూడా ఉన్నాయి.

బ్రహ్మము, మాయల కలయిక వలన పుట్టిన సమస్త జీవరాసులూ అదే చీకటి ముసుగు (ఆవరణ) రూపంలో ఉన్నాయి. మానవుని స్థూల శరీరంలో, పంచభూతాలలో ఒకటి అయిన ఆకాశతత్వము ఆతని కంఠం దగ్గర స్థిరపడింది. అలాగే వాయుతత్వం హృదయంవద్ద, అగ్ని నాభివద్ద, జలతత్వము జననేంద్రియం వద్ద, భూమి గుదమువద్ద స్థిరపడ్డాయి. ఈ పంచభూతాలూ

తగుమాత్రంగా కలగలిసి ఉండడం (పంచీకరణ) వలన శరీరము ఏర్పడింది. శబ్ద, స్పర్శ, రూప, రస గంధములు సూక్ష్మ శరీరమైన మానవ హృదయంలో ఎలా ఉన్నాయో, అలాగే అవి అంతర్యామి (అవ్యకృతుని)లో కూడా కన్పిస్తాయి. మానవుని కారణ శరీరంలో ఈ పంచతత్వముల యొక్క ఐదు కళలూ ఏవిధంగా నిద్రాణమై ఉంటాయో, అదేవిధంగా అవి "హిరణ్యగర్భ" లో కూడా కానవస్తాయి.

సృష్టించేది కాలమే. మరి సంహరించేదీ కూడా కాలమే. ఇది తప్పనిసరియైన, తప్పించుకోలేని నియమం. వ్యక్తిగత జీవుడు, అంటే జీవాత్మ, ఎలా లయము (మరణము) చెందుతాడో తెలుసుకుందాం.

మృత్యువు ఎప్పుడు వస్తుందో అప్పుడు, అన్నిటికంటే ముందుగా మూలాధార చక్రము నుండి భూమి తత్వము పైకి లాగబడి, జలతత్వమునకు స్థానమైన స్వాధిష్ఠాన చక్రం (పొత్తికడుపు లోనికి చేరుతుంది. అప్పుడు భూమితత్వము జలముగా మారి, చేతులూ, కాళ్ళూ చల్లబడతాయి. ఇదే జలతత్వములో ప్రళయం అంటే. ఆపైన స్వాధిష్ఠాన చక్రం నుండి జలము పైకి లాగబడి, మణిపూరక చక్రము (నాభి) యందు పోగవుతుంది. అది (జలము) అప్పుడు అగ్నిగా మారి, నాభికి పైనున్న భాగమంతా వేడెక్కుతుంది. ఇదే అగ్నితత్వములో ప్రళయము. ఆ పిమ్మట అగ్ని, నాభి చక్రము నుండి అనాహత చక్రము, లేదా హృదయ చక్రంలోనికి క్రమేపీ పైపైకి లాగబడి, హృదయ క్షేత్రములోని ఊపిరితో కలసి, వాయువుగా మారుతుంది. అప్పుడు శరీరమంతా వణకనారంభిస్తుంది. ఇదే వాయుతత్వములో ప్రళయము. ఆ తర్వాత వాయువు, హృదయ చక్రం నుండి పైకి, విశుద్ధి (కంఠ) చక్రము లోనికి లాగబడి, ఆకాశము యొక్క రూపాన్ని ధరిస్తుంది. అప్పుడు గొంతుకలో గురక పుట్టుతుంది. ఇదే ఆకాశ తత్వములో ప్రళయము. అంతటితో, శరీరము యొక్క క్రింది భాగము నిర్జీవమై, వదులుగా అయిపోతుంది. పట్టులన్నీ సడలిపోతాయి. ఇప్పుడు శరీరంలో, కేవలం కన్నులకు పైనున్న భాగం మాత్రం సజీవంగా ఉంటుంది. ఇప్పుడు ప్రత్యగాత్మ (జీవుని) లోనున్న బ్రహ్మతత్వము వెనుకకు (లోపలకు) తీసుకోబడుతుంది. కండ్లు వెనుకకు తిరిగిపోయి, చూపు విరాట్ తత్వము నందు లయమౌతుంది. ఈ విరాట్ తత్వము దానికదే అంతర్యామి తత్వములో లయమౌతుంది. ఆ అంతర్యామి తత్వము దానంతట అదే హిరణ్యగర్భుని యందు లయమౌతుంది. ఇదే బ్రహ్మ ప్రళయము. సుషుప్తి స్థితి (గాఢనిద్ర) దీనికొక ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

ఆ తర్వాత బ్రహ్మము యొక్క మూడు శరీరాలూ 'కాలతత్వము' లో కలిసిపోయి అంతర్థానమౌతాయి. ఇదే కాలతత్వంలో ప్రళయం అంటే. “కాలము” కూడా అన్నింటికీ చలన వేగాన్ని ప్రసాదించే "ఆది మాయ” యొక్క సుడిగుండం (బిలం) లో లయము అయిపోతుంది. ఆ తరువాత నిష్క్రమించడానికి ఇక ఏదీ మిగలదు. "ఆది మాయ” ముడుచుకుపోయి, కుంచించుకుపోయిన స్థితిలో అక్కడే స్థిరపడుతుంది. అదే “మహాకాలం” యొక్క నిష్క్రమణ. అన్నింటికీ పరమాధారము, క్రింది పొరలో ఉన్న దివ్యమూలాధారము మాత్రం ఒక విచిత్రరూపంలో ఎన్నటికీ లయం కాకుండా ఉంటుంది. అది అలాగే ఉన్నది ఉన్నట్లుగానే ఉండిపోతుంది.

## సాధనద్వారా ఆత్మ సాక్షాత్కారం

ఓ సాధువా! అవలంబించు సహజసిద్ధమైన సాధన

పొందలేవు దేనినీ, చేయనిదే సాధన

తెలుసుకో ఇదే దీనిలోని మర్మము

ఆత్మ సాక్షాత్కారం మాట అటుంచు

కావాలి ప్రాపంచిక విషయాల్లో కూడా సాధన.

సంస్కారాలు, కర్మ సిద్ధాంతం

ఇవి కూడా ఆశిస్తాయి ప్రతిఫలం

కర్మ ననుసరించియే ప్రతిఫలం, ఇదియే సిద్ధాంతం

అంగీకరించాలి నీవు, ఇదే పరమసత్యం.

మాటలూ, వాక్చాతుర్యాల వలన లేదు ప్రయోజనం

పని చేయడానికి తీసుకో గట్టి నిర్ణయం

భ్రమలుంటాయి కోట్లకొలదీ

లోనుకావద్దు వీటన్నింటికీ!

మాయం కాదీ భ్రమ, చేయనిదే సాధన

పోగొడుతుంది వీటినన్నింటినీ నీ సాధన

శబ్దయోగ సాధన, ప్రకృతి సహజమైన సాధన

దీని పద్ధతిని తెలుసుకో బాగుగా!

ప్రక్షాళన చేస్తే నీ మనస్సులోని మాలిన్యాన్ని

చూస్తావు నీ నిజస్వరూపాన్ని

అలాగ సాధించి సహజ పద్ధతిని

దాటుతావు సంసార సాగరాన్ని,

ప్రక్షాళన చేస్తే మనస్సులోని మాలిన్యాన్ని

చూడగలవు నీ నిజస్వరూపాన్ని

ఓ సాధువా! సత్సంగ కృపనుగొమ్ము


నీ ప్రయోజనాన్ని సాధించుకొమ్ము.

'పరబ్రహ్మము' అంటే బ్రహ్మమునకు ముందు అని గానీ, బ్రహ్మమునకు అతీతమైనది అని గానీ అర్థం. త్రిగుణాత్మకము అని వ్యవహరించే మూడు శరీరాలు కలిగిన ' బ్రహ్మము నకు ముందు ఎటువంటి స్థితి ఉండేదో, ఇప్పుడు కూడా ఎటువంటి స్థితి ఉన్నదో, ఆ స్థితినే 'పరబ్రహ్మము' అని అంటారు. ఆ స్థితి ఎటువంటిదంటే, వ్యాపించాలనీ, ఆలోచించాలనే కోరిక ఏదీ ఇంకా అప్పటికి స్పష్టము కానట్టి స్థితి. అది 'మాయ' అనే గుహలో 'సత్యతత్వము' యొక్క ప్రతిబింబము పడినంత మాత్రాన దానికదే వ్యక్తమైనది. మనము ఆతనిని ఒక ఆదర్శమైన గమ్యస్థానంగా, శరీరమును గురించిన భావనలకు భిన్నమైనటువంటి మానసిక భావనకు ఆదర్శముగా కల్పించుకున్నాము. అంతేగాక, ఆతని రూపాన్ని మన లక్ష్యముగా చేసుకున్నాము. ఆతని పేరు “శుద్ధ బ్రహ్మము”. శుద్ధము అంటే శారీరకత్వపు దోషం లేనటువంటిది అని అర్థం. దేనిలో శారీరకత ఉందో, దానిని 'సబల' బ్రహ్మము అని అంటారు. ఇది హిరణ్యగర్భుని స్థితి. అంటే ఈ స్థితి సుషుప్తి (గాఢనిద్ర) ని

పోలి ఉంటుంది. ఋషులు ఆ స్థితికి 'కాల పురుష' అనీ, 'మహా కాల పురుష' అనీ నామకరణం చేసారు. ఆ దైవమే సుడిగుండపు పీఠము. విజ్ఞులు అదియే సర్వస్వము అని తెలుసుకున్నారు.

ఆధారమూ లేదా శాశ్వతమైన పునాది అధిష్ఠానము. కూటస్థము యొక్క స్థితి దాని (శుద్ధ బ్రహ్మము) కంటే ఉన్నతమైనది. ఋషులు దీనిని "సత్యలోకము" నకు 'అధిష్ఠాన దైవము' అయిన సత్పురుషుడు అని పిలిచేవారు.

ఇక నాల్గవదశను 'తురీయము' అంటారు. త్రిగుణాత్మక మైనట్టి ప్రతిలోకానికీ చిట్టచివరి శిఖరమందు ఇది కనిపిస్తుంది. ఈ నాల్గవదశ లేకుండా ఏదీ ఉండదు.



పటము - 1


ఒక పెద్ద వలయం ఉంది. దానిలో ఒక పెద్ద త్రిభుజమూ, దాని మూడు కోణాల వద్దా మూడు చిన్న చిన్న త్రిభుజములూ, మళ్ళీ వాటిని ఆవరించి ఉన్న చిన్న చిన్న వలయాలూ ఉన్నాయి. పెద్ద వలయం అట్టడుగు పొర ఆధారాన్ని సూచిస్తుంది. ఇది పెద్ద నాల్గవ స్థితి. మిగిలిన చిన్న త్రిభుజాలను ఆవరించి ఉన్న చిన్న వలయాలూ, ఆయా త్రిభుజాల 'చిన్న నాల్గవ స్థితి'ని సూచిస్తాయి.

'అ'వద్ద నున్న త్రిభుజము 'బ్రహ్మము'

'క' వద్ద నున్న త్రిభుజము 'జీవుడు'

'గ' వద్ద నున్న త్రిభుజము 'ప్రకృతి'

కేవలం వివరణ కోసమే ఈ త్రిభుజాలు సూచింపబడ్డాయి. వాస్తవానికి 'బ్రహ్మము' అనే త్రిభుజము అన్నింటినీ, తన వలయాన్నీ కూడా ఆవరించి ఉంటుంది. “జీవము”, “ప్రకృతి" అనే త్రిభుజాలు కూడా దాని మధ్యనే ఉన్నాయి. అన్నింటికీ శిఖరంలో నున్నది "బ్రహ్మము”. అన్నింటికీ దిగువన ఉన్నది జడ పదార్థము ' ప్రకృతి'. దీనిని క్రింది విధంగా చిత్రీకరించవచ్చు.




‘అ’ అనేది ' బ్రహ్మము’

'క' అనేది 'జీవుడు'


‘గ’ అనేది ' ప్రకృతి’

ఇవి సాధారణ త్రిభుజాలు. 'హ' అనేది పెద్ద త్రిభుజం. ఇది “పరబ్రహ్మము”. దీనిలో మూడు చిన్న త్రిభుజాలు ఉన్నాయి. పెద్ద వలయము - 'ఇ': మూలాధారము, లేదా పీఠము, లేదా అధిష్ఠానము.

'జీవత్వము' అనేది వాస్తవికత.

‘బ్రహ్మత్వము' అనేది చేరవలసిన చోటు.

‘జ్ఞాని" ఈ జీవ, బ్రహ్మములను అధిగమించి, బ్రహ్మము యొక్క వాస్తవికతను తన ఆదర్శమైన లక్ష్యంగా ఉంచుకుని, దానితో లయావస్థను పొందడానికి సాధన చేస్తాడు. అటువంటివారు తమ లక్ష్యమే సర్వస్వము అని తలచి, సంతుష్టి నొందుతారు. ఇది కూడా సాధన లేనిదే సాధ్యపడదు.



పటము-3

1. బ్రహ్మము యొక్క ముల్లోకాలే కారణ, సూక్ష్మ, స్థూల శరీరాలు.

వీటిని ఆత్మ, హృదయము, శరీరము అనవచ్చు.

2. పదార్థము యొక్క ముల్లోకాలూ కారణ భౌతికత్వము, సూక్ష్మ


భౌతికత్వము, స్థూల భౌతికత్వము కల్గి ఉంటాయి.

3. “జీవ త్రిలోకము” అంటే త్రిగుణాత్మక 'జీవము' కూడా స్థూల,

సూక్ష్మ, కారణ రూపాలను కలిగి ఉంటుంది. అవి శరీరము,

హృదయము, ఆత్మ.

వీటన్నింటికీ అవతల "తురీయం” అనే నాల్గవస్థితి ఉంది. కాని, పరబ్రహ్మమునకు పైన, శిఖరము నందుండే "తురీయము" నకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబడింది.




పటము - 4.

1. పరబ్రహ్మ తురీయము (పరబ్రహ్మము యొక్క నాల్గవదశ)

2. బ్రహ్మ తురీయము (బ్రహ్మము యొక్క నాల్గవదశ)

3. జీవ తురీయము (జీవుని నాల్గవదశ)

4. ప్రకృతి తురీయము (ప్రకృతి యొక్క నాల్గవదశ)

5. అధిష్ఠాన తురీయము (పీఠము యొక్క నాల్గవదశ)

తురీయము, లేదా నాల్గవ స్థితి యొక్క జ్ఞానం కలిగినప్పుడు, త్రిగుణాత్మకము యొక్క జ్ఞానము కూడా వచ్చి తీరుతుంది. ఇది పరిపూర్ణ స్థితి కానేరదు. దీనిలో కొంచెము లోపం ఉంటుంది. తురీయావస్థలో లయమైనప్పుడు గానీ, దానిని దాటి ముందుకు వెళ్ళేటప్పుడు గానీ, ఎటువంటి లోపమూ ఉండజాలదు. ఈ తురీయాతీత స్థితి యందు కూడా లయావస్థ ఉన్నది. ఇది లోపరహితము. అటువంటి దశను 'సత్', అంటారు. దానినే 'శుద్ధ అస్తిత్వము' అని కూడా అంటారు. ఈ స్థితిలో లయము అయినవారికి ' అనుభవాలు' అనేవి ఏవీ ఉండవు. అవి ఈ స్థితికి ఆరంభ దశలోనే కలుగుతాయి. లేకుంటే ఆ లయావస్థ దశలో తానే 'అనుభవం' గా మారిపోతాడు.

నాల్గవదశ అయిన "తురీయము" ఒక అంతులేని స్థితి. దీనిలో 'అనుభవము' జాగృతం చేయబడుతుంది. జాగృదావస్థకు హద్దులు ఉన్నాయి. స్వప్నావస్థకూ, గాఢనిద్రావస్థకూ ఏ హద్దులూ ఉండవు. అదే మోస్తరుగా తురీయావస్థ కూడా అనంతమైనది. జాగృదావస్థ, స్వప్నావస్థ, దీర్ఘనిద్రావస్థలలోని జీవుడు ఎలాగైతే హద్దులు కలిగి ఉంటాడో అలాగే జీవుడి పరంగా చూస్తే, తురీయ స్థితిలోని జీవునికి కూడా హద్దులున్నాయి. కాని సాధారణంగా మానవులు సుషుప్తి అవస్థను ' అజ్ఞానము' అని తలుస్తారెందుకో? దానిలో తెలుసుకోడానికి అంటూ ఏమీలేదు కాబట్టి, ఎవరైనా తెలుసుకోవాలనుకున్నా ఏమి తెలుసుకోగలరు? ఆ స్థితికి వెళ్ళిన తర్వాత, జాగృత, స్వప్నావస్థలు రెండూ వెనుకకు మళ్ళిపోయి, ముడుచుకుపోయి, ఒకే బీజరూపంలో ఉంటాయి. ఈ దృష్టితో చూసినట్లయితే, ఎరుక ఉండదు. అందువల్లనే లోకులు ఈ వాస్తవ పరిస్థితిని తెలుసుకోలేక, ఆ స్థితిని అంధకారమనీ, అజ్ఞానమనీ భావిస్తారు. జ్ఞానము, ఎరుక యొక్క బీజమూ, మూలమూ దానిలో నిక్షిప్తమై ఉన్నప్పటికీ, దానినుండే మొలకెత్తినప్పటికీ, గాఢ నిద్రావస్థ నుండే ఒక విధమైన నవ్యత, సత్తువ కలుగుతాయి.

సుషుప్తి దశను తెలుసుకోడానికి ఏదైనా ఒక పద్ధతి ఉంటే, ఒకరు ఆ దశకు చేరి, దాని వివరాలను గురించి ఎంతో కొంత చెప్పడానికి వీలవుతుంది. ఆలోచించే హృదయం (మనస్సు) పూర్తిగా మెలకువగా ఉన్నప్పుడే, ఇది సాధ్యపడుతుంది. అలా తెలుసుకోగలగడానికి చేయవలసిన అభ్యాసమే ఇది. మెలకువ స్థితిలో ఉన్నప్పుడు హృదయం ఇచ్చే సహకారంతో, స్వప్నస్థితి, దీర్ఘనిద్రావస్థలు

గురించి ఆలోచించగలిగినట్లు, జాగ్రదావస్థ, స్వప్నావస్థల గురించి గాఢనిద్ర (సుషుప్తిలో ఉన్నపుడు కొంతవరకైనా తెలుసుకొనడం సాధ్యమౌతుంది. అది ఎప్పుడంటే, హృదయము (మనస్సు), దాని ఆలోచనల యొక్క పోకడలను సుషుప్తిలో కూడా నిలబెట్టుకోగలిగి, వేరే శక్తి ఏదైనా సుషుప్తి స్థితిని గురించి మనస్సును ప్రశ్నించినప్పుడే, అలా తెలుసుకోడం సాధ్యమౌతుంది. ఒక వ్యక్తి నిద్రావస్థ నుండి, గాఢనిద్రలోకి జారుకున్నప్పుడు, వేరొక వ్యక్తి వచ్చి ప్రశ్నల పరంపరను కురిపించినప్పుడు, నిద్రిస్తున్న ఆ వ్యక్తి, ఆ ప్రశ్నలన్నింటికీ తగిన సమాధానాలు చెప్పినప్పటికీ, అతనికి మెలకువ వచ్చిన తర్వాత ఆ ప్రశ్నల గురించీ, ఆతడిచ్చిన సమాధానాల గురించీ ఆతడికేమీ "తెలియదు. ఈ విషయాన్ని మనము సాధారణంగా గమనిస్తూనే ఉంటాము.

"తురీయ" ము దివ్యదృష్టి యొక్క స్థితి. జీవుని తురీయ దశ ఎల్లప్పుడూ జీవునితోనే ఉండి ఎప్పుడూ వేరుపడదు. అది 'శృతి'తో సంబంధాన్ని కలిగి ఉంటుంది. ఉదాహరణకు ఒక పల్లెటూరి వ్యక్తిని తీసుకోండి. ఏదోవిధంగా ఆతడి జీవ తురీయము మేల్కొన్నది. అతడి చుట్టూ పల్లెటూరి జనం, అతడినేదో భూతం ఆవహించిందని ప్రకటించి, అతడిని విపరీతంగా కొట్టి, తిట్టి, హింసించి ఆ స్థితిని అణగద్రొక్కుతారు. అతనిలో గల జీవ తురీయము మాత్రం జీవునితోనే ఉంటుంది. కాని పూర్ణ జ్ఞానముతో మాత్రము అది తిరిగి రాలేదు. కనుక, ఈ జీవ తురీయ దశలో, ఈ లయావస్థలో ఏదో లోపం ఉండి, అది హానికరంగా మారింది. అతడు పూర్తి జ్ఞానముతో ఆ లయావస్థలో ప్రవేశించి ఉన్నట్లయితే, పరిస్థితి వేరే విధంగా ఉండేది. ప్రతీ వ్యక్తిలోనూ ప్రతి ఒక్క దశ కనపడుతుంది. కొందరిలో అవి లోపల అణగారి ఉంటే, మరికొందరిలో అవి మేల్కొని ఉంటాయి. అందరూ దానిప్రకారం దానితోనే జీవనం కొనసాగిస్తుంటారు.

* పెద్దవాళ్ళు ఎంతో ప్రయత్నం చేసినా అర్థం చేసుకోలేని కొన్ని విషయాలను చిన్నపిల్లలు క్షణంలో గ్రహిస్తారు. అదే విధంగా, అనాగరికంగా ఉండే పల్లెటూరి వాళ్ళల్లో కూడా - ఆడైనా, మగైనా సరే - వారిలోనూ దివ్యదృష్టి ఉంటుంది. కొందరిలో స్వల్ప ప్రయత్నంతోనే ఆ దివ్యదృష్టి మేల్కొంటుంది. కాని కొందరిలో, దానికొరకు ఎంతో శ్రమపడవలసి వస్తుంది. ఇంత జరిగినా వారిలో గల దివ్యదృష్టి అంత సులభంగా సిద్ధించదు.

ఈ జీవ తురీయావస్థ మేల్కొన్నప్పుడు, అది సుషుప్తిని పోలి ఉంటుంది. దీన్ని బహు కొద్దిమందే విశ్వసిస్తారు. బ్రహ్మ తురీయము కూడా కాలచక్ర పరిధిలోనే ఉంటుంది కనుక, దాన్ని సాధించిన తర్వాత కొద్దిగా క్రిందకు పడిపోతుంది. దాన్ని సాధించినప్పటికీ, ఆ దశ శాశ్వతంగా

ఉండదు. కాని నాల్గవదశలోని తురీయావస్థ (అధిష్ఠాన తురీయం) యొక్క ప్రవాహం మాత్రం ఎడతెరిపి లేకుండా అలా సాగుతూనే ఉంటుంది. నిదానంగా సాధనచేసి, మనస్సు దాని అధిష్ఠాన తురీయము యొక్క రూపాన్ని ఎప్పుడు పొందుతుందో, అప్పుడు శాశ్వత తత్వము సిద్ధించి, దిగజారుట అనేది సంభవించదు.

## సాధనోపాయములు

1. సత్సంగము.

2. అభ్యాసము.

సమర్థ గురువర్యులను విధిగా పూజించాలి. సత్యతత్వముతో ఉన్న సాంగత్యమే సత్సంగము అవుతుంది. సాధన అంటే శబ్దయోగాన్ని అభ్యసించడంలో నేర్పు గడించడం అని అర్థం.

సద్గురువును ఈ క్రింది విధంగా నిర్వచించవచ్చు.

1. అతడు సత్యతత్వంతో అనుబంధాన్ని కలిగి ఉండాలి. అంటే, ఆతడు నాల్గవ స్థితి (తురీయం)లో నివసించి ఉంటూ, జీవన్ముక్త దశలో ఉండాలి.

2. ఆతడు యోగసాధన చేసినవాడై ఉండాలి. శబ్ద అభ్యాసము చేసి ఉండాలి. ఈ ప్రక్రియ ద్వార ఆతడు తన మానవ మేధస్సులోని అంతర్గత మండలాలపై పూర్తి ఆధిపత్యాన్ని కలిగి ఉండాలి.

3. ఆతనికి నక్షత్రాలలా మిలమిల మెరిసే కళ్ళూ, వెడల్పాటి నుదురుభాగం ఉండాలి.

4. భక్తి, జ్ఞానము, కర్మలనే విషయాల గురించి అతనికి పూర్తి అవగాహన ఉండాలి. ఎవరైనా ప్రశ్నలు వేసినప్పుడు, వారి నోటికి తాళం వేయకుండా ఆతడు వారి ప్రశ్నలన్నింటికీ తగిన సమాధానం చెప్పగలిగి ఉండాలి.

5. అతడు ఆధ్యాత్మిక విషయాలతో సంబంధాన్ని కలిగి ఉండాలి. అంటే వాటి పట్ల తగు శ్రద్ధ కలిగి ఉండాలి.

ఇవన్నీ సాధారణ లక్షణాలు. కానీ, వాస్తవమైన అంతరంగ యోగ్యత ఎలాంటిదై ఉండాలి అంటే, ఆతడు తనలో మేల్కొని ఉన్న అంతర్దృష్టి ద్వారా తన శిష్యులకు దివ్యకృపను (ప్రాణాహుతిని ప్రసారం చేసి వారిని సంతుష్టులను చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉండాలి).

కట్టడిసేయుము బుద్ధిని మూడవ అంతరువునందు,

ఉత్తమ జ్ఞానంబు కలుగు ఈ యోగంబు వలన;

బుద్ధిలోన ఈ దశ గోచరము కాగ

వేయి టేకుల తామర విప్పారు సుమ్ము.

అనేకముతోనున్న ఈ జగము ' విరాట్' నకు ఉనికిపట్టు

కానవచ్చె నటులే ఈ చలిత బ్రహ్మాండంబు;

ప్రభువు పొదరింట ధ్యానంబు పట్టుబడియె

వెలుగు గోచరమయ్యె, వినవచ్చె దివ్య శబ్దంబు మఱియు,

గంటల గణగణ మఱియు శంఖనాదము ఇంపుగాను,

తియ్యటి కబురులు వెలుగుజాడలు మఱియు.

శబ్దము వినవచ్చె కంటికానినది దివ్య కాంతి మఱియు

నిలుప బడినది ధ్యానము, దివ్యానంది మవతరించె మఱియు,

నిమగ్నమాయెను మనసు అత్యుత్తమ ప్రేమ యందు.

పులకరించెడి సంతసము పావన నామ మందు

వసియించి కొన్నాళ్లు సహస్రకమల మందు

కోరిక పొడచూప రెండవ దశ పొందు కొఱకు

త్రికుటికి పరుగులిడె మీదికి బోవు వంకర బాట

మఱియు జూచితి 'ఓం' కారపు కాంతి నచట.

పావన ఓంకారము సద్గురుని కృపయు,

సమయించు నీ రెండు, మానసిక తొణకు లెల్ల;

పుత్తడి తావిది సద్గురుని యొక్క

సత్సంగ వచనాల లోలోని పబ్బంబు.

ఎఱుపు భానుడు కెంజాయ ధ్వజము మఱియు

వినుటకు ఓంకార నాదంబు మద్దెల ధ్వనులు మఱియు.

స్థిరము చేయు మొక్కెడ చూడ్కులు నీదు

వినుము నాదంబు ధ్యానమగ్నత తోడ,

నిలుపుము నీదు దేహంబు కదల్పక తిన్నగాను

పిమ్మట దృశ్యంబు కేవలము కలుగునపుడె.

త్రికుటి చెంత ధ్యానంబు పూర్ణత నొందు వ్యక్తి

మహాత్ముడన బరుగు, దేహపారంగతుడు వాడు;

సోదరా, ఆంతరిక అభ్యాసము ఇదియె సుమ్ము,

మెదలిడును సద్గురుని పథము ఇచటి నుండి.

'శూన్య' మండలము తట్టు ఇఱుకు దారిని పోవ,

రుచి గాదె మనసుకు పుట్టుకతో నున్న జంటతనము;

గ్రోలుము చల్లని వెన్నెలల పూ దేనియలను

అతి భాగ్యశాలి యగును దీనిని పొందు వాడు.

ఫిడేలు సారంగుల ఇంపైన స్వరాలు

లోన విన వచ్చె మఱి ఉయ్యల లూగె మనసు.

చూడుము స్థిరపడిన నీదు మనసు  రూపంబు

నాట్యంబు సేయుట 'శూన్యత్వ' భవనమందు.

పరికించి చూడుము నీదు స్వంత దశను

పడయుము స్థిరమైన శాంతిని పరమానందమందు.

కటిక చీకటి వ్యాప్తమై యుండు నెచట

నియమిత లక్ష్యంబు పోలికపట్టు బడదు

కలత జెందదు సమాధి శూన్యత్వంబులోన

ఎటుల వర్ణించుటో దాని గొప్పతనము?

ఇంపు గాదె బ్రహ్మరంధ్ర శిఖరంబు

ప్రాప్తమాయెను నామంబు శక్తి వలన.

ఏడు రంగుల భానుడు భాసిల్లు నెచట

సంతసింపుము విని మధురమగు ఫిడేలు నాదములను.

స్నాన మొనరింపుము మానస దివ్య సరసు నందు

తెలిసికొనుము ఎగురు తెఱగు మఱియు హంస పథము.

కలియుగపు పాప పంకిలము కడిగివేసి

పునీతుడవు కమ్ము పూర్వపు ఋషుల పోలి

నీరు నుండి పాలను వేఱు పఱచి

అతి ఉత్తమ తరగతి హంస ఎగుము.

## <u>దాస్యము – స్వేచ్ఛ</u>

కృత్రిమ భావాలూ, తనకు తానుగా కల్పించుకొనిన కృత్రిమ సంబంధాలు స్థిరంగా ఉంటాయనుకునే మానవుని అభిప్రాయమూ, మతం లాగే మనస్సుకు సంబంధించిన మనోభావన యొక్క రూపాలే. ఇది ఒకే దిశగా పయనించే మానవుని మనోనిశ్చయం యొక్క సయ్యాట. ఈ

జీవితం దాస్యమెలా అయింది? అన్నదే ఇప్పటి ప్రశ్న. దీనికి సమాధానం: ఆలోచనలతో ఆడుకున్న ఆటలే బంధనానికి మూలకారణాలయ్యాయి.

ఆశవల్లనే జన్మించింది అత్యాశ మనస్సులో

గట్టిగా పెనవేసుకుందది మనస్సును.

క్రమక్రమంగా దృఢంగా మారిందా అత్యాశ

అనుబంధాలకు అదే అయ్యింది మూలకారణం.

ఆ దృఢత్వంలోనే బంధింపబడింది మనస్సు

నేనూ, నాదనే పాశంతో

అయ్యిందదే పడుగూ-పేకా

దానితో అల్లుకుపోయింది సాలెగూడు దాని చుట్టూతా!

అలాగ అధికమయ్యింది కోరిక అనుబంధాల ఎడల

అయ్యిందదొక అవగుణాల చీకూ-చింతల గని

పాముతో జతగూడి తిరుగుతున్న చుంచువలె

ఉండిపోయిందది అతి మూర్ఖంగా, అవివేకంగా.

వదలుకోలేదది అత్యాశ, అనుబంధాలను

దాని సరసనే ఉండాలి సదా అని కోరుతుంది.

ఎక్కడ అత్యాశ ఉందో, ప్రక్కనే ఉందక్కడ దాస్యం

విచిత్రం, ఆశ్చర్యం - ఈ వరుసక్రమం.

కాలపాశపు బంధనము ఇది

కన్పించదు మరి ఎవ్వరికీ ఇది

దివ్యకృపను అనుగ్రహిస్తే ఆ దైవం

అప్పుడే అవుతుంది మానసిక క్షోభ మటుమాయం.

ఉదాహరణకు, నాటకంలో ఒక నటుడు ఇంద్రుని పాత్ర ధరించి, రంగస్థలం మీదకు వస్తాడు. అతడు తన బలమైన ఆలోచన కారణంగా ఆ నాటకం జరుగుతున్నంతసేపూ తాను నిజంగా ఇంద్రుడనేనని భావిస్తాడు. నాటకంలో ఇంద్రుని పాత్రను ఎంతో చక్కగా పోషిస్తాడు. కానీ, నాటక ప్రదర్శన ముగిసిన తర్వాత కూడా, తాను ఇంకా ఇంద్రుడనేనన్న భావన ఆతని హృదయంలో బలంగా నాటుకుపోతుంది. అందరూ ఆతడిని చూసి, నవ్వి, ఆతని వాస్తవ స్థితిని ఆతనికి వివరిస్తారు. అయినా ఆతడు ఒప్పుకోడు. దానిఫలితంగా ఆతడు అపహాస్యానికీ, హేళనకు గురి అవుతాడు; దుఃఖానికి లోనౌతాడు.

ఇంకొక ఉదాహరణ తీసుకోండి. ఒక వ్యక్తి స్వప్నంలో తనకు జబ్బు చేసినట్లు కలగంటాడు. ఆ భావం ఎంత దృఢమైనదంటే మెలకువ వచ్చిన తర్వాత కూడా తాను అస్వస్థుడననే అనుకుంటాడు. నిద్ర-జాగృదావస్థల్లో కూడా ఆతడు ఆరోగ్యవంతుడే తాను రోగిష్టివాడిననే నమ్ముతాడు. నిజానికి అయినప్పటికీ, ఆతడు దానిని అంగీకరించడు. దాని ఫలితంగా అతడు అకారణంగా విచారంలో మునిగి ఉంటాడు. భావ బానిసత్వానికి ఇది మరొక ఉదాహరణ.

ఇంకొక ఉదాహరణ తీసుకుందాం. ఒక వ్యక్తికి భూతాలంటే భయం. చీకటిలో ఒక చెట్టు కొమ్మను చూసి, భూతమని భ్రాంతి చెందుతాడు. ఆతడి మనస్సు 'అదొక పెద్ద కోరలున్న భూతం' అనే భావాన్ని కలిగిస్తుంది. దానితో ఆతడు భయపడి, పరుగు లంకించుకుంటాడు. పరుగులెత్తుతూ దారిలో పడిపోయి, స్పృహ కోల్పోతాడు. అతడికి స్పృహ వచ్చి, కళ్ళు తెరచి చూసిన తర్వాత కూడా అది భూతమే నన్న భావం ఆతడిని వదలదు. ఆతడా భూతాన్ని గురించే మాట్లాడుతూ, గొణుగుకుంటూ, పిచ్చివాడై తిరగడం మొదలెడతాడు. ఆతడికి ఇది దుఃఖం కాక మరేమిటి? వ్యక్తికి, తన మనస్సులో నుండే పుట్టుకొచ్చిన ఒకానొక భ్రమ ఆతడిని వశపర్చుకుని, ఈ విధంగా బాధ పెడితే, ఆతడు ఆ భావానికి బానిసైపోయి, అశాంతికి లోనౌతాడు.

ఈ ప్రపంచం, భ్రమలకు నిలయం. ఇక్కడ కోటానుకోట్ల భ్రమలతోకూడిన ఆలోచనలు తమ విన్యాసాలను చూపిస్తూ ఉంటాయి. అటువంటి భ్రమలకు లోబడిపోయిన మానవుడు పూర్తిగా దుఃఖంలో మునిగి, బాధ పడకుండా ఎలా ఉండగలడు? బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులనేవి భ్రాంతి వలన కలిగే భావాలే. గృహస్థ, వానప్రస్థ, సన్యాసాశ్రమాలనేవి కూడా భ్రాంతి వల్ల కలిగే

భావాలే. హిందు, ముసల్మాను, క్రైస్తవ, యూదులు అనేవి కేవలం భ్రమలు మాత్రమే. మతము, సాంప్రదాయము, రివాజుగా వచ్చే ఆచారాలు, తెగలూ, ఉప తెగలూ ఇవన్నీ కూడా భ్రమలే. ఈ భ్రాంతి అనే సంకెళ్ళు తగిలించుకుని అయిన మానవులు, అశాంతికి వాస్తవాన్ని కనుగొనలేకపోతున్నారు. ఈ భవబంధాలన్నీ వాస్తవాలు కావు. అవన్నీ మానవ కల్పితాలు, భ్రమలు, ఆలోచనాసరళిలో మాత్రమే ఉండే కల్పనలు. ఈ సంకెళ్ళు ఇంకొంచెం సాగి, మరణించిన తర్వాత పరలోకంలో కూడా కొనసాగుతూ మనిషిని ఇంకా బానిసగానే ఉంచుతాయి. (బానిసలు లోనై, )

ఈ 'బంధాలను' గ్రహించగలిగితే, మానవుడు సుఖదుఃఖాల ననుభవించి, వాటిపై ఏవగింపు కలిగి మానసికంగా వాటికి దూరంగా జరిగిపోతాడు. భ్రమలకు లోనై, బందీలైనట్లుగానే, భ్రమలను వదలి స్వేచ్ఛను ఆనందించే వ్యక్తులెందరో ఉన్నారీ లోకంలో. అటువంటి వారు తమకు కోరికలు కలుగగానే, వెంటనే వాటిని బుజ్జగించి శాంతపరుస్తారు. అట్టి వారిని ఉన్నత స్థితులకు చేరుకున్న జ్ఞానులు అని అంటారు. అలాంటివారు బందీలై ఉన్నవారికి వివరించి, వారిని బంధ విముక్తుల్ని చేస్తారు. వారిని “ముముక్షువులు" అని అంటారు. అలాంటివారు ఉండడం నిజంగా మానవాళి అదృష్టం. వారు దాస్య విమోచనాన్ని ఆకాంక్షిస్తారు. అలాంటివారు మహోన్నతులైన ప్రతిభావంతులు. కాని బంధం ఎడల ప్రీతి చెందినటువంటి ఈశ్వర భక్తులు మొండిపట్టు విడువని మూర్ఖులు. వారు బంధాన్ని తెంచుకోడానికి ఇష్టపడక, కేవలము దుఃఖం నుండి తప్పించుకోవాలనే కోరుతుంటారు. వారి యోగ్యత అటువంటిది. వారి రోగాలను నయం చేసే వైద్యులు సాధారణంగా మత ప్రచారకులే. ఒక భ్రాంతికి చికిత్స మరొక భ్రాంతితో చేసి సావధానంగా చాలమందిని బంధాలనుండి విముక్తులను చేస్తారు.

ఇంతకంటే పనికిమాలిన మూడవ తరహా వ్యక్తులు కూడా ఉన్నారు. ప్రత్యేక మత భావాలూ, ఆచారాలూ, చాదస్తపు నడతలూ, రీతి రివాజులూ అనేవి దాస్య ప్రవృత్తికి మార్గాలని వారికి బాగా తెలుసు. కానీ వారు సంస్కరణలకు పరమ శత్రువులు. వీరిని దాస్య విముక్తులను చేసేవారు కొంత కఠినమైన స్వభావాన్ని కలిగి ఉంటారు. తమ భక్తులతో నిష్కర్షగా పని చేయిస్తూ వారి మూఢ నమ్మకాలనూ, ఆచారాలనూ తలక్రిందులు చేస్తారు. అతి క్రూరంగా, భయంకరంగా వారి భ్రాంతి భావాలను వ్రేళ్ళతో సహా పెకలించి వేస్తారు. నిజానికి వారు ఎంతో మృదు స్వభావులూ, సహృదయులే గానీ, వేరే మార్గం లేనప్పుడు బలప్రయోగంతో, కఠినంగా ప్రవర్తిస్తారు.

మానవులకు స్వేచ్ఛను ప్రసాదించే సాధు, సంతులనే నాల్గవ తరహాకు చెందినవారు కొందరు ఉంటారు. వీరు అన్ని మతాలలోనూ, అన్ని జాతులలోనూ కన్పిస్తారు. వీరు ఎంతో ఉదాత్తులు, సహృదయులు, దయామయులు, సానుభూతిపరులై ఉంటారు. వారు తమ భక్తులందరితోనూ స్నేహంగా ప్రేమతో ఉంటూ, వారికి మార్గదర్శకులై, వారిని జాగృతం చేస్తూ ఉంటారు. వారు కఠిన నియమాలు, దండనలు, భయపెట్టడం లాంటి విధానాలను అవలంబించరు. సత్సంగమనే అనుబంధాన్ని దృఢం చేస్తూ, తమ సత్సంగ ఫలితాన్ని వారికి అందజేస్తూ, వారిని విముక్తులను చేస్తూ ఉంటారు. వారి భ్రాంతులను దూరం చేస్తారు. మతాచారాల పట్ల, సాంప్రదాయాలపట్ల ఏమాత్రం ఏవగింపనేది లేకుండా, వారి వారి భావాలకు అనుగుణంగా వారికి బోధనలు చేస్తూ, తమ అభిమతాలను జోడిస్తూ, సాధకులను తమలాగే తయారుచేసుకుంటారు. వీరు నలుగురూ వివిధ తరగతులకు చెందిన ముక్తిప్రదాతలు.

ఎంతైనా ప్రతి రోగీ ఏదో ఒక విధమైన చికిత్సకు నిస్సందేహంగా అర్హుడే. ఇప్పుడిక జరిగేదేమిటంటే, కొందరు రోగులు వైద్యుల సలహాలను పాటిస్తూ, వారు చెప్పినట్లుగా శ్రద్ధగా మందులు వాడుతూ, క్రమపద్ధతిలో ఆహార నియమాలను పాటిస్తూ, త్వరగా ఆరోగ్యవంతులౌతారు. మరికొందరు మాత్రం తమ అజ్ఞానం వల్ల, ఆహార నియమాలను నిర్లక్ష్యం చేస్తూ, వైద్య సలహాలను పెడచెవిని పెడుతూ, అనారోగ్యాన్ని కొనితెచ్చుకుంటారు. వైద్యుల చికిత్సలు వేర్వేరుగా ఉండడానికి ఇదే కారణము. వైద్యునిపై పూర్తి విశ్వాసాన్ని ఉంచే రోగులే సంతోషంగా తీసుకుంటారు. మంచివారు. మందులను పథ్య - అపథ్యాలను ఎంతో శ్రద్ధగా పాటిస్తారు. అలాంటివారు ఎంతో త్వరితంగా, సునాయాసంగా ఆరోగ్యాన్ని తిరిగి పొందగలరు.

రెండవ తరహాకు చెందిన రోగులు వైద్యుని సలహా శ్రద్ధగా వింటారు కానీ వాటిని అనుసరించరు. ఆహార నియమాలను పాటించరు. వైద్యులు నయానో, భయానో వారిచేత మందులు మ్రింగించి మెల్లమెల్లగా వారిని తమ దారిలోనికి తీసుకువచ్చి, సాధారణ వైద్యం చేస్తూ, వారిని ఆరోగ్యవంతులుగా చేస్తారు. ఇక మూడవ రకానికి చెందిన రోగుల విషయానికి వద్దాం. వారికి అనారోగ్యం క్షణాల్లో మటుమాయం కావాలి. కానీ వైద్యులు చెప్పే నియమాలంటేనే వారిలో ఏవగింపు కలుగుతుంది. చేదు మందులంటే అసలే కిట్టదు. అప్పుడప్పుడు వైద్యులనే అసహ్యించుకుంటారు. అటువంటివారికి ప్రకృతి కర్కశ మనస్కులైన వైద్యులను ప్రసాదిస్తుంది. వారు రోగి గుండెలమీద కూర్చొని, బలవంతంగా చేదు మాత్రలనూ, గరళ కషాయాలనూ మ్రింగిస్తారు. ఆ రోగుల భావాలను

గానీ, వారి రోదలను గానీ ఆ వైద్యుడు పట్టించుకోడు. రోగులతో ఎంతో కఠినంగా ప్రవర్తించి, దురుసుగానూ కటువుగానూ వ్యవహరిస్తాడు. రోగుల అభిప్రాయాలను మనోభావాలను ఏమాత్రం లెక్కచేయడు.

నాల్గవ తరహా వైద్యుడు సాధు, సంతుల వంటివాడు. రోగులతో స్నేహంగా ఉంటూ, వారిపట్ల సానుభూతి చూపిస్తూ, వారికి యిష్టమైన పద్ధతిలో వైద్యం చేస్తూ, రోగాన్ని నయం చేస్తాడు. రోగి ఎంతటి మొండివాడైనా ప్రేమతో, ఆప్యాయతతో ఆతడిని లొంగదీసుకుని, వైద్యం చేసి, వానికి పూర్తి ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాడు. రోగి వైద్యం పొందడానికి కావలసిన అర్హత ప్రతి దశలోనూ ఉన్న అతని పరిస్థితిని బట్టి ఉంటుంది.

## విముక్తి - మోక్షముల స్వభావము

దుఃఖములనుండి విముక్తి పొందడమే మోక్షము. మోక్షము శాశ్వతమూ, అశాశ్వతమూ కూడా. ముక్తియందు దుఃఖం ఎంత మాత్రమూ లేకుండా ఎప్పుడు ఉంటుందో, అప్పుడు అటువంటి, ముక్తి శాశ్వతమైన మోక్షం అవుతుంది. మరి మోక్షం శాశ్వతమైనది అన్నప్పుడు, బంధం కూడా శాశ్వతమైనదేనా? కాదు. బంధాలనేవి శాశ్వతం కానేరవు. అవి కేవలం అనిత్యమైనవి. బంధాలు శాశ్వతమైనవే అయితే, అసలు మోక్షప్రాప్తే అసంభవం అయి ఉండేది. బంధాలు అనిశ్చితమైనవీ, అశాశ్వతమైనవీ అయినప్పుడు మోక్షమనేది కూడా అశాశ్వతమైనదేనా? అన్నదే ప్రశ్న. బంధాలు అశాశ్వతమైనవి అయినా, మోక్షమనేది శాశ్వతము.

అసలు మనోభావాలు గానీ, చలనం గానీ లేకుండా రాయిలా పడి ఉండడమే మోక్షమని కొందరంటారు. మహాసాగరంతో కలిసి ఒకటైపోయిన నీటిబిందువు వలే ఉండడాన్ని మోక్షమని ఇంకొందరు భావిస్తారు. మరికొందరు ఆత్మజ్యోతి, పరంజ్యోతిలో ఐక్యమవ్వడమే మోక్షమని అంటారు. మరి ఇంకొందరు, ఉన్నతమైన స్థితికి ఎదిగిన వ్యక్తి మోక్షాన్ని పొందాడని విశ్వసిస్తారు. కానీ వీరిలో ఏ ఒక్కరూ చెప్పింది నిజంకాదు. మనస్సులో 'అనురక్తి'ని కలిగి ఉండడము బంధము. మరి 'విరక్తి' కలిగి ఉండడమే “మోక్షం” అవుతుంది. దీనిని 'సమర్పణ' లేదా 'పరిత్యాగం' అని కూడా అంటూ ఉంటారు. పరిత్యాగము, మరియు విరక్తి - వీటిని కూడా ముక్తి అని అనవచ్చు. ఈ రెండింటి మధ్య గల తేడా ఇదే. ఇలాంటి తేడా ఒక మహాత్మునిలోనో, లేదా సర్వస్వాన్నీ విడిచిపెట్టిన వ్యక్తిలోనో కన్పిస్తుంది. ఎవరైతే విరక్తియందు ఆసక్తినీ, ఆసక్తియందు విరక్తినీ కలిగి ఉంటారో,

అలాంటివారిని మహాత్ములు అని అంటారు. వారి ముక్తి ఆవిధంగా ఉంటుంది. వారిది 'ఆసక్తి', 'విరక్తి' దశలకు అతీతంగా వెళ్ళినటువంటి శుద్ధ అస్తిత్వము. ఇది సుగమమైనట్టి మార్గము. అన్నింటినీ విడచిపెట్టి, సర్వసంగ పరిత్యాగిగా మారిన వ్యక్తిని 'విరక్తుడు' అని అంటారు. అలాంటి వ్యక్తి అనురక్తి పట్ల 'సంపూర్ణ విరక్తి' యందుండే అన్ని దశల అంతరువులను దాటిన స్థితి వైపు వెళ్తాడు. దీనిని 'ఇది కాదు, ఇదీ కాదు' అనే 'నేతి... నేతి...' మార్గాలని అంటారు. వీరిద్దరూ ఆశించే లక్ష్యమూ, ఆదర్శమూ ఒక్కటే. వీరిలో ఒకనికి దానిని గురించి పూర్తిగా స్పష్టంగా తెలుసు. రెండవవానికి అలాంటి స్పష్టమైన దృష్టి ఉండదు. అది కూడా సంపూర్ణమైన 'అభావస్థితి' నేతి... నేతి... కాదు. 'అభావం కాని అభావస్థితి' ఎలా సాధ్యం? ఇది కేవలం అర్థం లేని మాటల గారడీలా కన్పిస్తుంది. లోలోపల వాడు (విరక్తుడు) కూడా అనురక్తి వైపు గురిపెట్టి ఉంటాడు. అంతేకాదు, ఈ అనురక్తి మరేవిధంగానూ నిరాకరించడానికి వీలు లేదు. 'అభావస్థితి' లేదా 'పరిత్యాగము' అనేది శుద్ధ జ్ఞానమార్గము. మరి అనురక్తి అనేది మాత్రం పూర్తిగా స్పష్టమైనట్టి ప్రేమ, భక్తి మార్గము. అది సాక్షాత్తూ సుగమమైన మార్గం.

## మోక్షము

మోక్షప్రాప్తికి సాధనా మార్గం ఇదే:

గురుభక్తి కలిగియుండుము మెండుగ మొదటి జన్మయందు

ఆ పరంధాముని దివ్య నామగానము చేయుచు నోరార మరు జన్మయందు

మోక్షప్రాప్తి గలుగును మలి జన్మయందు

చేరితివి పో! నీ గమ్యమును నాల్గవ జన్మమందు.

అంటే :

తొలి జన్మయందు ఇంద్రియ నిగ్రహంబు పాటింప

మలి జన్మయందు పరిపూర్ణ గృహస్థ జీవితంబు గడుప

ఆవలి జన్మయందు కానలకేగి త్యాగియై యుండ

నాల్గవ జన్మయందు గమ్యము చేరుట నిశ్చయంబు కాదా!

గురుభక్తి అంటే కేవలం ఆరాధన. గురువర్యునితో సహవాసము చేసి, అనుమానాలను నివృత్తి చేసుకో. దివ్యనామ జపం చేసి కొంతసేపు మౌనంగానే ఆ ఈశ్వర నామాన్ని, బయటకు శబ్దం రాకుండా ఉచ్చరించడమే అంతర్గత సాధన. ఈ సాధనను కొంతకాలం కొనసాగిస్తే, మానవునికి మోక్షం లభిస్తుంది. దీనినే 'జీవన్ముక దశ'' అనీ, ఆతడిని "జీవన్ముక్తుడు" అనీ అంటారు. జీవన్ముక్తుడు అంటే జీవించి ఉండగానే ముక్తిని/మోక్షాన్ని పొందినవాడని అర్థం. ఈ స్థితిని కొన్నాళ్ళపాటు అనుభవించి ఆనందించు. ఆ తరువాత అప్రయత్నంగానే అసలైన గమ్యాన్ని చేరుకుంటావు. అక్కడినుండి నీకు తిరుగుముఖం పట్టడం అనేది ఉండదు. "సంత్మత్' అనబడే సాధు, సంత, సజ్జనులకు మోక్షం, ముక్తి అనేవి వారి గమ్యంగానీ, ఆదర్శం గానీ కావు. ఆరాధన చేస్తూ ఉంటే, వారు దానిని పొందగలుగుతారు. సత్సంగీయుడు నియమానుసారంగా తన పద్ధతిని అనుసరిస్తూ ఉంటే, ఉంటే, తన జీవితకాలంలోనే సునాయాసంగా మోక్షాన్ని పొందుతాడు. ఆదినుండి మనయందు ఉన్నటువంటి ఆ నిజరూపాన్ని తెలుసుకోడంలోనే దాని గొప్పదనం ఉంది. మనకు ఉన్న భ్రాంతుల వలన, మనము ఆ సత్యజ్ఞానాన్ని పొందలేక పోతున్నాము. ఆరాధనా, భక్తి వీటిని విశదం చేస్తాయి. ఇదే అసలు విషయం. మన బంధాలకు కారణమైనవాటిని వెనక్కి తిప్పితే అవే మన మోక్ష ప్రాప్తికి సహాయకారులవుతాయి.

ఈ భవబంధాలకూ, మోహానికి గల కారణాలు మూడు.

1 జ్ఞాపకముంచుకోడం

2. ధ్యానం చేయడం

3. భజన చేయడం

ఈ మూడింటి ఆచరణా కనుక బహిర్గత వస్తువులతో సంబంధాన్ని కలిగి ఉంటే, దాని ఫలితంగా పునర్జన్మా, బంధనాలూ ఏర్పడతాయి. కాని వాటినే అంతర్గతంగా, మానసికంగా ఆచరిస్తూ, మన గమ్యాన్ని నిరంతరం మన దృష్టిలో ఉంచుకుంటే, దాని ఫలితంగా ఈ భవబంధాలనుండీ, పైపైకి కనిపించే అనుబంధాలనుండీ మనకు విముక్తి లభిస్తుంది.

1. 'స్మరణ' అంటే పదేపదే జ్ఞాపకం చేసుకోడం

2. 'ధ్యానం' అంటే దాని భావాన్ని కలిగి ఉండడం

3. ‘భజన’ అంటే దానిపైననే దృష్టి లేదా తదేక ధ్యాస కలిగి ఉండడం

గురువర్యులు ఆదేశాలననుసరించి వీటిని వెనుకకు మరల్చి చూడండి. బయటనుండి కలిగే సంస్కారాలంటే మనలో ప్రతిఘటన కలుగుతుంది. లోపలి ముసుగును తొలగించాలి. అప్పుడు ముక్తి, మోక్షం అంటే ఏమిటో నెమ్మది నెమ్మదిగా స్పష్టమౌతుంది. మోక్షం కూడా సాధ్యమౌతుంది.

## అభ్యాసి ధ్యానము చేయు విధానము

ప్రార్ధన

ఓ ప్రభూ! మానవ జీవితమునకు యదార్ధ లక్ష్యము నీవే.

మేమింకనూ కోరికలకు బానిసలమై యుండుట

మా ప్రగతికి ప్రతిబంధకమై యున్నది.

మమ్ము ఆ దశకు చేర్చు ఏకైక స్వామివి, శక్తివి నీవే.

### ఉదయము ధ్యానము

పూజకై ప్రత్యేకించబడిన స్థలములో ఒకే భంగిమలో కూర్చొని, శారీరక,మానసిక శుభ్రతలను కలిగి, నిత్యము నిర్ణీత సమయమందు సూర్యోదయమునకు ముందే ఒక గంటకాలము ధ్యానము చేయుము.

పై ప్రార్ధనను ఒకమారు ఉచ్చరించిన తరువాత హృదయములో దివ్య తేజస్సు కలదను భావము కల్గి, మనస్సుపై ఒత్తిడి లేకుండా, సహజముగా ధ్యానము చేయుము. అక్కడ తేజస్సు కనబడనిచో లెక్క చేయకుము. అది ఒక ఊహ మాత్రముగా ధ్యానము ప్రారంభింపుము.

ఏకాగ్రతకై ప్రయత్నించక, మనస్సును హృదయమువైపు మరల్చుము. ఆ సమయమున వచ్చు ఆలోచనలను ఆహ్వానించకనే వచ్చిన అతిధులుగా భావించి, వాటిని గమనించక, దృష్టిని ఏకైక లక్ష్యముపై మరల్చుము.

### సాయంకాల శుద్ధీకరణ

నీలోని ప్రతి అణువు నుండి, నీ ఆధ్యాత్మిక ప్రగతికి ప్రతి బంధకములైన మాలిన్యములు, జడత్వము, తామసము మొదలగునవి ఆవిరి రూపములో నీశరీరము వెనుకభాగమునుండి బయటికి

పోవుచున్నవని వాటి స్థానములో మాస్టరు హృదయంనుండి పవిత్ర పవిత్ర దివ్య ధార మనహృదయంలోకి ప్రవహిస్తున్నది. అను సంకల్పముతో సాయంకాలము అరగంట కూర్చొనుము. మనము విడువదలచిన వాటిని గురించి తలచకుము. చివరిలో అవి తొలగిపోయినవను దృఢమైన భావమును కలిగియుండుము.

## నిదురించే సమయములో చేసే ప్రార్థనా – ధ్యానం

రాత్రి నిదురించుటకు ముందు నమ్రభావముతో ఉదయంవలె ప్రార్థన చేయవలెను. భక్తి భావముతో ప్రార్థన రెండుమూడు సార్లు మనస్సులోనే ఉచ్చరించి దాని భావముపై ధ్యానము చేయుచు దానియందే లీనమై నిదురించుము.

## దశ నియమములు

1. ప్రొద్దు పొడవక ముందే నిద్రలెమ్ము. నిర్ణీత నిద్రలెమ్ము. నిర్ణీత సమయమున సూర్యోదయమునకు ముందయినచో మంచిది. ఒకే స్థలములో, ఒకే ఆసనమున కూర్చొని ప్రార్థన, ధ్యానములను కావింపుము. మానసిక, శారీరక పారిశుద్ధ్యమును ప్రత్యేకముగా పాటింపుము.

2. ప్రేమ, భక్తి పూర్వకమైన హృదయముతో ఆధ్యాత్మికోన్నతి కొరకు ప్రార్థన జరిపి, ధ్యానము నారంభింపుము.

3. భగవంతునితో సంపూర్ణ ఐక్యము పొందుటయే నీ గమ్యముగా నిర్ణయించుకొనుము. దానిని సాధించునంతవరకు విశ్రమింపకుము.

4. ప్రకృతితో సారూప్యము పొందుటక నిష్కపటముగాను, నిరాడంబరముగాను ఉండుము.

5. సత్య సంధత కలిగి యుండుము. దుఃఖములను దివ్యమైన దీవనలుగా భావించి, అవి నీ మేలుకొరకే కలుగుచున్నవని కృతజ్ఞతా భావముతో నుండుము.

6. అందరినీ సోదరులుగా భావించి, అట్లే వారి నాదరింపుము.

7.ఇతరులు కీడు చేసినచో ప్రతీకార చర్యకు పూనకుము. దానిని దేవుడిచ్చిన బహుమతిగా కృతజ్ఞతతో స్వీకరింపుము.

8. ఋజు వర్తన తోడను, భక్తి భావముతోడను ఆర్జించిన దానితో తృప్తి చెంది, నిరంతరము దివ్ భావములతో దానిని ఆరగింపుము. ఇతరులలో భక్తి, ప్రేమ భావములు మొలకెత్తించునట్లుగా నీ జీవనమును మలచుకొనుము.

9. పడుకొనబోవు సమయమున దైవసాన్నిధ్య భావనతో నీవొనర్చిన తప్పులను గూర్చి పరితప్తుడవు కమ్ము. వాటిని మరిచేయనని వినమ్రభావముతో

10.భగవంతుని క్షమాపణ కోరుము.

*****